దర్శనీయ
ఆంజనేయ దేవాలయాలు-2

గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ:

సరసభారతి

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

DARSANIYA
ANJANEYA DEVAALAYAALU-2

by

Gabbita Durga Prasad

First Edition: **March 2019**

Copies: 1000

© **Author**

Price. Rs.**200/-**

Cover Design: **Kalasagar**

For Copies: **Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375
e-mail: gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http/sarasabharati.wordpress.com
http/suvarchalanjaneyaswamy.wordpress.com

Type Setting: **"Ramya Bharathi"** vja

Printed : **Rainbow Graphics,** vijayawada-2

అంకితం

శ్రీ హనుమతే నమః

రెండవ భాగం రచనకు నేపథ్యం

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-1 మొదటిభాగం దేశ, విదేశాలలోని 201 శ్రీ ఆంజనేయ దేవాలయాల గురించి నేను రాసి, సరసభారతి ప్రచురించి 18-5-2015 శ్రీ హనుమజ్జయంతి నాడు ఉయ్యూరు శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ స్వామివార్ల శాంతి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆవిష్కరణ జరిపాం. దీనిని మా చిన్నక్కయ్య, బావగార్లు శ్రీమతి వేలూరి దుర్గ, శ్రీ వేలూరి వివేకానంద్‌లకు వారి వివాహ వజ్రోత్సవ కానుకగా అంకితమిచ్చాం. దీనికి స్పాన్సర్- మా మేనల్లుడు చి.

వేలూరి మృత్యుంజయ శాస్త్రి (జయ్ వేలూరి) శ్రీమతి విజయలక్ష్మి దంపతులు (అమెరికా).

అప్పటికి కొద్దికాలం ముందు నుంచే రెండవభాగం దేవాలయాలను అంతర్జాలంలో రాయటం మొదలుపెట్టాను. మధ్యమధ్య రాస్తూ ఆపేస్తూ మరి కొన్ని పుస్తకాలు రాస్తూ ప్రచురిస్తూ 2018 అక్టోబర్‌కు మూడేళ్ళలో 100 దేవాలయాల గురించి మాత్రమే రాసి, ఇక ఉండవులే అనుకొన్నాను. కాని మా రెండవ అబ్బాయి శర్మ ఇంకా చాలా ఉన్నాయని, వాటి వివరాలు వీకీపీడియా, యు ట్యూబ్, ఇతర చోట్ల నుండి లింక్‌లు పుంఖాను పుంఖంగా పంపటం ప్రారంభించాడు. వెంట వెంటనే వాటిని అదే వేగంతో ఇంటర్ నెట్‌లో రాసేసేవాడిని. నవంబర్‌కు రెండవభాగంలో దేవాలయాల సంఖ్య 254 అయింది. ఇందులో ఒక్కటి మాత్రమే అమెరికా దేవాలయం. మిగిలినవన్నీ మన దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందినవే. ఇందులో కొన్ని దేవాలయ చరిత్రలు హిందీ, కన్నడం, మలయాళం, తమిళం మొదలైన వివిధ భాషలలో ఉన్నాయి. ఏదో రకంగా తంటాలు పడి విషయ సేకరణ చేసి రాశాను. కొన్నిటిని యు ట్యూబ్‌లో చూస్తూ, వింటూ రాయల్సివచ్చేది. హనుమ దయవలన అన్నీ సక్రమంగా సాధ్యమైనంతవరకు పూర్తి వివరాలతోనే రాశాను. కొన్ని దేవాలయాల చరిత్ర అసమగ్రంగానే దొరికింది. దొరికింది దొరికినట్లు రాసి సంతృప్తి చెందాను.

మరీ అసలేమీ వివరాలు లేని దేవాలయాలను ఆయా రాష్ట్రాలలో చివర 'దర్శించదగిన ఇతర ఆంజనేయ దేవాలయాలు' అనే శీర్షిక లో పొందు పరచాను. ఇవి సుమారు 50 దాకా ఉంటాయి. అంటే రెండు భాగాలలో కలిపి 201,254, 50వ 555 ఆంజనేయ దేవాలయాలను స్పృశించిన అదృష్టవంతుడనయ్యాను. ఇంకా మా దృష్టిలోకి రాని ఆంజనేయ దేవాలయాలు ఎన్నో ఉండే ఉంటాయి. కనుక ఇదే పరిపూర్ణం అని మేము భావించటం లేదని సవినయంగా మనవి చేస్తున్నాము. వివరంగా రాసిన అన్ని దేవాలయాల

ఆంజనేయ స్వామి వారల విగ్రహాల ఫోటోలు పెట్టాము. ఒకవేళ విగ్రహం ఫోటో దొరకకపోతే, దేవాలయం ఫోటో అయినా పెట్టాం. ఈ ఫోటోల సేకరణ, ఫైల్‌గా పెట్టటం, రాష్ట్రాలవారీగా వరుసక్రమంలో లిస్టు తయారు చేయటం, కవర్ పేజీలలో ఏయే ఫోటోలు ఉండాలో నేను చెబితే వాటిని అలా ఎంపిక చేసి, తయారు చేసే పని అంతా మా అబ్బాయి శర్మ తన డ్యూటీ తానూ చేసుకొంటూ, ఈ పనులు చేసినందుకు అభినందనలు. దీనివలన నా శ్రమ, కళాసాగర్, ప్రకాష్ గార్ల శ్రమ చాలా తగ్గింది.

ఎందరో మహానుభావులు

సరసభారతికి ఆప్తుడు, రమ్యభారతి సంపాదకుడు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ చలపాక ప్రకాష్ ఇదివరకు లాగానే ఈ పుస్తకం, డి.టి.పి నిర్దుష్టంగా చేసి, ముద్రణ చేయించి, సకాలంలో అందజేసినందుకు, మేము 'సరసభారతి స్టాఫ్ కళాకారుడు'గా భావించే శ్రీ కళాసాగర్ కోరిన డిజైన్‌లో అందమైన ముఖచిత్ర రచన చేసి గ్రంథానికి అదనపు ఆకర్షణ కలిగించినందుకు ధన్యవాదాలు.

సరసభారతి ప్రగతి

ఇది సరసభారతి ప్రచురించిన 33వ గ్రంథం, నేను రాసిన 21వ పుస్తకం అని విన్న విస్తున్నాను. సరసభారతి స్థాపించి (2009-నవంబర్ 24) 9సంవత్సరాలు దాటి 10వ సంవత్సరంలో ప్రవేశించిందని తెలియజేయటానికి ఆనందంగా, సంతృప్తిగా ఉన్నది. 2019 జనవరి 31 నాటికి సరసభారతి 136 వైవిధ్యభరిత కార్యక్రమాలు నిర్వహించి "అక్షరం లోక రక్షకం" అన్న మా లక్ష్యానికి అనువుగా నడుస్తోంది. సరసభారతి సాధించిన, సాధిస్తున్న ప్రగతి, విజయాలన్నిటికీ సరసభారతి గౌరవాధ్యక్షులు శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి, కార్యదర్శి శ్రీమతి మాదిరాజు శివలక్ష్మి,

కోశాధికారి గబ్బిట వెంకట రమణ కార్యవర్గ సభ్యులు, మా కుటుంబ సభ్యులు, ముఖ్యంగా మా శ్రీమతి ప్రభావతి అందిస్తున్న సహాయ, సహకారాలకు ధన్యవాదాలు. సాహితీ బంధువుల, వదాన్యులైన వితరణశీలురైన దాతల ప్రోత్సాహక సహాయాలకు కృతజ్ఞతలు.

హనుమలకు అంకితం

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2 రెండవభాగంను కృష్ణాజిల్లా ఉయ్యూరులోని మా శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారికీ, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒకప్పటి గబ్బిటవారి అగ్రహారమైన రామారావు గూడెంలో వెలసిన గబ్బిట, చందోలు వారి శ్రీ భక్తాంజనేయ స్వామివారికీ, ఉయ్యూరులో మా మేనమామ శ్రీ గుండు గంగయ్యగారి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారితో సహా అన్ని దేవాలయాల శ్రీ ఆంజనేయస్వామి వారలకు అంకితమిస్తూ ధన్యుల మవుతున్నాము. ఏదో మన భ్రమ కాని హనుమ లేని చోటున్నదా? శ్రీ హనుమ కృపా కటాక్షా వీక్షణాలే ఇంతటి బృహత్ రచన, ప్రచురణ మాతో చేయించాయి.

శ్రీ ఆంజనేయ వైభవం

ఇంతటి వైభవంగా దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2 రెండవ భాగం వస్తున్న సందర్భంగా, నామదిలో ఇందులో "శ్రీ ఆంజనేయ వైభవం" పై పద్యాలు రాయించి, చేర్చాలనే కోరిక లీలగా మెదిలి, సరసభారతి అభిమాన కవులను కొందరికి చెప్పి, తలొక 11 వృత్త పద్యాలు రాసి పంపమని తెలియ జేయగా, వెంటనే స్పందించి, అది తమ అదృష్టంగా, శ్రీ హనుమ ప్రసాదంగా, కర్తవ్యంగా భావిస్తున్నామని, సరసభారతిపై తమకున్న ఆదరాభిమానాలను చాటి చెప్పి, అతి తక్కువ వ్యవధిలోనే రచించి పంపిన కవి మిత్రులు 1) డా.రామడుగు వేంకటేశ్వరశర్మ (గుంటూరు), 2) శ్రీ మంకు శ్రీను (కొప్పర్రు),

3) శ్రీ తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు (విజయవాడ), 4) శ్రీ టేకుమళ్ళ వెంకటప్పయ్య (విజయవాడ), 5) శ్రీ పంతుల వెంకటేశ్వరరావు (విజయవాడ), 6) మధుర కవి శ్రీమతి ముదిగొండ సీతారామమ్మ (విజయవాడ), 7) శ్రీమతి లక్కరాజు వాణీ సరోజిని (విజయవాడ), 8) శ్రీమతి వారణాసి సూర్యకుమారి (మచిలీపట్నం) గార్లకు కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. ఈ 'వైభవ పద్య రాశి' గ్రంథానికి అదనపు ఆకర్షణ కాగలదు. శ్రీ హనుమ బహుముఖీన ప్రతిభా వైభావానికి దర్పణంగా భాసించగలదని భావిస్తున్నాను.

సరసభారతి శ్రీ వికారి ఉగాది వేడుకలు

సరసభారతి శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహిస్తున్న 31-3-19 ఆదివారం నాడు ప్రముఖులకు ఉగాది పురస్కారం, స్వయం సిద్ధ పురస్కార ప్రదానం, కవి సమ్మేళనంతోపాటు నేను రచించిన మూడు సరసభారతి ప్రచురణలు 1) అణుశాస్త్రవేత్త డా.ఆకునూరి వెంకట రామయ్య (స్పాన్సర్ శ్రీ మైనేని గోపాలకృష్ణ, శ్రీమతి సత్యవతి దంపతులు (అమెరికా), 2) ప్రయోగాత్మక కాంతి శాస్త్ర పరిశోధనపిత డా.పుచ్చా వెంకటేశ్వర్లు (అంకితం అణుశాస్త్రవేత్త డా.ఆకునూరి వెంకటరామయ్య గారికి (అమెరికా), 3) దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2 రెండవభాగం ఆవిష్కరణ జరగటం సరసభారతి ప్రగతికి నిదర్శనమని సవినయంగా మనవి చేస్తున్నాను. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న అతిధులకు, పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులకు, కవిసమ్మేళనంలో పాల్గొంటున్న కవి మిత్రులకు, ఉగాది, స్వయం సిద్ధ పురస్కారాలు అందుకొంటున్న ఆత్మీయులకు శ్రీ వికారి ఉగాది శుభాకాంక్షలతో ఆహ్వానం పలుకుతున్నాం.

"పూజ్యాయ వాయు పుత్రాయ వాగ్దోష వినాశన-సకల విద్యాం కురు మే దేవ రామ దూత నమోస్తుతే"

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

"ఆయుః ప్రజ్ఞా యశో లక్ష్మీ శ్రద్ధా పుత్రాస్సుశీలతా-ఆరోగ్యం దేహ సౌఖ్యం చ కపినాథ నమోస్తుతే"

"సర్వ కళ్యాణ దాతరం సర్వాపత్ నివారకం-అపార కరుణా మూర్తిం ఆంజనేయం నమామ్యహం"

"ఆంజనేయం మహా వీరం బ్రహ్మ విష్ణు శివాత్మకం-తరుణార్క ప్రభం శాంతం రామదూతం భజే"

- గబ్బిట దుర్గా ప్రసాద్

శ్రీ సువర్చలాంజనేయ స్వామి సేవకు, సరసభారతి పుస్తక ప్రచురణకు విరాళాలు అందజేసిన వదాన్యులకు కృతజ్ఞతలు

1) శ్రీ వేలూరి మృత్యుంజయ శాస్త్రి (జయ్ వేలూరి), శ్రీమతి విజయలక్ష్మి దంపతులు -ఫ్రీమాంట్ (అమెరికా)- రూ. 25,000/-
2) శ్రీ వేలూరి వివేకానంద్ - హైదరాబాద్ - రూ. 15,000/-
3) శ్రీ మద్దాల జగదీశ్, శ్రీమతి లక్ష్మి దంపతులు - షార్లెట్ (అమెరికా) రూ. 10,240/-
4) శ్రీ సుంకర కోటేశ్వరరావు, శ్రీమతి సరోజినీ దంపతులు - హైదరాబాద్- రూ. 10,000/-
5) శ్రీ గబ్బిట రామనాథబాబు, శ్రీమతి జయలక్ష్మి దంపతులు- ఉయ్యూరు- రూ. 10,000/-
6) డా. ఆకునూరి వెంకటరామయ్య, శ్రీమతి కృష్ణమయి దంపతులు- నాష్‌విల్- అమెరికా- రూ. 8,120/-
7) శ్రీ పువ్వుల సారధి, శ్రీమతి రేణుక దంపతులు - హైదరాబాద్ - రూ. 5,120/-
8) శ్రీమతి చతుర్వేదుల జానకి - విజయవాడ - రూ. 2,500/-
9) శ్రీ.టి.వి.ఎస్.బి .శాస్త్రి (ఆనంద్), శ్రీమతి రుక్మిణి దంపతులు-హైదరాబాద్- రూ. 1,116/-
10) చిరంజీవి ఆదిత్యసింగ్- హైదరాబాద్ - రూ. 1,116/-
11) శ్రీ చతుర్వేదుల మధుసూదనమూర్తి, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులు- విజయవాడ- రూ. 1,100/-
12) శ్రీ గబ్బిట లక్ష్మీ నరసింహ శర్మ, శ్రీమతి ఇందిర దంపతులు-హైదరాబాద్- రూ. 1,100/-
13) శ్రీ శంభుని శ్రీ రామచంద్రమూర్తి, శ్రీమతి మహాలక్ష్మి దంపతులు-ఖమ్మం- రూ. 1,000/-
14) శ్రీమతి కొల్లి భారతి-మచిలీపట్నం - రూ. 1,000/-
15) శ్రీ కడవకొల్లు కృష్ణ దంపతులు -కడవకొల్లు- రూ. 500/-
16) శ్రీ కూచిభొట్ల రాజగోపాలకృష్ణమూర్తి, శ్రీమతి సీతారామమ్మ దంపతులు- ఉయ్యూరు- రూ. 500/-

* * *

గ్రంథకర్త పరిచయం



పేరు:	గబ్బిట దుర్గాప్రసాద్
జననం:	27-06-1940, ఉయ్యూరు
తలిదండ్రులు:	భవానమ్మ, మృత్యుంజయశాస్త్రి
భార్య:	ప్రభావతి
విద్య:	ఎం.ఏ. (తెలుగు), బి.ఎస్.సి., బి.ఎడ్.
ఉద్యోగం:	సైన్స్ టీచర్, హెడ్ మాస్టర్, కృష్ణాజిల్లా హైస్కూల్స్ (1963-1998)
సంతానం:	1) గబ్బిట మృత్యుంజయశాస్త్రి, సమత (సంకల్ప్, భువన సాయి తేజ)
	2) లక్ష్మీ నరసింహశర్మ, ఇందిర (శ్రీహర్ష సాయి, హర్షితాంజని)
	3) నాగ గోపాల కృష్ణమూర్తి, రాణి (గౌతమ్ శ్రీచరణ్, రమ్య)
	4) వెంకట రమణ, మహేశ్వరి

5) కోమలి విజయలక్ష్మి, సాంబావధాని
(శ్రీకేత్, అశుతోష్, పీయూష్)

సాహితీ వ్యాసంగం: రచనలు, సరసభారతి- అధ్యక్షులు

స్వీయ రచనలు: 1) ఆంధ్ర వేదశాస్త్ర విద్యాలంకారులు, 2) జన వేమన 3) దర్శనీయ దేవాలయాలు, 4) శ్రీ హనుమత్ కథానిధి, 5) శ్రీ ఆంజనేయస్వామి మహాత్మ్యం, 6) సిద్ధ యోగి పుంగవులు, 7) మహిళా మాణిక్యాలు, 8) పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు, 9) దర్శనీయ దైవ క్షేత్రాలు, 10) గీర్వాణ కవుల కవితా గీర్వాణం, 11) దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-1, 12) కెమోటాలజి పిత కొలచల సీతారామయ్య, 13) దైవ చిత్తం, 14) గీర్వాణకవుల కవితా గీర్వాణం-2, 15) బ్రహ్మశ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారి శత జయంతి కరదీపిక, 16) ఆధునిక ప్రపంచ నిర్మాతలు, జీవితాలలో చీకటి వెలుగులు, 17) గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3, 18) షార్లెట్ సాహితీ మైత్రీ బంధం, 19- అణుశాస్త్రవేత్త డా. ఆకునూరి వెంకట రామయ్య, 20) ప్రయోగాత్మక కాంతి శాస్త్రపిత డా. పుచ్చా వెంకటేశ్వర్లు. 21) దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు -2.

స్వీయ సంపదకత్వంలో... (సరసభారతి ప్రచురణలు): 1) జ్యోతిస్సంశ్లేషణం, 2) ఉయ్యూరు ఊసులు, 3) నవకవితా వసంతం, 4) మా అక్కయ్య, 5) ఆదిత్య హృదయం, 6) త్యాగి పే"రెడీలు, 7) శ్రీరామ వాణి, 8) మా అన్నయ్య, 9) శ్రీ సువర్చలా వాయు నందన శతకం, 10) శ్రీ సువర్చలా మారుతి శతకం, 11) శ్రీ సువర్చలేశ్వర శతకం, 12) వసుధైక కుటుంబం, 13) సాహితీ స్రవంతి (సాహితీ మండలి తరపున)

సరసభారతి, శ్రీ సువర్చలలాంజనేయ స్వామి బ్లాగుల నిర్వహణ,
శ్రీ సువర్చలాంజనేయస్వామి దేవాలయ వంశపారంపర్య ధర్మకర్త-
స్వామి సేవలో ధన్యత, అనునిత్య సాహితీ వ్యాసంగం ❁

ఆంజనేయ దేవాలయాలు- రెండవభాగం

విషయ సూచిక

ఆంధ్రప్రదేశ్-కృష్ణాజిల్లా

1) శ్రీ అడవి ఆంజనేయ దేవాలయం-తుక్కులూరు 23
2) 'గుండు' వారి శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-ఉయ్యూరు 24
3) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-గొడుగుపేట-మచిలీపట్నం 28
4) శ్రీ అభయాంజనేయ దేవాలయం-పెడన 29
5) శ్రీ వీరాంజనేయ దేవాలయం-బంటుమిల్లిరోడ్-గుడివాడ 29
6) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-బచ్చుపేట-మచిలీపట్టణం 30
7) శ్రీ ప్రసన్నాంజనేయదేవాలయం-ఈడేపల్లి-మచిలీపట్టణం 30
8) శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం-సుల్తాననగరం-మచిలీపట్టణం 31
9) శ్రీ ఆంజనేయ దేవాలయం-వలందపాలెం-మచిలీపట్నం 32
10) శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం-అంగలూరు 32
11) శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ దేవాలయం-లింగారెడ్డిపాలెం 33
12) శ్రీ అభయాంజనేయ దేవాలయం-పెదముత్తేవి 33
13) శ్రీ ఆంజనేయ దేవాలయం-ఇంద్రకీలాద్రి-విజయవాడ 35
14) శీతల యంత్రప్రతిష్ఠిత శ్రీ సువర్చలాంజనేయ దేవాలయం-శ్రీకాకుళం 37
15) శ్రీ స్వయంభు వీరాంజనేయ దేవాలయం-మేడూరు 41

తూర్పుగోదావరి జిల్లా

16) శ్రీ అభయాంజనేయ దేవాలయం-కాకినాడ 43
17) శ్రీ సకల కార్యసిద్ధి హనుమాన్ మందిర్-అమలాపురం 43
18) శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం-రాజోలు 47
19) 135 అడుగుల శ్రీఆంజనేయ విగ్రహం-యర్రవరం 48
20) మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి ప్రతిష్ఠిత శ్రీ ఆంజనేయ దేవాలయం-
చొల్లంగి- 48

పశ్చిమ గోదావరి జిల్లా

21) గబ్బిట, చందూరి వారల శ్రీ భక్త ఆంజనేయస్వామిదేవాలయం-

రామారావుగూడెం 50
22) శ్రీ కార్యసిద్ధి హనుమాన్దేవాలయం-దత్తక్షేత్రం-ఏలూరు 58
23) శ్రీ భక్తాంజనేయ దేవాలయం-ప్రక్కిలంక 58
24) మహాశక్తివంత హనుమాన్ దేవాలయం-నందమూరి గరువు శృంగవృక్షం 59

విజయనగరం జిల్లా

25) శ్రీ హనుమాన్ దేవాలయం-గుమ్చి 59

గుంటూరు జిల్లా

26) శ్రీ గోవర్ధన వీరప్రతాప ఆంజనేయస్వామి దేవాలయం-తెనాలి 60
27) శ్రీ ధూళిపాళ నిర్మించిన శ్రీసువర్చలాంజనేయ దేవాలయం-గుజ్జనగూళ్ళ 61
28) 79 అడుగుల అభయాంజనేయ దేవాలయం-గుంటూరు 62
29) శ్రీ ఆంజనేయ దేవాలయం-పొనుగుపాడు 63
30) శ్రీ పాతూరు ఆంజనేయస్వామి దేవాలయం-నరసరావుపేట 65
31) శ్రీ సువర్చలాసహిత శ్రీ వీరాంజనేయస్వామివారి ఆలయం-
దాసుపాలెం 66

ప్రకాశం జిల్లా

32) శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం-చీమకుర్తి 67
33) పెరిగిన పెద్దహనుమంతుడు-పెద్దవరం 68
34) శ్రీ భక్తాంజనేయ దేవాలయం-ఈతముక్కల 71

నెల్లూరు జిల్లా

35) శ్రీ అభయాంజనేయ దేవాలయం-ప్రభగిరి పట్నం 71

అనంతపురం జిల్లా

36) శ్రీ అభయాంజనేయ దేవాలయం-మౌనగిరి 72
37) శ్రీ బెనకానహళ్లి ఆంజనేయ దేవాలయం-దేవగిరి 73
38) జనమే జయమహారాజు ప్రతిష్టించిన శ్రీఆంజనేయ దేవాలయం-చౌళూరు ...74
39) శ్రీ రామగిరి హనుమాన్ దేవాలయం-చిప్పగిరి 74
40) శ్రీ దుర్గాంజనేయ దేవాలయం-శింగనమల 75
41) శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయ దేవాలయం-కదిరి 75
42) వ్యాసరాయల ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి దేవాలయం-మురడి 76

కర్నూలు జిల్లా

43) శ్రీ పేట హనుమాన్ 77
44) శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయం-మంత్రాలయం 78

45) స్వామి పేరే జనంపేరుగా ఉన్న-శ్రీ గిద్ద ఆంజనేయస్వామి దేవాలయం
-వెంకటగిరి 78
46) శ్రీ ఆంజనేయ దేవాలయం-బేతంచర్ల 80
47) నాగనంది శ్రీ ఆంజనేయ దేవాలయం- నంద్యాల 81
చిత్తూరు జిల్లా
48) 24 అడుగుల శ్రీహనుమాన్-అంగల్లు 82
49) శ్రీ బేడీ ఆంజనేయస్వామి-తిరుమల 84
50) వాలేశ్వర ఆంజనేయ ఆలయం- పిచ్చాటూరు 85
కడప జిల్లా
51) గండి వీరాంజనేయ దేవాలయం-పులివెందుల 88
52) ముస్లిం నవాబు కట్టించిన శ్రీ ఝూల్ ఆంజనేయ దేవాలయం-కడప 90
53) మహిళా ప్రవేశంలేని శ్రీ ఆంజనేయాలయం-తిప్పాయపల్లి 92
54) సంజీవిని మూలికను చేత ధరించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం
-రామాపురం 93
మరికొన్ని ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ దేవాలయాలు 95
తెలంగాణ
55) శ్రీ ఏదుల యెర్రగట్టు వీరాంజనేయస్వామి దేవాలయం-మహబూబ్‌నగర్ 99
56) శ్రీ ఇష్టదైవ హనుమాన్-నిజాంపేట 105
57) శ్రీ వీరాంజనేయస్వామి చేతిలో 'కొయ్యగద'-మల్లంపేట 106
58) శ్రీ సువర్చలాంజనేయ దేవాలయం-ఎల్లెందు 109
59) శ్రీ ఆంజనేయ దేవాలయ సమూహం-బోధన్ 110
60) శ్రీ అభయాంజనేయ దేవాలయం-భద్రాచలం 111
61) శ్రీ హనుమ-సికందరాబాద్-స్కందగిరి 112
62) శ్రీ ఆత్మలింగ అభయాంజనేయస్వామి దేవాలయం-పెండల్వాడ 113
63) శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం-మద్దిమడుగు 115
64) శ్రీ అభయ జనేయస్వామి దేవాలయము-ఉరుకొండపేట 118
65) శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం-మక్తల్ 120
66) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-కోదండరాంనగర్ 121
67) చిన్న హనుమంతుడు-బడీచావడి 122
68) శ్రీ హనుమాన్ గుడి-ఖైరతాబాద్ 122
69) స్వయంభు శ్రీ వీరాంజనేయ దేవాలయం-కందుకూరు 123

70) శ్రీ అష్టదిక్పాలక ఆంజనేయ దేవాలయం-యల్లందు 123
71) 51 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం-ధూల్పేట 124
72) శ్రీ వీరాంజనేయ దేవాలయం-భీమునిమల్లారెడ్డి 125
73) శ్రీ గుండు ఆంజనేయస్వామి దేవాలయం-రాఘవపట్నం 126
74) శ్రీజంబి హనుమాన్ దేవాలయం-ఆర్మూర్ 126
75) వ్యాసమహర్షి ప్రతిష్ఠిత శ్రీ ఆంజనేయ దేవాలయం-చిన్నరాజమూరు 127
76) కాలాహనుమాన్ దేవాలయం-అత్తాపూర్ 128
77) మీసాలు గడ్డాల హనుమాన్-జగద్గిరిగుట్ట 129
78) శ్రీ కేసరి హనుమాన్ దేవాలయం-కార్వాన్ 129
79) శ్రీ విజయాంజనేయ దేవాలయం-విజయనగర్ కాలని 130
80) శ్రీ మహావీరనుమాన్ దేవాలయం-సలాబత్పూర్ 131
81) మాంసం మద్యం నైవేద్యం పొందే శ్రీ ఆంజనేయస్వామి-
పాతపల్లిచింతలకుంట 133
82) శ్రీ పసన్న ఆంజనేయ దేవాలయం-వెస్ట్ వెంకటాపురం 135
83) శ్రీ జోడీ ఆంజనేయ దేవాలయం-లింగాపూర్ 136
84) శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం-మూండామార్కెట్ 136
85) శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం-జమ్మికుంట 137
86) శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం-గోదావరిఖని 137
87) శ్రీ హనుమ దేవాలయం-భువనగిరి 137
88) మునుల కోరికపై వెలసిన శ్రీ స్వయంభు ఆంజనేయ దేవాలయం-
తపస్థలి-కూచారం 138
89) వనమూలికాకేంద్ర శ్రీ ఆంజనేయాలయం-శ్రీరామకొండ 140
90) ఊరంతా హనుమంతా(లయాలు)-వెల్లుల్ల మెట్ పల్లి 143
91) శ్రీ వీరాంజనేయ దేవాలయం-చాకరిమెట్ల 144
92) స్వయంభు శ్రీ బాలాంజనేయ దేవాలయం-బాగ్ అంబర్ పేట 145
93) అఖండజ్యోతితో శ్రీ ఆంజనేయస్వామి-మున్ననూరు 146
94) ఉత్తరాదిమఠం ఉత్తరాముఖ ఆంజనేయస్వామి-రామగిరి 147
మరికొన్ని తెలంగాణ ప్రసిద్ధమైన హనుమాన్ దేవాలయాలు

కర్ణాటక రాష్ట్రం
95) వ్యాసరాయ ప్రతిష్ఠిత ప్రాణరాయ హనుమాన్-బొమ్మఘట్ట-బళ్ళారి 154

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

96) శ్రీ ఆనెగొంది ఆంజనేయస్వామి-హోస్పేట 157
97) శ్రీ వీరాంజనేయ దేవాలయం-కక్కలూరు 159
98) పురాతన శ్రీ ఆంజనేయ దేవాలయం-చేలూర్ 160
99) వ్యాసరాయ ప్రతిష్టిత హనుమాన్ దేవాలయం-మూలభగల్ 160
100) శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం-రాగిగుడ్డ 161
101) శ్రీ ఆంజనేయ దేవాలయం-బెంగళూరు-బనస్వాది 164
102) శ్రీ ప్రసన్న వీరాంజనేయ దేవాలయం-బెంగళూర్ 165
103) శ్రీ సుందర ఆంజనేయ దేవాలయం-కాల్కెరి-బెంగళూర్ 166
104) శ్రీ ఆగార హనుమాన్ దేవాలయం-బెంగళూర్ 167
105) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం-మైసూర్ 168
106) శ్రీ కోటే ఆంజనేయస్వామి దేవాలయం-షిమోగా 168
107) శ్రీ కోరంటి హనుమాన్ దేవాలయం-గుల్బర్గా 169
108) వ్యాసరాయ ప్రతిష్టిత శ్రీహనుమాన్ దేవాలయం-షామనూర్ 169
109) శ్రీ సుందర ఆంజనేయస్వామి దేవాలయం-బెంగుళూరు 170
110) బెంగుళూర్సిటీని కాపాడే శ్రీ ఆంజనేయ దేవాలయం-యలహంకగేట్ 171
111) శ్రీ ఆంజనేయ దేవాలయం-మల్లేశ్వరం 173
112) శ్రీ కరేకల్లు ఆంజనేయ దేవాలయం-బెంగుళూరు 174
113) కుంచితగర శ్రీహనుమాన్ దేవాలయం-బెంగుళూరు 175
114) శ్రీవేణుగోపాలస్వామి సన్నిధిలో శ్రీ వీరాంజనేయస్వామి-మల్లేశ్వరం 176
115) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-సుబేదార్-బెంగుళూరు 176
116) శ్రీ తులసిగిరేశ్వర హనుమాన్ దేవాలయం-తులసిగిరి 177
117) శ్రీ చిక్కోడి హనుమాన్ మందిరం-చిక్కోడి 177
118) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం-గుడియనోదురన్న 178
119) శ్రీఅంజప్ప ఆంజనేయ దేవాలయం-కోలార్ 178
120) శ్రీ హనుమ దేవాలయం-బెల్గాం 179
121) శ్రీ సాలిగ్రామ హనుమాన్-ఉడిపి 179
122) శ్రీ హనుమాన్ దేవాలయం-నుగ్గికేరి 179
123) శ్రీ వీరప్రతాప హనుమ దేవాలయం-బెలగూర్ 180
124) శ్రీ ఆంజనేయ దేవాలయం-రామాంజనేయగుడ్డ 180
125) శ్రీ యోగపురిక్షేత్ర హనుమాన్ దేవాలయం-వాగట గ్రామం 181
126) శ్రీ హనుమ గుహాలయం-యలగూరు 182

127) శ్రీ ముత్తేత రాయ హనుమాన్ దేవాలయం-ముత్తాతి 183
128) ముఖ్య ప్రాణ కటాక్ష హనుమాన్ దేవాలయం-పూర్ణ ప్రసాద్ 183
మరికొన్ని ప్రసిద్ధమైన కర్ణాటక హనుమాన్ దేవాలయాలు

తమిళనాడు

129) శ్రీ ఆరుళ్మిగు ఆంజనేయ దేవాలయం-ఇడుగంపాలెం 185
130) శ్రీ కాడు హనుమంతరాయ దేవాలయం-ధర్మాపురం 186
131) శ్రీ వీరమంగళ ఆంజనేయ దేవాలయం-తిరుత్తని 187
132) ఒకే అడుగు ఎత్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం-కుళ్ళుకూజి 189
133) శ్రీ సంజీవరాయ దేవాలయం-తిరుచి 190
134) శ్రీ ఆంజనేయద్వయ దేవాలయం-పట్టేశ్వరం 191
135) శ్రీ జయ వీరాంజనేయ దేవాలయం-పేరూర్ 192
136) శ్రీ కట్టు వీరాంజనేయ దేవాలయం- కృష్ణగిరి 193
137) శ్రీ వీరాంజనేయ దేవాలయం-పుదుప్పాకం 194
138) శ్రీ తన్నీర్తురై వీరాంజనేయ దేవాలయం-బ్రాడ్వే-చెన్నై 195
139) శ్రీ వీరాంజనేయ దేవాలయం-అవినాశి 197
140) పంచముఖి హనుమాన్ దేవాలయం-కుంభకోణం 197
141) శ్రీ సంకట హరవిశ్వరూప హనుమాన్ దేవాలయం-జ్ఞానపురి 198
142) శ్రీ విశ్వరూప పంచముఖ హనుమాన్ దేవాలయం-తిరువళ్లూర్ 198
143) శ్రీ జయవీర హనుమాన్ దేవాలయం-మదురై 199
144) శ్రీ భక్త హనుమాన్ దేవాలయం-మదురై 201
145) శ్రీ భక్తాంజనేయ దేవాలయం-పళని 202
146) శ్రీ త్రినేత్ర వీరాంజనేయ దేవాలయం-అనంతమంగళం 203
147) 37 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం-అయిపెట్టై 205
148) బాలికకు కలలో కన్పించి ఆలయం నిర్మించుకొన్న శ్రీ హనుమాలయం
-క్రోంపేట 205
149) శ్రీ సప్తస్వరసామీరి దేవాలయం-మయిలాడుతురై 206
150) తోకలో కోట్లు విలువ చేసే వజ్రం ఉన్న శ్రీ ఆంజనేయస్వామి
దేవాలయం-నల్లత్తూరు 207
151) సముద్ర ముఖంగా శ్రీ ఆంజనేయ దేవాలయం-సేతుకరై 209
152) శ్రీ రామదాస ఆంజనేయస్వామి దేవాలయం-ధర్మపురి-తమిళనాడు 210

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

153) శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం-ముత్తంపట్టి 212
154) శ్రీ అష్టాంశవర్ధన ఆంజనేయస్వామి దేవాలయం-కోయంబత్తూర్ 213
155) జైవీర అభయహస్త హనుమాన్ దేవాలయం-కృష్ణపురం 214
156) శ్రీ అష్టాంశ శ్రీవర్ధన ఆంజనేయ దేవాలయం-పీలమనేరు 215
157) శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయం-గౌరివాక్కం 216
158) శ్రీ స్వయంభు వీరాంజనేయ దేవాలయం-తిరుకోయిల్-పొల్లాచి 216
159) శ్రీ రామాంజనేయ దేవాలయం-తాంబరం 217
160) శ్రీ రామాంజనేయ దేవాలయం-పోజిచాలూర్ 217
161) హనుమ భీమసమాగమమైన శ్రీ ఆంజనేయాలయం-అనైపత్తి 218
162) ఆంజనేయస్వామి దేవాలయం-నమక్కల్ 219
163) కూర్చున్న భంగిమలో 28 అడుగుల శ్రీ ఆంజనేయ దేవాలయం-
గేరుగం బాక్కం 220
మరికొన్ని తమిళనాడు హనుమాన్ దేవాలయాలు

పాండిచ్చేరి
164) ఏలకులతో అభిషేకించే పంచవటి ఆంజనేయ దేవాలయం-పాండిచ్చేరి 221

కేరళ
165) వోటి.సి.హనుమాన్ దేవాలయం-పాలయం 222
166) మూడువేల ఏళ్ళనాటి శ్రీ ఆంజనేయ దేవాలయం-శబరిమల 223
167) శ్రీదత్తక్షేత్ర హనుమాన్-కాలడి 223
168) శ్రీ సంకట నివారణ హనుమాన్ దేవాలయం-అలతియూర్ 224
169) అరేబియా సముద్రవాయువులను తట్టుకొనే వాయుసుతుడు-ఎజిమలకొండ -225
170) ఉడిపిస్వామి ప్రతిష్ఠించిన ఏకైక హనుమాన్ దేవాలయం-ఎర్నాకులం 226
171) శ్రీ హనుమాన్ దేవాలయం-నత్తిక 227
172) మూషకరాజు కట్టించిన శ్రీ ఆంజనేయ దేవాలయం-రాఘవాపురం 227
173) మహాదేవాలయంలో శ్రీ మహాబలవీర హనుమాన్-కవియూర్ 228
174) శ్రీ హనుమాన్మఠం-వైకోమ్ 228
175) శ్రీ హనుమ కోట దేవాలయం-కాలాపతి 229
మరికొన్ని కేరళ హనుమాన్ దేవాలయాలు

గుజరాత్

176) శ్రీ వీసా ఆంజనేయస్వామి దేవాలయం-అహ్మదాబాద్ 230
177) శ్రీ కష్టనివారణ హనుమాన్ దేవాలయం-సోమనాద్ 232
178) శ్రీ రోకాడియా హనుమాన్ మందిరం-పోర్బందర్ 233
179) శ్రీ బాలాజీ హనుమాన్ దేవాలయం-రాజకోట్ 233
180) శ్రీ దాబోదియా హనుమాన్ మందిర్-గాంధీనగర్ 234
181) శ్రీ బిద్ భజన మారుతి దేవాలయం-హర్ని-వడోదర 235
182) శ్రీ అనోఖే హనుమాన్ మందిర్-అహమ్మదాబాద్ 237
183) శ్రీ ఏకాదశముఖి హనుమాన్ మందిరం-పోర్బందర్......................238
184) శ్రీ హనుమాన్ మందిరం-లంభవేల్ 239
185) శ్రీ జంబూ గోద జంద్ హనుమాన్ మందిరం-గుజరాత్ 239
186) శ్రీ దోడీవాడా హనుమాన్ మందిరం-బేచరాజి 240

మహారాష్ట్ర

187) నది నీటిలో దొరికిన శ్రీ ఆంజనేయ విగ్రహం-పూనే 240
188) శ్రీ దక్షిణముఖ హనుమాన్ మందిర్-షిర్డీ 241
189) భద్రమారుతి దేవాలయం-ఖుల్దాబాద్ 242
190) శ్రీ విశ్వరూప హనుమాన్ మందిర్-ముంబై 245
191) శ్రీ ఘంటల హనుమ దేవాలయం-ఖార్ 246
192) పాముకాటు డాక్టర్-శ్రీ మారుతి దేవాలయం-పంగారి 247
193) శ్రీ జాగృత మారుతి దేవాలయం-గౌడగావ్ 248
194) శ్రీ ఖల్జాపూర్ మారుతి దేవాలయం-షోలాపూర్ 249
195) పురాతన శ్రీ ఆంజనేయ దేవాలయం-గొండియా 250
196) 'విలన్ హనుమాన్' దేవాలయం-పార్మర్ 250
197) శ్రీ సమర్ధ రామదాసు నిర్మించిన హనుమాలయం-సలాబత్పూర్ 251

గోవా

198) ప్రాచీన శ్రీ హనుమాలయం-గోవా 252

దాద్రానగరవేలీ

199) శ్రీ హనుమాన్ దేవాలయం -సిల్వాసా 252

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

మధ్యప్రదేశ్

200) ఖేదపతి హనుమాన్ మందిర్-గ్వాలియర్ 252
201) శృంగార క్షేత్రంలోనూ శ్రీ బాహువీర ఆంజనేయ దేవాలయం-ఖజురాహో..253
202) శ్రీ డాక్టర్ హనుమ దేవాలయం-భింద్ 254
203) శ్రీ ఖేదా హనుమాన్ దేవాలయం-ఖేదా 255
204) శ్రీ చిందాదా హనుమాన్-చింద్ 255
205) శ్రీ చమత్కారి హనుమాన్ దేవాలయం-మహాగావ్ 256
206) శ్రీ గోదావరి ధాం హనుమాన్ మందిరం-కోట 256
207) శ్రీ హనుమాన్టేక్రిమందిర్-గుణ 256

ఛత్తీస్‌గడ్

208) శ్రీ దక్షిణముఖి హనుమాన్ మందిరం-భిలాయ్ 257

రాజస్థాన్

209) శ్రీ గెజిటెడ్ హనుమాన్ మందిర్-జైసల్మేర్ 257
210) ఎడారి ప్రాంతంలో శ్రీ హనుమ దేవాలయం-రోజ్రీధాం 258
211) పుట్టువెంట్రుకలకు ప్రసిద్ధమైన శ్రీ హనుమ దేవాలయం-పునరసార్ 259
212) మర్రిచెట్టుక్రింద విశ్రమించిన శ్రీ వీరహనుమాన్ దేవాలయం-వడ్లేశ్వర్ ...260
213) పాండవులు ఆశ్రయం పొందిన శ్రీ పండుపోలనుమదేవాలయం-ఆల్వార్ ...261
214) ఎడమచేత ఖట్వాంగాయుధం ధరించిన శ్రీ హనుమ దేవాలయం-మేవాడ్ ..262
215) మాండవేయ హనుమాన్ దేవాలయం-దుంగార్పూర్ 265
216) శ్రీ భజరంగ్దోరా దేవాలయం-బికనూర్ 266
217) శ్రీ నవఖండీయ హనుమాన్ దేవాలయం-పుష్కర్-అజ్మీర్-రాజస్థాన్ 266
218) శ్రీ ఖోలేకే హనుమాన్ మందిర్-జైపూర్ 267
219) శ్రీ అంజనిమాత దేవాలయం-కరౌలి 268
220) శ్రీ భజరంగబలి దేవాలయం-భిల్వారా 268

మరికొన్ని రాజస్థాన్ హనుమాన్ దేవాలయాలు

పంజాబ్

221) సిద్ధ శ్రీ హనుమాన్ దేవాలయం-ఫజిల్కాబాద్ 269

హర్యానా

222) శ్రీ కపిస్థల హనుమాన్ మందిర్-కైథాల్ 270
223) భారీప్రసాద వితరణ చేసే హనుమాన్ మందిర్-నగోరిగేట్ 270
224) శ్రీ పంచముచముఖ ఆంజనేయ దేవాలయం-యమునానగర్ 271

ఢిల్లీ

225) గిన్నీస్ బుక్ ఎక్కిన శ్రీ బాలహనుమాన్ మందిరం-కన్నాట్ సర్కస్-ఢిల్లీ 271

ఉత్తరప్రదేశ్

226) శ్రీ పంకీ హనుమాన్ దేవాలయం-కాన్పూర్ 272
227) శ్రీఆంజనేయ దేవాలయం-నైమిశారణ్యం 274
228) 90 అడుగుల విరాట్హనుమాన్-కిరాతపురం 276
229) బిజేతువా మహావీర్హనుమాన్ దేవాలయం-సుల్తాన్పూర్ 276
230) లడ్డూ తింటున్న హనుమాన్ మందిర్-ఈతావా 277
231) శ్రీ హనుమాన్ధాం-షామ్లి 277

ఉత్తరాఖండ్

232) 52 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి-నౌకుచింతల్ 278
233) శ్రీ హనుమాన్గరి-నైనిటాల్ 279
234) శ్రీ హనుమాన్ధాం-రాంనగర్ 279
235) శ్రీ సిద్ధబలి హనుమాన్ మందిర్-కోట్ద్వార్ 280

హిమాచలప్రదేశ్

236) సంజీవి పర్వతంతో కాలుమోపిన శ్రీ ఆంజనేయాలయం-కసౌలి 280

బీహార్

237) శ్రీ సంకట మోచన్హనుమాన్ దేవాలయం- గయ 281
238) శ్రీశ్రీ 1008 శ్రీ రామభక్త మహావీర బాలాజీ దేవాలయం-కర్హారియా 282

ఝార్ఖండ్

239) శ్రీ గుహాంజనేయ దేవాలయం-తపోవనం 283

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

మధ్యప్రదేశ్

240) శ్రీ ఉల్టా వీరహనుమాన్ దేవాలయం-సాల్వర్ 284
241) శ్రీ సఖీరూప హనుమాన్ దేవాలయం-ఝూన్సి 286
242) రోజుకు మూడుసార్లు ముఖం మార్చుకొనే శ్రీ హనుమ దేవాలయం-
సూరజ్కుండ్ 286
243) శ్రీ హోరీకే హనుమాన్ మందిర్-ఇందోర్ 287

ఒరిస్సా

244) శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయం-కటక్ 287
245) శ్రీ సంకట మోచన హనుమాన్ దేవాలయం-భద్రక్ 288
246) శ్రీ ద్విబాహుహనుమాన్ దేవాలయం-కేదారగౌరీ 288
247) శ్రీ సంకట మోచన హనుమాన్ మందిరం-ఖుర్దారోడ్ 289

పశ్చిమబెంగాల్

248) శ్రీ హనుమాన్ మందిర్-డార్జిలింగ్ 289
249) శ్రీ కోనహనుమాన్ మందిర్-హౌరా 290
250) శ్రీ హనుమాలయం-బారకార్ 290

అస్సాం

251) శ్రీ గోగాముఖ ఆంజనేయస్వామి ఆలయం-గోగాముఖ్ 291
252) శ్రీ ఉమానంద హనుమాన్ దేవాలయం-పీకాక్ ఐలాండ్ 291

అండమాన్

253) శ్రీ వీరహనుమాన్ దేవాలయం-అండమాన్ 292

అమెరికా

254) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ మందిర్-డల్లాస్ 293
శ్రీ ఆంజనేయ వైభవం (పద్యాలు) 294
నుండి ......❀

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

ఆంధ్రప్రదేశ్

కృష్ణాజిల్లా

1) శ్రీ అడవి ఆంజనేయ దేవాలయం-తుక్కులూరు

కృష్ణాజిల్లా నూజివీడుకు మూడు కిలోమీటర్ల దూరంలో తుక్కులూరులో అడవిలాంటి ఒక విశాల ప్రదేశంలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామినే 'అడవి ఆంజనేయ స్వామి' అంటారు. భక్తుల కోరికలు తీర్చే వరదుడిగా స్వామి సుప్రసిద్ధుడు. దీనికి దగ్గరలోనే శ్రీ సరస్వతీ దేవి ఆలయం కూడా దర్శించ దగినది. బాసర సరస్వతీ ఆలయం తర్వాత నూజివీడు సరస్వతీ ఆలయానికి గొప్ప ప్రశస్తి కలిగింది. అమ్మవారి సమక్షంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించటం ప్రత్యేకత. దసరాలలో మహా వైభవంగా పూజలు నిర్వహిస్తారు. మూలా నక్షత్రం నాడు సరస్వతీ పూజ జరుగుతుంది. వేలాది భక్తులు అమ్మవారిని దర్శించి తరిస్తారు.❋

2) 'గుండు'వారి శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-ఉయ్యూరు

కృష్ణాజిల్లా ఉయ్యూరు గ్రామంలో శ్రీ భ్రమరాంబా సమేత సోమేశ్వర ఆలయం (శివాలయం)లో గుండువారి ప్రసన్నాం జనేయస్వామి విగ్రహం చూడ ముచ్చటగా ఉండటమేకాక ప్రత్యేక కథనం కూడా కలిగి ఉంది.

విగ్రహానికి నేపథ్యం

ఉయ్యూరులో మా ఇంటికి ఉత్తరం వైపు మా మేనమామ గుండు గంగయ్య అనబడే గంగాధర శాస్త్రి గారి ఇల్లు ఉంది. వారిది కామకాయనస గోత్రం. మా అమ్మ భవానమ్మగారికి గంగయ్యగారు తమ్ముడు. ఆయన్ను పెద్దవాళ్లందరూ గంగయ్య అని చిన్నవారంతా గంగయ్యగారు అని పిలిచేవారు. స్థితిపరులు. వాళ్లకు ఉయ్యూరుకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో పెనమకూరుకు వెళ్ళేదారిలో కనకవల్లి గ్రామంలో ఒక శివాలయం ఉంది. రాజమండ్రిలో విగ్రహాలను చెక్కించి ఆగమ శాస్త్ర విధానంలో కనకవల్లిలో 1954లో వారం రోజులు బ్రహ్మాండంగా ప్రతిష్ఠామహోత్సవాలు నిర్వహించారు. మా అమ్మా మామయ్యల పిన తండ్రి (నాన్నగుండు సింగిరి శాస్త్రి గారి తమ్ముడు) నరసింహం గారి ఆధ్వర్యంలో మామేనమామ, మా అత్త మహాలక్ష్మమ్మ దంపతులు ప్రతిష్ట చేశారు. కనకవల్లి గ్రామ బ్రాహ్మణ్యం అంతా రెండు పూటలా భోజన ఉపాహారాలు అక్కడే. పెళ్లి వేడుకలను మించి ఘనంగా ప్రతిస్టా మహోత్సవం జరిగింది. ఇదంతా మా చిన్ననాటి సంగతి. అప్పుడు మేము తొమ్మిదో తరగతి చదువుతున్నామని గుర్తు. అయినా బాగా జ్ఞాపకం ఉంది. అందరికి తమలపాకులు, వక్కపొడి మా గబ్బిట వారి కుటుంబం మా నాన్నగారు మృత్యుం జయ శాస్త్రి, అమ్మ భవానమ్మ దంపతుల ఆధ్వర్యం ఏర్పాటు చేయబడింది. మా తాతయ్య నరసింహం గారు ఆయన అనుంగు

మిత్రుడు సీతంరాజు లక్ష్మీనారాయణ గారు ఆంధ్ర రాష్ట్రంలో అంతటా తిరిగి నిధులు సేకరించి ప్రతిస్టా కార్యక్రమాన్ని మహా ప్రతిష్టగా తీసుకొని పరమ వైభవంగా నిర్వహించారు. వంట బ్రాహ్మణులు మహా రుచికరంగా పదార్ధాలు వండేవారు. ఈ వంటవారి చేతనే ఆ తర్వాత మా చిన్నక్కయ్య శ్రీమతి దుర్గ శ్రీ వేలూరి వివేకానందం బావ గార్ల వివాహానికి వంట చేయించాం. అప్పుడూ మహా భేషుగ్గా చేశారు. అందులో ఒక ఎర్రటి ఆయన మేస్త్రీ సన్నగా బారుగా ఉండేవాడు. సీతారామయ్య అనే ఉయ్యూరు ఆయన అతని సహాయకులలో ఒకరు. ఆ తర్వాత సీతా రామయ్య నా ఉపనయనానికి వంట చేశాడు. ఉయ్యూరు కనకవల్లి మొదలైన గ్రామస్తుల సహకారం మరువలేనిది. అప్పుడే మా తాతయ్యకు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించాలనే సంకల్పం కూడా ఉండేది. సమయం చాలక అది కార్యరూపం దాల్చలేదు. కాని ఆయన మన్సులో నుండి అది తొలగిపోలేదు.

కనకవల్లి ప్రతిష్టలైన తర్వాత నరసింహం తాతయ్య రాజమండ్రిలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారల 5 అడుగుల భారీ విగ్రహాన్ని చెక్కించారు. అది పడవలమీద గోదావరి కృష్ణా నదులలో ప్రయాణం చేసి పుల్లేరు కాలువ ద్వారా ఉయ్యూరు చేరింది. పుల్లేరు కాలువ నుండి మామయ్యా వాళ్ళ రెండెడ్ల బండీ చట్రానికి కింద మోకులతో కట్టి అతి జాగ్రత్తగా ఇంటికి తేవటం నాకు బాగా గుర్తు. అంతటి భారీ విగ్రాన్ని ప్రతిష్టించి గుడికట్టటానికి తగిన ఆర్ధిక స్తోమత అప్పుడు మా మామయ్యకు లేకపోవటం వలన విష్ణాలయం వెనుక వేగరాజుసీతారామయ్య గారి ఇంటికి ఆనుకొని ఉన్న మామయ్యగారి పెంకుటిల్లు ఉత్తరం వైపు గోడకు ఈశాన్య భాగాన ఏటవాలుగా వాల్చి 1972లో నిలబెట్టారు. బహుశా అదే ప్రతిష్ట ఏమో? 'శ్రీ గుండు లక్ష్మీ నరసింహ సంకల్పః-శ్రీ ప్రసన్నాంజనేయ స్వామినః శ్రీ గుండు గంగాధర శాస్త్రిణా 26-1-1972 ప్రతిష్టితః 200 రూపాయలు' అని రాసి శిలాఫలకం వేయించారు. విగ్రహంపైన ఆచ్చాదన కూడా ఏర్పాటు చేయలేదు. ఎండకు ఎండుతూ వానకు నానుతూ ఆంజనేయస్వామి ఏమీ అనలేక అలాగే ఉండిపోయాడు. దేవుడికైనా మంచి రోజు రావాల్సిందే. అంతదాకా ఎదురు చూడక తప్పదు. పోకల దమ్మక్క పూనుకోకపోతే భద్రాద్రి రాముడికి గూడు ఉండేదా? భక్త

రామదాసు పూనుకోకపోతే రామయ్యకు భద్రాచలంలో ఆలయ నిర్మాణం జరిగేదా? ఊరి ప్రజలందరూఈ ఆంజనేయ విగ్రహాన్ని చూస్తూ, అయ్యో అనుకొంటూ ఉండేవారు. కాలక్రమలో నరసింహం తాతయ్యా చనిపోయాడు. మామయ్యా కుటుంబమూ పెరిగింది.

శివాలయంలో దేవతల సమూహం

కాలం ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉండదు. కొందరు ఉత్సాహవంతులు ఉయ్యూరు శివాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని, శంకరాచార్యుల వారిని మొదలైన వారిని ప్రతిష్ట చేయాలనే ఆలోచనలో ఉన్నారు. దీనికి ఒక కమిటీ ఏర్పడింది. ఊరి పెద్దలు శివాలయానికి సమీపంలోనే ఉండే గోవింద రాజు శ్రీరామమూర్తి గారు అధ్యక్షులుగా, సీతంరాజు సత్యనారాయణ గారు, కొలచల వెంకటాచలపతి మొదలైన వారు కార్యవర్గ సభ్యులుగా కమిటీ ఏర్పడి అప్పటికే సి.పి.ప్లాంట్ మేనేజర్ శ్రీ ఇంజేటి జగన్నాధ రావు గారిని కలిసి విషయం వివరించారు. ఆయన వెంటనే అంగీకరించి ఫాక్టరీ వారి సహకారం లభించేట్లు చేసి శివాలయంలో దక్షిణం వైపు గోడను ఆనుకొని లోపల సుమారు ఎనిమిది అడుగుల వెడల్పున అరవై అడుగుల పొడవున ఒక ఆస్బెస్టాస్ రేకుల షెడ్డు నిర్మించటానికి పూనుకొన్నారు. విగ్రహ సముదాయాన్ని అందులో ప్రతిష్టిస్తే బాగుంటుందని చెప్పారు. అందరూ అంగీకరించారు. విగ్రహ ప్రతిష్ట చేసేవారి వారినుండి కనీసం 2,000 రూపాయలు విరాళంగా స్వీకరించారు. మామయ్య గంగయ్య గారికి కూడా అందరూ చెప్పారు. ఇక ఆయన ఆంజనేయ విగ్రహాన్ని వేరే చోట ప్రతిష్టించి ఆలయం కట్టే పరిస్థితిలో లేరు కనుక ఈ సముదాయ ప్రతిస్టలలో దానినీ చేయమని నచ్చ జెప్పారు. చివరికి అంగీకరించాడు మామయ్య.

ప్రతిష్టామహోత్సవం

శివాలయంకు విశాలమైన బయటి ప్రాంగణం ఉన్నది కనుక విగ్రహాలను ఉంచటానికి జలాదివాస ధాన్యాది వాసాలకు ఇబ్బంది లేదు. మంచి ఆగమ పండితులు లభించారు. అగ్నిమధనం చూడ ముచ్చటగా జరిగింది. ఎవరు ఏ దేవుని ప్రతిష్టించాలో వారు దంపత్యుక్తంగా కూర్చుని ప్రతిష్ట చేశారు. మామయ్య గంగాధర శాస్త్రిగారు, అత్త మహాలక్ష్మమ్మ గారు

దంపత్యుక్తంగా కూర్చుని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి ప్రతిష్టామహోత్సవం జరిపారు. పాత శిలాఫలకాన్ని ఈ విగ్రహం గూడు పైన ఇప్పుడు అంటించబడి ఉంది. చుట్టూ ప్రదక్షిణ చేసే చిన్న దారికూడా ఏర్పాటు చేశారు. అన్ని ప్రతిష్టలు అయిన తర్వాతా భారీగా అన్నదానం నిర్వహించారు. విడిగా స్వయంగా ప్రతిష్టింపబడాల్సిన స్వామి ఇప్పుడు 'గుంపులో గోవిందా అయ్యాడు'. శివాలయ పూజారులే ఈ విగ్రహాలకూ నిత్యం నైవేద్యం పెడతారనుకొంటా. ఈ కాంప్లెక్స్ అంతా పూర్తిఅయి సభామందిరం కూడా ఏర్పడి, వేదిక కూడా కట్టి శ్రీ జగన్నాధరావు గారి చేత 26-2-1987న ప్రారంభోత్సవం చేయించారు. కనుక ప్రసన్నాంజనేయస్వామి దాదాపు పదిహేడేళ్ళు గుండువారింటి గోడకు ఆనుకొనే అన్నీ భరిస్తూ ఉన్నాడన్నమాట. అందుకనే ఈ విగ్రహాన్ని 'గుండువారి ప్రసన్నాంజనేయ స్వామి' అంటారు. మామయ్య ఈ ప్రతిష్ట జరిగిన కొన్నేళ్ళకే చనిపోయాడు. స్వయంగా స్వామిని ప్రతిష్ట చేయలేక పోయానే అనే బాధ మామయ్యలో కనిపించేది.

ఉత్సవాలు

మామామయ్య గంగయ్య గారు చనిపోయిన తర్వాత ఇప్పుడున్న వారిలో రెండవ కొడుకు గుండు నరహరి ఈ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం గురించి పట్టించుకొంటూ, రంగులు వేయిస్తూ, శ్రీ హనుమజ్జయంతిని జరుపుతున్నాడని శివాలయ అర్చకులు చెప్పారు. స్వామి కనులు విశాలంగా అతి ప్రసన్నంగా దర్శనమిస్తాయి. నమస్కారం చేస్తున్న హస్తాలతో నుదుట తిరునామంతో మెడ నిండా శరీరం నిండా సహజ ఆభరణాలతో ఆకుపచ్చ రంగు అంగ వస్త్రంతో శిరసుపై కిరీటంతో కాలికి చుట్టుకొన్న వాలంతో భక్త జన సులభుడుగా గుండువారి ప్రసన్నాంజనేయ స్వామి దర్శనమిస్తాడు. తప్పక దర్శించి తరించాలి.*

3) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-గొడుగుపేట-మచిలీపట్నం

కృష్ణాజిల్లా మచిలీపట్నం గొడుగుపేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం సకల సదుపాయాలతో వర్ధిల్లుతోంది. ఆలయం దక్షిణ ముఖంగా ఉండటం ప్రత్యేకత, విశిష్టత కూడా. ఈ ఆలయానికి వందేళ్ళ చరిత్ర ఉంది. స్వామి దక్షిణ ముఖంగా దర్శనమిస్తాడు. ఆగమ శాస్త్రంలో దక్షిణముఖ విగ్రహానికి చాలా ప్రాముఖ్యత ఉంది. కుర్తాలం పీఠాదిపతి 19వ శతాబ్దంలో ఈ ఆలయానికి మహాసంప్రోక్షణ చేస్తుండగా కుండపోత వర్షం కురిసి వీధులన్నీ జలమయమై జనం తడిసి ముద్దయ్యారు. కాని ఆలయ శిఖరంపై ఒక్క చుక్క నీటిబొట్టు కూడా పడలేదట. ఈ విషయాన్ని ఆ రోజుల్లో చాలా విచిత్రంగా జనం చెప్పుకొన్నారు. అంత మహిమాన్వితుడు ప్రసన్నాంజనేయ స్వామి పేరును సార్ధకం చేసుకొన్నాడు.

వైశాఖ బహుళ దశమి హనుమజ్జయంతి నిమూడు రోజులపాటు ఘనంగా ఆలయంలో నిర్వహిస్తారు. అభిషేకం, సహస్రనామార్చన హనుమాన్ చాలీసా పారాయణ బాగా జరుగుతాయి. దీపాలంకారం, అనేక స్తోత్ర పఠనం జరగటం విశేషం.❋

4) శ్రీ అభయాంజనేయ దేవాలయం-పెడన

కృష్ణాజిల్లా ముఖ్యపట్నం మచిలీపట్నానికి దగ్గరే ఉన్న పెడన మునిసిపాలిటీలో దాదాపు ఇరవై దేవాలయాలున్నాయి. అందులో శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం చాలా ప్రసిద్ధమైనది. వేలాది భక్తులు సందర్శించి మనసులోని కోరికలను స్వామికి నివేదించి నెరవేర్చుకొంటారు. పెడన కలంకారి అద్దకం పరిశ్రమకు, చేనేత పరిశ్రమకు నిలయం. అలాగే అభయాంజనేయ స్వామికీ ప్రాముఖ్యమైంది.❋

5) శ్రీ వీరాంజనేయ దేవాలయం-బంటుమిల్లి రోడ్-గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడలో బంటుమిల్లి రోడ్డులో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ఎప్పుడూ భక్తులతో కళకళ లాడుతుంది. స్వామి వీర రూపం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. అందరూ దర్శించాల్సిన దేవాలయం ఇది.❋

6) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-బచ్చుపేట-మచిలీపట్టణం

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో బచ్చుపేట హిందూ కాలేజికి ఎదురుగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఉన్నది. స్వామి సుమారు నాలుగడుగుల మూర్తి. దీనిని ప్రముఖ డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య నిర్మించారు. ఆలయానికి వెనుక భాగాల సభలు సమావేశాలు నిర్వహించటానికి వీలుగా 'మహతి కళావేదిక' ఏర్పాటు చేశారు. అనుబంధంగా గ్రంథాలయాన్ని కూడా చేర్చారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు శ్రీ ధన్వంతరి ఆచార్యులవారు. ఆయన అధ్యక్షత వహించని సభ బందరులో ఉండదు. చాలా సంస్థలలో అధ్యక్ష, గౌరవాధ్యక్ష మొదలై పదవులలో రాణిస్తున్నారు. హనుమజ్జయంతి వైభవంగా నిర్వహిస్తారు. పురాణాలు ప్రవచనాలు చాలీసా పారాయణ హరికథలు ఎప్పుడూ ఆలయంలో జరుగుతూనే ఉంటాయి. ❋

7) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-ఈడేపల్లి-మచిలీపట్టణం

మచిలీపట్నం బస్ స్టాండ్‌కు వెనక ఉన్న ఈడేపల్లిలో శ్రీ ప్రసన్నాం జనేయ దేవాలయం చాలా పురాతన దేవాలయం. సర్వాలంకారాలతో స్వామి వెలిగిపోతూ ఉంటాడు. పుష్పహారాలతో మునిగిపోతాడు. ఈ ఆలయంలో హనుమద్దీక్ష కార్యక్రమం చాలా శ్రద్ధగా నిర్వహిస్తారు. సుందర కాండ పారాయణ ప్రత్యేకం. శని మంగళ వారాలలో తమలపాకు పూజ విశేషంగా చేస్తారు. శ్రీరామనవమి కల్యాణం చేస్తారు. హనుమజ్జయంతిని వైభవోపేతంగా అనేక కార్యక్రమాలతో కలిపి నిర్వహిస్తారు. ❋

8) శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం-సుల్తాననగరం-మచిలీపట్టణం

కృష్ణాజిల్లా మచిలీపట్టణంలో సుల్తాన నగర శ్రీ అభయ ఆంజనేయ దేవాలయం చాలా ప్రశస్తి కలిగి ఉంది. స్వామి కాలి దగ్గర గద పెట్టుకొని, కుడి మోకాలు భూమిపై ఆనించి ఎడమకాలు కొద్దిగా ప్రక్కకు ఉంచి కూర్చున్న విధానంలో దర్శనమిస్తాడు. అభయ ముద్రతో కుడి చేయి ఉంటే, ఎడమ చేయి మోకాలిపై ఆనించి కనిపిస్తాడు. తోక వెనక్కి బాగా పైకిలేచి ఉన్నట్లు కనిపిస్తుంది. నుదుట నామాలు ముచ్చటగా ఉంటాయి. శిరస్సుకు ధగ ధగాయ మానమైన కిరీటం ఉంటుంది. మెడలో దివ్యాభారణాలు భుజకీర్తులు ఉంటాయి. మూర్తిని చూడగానే పరవశం కలుగుతుంది. నిత్య ధూప దీప నైవేద్యాలు ఆగమ విధానంలో నిర్వహిస్తారు. శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలను 12 రోజులు ఘనంగా, దివ్యంగా నిర్వహిస్తారు. గ్రామోత్సవమూ చేస్తారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను సాయంవేళ నిర్వహించటం ఇక్కడి ప్రత్యేకత.❋

9) శ్రీ ఆంజనేయ దేవాలయం-వలందపాలెం-మచిలీపట్నం

ఇమిటేషన్ నగలకు ప్రసిద్ధమైన బందరులోని వలందపాలెంలో శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. దీనికే పోతేపల్లి ఆంజనేయ దేవాలయం అంటారు. ఇదికాక భక్తాంజనేయ స్వామి దేవాలయం కూడా మచిలీపట్నంలో ఉంది. వివరాలు తెలియలేదు. రాజుపేటలో మరొక ఆంజనేయ దేవాలయం ఉన్నది.❋

10) శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం-అంగలూరు

కృష్ణాజిల్లా గుడివాడ దగ్గరున్న అంగలూరు గ్రామంలో 106 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని 28-5-15 గురువారం మహా వైభవంగా పునః ప్రతిష్ట చేశారు. శిఖర ధ్వజస్థంభ ప్రతిష్టలను కూడా ఘనంగా నిర్వహించారు. ఆగమోక్తంగా జరిగిన ఈ కార్యక్రమం అశేష జనం తిలకించి పులకించింది. శ్రీ దుగ్గిరాల కృష్ణమూర్తి, ప్రమీల దంపతులు ప్రతిష్ట కార్యక్రమాలను యాజ్ఞికులు శ్రీనివాస రామానుజాచార్యులవారి ఆధ్వర్యంలో నిర్వహించారు.❋

11) శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయదేవాలయం–లింగా రెడ్డిపాలెం

కృష్ణాజిల్లా దివితాలూకా కోడూరు మండలంలో లింగారెడ్డి పాలెంలో 28–5–15 గురువారం అశేష భక్త సందోహం నడుమ ఉదయం 9–33 గం.లకు శ్రీ సీతా రామలక్ష్మణ సమేత శ్రీ ఆంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ట వేదపండితులు శ్రీ కారం పూడి సంపత్ కుమారాచార్య ఆధ్వర్యంలో జరిగింది. వేదమంత్రాలతో గ్రామం మారు మ్రోగిపోయింది. కన్నుల పండువుగా జరిగిన ఈ కార్యక్రమాన్ని కనులారా దర్శించి భక్తజనం తరించారు. తర్వాత అందరికీ భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు.*

12) శ్రీ అభయాంజనేయ దేవాలయం–పెదముత్తేవి

కృష్ణాజిల్లా మొవ్వ తాలూకా పెదముత్తేవి గ్రామంలో 'ముముక్షు జన మహాపీఠం' అనే శ్రీ కృష్ణాశ్రమం ఉంది. దీని సంస్థాపకులు శ్రీ శ్రీ సీతారామ యతీన్ద్ర గురుదేవులు. వారి తర్వాత ఆశ్రమ పీఠాన్ని అధిరోహించినవారు జగత్ ప్రసిద్ధులైన శ్రీ శ్రీ లక్ష్మణ యతీన్ద్రులవారు. వీరు అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను రాసి ప్రచురించారు. 'ముముక్షువు' అనే ఆధ్యాత్మిక మాస పత్రికను నిర్వహించారు. భజన చేయటంలో కీర్తనలు పాడటంలో లక్ష్మణ యతీన్ద్రులవారిది ఒక ప్రత్యేక శైలి. భగవంతుడు వారి శరీరంపై ఆవహిస్తాడు. ఆయన చిందులు వేస్తూ చిడతలతో చేసే భజన తాదాత్మ్యాన్ని కలిగిస్తుంది. వారు పర్యటించని ప్రదేశం లేదు. భక్తిని ఊరూ వాడా ప్రచారం చేసిన గురువరేణ్యులు. వారి శిష్యులు కాని వారు ఆంధ్రదేశంలో లేనే లేరు అంటే ఆశ్చర్యం లేదు. ఇక్కడ శ్రీ అభయ ఆంజనేయ స్వామి భారీ విగ్రహాన్ని 1984లో ప్రతిష్టించారు. హనుమకు గారెలు మహా

ప్రీతి కనుక నిత్యం స్వామికి నిలువెత్తు గారెల దండ వేసి పూజిస్తారు. తమలపాకు పూజా విశేషంగా ఉంటుంది. స్వామిని దర్శిస్తే మనమూ ఆయన భక్తిలో లీనమైపోతాము. అదీ ఇక్కడి ప్రత్యేకత. 1984లో ఒకసారి 108 రోజులు శ్రీ లక్ష్మీ నారాయణ మహాక్రతువును నిర్వహించి నిత్యం అన్న సంతర్పణ అఖండంగా చేస్తూ పూర్ణాహుతి రోజున లక్ష మందికి ఒకే పంక్తిలో అన్నదానం చేసిన ఘన చరిత్ర వారిది. లక్ష్మణ యతీంద్రులు పరమ పదించిన తర్వాత వారి కుమారులు శ్రీ శ్రీ సీతారామ యతీంద్రులు పీఠాదిపత్యానికి వచ్చి నిర్వహిస్తున్నారు.

ఆశ్రమంలో ఆంజనేయస్వామి

శ్రీ శ్రీ లక్ష్మణ యతీంద్రుల శత జయంతిని పురస్కరించుకొని శ్రీ కృష్ణాశ్రమంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మణ యతీంద్రుల భారీ విగ్రహాన్ని కూడా స్థాపించారు. ఆశ్రమం శ్రీ సీతారామ యతీంద్రుల వారి ఆధ్వర్యంలో చక్కగా నడుప బడుతోంది. ఆశ్రమం శ్రీ లక్ష్మీ నరసింహా ఓరిఎంటల్ హైస్కూల్‌ను కూడా నిర్వహిస్తోంది. ఆశ్రమ నిర్వహణలో శ్రీ మద్భాగవతం తాత్పర్య సహితంగా ప్రచురింపబడింది. నిత్యం వందలాది భక్తులకు ఏ భేద భావమూ లేకుండా అన్నదానం నిరంతరంగా జరుగుతోంది. చక్కని ప్రకృతిలో పంట పొలాల మధ్య ఆశ్రమం ఆనందానుభూతిని కలిగిస్తుంది. గోశాలను కూడా నిర్వహిస్తున్నారు.❋

13) శ్రీ ఆంజనేయ దేవాలయం-ఇంద్రకీలాద్రి-విజయవాడ

ఇంద్రకీలాద్రిపై వెలసిన దేవి శ్రీ కనకదుర్గా మాత. ఇంద్రకీలుడు అనే యక్షుడు ఆది పరాశక్తి అయిన దుర్గాదేవి అనుగ్రహం కోసం ఇక్కడ ఘోరమైన తపస్సు చేశాడు. అమ్మవారు అతని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై వరం కోరుకోమనగా "అమ్మా! నువ్వు ఎప్పుడు నా హృదయంలో నివసించాలి" అని భక్తిగా అర్థించాడు. అమ్మ సంతోషించి "కీలా! పవిత్ర కృష్ణానది ఒడ్డున నువ్వు కొండ రూపంలో ఉండు. కృతయుగంలో అసుర సంహారం చేసి నేను నీ పర్వతం మధ్యభాగంలో కొలువై ఉంటాను" అని వరం ప్రసాదించింది. కాలగమనంలో ఇంద్రకీలుడు బెజవాడలో పర్వత రూపందాల్చి అమ్మవారికోం ఎదురు చూడసాగాడు. మహిషా సుర సంహారం చేత ఆదిపరాశక్తి దుర్గాదేవి రూపంలో స్వయంభుగా ఇంద్రకీలాద్రిపై స్వయంగా వెలసి కీలుని కోరిక తీర్చింది. ఇంద్రాది దేవతలు అమ్మవారిని అర్చించారు. కనుక ఇంద్రకీలాద్రి అని ఈ కొండకు పేరు వచ్చింది. ఇక్కడ వెలసిన శివుడిని బ్రహ్మదేవుడు మల్లెపూలతో విశేషంగా అర్చించాడు కనుక ఆయనకు మల్లేశ్వరస్వామి అనే పేరు వచ్చింది. ఉగ్రరూపిణి అయిన అమ్మవారిని శాంతస్వరూపంగా మార్చటానికి జగద్గురువులు శ్రీ ఆది శంకరాచార్య స్వామి శ్రీ చక్రాన్ని ప్రతిష్టించారు. అలాంటి శక్తి స్వరూపిణి అయిన దుర్గా మాత సమక్షంలో ఈ శాన్యం వైపు నూరేళ్ళ క్రితం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ మేర్పడింది.

హనుమత్ దీక్షలు ఇంద్రకీలాద్రిపై ఈ ఆలయంలోనే భక్తులు చేబడతారు. ఇది స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన దేవాలయం. సయ్యద్ అప్పల స్వామి అనే భక్తుడు బాటసారుల కోసం బెజవాడలో చాలాచోట్ల

బావులు తవ్వించాలని భావించాడు. 1913 సంవత్సరంలో ఇంద్రకీలాద్రి ఈశాన్యం మూల ఒక బావి తవ్వించాలని నిర్ణయించాడు. ఒకరోజు రాత్రి శ్రీ ఆంజనేయ స్వామివారు ఆయన కలలో కనిపించి, బావిని మరింత లోతుకు త్రవ్వితే తాను కనిపిస్తానని చెప్పాడు. దానిప్రకారం బాగా లోతుగా నుయ్యి త్రవ్వించాడు అప్పలస్వామి. అప్పుడు బావిలో శ్రీహనుమ విగ్రహం బయటపడి అందరినీ ఆశ్చర్య పరచింది. బయటికి తీసి ఆ రోజు నుంచి 1930 వరకు ఒక తాటాకుల పాకలో స్వామిని ఉంచి పూజించటం ప్రారంభించారు. తరువాత గుడి కట్టించారు.

శ్రీ రాం పిళ్ళసూర్యనారాయణ అనే హనుమద్భక్తుడు భక్తుడు, హనుమ దీక్షాపరుడు ఈ హనుమాలయంలో శ్రీ హనుమద్ దీక్షాపీఠాన్ని స్థాపించాడు. ప్రతి ఏడాది మన రాష్ట్రం నుండే దేశంలో అనేక ప్రాంతాల నుండి వేలాది భక్తులు ఇక్కడకు వచ్చి, మాలాధారణతో శ్రీ హనుమ దీక్షను స్వీకరిస్తారు. ఈ దీక్ష వలన ఆత్మస్థైర్యమేర్పడి స్వామి వారి అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తుందని భక్తుల విశ్వాసం.❋

14) శీతలయంత్ర ప్రతిష్టిత శ్రీ సువర్చలాంజనేయ దేవాలయం-శ్రీకాకుళం

శ్రీకాకుళం విశిష్టత

కృష్ణాజిల్లాలో ఒకప్పటి శాతవాహన రాజుల తొలి రాజధాని. కృష్ణానదీ తీరంలోని శ్రీకాకుళంలో శ్రీ ఆంధ్రమహావిష్ణు దేవాలం సుప్రసిద్ధమైనది. ఇక్కడికే శ్రీకృష్ణ దేవరాయలు వచ్చి స్వామిని దర్శించి ఆ రాత్రి ఇక్కడే ఒక మందిరంలో నిద్రించాడు. ఆ రాత్రికలలో స్వామి కనిపించి రాయలను శ్రీ గోదాదేవి చరిత్రను కావ్యంగా రాసి తనకు అంకితమివ్వమని కోరాడు. ఆశ్చర్యపడిన రాయలు స్వామి ఆజ్ఞ శిరసా వహిస్తూ 'ఆముక్తమాల్యద' కావ్యం రాయటానికి నిర్ణయించాడు. రాయలు నిద్రించిన ఆ మందిరాన్నే శ్రీ "కృష్ణ దేవరాయ మండపం" అంటారు. ఇక్కడే ఇటీవల కాలం శ్రీ శ్రీ కృష్ణ దేవరాయలు ఆముక్యమాల్యద రాస్తున్నట్లు విగ్రహం ప్రతిష్టించి ఆనాటి మధుర స్మృతిని శాశ్వతం చేశారు. ఒక జాతి లేక రాష్ట్రం పేరుతో ఎక్కడా ఒక దేవాలయం లేదు. ఆ అదృష్టం ఆంధ్రులకే దక్కి ఆ స్వామి ఆంధ్ర మహావిష్ణువయ్యాడు. కావ్యం రాసి రాయలు తిరుపతి వెంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు.

'శీతల యంత్ర ప్రతిష్టిత' శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయం శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ గారి అనన్య భక్తి

అలాంటి చరిత్రగల శ్రీకాకుళంలో శ్రీ కాకుళస్వామి దేవాలయం దేవాలయం వెనుక మహామహిమాన్విత శ్రీ సువర్చలాంజ నేయస్వామి

దేవాలయం ఉంది. ఈ ఆలయానికి సుమారు రెండు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఎవరు ఎలా, ఎప్పుడు ప్రతిష్ట చేశారో చారిత్రిక ఆధారం మాత్రం దొరకటం లేదు. కాని సుమారు వంద ఏళ్ళక్రితం శ్రీ మతి విష్ణుభొట్ల రాజ్యలక్ష్మమ్మ గారు అనే మహాభక్తురాలు, వితరణశీలి స్వామి వారికి అర ఎకరం పొలం ధూప దీప నైవేద్యాల కోసం రాసిచ్చారు. అప్పటికి స్వామి వారికి ఆలయం అంటూ ఏమీలేదు. ఒక తాటాకు పందిరిలోనే ఉండేవారు.

వ్యాసులవారి వితరణ

శ్రీకాకుళ వాసి శ్రీ అద్దేపల్లి వ్యాసులుగారు బహు కుటుంబీకుడు. వేదశాస్త్ర పారంగతుడు. గ్రామంలో యాయవారం చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకొనేవాడు. ధనాశ లేకుండా అంతా పరమేశ్వర లీలావిలాసం అని నమ్మినవాడు. ఆయన బుద్ధిగరిమను గుర్తించిన గుంటూరు జిల్లా కొల్లూరుకు దగ్గరున్న 'ఇటికం పాడు' గ్రామస్తులు వ్యాసులు గారిని సగౌరవంగా తమ గ్రామానికి ఆహ్వానించి సత్కరించి ఒక అరయకరం స్థలం రాసిచ్చారు. ఏ ఆపేక్షా లేని వ్యాసులవారు ఇంటికి తిరిగివచ్చి ఆస్థలాన్ని శ్రీ సువర్చలాంజనేయ స్వామికి రాసిచ్చి నిశ్చింతగా కాలం గడిపారు. అయినా స్వామివారికి ఆలయ నిర్మాణం జరగలేదు. ఊరిలో బ్రాహ్మణ్యం ఎక్కువ. స్థితితపరులైన వారు కొద్దిమందే ఉండేవారు. శ్రీకాకుళం చల్లపల్లి జమీందారుల ఏలుబడిలో ఉండేది.

వేశ్యాసంగమం నుంచి ఆలయ నిర్మాణానికి

ఇలా కాలం గడిచిపోతూనే ఉంది. కాని ఆలయ నిర్మాణం చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. నడుం కట్టలేక పోయారు. మొవ్వ గ్రామం దగ్గర గుడిపాడుకు చెందిన చౌదరిగారు శ్రీ వెంకటప్పయ్య గారు రోజూ సాయంత్రం వేళ గుర్రపు స్వారిపై గుడిపాడు నుండి శ్రీకాకుళం వచ్చి ఇక్కడి దేవదాశీలతో రాత్రుళ్ళు గడిపి వెడుతూ ఉండేవాడు. ఒకరోజు శ్రీకాకుళం గ్రామ పెద్దలు సమావేశమై చౌదరి గారు రావటం గమనించి వారిని కాసేపు ఆగి తమ మొర వినమని కోరారు. ఏ మూడ్‌లో ఉన్నాడో కాని చౌదరిగారు గుర్రం దిగి ఆగారు. గ్రామస్తులు "అయ్యా చౌదరి గారూ! రోజూ మా ఊరొచ్చి వేశ్య దర్శనం చేసుకొని వెడుతున్నారేకాని ఇక్కడ

ఆలనాపాలనా లేకుండా పందిరి కింద ఎన్నో ఏళ్ళుగా ఉంటున్న శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారికి దేవాలయం లేదు. తమరు తలచుకొంటే అదెంతపని? ఆలయం కట్టి పుణ్యం కట్టుకోండి" అని చాలా వినయంగా విన్నవించారు. చౌదరిగారి మనసులో ఆంజనేయస్వామి సంకల్పం కలిగించాడు అంతే. తప్పకుండా ఆలయం నిర్మిస్తానని వాగ్దానం చేసి కొద్ది నెలలోనే అన్నమాట నిలబెట్టుకొని స్లాబ్ వేసి దేవుడికి నీడ చేకూర్చాడు చౌదరి గారు.

ధర్మకర్తల ఏర్పాటు

ఆలయ నిర్మాణం జరిగినందుకు రాజ్య లక్ష్మమ్మగారు ఆనందించి స్వామి సేవకు శ్రీ బొగ్గవరపు శ్రీ రామచంద్రయ్య శ్రీ పారుపల్లి నాగేశ్వరరావు గారి తండ్రిగారు, శ్రీ విష్ణుభొట్ల నాగయ్య గార్లను ధర్మకర్తలను చేశారు. వీరు చాలా శ్రద్ధగా ఆలయ నిర్వహణ చేశారు. ఆలయం దిన దిన ప్రవర్ధమానమైంది.

కలరా నుండి కాపాడిన కారుణ్యమూర్తి

సుమారు ఎనభై ఏళ్ళ క్రితం శ్రీకాకుళం గ్రామంలో కలరా వ్యాధి విజ్రుంభించి వందలాది జనాలను పొట్టను పెట్టుకొన్నది. జనం భయభ్రాంతులై ఏమీ పాలుపోక తలలు పట్టుకు కూర్చున్నారు. కొందరు గ్రామ పెద్దలు గుంటూరు జిల్లా 'ఉల్లిపాలెం' వెళ్లి అక్కడ ఉన్న స్వాములవారికి తమ గోడు నివేదించుకొని కాపాడమని వేడుకొన్నారు. వారిపై అనుగ్రహించిన 'ఉల్లిపాలెం స్వామి' వారితో కలిసి శ్రీకాకుళం చేరారు. గ్రామమంతా ప్రదక్షిణగా తిరిగి గ్రామ మధ్యలో ఒక 'జమ్మికొమ్మ' మీద 'శీతల యంత్రం' ప్రతిష్టించి, పూజాదికాలు నిర్వహించి దానిని శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్టించారు. రోజూ నైవేద్యంతోబాటు పెరుగన్నం కూడా స్వామికి నైవేద్యం పెట్టమని సలహా ఇచ్చారు. గ్రామస్తులు వారి సలహా అక్షరాలా పాటించారు. అప్పటినుండి ఇప్పటివరకు శ్రీకాకుళం కలరా మసూచి మొదలైనవేవీ జనం జొలికి రానేలేదు. ఇది శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారి మహిమగా చెప్పుకొని మరింత భక్తితో స్వామిని అర్చించటం ప్రారంభించారు. శక్తిగల దేవుడుగా మహా మహిమాన్వితుడుగా స్వామికి గొప్ప పేరుంది.

అర్చకత్వం-అర్చనలు

శ్రీ అద్దేపల్లి శంకరావధానులు గారు స్వామి వారి అర్చకులుగా చాలా ఏళ్ళు ఉండి ఆలయాభివృద్ధికి ఎంతో సహకరించారు. వారి వారసులెవరూ లేనందున ఇప్పుడు అర్చకులుగా వైష్ణవులు ఉన్నారు. శ్రీ హనుమజ్జయంతిని మహా వైభవోపేతంగా లక్ష రూపాయలు దాకా ఖర్చు చేసి నిర్వహిస్తారు. స్వామి వారల కల్యాణం చేస్తారు. ప్రతిమంగల శనివారాలలో తమలపాకులతో విశేష అర్చన ఉంటుంది. శ్రీ దైతా వెంకట సుబ్బయ్యగారి మూడవ కుమారుడు స్వామివారికి 'రజత కవచం' తయారు చేయించి సమర్పించారు.

శ్రీ శంకర మఠం

శ్రీ సువర్చలాన్జనేయ స్వామి ఆలయం ప్రక్కనే శ్రీ రెండు చింతల సంపూర్ణ చంద్ర మౌళేశ్వరరావు అనే శ్రీకాకుళంలోని సంపన్న గృహస్తు సుమారు అయిదు లక్షలు ఖర్చు చేసి 'శ్రీ శంకర మఠం' నిర్మించారు. దీనిని గ్రామంలోని 'శ్రీ ఆది శంకరాచార్య సంఘం' చంద్రమౌళిగారి ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ఇది పూర్తిగా బ్రాహ్మణులు మాత్రమే నిర్వహించే సంస్థ. ఎవరి సాయం లేకుండా బ్రాహ్మణ్యమే చందాలు వేసుకొని కార్యక్రమాలను గొప్పగా నిర్వహిస్తున్నారు.❋

15) శ్రీ స్వయంభు వీరాంజనేయ దేవాలయం-మేడూరు

కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం మేడురులో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామీ ఆలయం మధిర నుండి తిరువూరు మార్గం మధ్యలో ఉంది. ఈ గ్రామంలో హనుమద్గిరి ఉంది. ఈ గిరికి ఉత్తరదిశగా స్వయంభూ శ్రీ వీరాంజనేయస్వామీవారి పర్వతవిగ్రహం ఉంది. ఈ దేవాలయం స్వామివారు వెలసి ఎంతకాలం అయినదో కూడా గ్రామంలో శతాధిక వృద్దులు కూడా చెప్పలేకపోతుండటం వలన అతి ప్రాచీనంగా భావిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా స్వామివారు ఊర్ధ్వ భాగములో ఇరువైపులా కూర్మ, వరాహములు, పదముల మధ్య మత్స్యము ఉన్నందున వేల సంవత్సరాలనాటి దనివిజ్ఞుల అభిప్రాయం. ఇంతటి మహిమాన్వితమైన స్వయంభు వీరాంజనేయస్వామీ వారి దర్శనముకు అటవీప్రాంతంలో ఉంది. భక్తుల స్వల్పముగా వచ్చేటి రోజులలో జగద్గురు విఖ్యాతులు మహిమాన్వితమోపెతులైన బ్రహ్మశ్రీ పరమహంస పరివ్రాజకులైన మన అందరి గురుతుల్యులు అయిన రామయోగేంద్రస్వామివారు. 1970 సంవత్సరంలో అఖండజ్యోతిని స్వామివారు మేడూరు గ్రామములో పురాతన రామాలయంనందు ప్రతిష్టించారు. ప్రస్తుతం వీరాంజనేయస్వామివారి దక్షిణ భాగంలో స్వామివారి పేరున ఒక ఆశ్రమం కట్టబడి ఉంది. దానిలో ఈ

అఖండజ్యోతిని ఉంచి నాటినుండి నేటివరకు దాన్ని సంరక్షిస్తున్నారు. ఈ బాధ్యతను ఆలయంవారు నిర్వహిస్తున్నారు. నేటికి భక్తులు అఖండజ్యోతిని దర్శించితరిస్తున్నారు. ఈ మేడూరు గ్రామాన్ని ఒక దివక్షేత్రంగా గుర్తించి వారి దివ్యశక్తిని ప్రభావితంచేసి ఉభయ తెలుగు రాష్ట్రాలలో గ్రామాలను, పట్టణాలను తిరిగి భక్తులను ఈ క్షేత్రానికి వచ్చి సప్తాహాలు, ఏకాహాలు, హనుమాన్చాలీసా పారాయణం జపించి జీర్ణోద్ధరణలో ఉన్న దేవాలయాలను పునరుద్ధరించి వర్షాధారం లేకుండా ఉన్న మేడూరు, పరిసర గ్రామాలను తన తపఃశక్తీతో సస్యశామలం చేయటం జరిగింది. మనవ కోతికి తన చిరునవ్వుతోనే పరమేశ్వర అనుగ్రహం కలుగుతుంది. సువృష్టి కలిగి మంచిపంటలు పండించుకొని భాగవ ధ్యానం చేయండి అని చల్లని దీవెనలు ఇచ్చి ఆశీర్వచనము చేస్తూ 2-21992లో పరమేశ్వర అనుగ్రహం కలిగి మంచి పంటలు పండించుకొని భాగవధ్యానం సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా రజతోత్సవాలు జరిపారు. స్వామివారి సంకల్పానుసారం శ్రీ భ్రమరాంభ సహిత రామలింగేశ్వరస్వామీ పేరున ఒక శివాలయం నిర్మించారు. 21-5-1955లో శివాలయం ప్రతిష్ట చేసారు. మహాలింగేశ్వర అభిషేకాతపస్వి అయిన రామయోగీంద్రస్వామివారి కుమారులు దివ్య శ్రీ చినరామయోగీంద్రస్వామివారు రాజయోగి, సువర్చలాసామెత పంచముఖహనుమత్ ఉపాసకులు, శ్రీ పంచానన విరాడ్రూపీ ఆస్థా దశ భానువార హనుమద్దీక్షాపీటం వ్యవస్థాపకులు దివ్య శ్రీ చినరామ యోగీంద్రస్వామివారు తన తండ్రిగారి ఆలోచనమేరకు దోసయాగము నిర్వహించి అదే యజ్ఞ ప్రదేశమును సహస్ర సతసోడశ అష్టోత్తర శివలింగములతో కూడిన శ్రీ కాత్యాయని సమేత జీవన్ముముక్తేశ్వరస్వామివారి ఆలయం నిర్మాణం అదే యజ్ఞప్రదేశమున సహస్రశత సోడశ అష్టోత్తర శివలింగములతో కూడిన శ్రీ కాత్యాయని సమేత జీవన్ముముక్తేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణము రామయోగీంద్రస్వామివారి గురు పరపరకు కొనసాగింపునున్నారు. ప్రస్తుతం వీరాంజనేయస్వామివారి ఆలయం ఎదురుగా రామాలయం, శివాలయం ఎదురుగా అయ్యప్పస్వామీ ఆలయం నిర్మించారు.❋

తూర్పు గోదావరిజిల్లా

16) శ్రీ అభయాంజనేయ దేవాలయం-కాకినాడ

తూర్పు గోదావరిజిల్లా కాకినాడలో సూర్యనారాయణపురంలో పైడా వారి అపార్ట్‌మెంట్ దగ్గర శ్రీ అభయాంజనేయ దేవాలయం 1996లో నిర్మించబడి దాదాపు ఇరవై ఏళ్ళుగా ప్రసిద్ధ దేవాలయంగా వినుతికెక్కినది. మనసులోని కోర్కెలను స్వామికి చెప్పుకొంటే అభయమిచ్చి నెరవేర్చే భక్త సులభుడు. ప్రతి మంగళవారం హనుమాన్ చాలీసా భజనలతో ఆలయం మారు మోగి పోతూ ఉంటుంది.*

17) శ్రీ సకల కార్యసిద్ధి హనుమాన్మందిర్-అమలాపురం

అమలాపురంపట్టణంలో పురోహితుడిగా జీవనం సాగిస్తున్న శ్రీ ఆకొండి గోపాలకృష్ణ గారి చిన్నతనం నుంచి దేవాలయ నిర్మాణం చేయాలన్న ఆశక్తి ఉన్నది. అయితే అది ఒక వ్యక్తి సాధించగల కార్యమా! అయినా ఉన్నకోరిక అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది, కానీ మరుప ్రకలగటం లేదు. ఆ భగవదిచ్ఛ ఏమిటో అనుకుంటూనే సంసారిక తాపత్రయంలో పడి కాలం గడుపుతున్నారు.

1984 వసంవత్సరంలో నివాస గృహనిర్మాణార్థమై యర్రమిల్లివారివీధిలో స్థలం

కొనటం జరిగింది. దైవసంకల్పమో ఏమోనేనుకొన్న స్థలం ఇరుగు పొరుగువారి స్థలములకన్నా బాగా పెరిగి ఉన్నది. అప్పుడు మళ్ళీ మనసులో దేవాలయ నిర్మాణం గురించి మెదిలింది. భగవంతుడు నివాస గృహాన్ని కలుగజేసాడు. ఇంటికి ముందున్న ఖాళి జాగాలో ఆలయ నిర్మాణం చేయగలిగితే బాగుండును కదా అనుకున్నారు. కానీ సంకల్పం నెరవేరే స్థితిగతులు ఏర్పడలేదు. ఇలా ఉండగా ఎవరో ఒక ఆసామీ గృహప్రవేశము ముహూర్త నిర్ణయం కొరకు ఆయన వద్దకు రావటం జరిగింది. ఆ మాటల్లో ఆయన "గురువుగారు! మీ ఇంటిముందు ఇంత జాగా ఉంది కదా. ఈ స్థలంలో ఏదైనా దైవ ప్రతిష్ట జరిగితే బాగుంటుందేమో" అన్నారు. ఆశ్చర్యపోయాడు ఆయన మాటలకు "నా మనస్సు చదివినట్లుగా చెప్పారు. నాది అదే సంకల్పం అది ఒక్కడివాళ్ళ అయ్యేపనా! అంగబలం, అర్థబలం కావలి. వీటన్నింటి కన్నా ముఖ్యముగా దైవబలం కావలి" అన్నాడు. "తమరు అనుగ్రహిస్తే నాదొక మనవి. నా గృహనిర్మాణం కోసం పాత ఇంటిని విప్పుతుండగా అటకమీద ఆంజనేయస్వామి విగ్రహం లభించింది. దానిని ఎప్పుడు, ఎవరు అక్కడ పెట్టారో తెలియదు, సుమారు వందసంవత్సరాల పైబడిన పాత ఇల్లది. ఆ విగ్రహాన్ని మీకిస్తాను, ఆ స్వామిని ఇక్కడ ప్రతిష్టించండి, ఆలయ నిర్మాణం ఆయనే చూసుకుంటాడ' అన్నాడు ఆ ఆసామీ. ఆ మాటలను దైవసంకల్పంగా భావించి ఆ విగ్రహాన్ని తీసుకుని ఉత్తరాభిముఖంగా తిధి వార నక్షత్రాదుల నిమిత్తం లేకుండా ప్రతిష్టించటం జరిగింది. స్వామికి నిలువడానికి చోటైతే దొరికింది కానీ, ఎండకు ఎండి వానకు తడుస్తూనే ఉన్నాడు. ప్రతిరోజు వీధిన పోయే భక్తులు ఆగి స్వామికి నమస్కరించుకుని త్రణమో పణమో అక్కడపెట్టి పోతుండటంతో ఒక చిన్న హుండీ ఏర్పాటుచేయటం జరిగింది. ఇనుప కిటికీలు మొదలగునవి తయారుచేసే ఒక వ్యక్తి "గురువుగారు! స్వామికి ఈ గొడుగు ఏర్పాటు చేయండి" అంటూ ఒక ఇనుప గొడుగును అందంగా తయారుచేసి రంగులు వేసి ఇచ్చారు. దానిని స్వామికి నీడగా ఏర్పాటుచేసాడు. ప్రతిరోజు ఉదయమే స్వామికి నిత్యపూజ చేసినా దైనందిన కార్యక్రమాలకు ఉపక్రమించేవాడు. మంగళవారం , శనివారం భక్తుల రాక పెరిగింది. "గురువు గారూ! మా మనసులో ఏది

కోరుకున్నామో స్వామివారి దయవలన అది ఫలించింది, అర్చన చేయండి. ఆకుపూజ చేయించండి” అనే భక్తుల సంఖ్య పెరిగింది. స్వామివారి పేరేమిటి అభయాంజనేయుడా వీరాంజనేయుడా” అంటూ అడగసాగారు. “నిజమే! స్వామివారిని ఏదోఒక పేరుతో పిలవాలి కదా అని నాకు కూడా అన్పించింది. ఆలోచించాడు. భక్తులు మనస్సులోని కోరికలను సిద్ధింపజేస్తున్నాడు కనుక “సకలకార్యసిద్ధిహనుమాన్” అని పిలిస్తే బాగుంటుంది కదా అనుకున్నాడు. అదే భక్తులకు చెప్పటం జరిగింది. అదే పేరుతో పిలవబడుతున్నాడు స్వామి. ఒకరోజు పండు ముత్తైదువా ఒకామె స్వామిదర్శనానికి వచ్చింది. అక్కడే ఉన్న ఆయనతో “ఏమబ్బాయి! హనుమయ్యను అలా వదిలేసావ్, కాస్త మందిరం ఏర్పాటుచేస్తే బాగుంటుంది, ఖర్చు కోసం వెనకాడకు. అంతా వాడే చూసుకుంటాడు” అంది. సాక్షాత్తు పార్వతిదేవీ వచ్చి గుడి కట్టమని ఆదేశించినట్లుగా అన్పించింది. ప్రయత్నించినప్పుడే కదా ఫలితం లభించేది మొదటి అడుగు వేసినప్పుడే కదా ప్రయాణం మొదలయ్యేది. ఆ క్షణంలోనే తాపీమేస్త్రికి కబురు పంపాడు. తెలిసినవారందరికీ విషయం చెప్పాడు. అంతే! ఒక చేతికి మరో చెయ్యిఆసరా. ఎవరికి వారే స్వచ్ఛందంగా “గురువుగారు! ఇసుక తోలిస్తాము, తలుపులు మేమిస్తాము” అంటూ తమ వంతు సహకారం అందించారు. మందిర నిర్మాణం పూర్తయింది. గోపుర నిర్మాణం సంగినీడి సీతారామయ్య, సూర్యకాంతం దంపతుల కుమారుడు నరసింహారావు దంపతుల ద్రవ్య సహాయంతో జరిగింది. దినదినాభివృద్ధిగా భక్తుల సందడి పెరిగింది. నిత్యపూజలు, మంగళవారం, శనివారాలలో విశేష పూజలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం మార్గశిర త్రయోదశి నాడు “హనుమద్వ్రతం” ఆ రోజున హనుమంతుడు సీతాదేవిని దర్శించాడు. అందుచే ఆ రోజు హనుమంతుని పూజించినవారి కోర్కెలు నెరవేరి సకల దుఃఖములు నివృత్తియగునని సీతమ్మతల్లి వరమొసంగించింది. ఆ రోజుకు ముందుగా స్వామిని పల్లకిలో ఊరేగించి తదుపరి హనుమద్వ్రతం రోజున లక్షతులసి, నాగవల్లీ దళములతో సింధూరంతో పూజించి భక్తజనావళికి ప్రసాద వితరణ, అన్న సమారాధన చేయటం జరుగుతుంది. ఈ కార్యక్రమాలన్నీ భక్తుల విరాళాలతో వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇలా సాగుతుండగా స్వామి ఆలయమందు ధ్వజస్తంభ

నిర్మాణం చేయసంకల్పం జరిగింది శ్రీ మట్టపర్తి సాహెబు దంపతులు తమకుమార్తె పేరున ధ్వజస్తంభ ప్రతిష్ట చేయించారు. తర్వాత ఒక భక్తురాలు వెండి కవచం, బంగారు నేత్రములు నామము చేయించారు. ఆమె తన పేరును గోప్యంగా ఉంచమని కోరటం జరిగింది. ఈదరపల్లి వాస్తవ్యులు పుల్లెపు వెర్రియ్యగారు స్వామివారికి వెండి కిరీటం చేయించారు. స్వామివారిని ప్రతి సంవత్సరం పల్లకిలో ఉరేగిస్తున్నారు. రథంలో ఉరేగిస్తే బాగుంటుంది అన్న ఉద్దేశ్యంతో భక్తుల ముందు ఆ ఆలోచన ఉంచటం జరిగింది. అన్ని కార్యక్రమాలకు మేము ముందంటే మేముముందని పోటీపడే ఉత్సాహవంతులు ఎందుకనో ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. బహుశా స్వామివారు ఈ సేవకు తననే నిర్ధేశించారు కాబోలు అనుకున్నాను. ఏ ఒక్కరి విరాళము లేకుండా స్వార్జిత విత్తంతో రథం తయారు చేయించాడు. అనుకున్న దానికంటే పదిరెట్లు ఎక్కువ ఖర్చు అయింది. స్వామి తనకు కలిగించిన అదృష్ట భాగ్యంగా భావించి సంతసించాడు. శ్రీ పొత్తూరి లక్ష్మిపతి రాజుదంపతులు శ్రీ ఆంజనేయస్వామి భక్తులు, మహారాజపోషకులుగా ప్రతిసంవత్సరం ఇతోధిక ధన సహాయంతో ఆలయానికి రంగులువేయించుట , ఋత్విక్కులను హనుమద్వ్రతం రోజున పూజాదికాలు నిర్వహించే బ్రాహ్మణులకు సత్కారం చేయుటవంటి కార్యక్రమాలు జరిపిస్తున్నారు. చిన్ననాటి నా సంకల్పం నెరవేరింది. దేవాలయ నిర్మాణం జరిగింది నిత్య ధూప దీపనైవేద్యాలతో సకల కార్యసిద్ధి హనుమాన్స్వామి వారికి సేవలు జరుగుతున్నాయి. ఈ దశలో ఆయన జ్యేష్ఠ కుమారుడు చి.నాగవెంకట సూర్య సింహాచలపవన్కుమార్ సంకల్పంతో ఇరువది నాలుగు అడుగుల శ్రీ స్వామివారి విగ్రహ నిర్మాణం చెప్పటం జరిగింది. ఆలయ నిర్మాణానికి ఎదురైనట్లుగానే అనేకఅడ్డంకులు, చిక్కులు ఎదురయ్యాయి. ఇది ఆ స్వామి పరీక్షగా భావించాడు. ఒకరోజు ఒక వానరం ఎక్కడి నుండి వచ్చిందో! నిర్మాణంలో ఉన్న స్వామి విగ్రహం చుట్టూ తిరిగింది. భక్తులు ఇచ్చిన ఫలాన్ని తీసుకొని తిన్నది. మా ఇంటికి కొద్దిదూరంలో ఉన్న అరటితోటలో పని ఉండి వెళ్ళాడు. తనకంటే ముందు ఆ వానరం ఎటు వెళ్లిందో నేను వెళ్లేసరికి తోటలో దర్శనమిచ్చింది. అప్పుడు అన్పించింది. స్వామివారు కటాక్షిస్తున్నారు అని, మానవ ప్రయత్నం చేయాలి

కదా అనుకున్నాడు. "స్వామి! నేను నిస్వార్ధంగా నీ సేవ చేసుకుంటున్నవాడినే అయితే నిర్విఘ్నంగా ఈ కార్యక్రమాన్ని సంపూర్ణం చేయించు అని ప్రార్ధించుకుని నా ప్రయత్నం నేను చేసాను ఒక భక్తురాలు స్వామివారి విగ్రహ నిర్మాణం పూర్తయ్యే వరకు 'అభోజనంగా' ఉంటానని ప్రమాణం చేసి కేవలం ఒకపూట స్వామి ప్రసాదం తిని దైవచింతనతో గడిపింది. స్వామికార్యం స్వామి చక్కబెట్టుకోడా. మన పిచ్చికానీ! మనస్థైయిర్యాన్ని పరీక్షించటం కోసమే ఏవో అడ్డంకులు, చిక్కులు కల్పిస్తాడు తప్ప! అనుకున్నట్లుగా స్వామి విగ్రహం పూర్తయింది. సప్తర్షి ఆశ్రమాధిపతులు గుంటూరు, కులపతి మారెళ్ల శ్రీరామకృష్ణగారిచే ఆవిష్కరణ చేయటం జరిగింది. "దేహో దేవాలయః ప్రాక్తోజీవోదేవస్సనాతన" అన్నట్లు మన దేహంలో ఉన్న భగవంతుడే కల్పిస్తున్నాడు, ఆయనే విఘ్నాలు కల్పిస్తున్నాడు ఆయనే వాటిని తొలగిస్తున్నాడు.❋

ఆధారం: శ్రీ ఆకొండి గోపాలకృష్ణమూర్తిగారు పంపిన వ్యాసం

18) శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం- రాజోలు

తూ. గో.జిల్లా రాజోలులో గోదావరి నదీ తీరాన శ్రీ భక్తాంజనేయ దేవాలయం ఉంది. త్రేతాయుగ సన్నిధిగా కీర్తి పొందింది. వసిష్ట మహర్షి ప్రతిష్టితం. అంతర్వేదిలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ప్రతిష్ట తర్వాతఇక్కడ ప్రతిష్ట జరిగిందని స్థలపురాణం. గర్భాలయంలో ముకుళిత హస్తాలతో శ్రీ భక్తాంజనేయ విగ్రహం దర్శనమిస్తుంది. రెండు ఉపాలయాలలో ఒకదానిలో శ్రీ సీతారామంజనేయ సహిత శ్రీరాముడు సకల ఆభరణాల, తేజో విరాజమానంగా కొలువై ఉంటాడు. తన ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్రుడిని తన సమక్షంలోనే ప్రతిష్టించుకొని శ్రీ హనుమజ్జయంతి ఘనంగా నిర్వహిస్తారు.❋

19) 135 అడుగుల శ్రీ ఆంజనేయ విగ్రహం-యర్రవరం

తూర్పు గోదావరిజిల్లా అన్నవరంకు 23 కిలోమీటర్ల దూరంలో జగ్గవరం సమీపంలో యర్రవరంలో 135 అడుగుల శ్రీ ఆంజనేయ విగ్రహం చూపరులను విశేషంగా ఆకర్షిస్తుంది. 1990లో ప్రతిష్టించారు. ముచ్చటైన భారీ మారుతిని చూసిన అనుభవం కలుగుతుంది.❋

20) మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి ప్రతిష్ఠిత శ్రీ ఆంజనేయాలయం-చొల్లంగి

550 ఏళ్ళనాటి ప్రాచీన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం కాకినాడ శివార్లలో 4 కిలోమీటర్లలో ఉన్న చొల్లంగి గ్రామంలో ఉంది. ఇందులో శ్రీ హనుమను విగ్రహాన్ని మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి ప్రతిష్టించారు. చొల్లంగి అమావాస్యనాడు విశేషంగా భక్తులు వచ్చి ఈ చొల్లంగి ఆంజనేయస్వామిని దర్శించి, పూజించి తరిస్తారు. గోదావరి ఒకపాయ చొల్లంగిలో పుష్య అమావాస్యనాడు సముద్రంలో కలుస్తుంది కనుక గొప్ప పర్వదినంగా భావించి చొల్లంగి అమావాస్యనాడు ఇక్కడ స్నానం చేసి హనుమను

దర్శించటం అనూచానంగా వస్తున్న ఆచారం. ఇదే చొల్లంగి తీర్థంగా ప్రసిద్ధికెక్కింది.

ఈ ఆలయ నిర్మాణం అంతా శ్రీ దేవరకొండ వ్యాసారావు పంతులుగారు ఒంటి చేత్తో చేశారు. సుమారు 500 ఏళ్ళక్రితం, కాకినాడ చొల్లంగి ప్రాంతమంతా దట్టమైన అడవిగా ఉండేది. వ్యాసారావు పంతులుగారు ఇక్కడే మంత్రాలయం అనేవేద పాఠశాల ఏర్పాటుచేసి అయిదుగురు విద్యార్ధులకు వేదం నేర్పారు. రోజూ అయన కాకినాడ నుండి గుర్రంబండీ మీద చొల్లంగి వచ్చి వెళ్ళేవారు. రోజు గుర్రం ఈ ప్రదేశం దగ్గరకు రాగానే సకిలిస్తూ, చొంగకారుస్తూ అక్కడే ఆగిపోయేది. దాన్ని బతిమాలుతూ బామాలుతూ దారి మళ్ళించి వేదపాఠశాలకు వెళ్ళి వచ్చేవారు. ఒకరోజు గుర్రం మొండికేసి, కదలకుండా భీష్మించింది. చేసేది లేక పంతులుగారు వెనక్కి తిరిగి కాకినాడ వెళ్ళిపోయారు. ఆ రోజు రాత్రి ఆంజనేయస్వామి ఆయన కలలోకి వచ్చి తాను గుర్రం ఆగిపోయి చొంగకార్చిన చోట భూమిలో విగ్రహంగా నిలువుగా పాతిపెట్టబడి ఉన్నానని, బయటికి తీసి శ్రీరాఘవేంద్రస్వామిచేత ప్రతిష్టింపజేసి, గుడి కట్టించమని చెప్పాడు. మర్నాడు పంతులుగారు అక్కడ తవ్వించి చూస్తే విగ్రహం కనిపించింది. బయటికి తీయించి మంత్రాలయం వెళ్ళి తన గురువు రాఘవేంద్రస్వామికి జరిగినదంతా చెప్పి ఆయన్ను తీసుకొని వచ్చి హనుమ విగ్రహాన్ని ప్రతిష్టింపజేసి గుడి కట్టించి ధూప దీప నైవేద్యాలకు ఏర్పాటుచేశారు పంతులుగారు. చిల్లంగి ఆంజనేయస్వామి పశ్చిమ ముఖంగా, మీసాలతో ఉండటం ఇక్కడ దబుల్విం్త. తూ.గో.జిల్లాలో ఇంకెక్కడా పశ్చిమ ముఖ ఆంజనేయస్వామి లేడు. గండికోట పశుపతిరావు వంశీకులే అప్పటి నుంచి అర్చకత్వం చేస్తున్నారు. పంతులుగారి గుర్రం హరాం చేసి చొల్లుకార్చిన చోట హనుమ విగ్రహప్రతిష్టాపన జరిగి ఆలయం వెలయటం, అక్కడే గ్రామం ఏర్పడటంవలన ఇది 'చొల్లంగి' అయిందని కథనం. కాకినాడ -యానాంబస్ ఎక్కి చొల్లంగి దగ్గర దిగి, కిలోమీటరు దూరంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం చేరుకోవచ్చు. ఆలయానికి ఒక కిలోమీటరు దూరంలో గోదావరి పాయ పుష్యఅమావాస్య (చొల్లంగిఅమావాస్య)నాడు సముద్రంలో కలుస్తుంది. ఈ తీర్థంలో ఆనాడు వేలాదిమంది అన్నిప్రాంతాల నుండి వచ్చి, పవిత్ర స్నానాలు చేసి అక్కడే ఉన్న శివలింగేశ్వరస్వామిని దర్శించి, తర్వాత చొల్లంగి హనుమను దర్శించి తరిస్తారు. ❃

పశ్చిమ గోదావరిజిల్లా

21) గబ్బిట, చందూరి వారల శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం-రామారావు గూడెం

పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్యపట్టణం ఏలూరుకు సమీపంలో దెందులూరు మండలంలో శ్రీ భక్తాంజనేయ దేవాలయ నిర్మాణం జరిగి ఆరేళ్ళు అయింది. దీనికో చరిత్ర ఉంది.

గబ్బిట వారి అగ్రహారం-రామారావు గూడెం

మా తండ్రిగారు కీ.శే. గబ్బిట మృత్యుంజ శాస్త్రి గార తండ్రిగారిది రామారావు గూడెం. దాన్ని గబ్బిట వారి అగ్రహారం అనేవారు. మా నాన్న గారి తండ్రిగారు అంటే మా తాతగారు గబ్బిట దుర్గాపతి శాస్త్రి గారిది ఆ గ్రామమే. వారు తొమ్మిది మంది అన్నదమ్ములు. మా నాయనమ్మగారు నాగమ్మగారు కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన గుండువారి ఆడబడుచు. ఆమె తండ్రిగారు గుండు నరసింహావధానులు గారు. రామారావు గూడెం అంతా గబ్బిట వారి అగ్రహారమనే మాట చెల్లు బాటులో ఉండేది. మా తండ్రిగారి తాత గారు గబ్బిట దక్షిణామూర్తి శాస్త్రిగారు. భార్య కనకమ్మగారు. మా తండ్రిగారు జన్మించిన కొద్దికాలానికే మా తాతగారు దుర్గాపతి శాస్త్రి గారు అకాల మరణం చెందారు. మా నాయనమ్మగారు పుట్టింటికి ఉయ్యూరుకు బిడ్డతో సహా వచ్చేశారు. మా అగ్రహారం భూములన్నిటినీ మా బంధువులు శ్రీ చందూరి సుబ్బారావు గారు చూస్తూ, ఆదాయం వసూలు చేసి మాకు

పంపుతూ ఉండేవారు. ఆయన భార్య సీతామహాలక్ష్మి. అగ్రహారంలో మాకు పెంకుటిల్లు, బండీ ఎడ్లు ఉండేవి. పాలేరు ఉండేవాడు. మా నాన్నగారు నేనూ ఎప్పుడు ఆ ఊరు వెళ్ళినా మా కోసం దెందులూరు రైల్వేస్టేషన్‌కు ఎడ్ల బండీ పంపేవారు సుబ్బారావుగారు. మాకు భోజన సదుపాయం ఏర్పాటు చేసేవారు సీతామహాలక్ష్మి గారు. ఆమెను అక్కయ్యా అని ఆయను బావ గారు అని నేను పిలిచేవాడిని. మా నాన్నగారు అనంతపురం జిల్లా హిందూపూర్ మునిసిపల్ హైస్కూల్‌లో సీనియర్ తెలుగు పండితులుగా 22 ఏళ్ళు పని చేసి, ఆ సర్వీస్‌తో కృష్ణాజిల్లా బోర్డ్ హైస్కూల్‌కు బదిలీ అయి ఉయ్యూరులో రిటైర్ అయ్యారు. అందుకని మా గూడెం పొలం వ్యవహారాలను మా అమ్మగారి బాబాయి గుండు లక్ష్మీనరసింహం గారు (నరసింహం తాత) అజమాయిషీ చేస్తూ చూసేట్లుగా మా నాన్న గారు ఏర్పాటు చేశారు. ఆయన ఎక్కడా భోజనం చేసేవారు కాదు. స్వయంగా వండుకొని తినేవారట రామారావు గూడెంలోని మా ఇంట్లో. ఈ విషయం సీతామహాలక్ష్మి అక్కయ్య చెప్పేదని కుమార్తె భారతి తెలియజేసింది. రామారావు గూడెంలో మా నాన్నగారిని అందరూ 'ముత్తయ్యగారు' అని పిలిచేవారు.

గబ్బిట వారి ఆంజనేయ స్వామి చందూరి వారి స్వామిగా మారటం

రామారావు గూడెంలో అప్పటికి నీటి వసతి ఉండేది కాదు. వర్షాధారమే పంటలకు. కౌలు సరిగ్గా ఇచ్చేవారు కాదు. ఈ బాధలు పడలేక మా నాన్నగారు సుమారు 60 ఏళ్ళ క్రితం అక్కడి భూములనన్నిటిని అమ్మేశారు. మా కుటుంబానికి చేయూతగా ఇంతకాలం పనిచేసి మాకు ఏంతో తోడ్పడిన మా బంధువు చందూరి సుబ్బారావు గారికి మా నాన్నగారు మూడు ఎకరాల భూమి, అందులో ఇల్లు బావితో సహా రాసి ఇచ్చారు. ఆ స్థలంలోనే చిన్నదైన శ్రీ భక్త ఆంజనేయస్వామి దేవాలయం తరతరాలుగా ఉండేది. కాలక్రమేణా మేము ఆ ఊరిని వదిలేయటం, సుబ్బారావు గారు కూడా అక్కడి నుండి కాపురం ఏలూరుకు మార్చటంతో దేవాలయం ఆలనా పాలనా లేక క్రమంగా శిథిలమై కూలిపోయింది. విగ్రహమూ కొంత మేరకు దెబ్బతిన్నది. సుబ్బారావు గారు చనిపోయిన తర్వాత భార్య సీతామహలక్ష్మి అక్కయ్య ఒకసారి అక్కడికి వెళ్లి చూసి స్వామి వారి ఆలయ దైన్య స్థితికి

కుంగిపోయి కన్నీరు మున్నీరై 'ముత్తయ్య బాబాయి' (మృత్యుంజయ శాస్త్రిగారు అంటే మా నాన్నగారు)కి చెందిన ఈ ఆలయాన్ని ఎలా అయినా పునరుద్ధ రించాలనుకొన్నది. కాని ఆమె వల్ల కూడా సాధ్యపడలేదు. ఆమె కూడా చనిపోయే ముందు తన కోరికగా రామారావు గూడెంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం గురించే చెప్పిందట. అక్కయ్య కుమార్తె శ్రీమతి భారతి, అల్లుడు శ్రీ కొలచన ప్రసాద రావు గార్లు ఆలయం కడతామని ఆమెకు వాగ్దానం చేశారట.

అమ్మ కోర్కెను తీర్చిన అమ్మాయి అల్లుడు

ఆలయ వివరాలను అందజేయమని శ్రీ ప్రసాదరావు దంపతులను కోరగా వారు పంపిన విషయాలు–చందూరి సుబ్బారావు గారి కుమార్తె భారతి గారి అమ్మమ్మ గారు స్వర్గీయ గబ్బిట నాగమ్మగారు తన అల్లుడు అంటే చందూరి సుబ్బారావు గారిని ఆమె జీవిత ఆఖరు దశలో రామారావు గూడెంలోనే ఉండి తననూ, అక్కడి వ్యవసాయ భూములను చూసుకొంటూ ఉండమని కోరింది. అత్తగారి మాటకు విలువనిచ్చి అల్లుడు చందూరి సుబ్బారావు గారు భార్య మహాలక్ష్మమ్మ గారితో గూడెంలోనే కాపురం ఉండి నాగమ్మగారిచ్చిన పొలాలను, మా తండ్రిగారు మృత్యుంజయ శాస్త్రి గారిచ్చిన భూములను సాగు చేసుకొంటూ ఆమె ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉండేవారు. ఆ తర్వాత నాగమ్మగారు మరణించారు. సుబ్బారావు గారు ఇక్కడ ఉండలేక ఏలూరుకు కాపురం మార్చారు. సుమారు యాభై ఏళ్ళ తర్వాత ఒకసారి సీతామహాలక్ష్మిగారు రామారావు గూడెం వచ్చి నిలువ నీడైనా లేకుండా తమ వ్యవసాయ భూమిలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ మౌనంగా భరిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామిని చూసి చలించిపోయింది. ఎలాగైనా స్వామికి దేవాలయం నిర్మించాలన్న సంకల్పం ఆమెలో బలీయమైంది. ఆ మాటనే కూతురు భారతికి అల్లుడు ప్రసాద రావు గార్లకు తేల్చి చెప్పింది. ఆమె మనోభీష్టాన్ని నెరవేర్చాలని ఈ దంపతులకూ సంకల్పం కలిగి నెమ్మదిగా ఆలోచన కార్యరూపం దాల్చింది.

ప్రసాదరావు గారు వరుసకు తోడల్లుడు భైరవభట్ల వెంకట రామయ్యగారితో కలిసి ఒకసారి కారులో రామారావు గూడెం వచ్చి స్వామికి కనీసం తాటాకు పందిరి కూడా లేనందుకు విచారించారు. అక్కడ వ్యవసాయ

కూలీగా చందూరి సుబ్బారావు గారి దగ్గర పని చేసిన కందుల వెంకన్న, కొందరు గ్రామస్తులు వచ్చి కారు చుట్టూ మూగారు. ప్రసాదరావుగారు హనుమస్వామి ఉన్న దయనీయ పరిస్థితికి కల్లోలపడి వారికి వివరించారు. అక్కడ శ్రీ ఆంజనేయస్వామికి కనీసం ఒక రేకుల షెడ్ అయినా వేయాలని తాను సంకల్పంతో ఉన్నానని చెప్పారు. అందరూ ప్రసాదరావు గారి పూనికకు హర్షామోదాలు తెలియజేసి తమ వంతు సహకారం ఆలయ నిర్మాణంలో చేస్తామని మాట ఇచ్చారు. అదీ దైవ సంకల్పం అంటే. అంతే ఇక వెను దిరిగి చూడాల్సిన అవసరం కలగ లేదు. సంకల్పమే సగం బలం అన్నారు అందుకే. వెంకన్న ఆ దేవాలయ హీన దీన స్థితిని వివరిస్తూ, సుబ్బారావుగారి తర్వాత వచ్చిన పొలం సాగు చేసేవారు అక్కడ ఉన్న ఆలయం నుండి శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని తొలగించి అవమాన పరచారని, గ్రామస్తులమైన తాము రెండుసార్లు స్వామికి ఆలయం నిర్మించటానికి ప్రయత్నించామని కాని అది సాధ్యపడలేదని, కాని హనుమ విగ్రహాన్ని మాత్రం భద్రపరచి జాగ్రత్త చేయగలిగామని సుబ్బారావు గారికి నమ్మకస్తుడైన వెంకన్న తెలియజేశాడు.

ఏలూరు చేరుకొన్న ప్రసాదరావుగారు భార్య భారతిని రామారావు గూడెం ఆలయం గురించి ఆమెకు తెలిసిన విషయాలను చెప్పమని కోరారు. ఆమె తన చిన్నతనంలో అక్కడ చిన్న హనుమాలయం ఉండేదని, అప్పటికే అది శిధిలావస్థలో ఉండేదని, ఆమె తల్లి పూర్వీకులకు కలలో కొన్ని దేవతా విగ్రహాలు దర్శనమిచ్చినట్లు ఎలాగైనా వాటిని ప్రతిష్ఠించి గుడి కట్టాలని వారు ప్రయత్నం చేశారని కాని గుడి కట్టలేక పోయారని గతాన్ని గుర్తుకు తెచ్చుకొని భర్త ప్రసాదరావు గారితో చెప్పింది భార్య భారతి. అంతేకాదు హనుమ దేవాలయాన్ని పునర్నిర్మించటం తమ వల్ల కాలేదు కనుక తమ వారసులైనా దాన్ని నిర్మించి తాము చేయలేనిపని చేసి పుణ్యం కట్టుకోమని కోరారు. లేకపోతే 'వంశ క్షయం' జరుగుతుందని కూడా తెలియజేశారు. ప్రస్తుత ఆలయాన్ని నిర్మించేముందు కూడా ప్రసాదరావుగారికి కలలో సంజీవి పర్వతాన్ని మోసుకొంటూ చేతిలో జెండాతో శ్రీ ఆంజనేయ స్వామి కొద్దిసేపు కనిపించారని తెలియజేశారు. కనుక స్వామి పూర్తి అనుగ్రహం తమ కుటుంబంపై ఉన్నదనే విశ్వాసం కలిగి ఆలయ నిర్మాణానికి ఉపక్రమించారు ప్రసాదరావు భారతి

దంపతులు.

అత్తగారి కోరికను అల్లుడు తీరుస్తుంటే తండ్రికి పూర్తి సాయం చేసిన కుమారుడు

తల్లిదండ్రులైన ప్రసాదరావు భారతి దంపతులు రామారావు గూడెంలో తమ మాతామహులు చందూరి సుబ్బారావు గారికి గబ్బిట మృత్యుంజయ శాస్త్రి గారిచ్చిన భూమిలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నారన్న సంగతి తెలుసుకొన్న వారి కుమారుడు స్విట్జర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న శ్రీ కే. సి. ఎస్.నాగేశ్వరరావు గారు వెంటనే స్పందించి ఆలయ నిర్మాణం కోసం 1,30 000 (లక్షా ముప్ఫై వేల రూపాయలు) రూపాయలు స్వచ్ఛందంగా భక్తితో విరాళమిచ్చి అందరిని కార్యోన్ముఖులను చేశారు. శ్రీమతి కొలచన ప్రసాదరావు భారతి దంపతులు 6-6-2011న ఆలయానికి శంకుస్థాపన చేశారు. పది నెలలో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి 25-4-2012 బుధవారం నాడు ఉదయం 10-33 గం.లకు వైశాఖ శుద్ధ చవితి మృగశిరా నక్షత్ర యుక్త మిధున లగ్నంలో ఆగమ శాస్త్ర విధానంలో ప్రతిష్ఠా కార్యక్రమాన్ని అత్యంత భక్తీ శ్రద్ధలతో నిర్వహించారు. పోలసానిపల్లికి చెందిన ప్రముఖ పురోహితులు శ్రీ కాశీభొట్ల ప్రసాద శాస్త్రిగారు ఆలయ ప్లాన్, డిజైన్ తయారు చేసి ఇవ్వటమేకాక, శంకుస్థాపన, ప్రతిస్టా మహోత్సవానికి ఆధ్వర్యం వహించి అందరికి సంతృప్తి కలిగించారు. మొదటి నుండీ శాస్త్రి గారే కొలచనవారికి ఆస్థాన పురోహితులు, హితులు మిత్రులు. బంధువుల నుండి మాత్రమే విరాళాలు స్వీకరించారు. బయటి వారెవరివద్ద తీసుకోలేదు. అదీ ఆలయ నిర్మాణంలో ప్రత్యేకత. పురాతన ఆంజనేయ స్వామి విగ్రహం రూపు చెడి అవయవ లోపంతో ఉండటంతో కోటిపల్లిలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ అర్చకులు శ్రీ భాస్కరం బాబు గారిని సంప్రదించి ప్రసాదరావు గారు రాజమండ్రిలో భాస్కరం బాబు గారి పర్య వేక్షణలో నూతన శ్రీ భక్తాంజనేయస్వామిని శిల్పితో శాస్త్రీయంగా చెక్కించి తీసుకొని వచ్చి ప్రతిష్టించారు. అంత శ్రద్ధ తీసుకొన్నారు ప్రసాదరావు గారు. సుమారు మూడు అడుగుల నల్లరాతి విగ్రహం. నమస్కరించే చేతులతో స్వామి శ్రీరామ భక్తునిగా దర్శనమిస్తారు. అందుకే శ్రీ భాక్తాంజనేయ స్వామి అని సార్ధక నామముడయ్యారు స్వామి.

పూజారిణి నియామకం

ఆలయ ధర్మకర్త అయిన ప్రసాదరావు గారి కుటుంబానికి మొదటి నుండి ఆత్మీయురాలైన రామారావు గూడెం నివాసిని శ్రీమతి దుగ్గిరాల రమాదేవి గారిని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పూజారిణిగా నెలకు 1,000 రూపాయల జీతంతో నియమించి నిత్య ధూప దీప నైవేద్యాలను పెట్టటానికి ఏర్పాటు చేశారు. ఆమె కూడా చాలా శ్రద్ధగా భక్తితో స్వామి సేవ చేసి తరిస్తున్నారు. ప్రసాదరావుగారి తోడల్లుడు శ్రీ కాశీభట్ల పరమాత్మగారు స్వచ్ఛందంగా ఆలయానికి 65,000 రూపాయలు విరాళం ఇస్తే, ప్రసాదరావు గారు మరొక 65,000 రూపాయలు స్వయంగా చేర్చి మొత్తం ఒక లక్షా ముప్ఫై వేల రూపాయలు 1,30,000 రూపాయలను బ్యాంక్‌లో ఫిక్సెడ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే నెలసరి వడ్డీని పూజారిణి రమాదేవి గారికి నెల జీతంగా 1,000 రూపాయలు అంద జేస్తున్నారు. ఇద్పి గొప్ప ఆదర్శవంతమైన ఏర్పాటు. దీనికి దాతలనిద్దరిని అభినందించాలి.

ఉత్సవాలు

ప్రతి మంగళ, శనివారాలలో స్థానిక మహిళలు ఆలయానికి వచ్చి భజనలు చేసి హనుమాన్ చాలీసా పారాయణ చేస్తారు. శ్రీ హనుమజ్జయంతిని వైశాఖ బహుళ దశమినాడు ఘనంగా నిర్వహిస్తారు. శ్రీరామనవమి, ఉగాది, దసరా ఉత్సవాలనూ చేస్తారు. ఆలయ నిర్మాణ వార్షికోత్సవాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణం జరిగింది. ఆలయ అభివృద్ధి కోసం గ్రామస్తులు కృషి చేయాల్సిన బాధ్యత ఉంది. నిత్యం ఆలయాన్ని సందర్శిస్తూ భజనలు చేస్తూ, పాటలూ, చాలీసా పారాయణ చేస్తూ ఉంటే స్వామి వారి అనుగ్రహం కలిగి అభివృద్ధికి మార్గం ఏర్పడుతుంది. మన కృషి ఉంటేనే దైవానుగ్రహమూ తోడౌతుంది అని అందరం గ్రహించాలి.

అపూర్వ ఆంజనేయ సహోదరులు

ఉయ్యూరులో మాకు శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయం ఉంది. మా శ్రీమతి ప్రభావతికి మా అగ్రహారమైన రామారావు గూడెంలో ఒక ఆంజనేయస్వామి దేవాలయం ఉంటే బాగుండును అనుకొంటుంది. ద్వారకా తిరుమల వెళ్ళినప్పుడు తిరుగుప్రయాణంలో రామారావు గూడెం

మీదుగా వస్తూ పిల్లలకు ఆ ఊరు మనదేనని చెప్పి పాత విషయాలన్నీ వివరించేవాళ్ళం. వాళ్ళకూ సంతోషంగా ఉండేది. రెండేళ్ళక్రితం ధనుర్మాసంలో చిన్న తిరుపతివెళ్లి రామారావుగూడెం మీదుగా తిరిగివస్తూ పంచాయితీ ఆఫీస్ దగ్గరకు వెళ్లి ఫోటోలు తీసుకొంటుంటే మేమెవరో గ్రహించిన పంచాయితీ గుమాస్తాగారు, వెంకన్న మొదలైనవారు కనిపించి "బాబూ మీ స్థలంలో ఆంజనేయ దేవాలయం కట్టారు" అని చెప్పి మమ్మల్ని వెంటపెట్టుకొని దేవాలయం చూపించారు. పాత విషయాలన్నీ గుర్తుకు తెచ్చుకోన్నాం. ఎవరో ప్రసాదరావు గారు కట్టించారని చెప్పారు. మళ్ళీ ఈ ఏడు ధనుర్మాసంలో ద్వారకా తిరుమలవెళ్ళే ముందే రామారావుగూడెం వెళ్లి శ్రీ భక్తాంజనేయ స్వామిని దర్శించి పూజారిని లేకపోతే వాళ్ళ మరదలు తాళాలు తీస్తే మేమే స్వయంగా స్వామికి సహస్రనామ పూజ చేసి ఉయ్యూరు నుండి పెరటిలో పండిన అమృతపాళీ అరటి పళ్ళు తెచ్చి నైవేద్యం పెట్టి ద్వారకా తిరుమలేశుని దర్శించాం. ఇంతలో పూజారిణి రమాదేవి ఫోన్ చేసి మమ్మల్ని ఒకసారి తిరుగు ప్రయాణంలో వచ్చి వెళ్లమన్నది. అలాగే వెళ్లాం. ప్రసాదరావు గారి ఫోన్ నంబర్ తన ఫోన్ నంబర్ ఇచ్చింది. దీనితో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రసాదరావుగారితోనూ ఫోన్‌లో మాట్లాడాను. సరసభారతి పుస్తకాలు పంపాను. ఆయన ఏప్రిల్ 22న దేవాలయ వార్షికోత్సవానికి రమ్మని ఆహ్వానించారు. అలాగే అందరం కలిసి ద్వారకా తిరుమల దర్శనం చేసుకొని రామారావు గూడెం వచ్చి అక్కడి కార్యక్రమంలో పాల్గొన్నాం. చక్కని ఏర్పాట్లు చేశారు. స్వామికి అభిషేకం, సహస్రనామార్చన విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అప్పుడు అసలు విషయం అంతా తెలిసింది. వాళ్ళు మా బంధువులేనని భారతి మా మహాలక్ష్మి అక్కయ్య, చందూరి సుబ్బారావు బావగార్ల కుమార్తె అని తెలిసింది. బాంధవ్యమూ అర్థమైంది. సన్నిహితమైనాయి రెండు కుటుంబాలు. శ్రీ భక్తాంజనేయ స్వామివారికి, భారతి దంపతులకు, రమాదేవికి నూతన వస్త్రాలు అందజేశాం. ఆ దంపతులు కూడా మా అందరికి నూతన వస్త్రాలు అందజేశారు. బంధుత్వం బాగా బిగిసి పోయిందని అనుకొన్నాం. ఆంజనేయస్వామియే ఇలా మా రెండు కుటుంబాలను ఎన్నో దశాబ్దాల తర్వాతా మళ్ళీ కలిపాడని స్వామికి కృతజ్ఞతలు తెలియజేసుకోన్నాం.

ఉయ్యూరులో శ్రీ సువర్చలాంజనేయస్వామి దేవాలయంలో జరుపుతున్న అయిదు రోజుల శ్రీ హనుమజ్జయంతి కార్యక్రమం సందర్భంగా 10-5-15 ఆదివారం జరిగిన పుష్పయాగానికి శ్రీ ప్రసాదరావు భారతి దంపతులు, రమాదేవి గారు రావటం సంతోషం కలిగించింది మాకు. ఆలయంలో జరిగిన పుష్పయాగంవారు చూసి పులకించి పోవటం స్వాములకు నూతన వస్త్రాలు సమర్పించటం, ఆలయంలో అర్చక స్వామిచేత ఆలయ మర్యాదగా శేష వస్త్రాలను అందజేసి సత్కరించటం, వారిద్దరూ మాకు కొత్త బట్టలు పెట్టి గౌరవించటం, మా ఇంట్లో భోజనం చేయటం వారికి మేము నూతన వస్త్రాలు అందజేయటంతో ఆత్మీయత బాగా విస్తరిల్లింది. భారతికి మమ్మల్ని చూస్తే ఆనందం పట్ట పగ్గాలు లేకుండా కళ్ళ వెంట ఆనందభాష్పాలు తెగ రాలిపోతాయి. మరీ చిన్నపిల్ల అయిపోతుంది. ఆ ఆత్మీయత మరువరానిది. మాకు ఒక కొత్త మేనకోడలు దొరికిందన్న ఆనందం మేమూ మర్చి పోలేనిది అయింది. వాళ్ళకూ పెద్దలు మేము దొరికాము అన్న పరమానందం లభించినట్లు భావించారు.

ప్రసాదరావు గారికి రామారావుగూడెం అగ్రహారంలో మాకున్న పొలాల వివరాల దస్తావేజుల జిరాక్సులు పోస్ట్‌లో పంపాను. దీనితో ఆంజనేయ ఆలయం చుట్టూ అక్రమంగా ఆక్రమించుకున్నవారిపై చర్య తీసుకోవటానికి ప్రసాదరావు గారికి అవకాశం లభించింది. ఇటీవలే దెందులూరు శాసన సభ్యులు శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు రామారావుగూడెం వచ్చి శ్రీ భక్తాంజనేయ స్వామిని దర్శించి స్వామి భూమిని అన్యాక్రాంతంగా ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకొని ఆలయం చుట్టూ మెరక చేయించి అభివృద్ధి చేస్తానని ప్రకటించారని ప్రసాదరావుగారు తెలియజేశారు. సర్పంచ్ గారు కూడా ఆలయ వృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు.

ఉయ్యూరు శ్రీ సువర్చలాంజనేయస్వామి, రామారావుగూడెం శ్రీ భక్తాంజనేయస్వామి మా రెండు కుటుంబాలకు అపూర్వ సహోదరులయ్యారు. ఈ రెండు కుటుంబాలను కలిపింది శ్రీ ఆంజనేయస్వామి వారే అనటానికి సందేహమే లేదు.❋

22) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం-దత్త క్షేత్రం-ఏలూరు

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం ఏలూరులో ఉన్న 'దత్తక్షేత్రం'లో శ్రీ గణపతి సచ్చిదానంద నిర్మించిన దేవాలయ సముదాయం భక్తులకు కనువిందు చేస్తుంది. ఇందులో దత్తాత్రేయ, అనఘాదేవి, గణపతి, కార్యసిద్ధి హనుమాన్, నవగ్రహ విగ్రహాలున్నాయి. అందులో 'శ్రీ కార్యసిద్ధి హనుమాన్' భక్త సులభుడుగా అందరికి ఆరాధనీయంగా వర్ధిల్లుతున్నాడు. స్వామి మూర్తి మహా ఆకర్షణీయంగా ఉంటుంది. మనసులోని కోర్కెలను తీర్చే కొంగుబంగారం కార్యసిద్ధి హనుమాన్. ప్రశాంత వాతావరణంలో ధ్యాన మందిరంతోబాటు సకల సదుపాయాలూ కలిగి భక్తికి నిలయంగా దత్తాశ్రమం వర్ధిల్లుతోంది. తప్పక దర్శించాల్సిన క్షేత్రం.❋

23) శ్రీ భక్తాంజనేయ దేవాలయం-ప్రక్కిలంక

పశ్చిమగోదావరి జిల్లా హనుమాన్ జంక్షన్ దగ్గర తాళ్ళపూడి మండలం ప్రక్కిలంకలో శ్రీ భక్తాంజనేయ దేవాలయం చూడదగింది. 1882లో శ్రీమతి నాగదేవర మహాలక్ష్మమ్మ అనే బ్రాహ్మణ భక్తురాలికి శివాలయం కట్టాలనే కోరిక కలిగింది. గండకీ నదీతీరంలో లభించిన సాలగ్రామ సహజ శివలింగాన్ని కాంట్రాక్టర్ కల్లూరి నృసింహం గారి ఆధ్వర్యంలో తెప్పించి గ్రామస్తుల సహాయ సహకారాలతో ప్రతిష్టించి ఆలయం నిర్మించారు. స్వామివారిని విశ్వేశ్వరస్వామిగా ఆరాధిస్తారు. శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలోనే ఈ విశ్వేశ్వరాలయం, శ్రీ వల్లీ దేవసేన సామెత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పంచపడగల నాగశేషు కిరీటంతో దర్శనమిస్తాడు. నవగ్రహ మండపమూ ఉన్నది. హనుమమూర్తి పెద్దదీ, ఆకర్షణీయమైనదీ.❋

24) మహాశక్తివంత హనుమాన్దేవాలయం- నందమూరి గరువు శృంగవృక్షం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం - పాలకొల్లు రోడ్డులో శృంగవృక్షం గ్రామం దగ్గర ఉన్న ఒక చెట్టుకింది శ్రీ నందమూరి తారకరామారావు ఎన్నికల ప్రచారంలో ఒక చెట్టుకింద విశ్రాంతి తీసుకున్నాడు. అప్పటి నుంచి అది 'నందమూరి గరువు'గా పిలువబడుతోంది. ఇక్కడే అత్యంత విశాల ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నిర్మించారు. దీనికే శృంగావృక్షం ఆంజనేయ దేవాలయం అనే పేరు. స్వామి చాలా ఆకర్షణీయంగా దర్శనమిస్తాడు. సర్వశక్తిమంతుడని కోరిన కోరికలు వెంటనే తీరుస్తాడని నమ్మకం, విశ్వాసం.❋

విజయనగరం జిల్లా

25) శ్రీ హనుమాన్ దేవాలయం- గుమ్చి

విజయనగరం జిల్లాలో గుమ్చి గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయాన్ని గుమ్చి హనుమాన్ దేవాలయం అంటారు. స్వామి మూర్తి మనోహరంగా ఉంది. నిత్యం వేలాది భక్తులను ఆకర్షిస్తాడు. స్వామి దర్శనం జీవితంలో మరవులేని మరుపురాని మధురానుభూతిగా మిగిలిపోతుందని దర్శించిన వారి అనుభవం వలన తెలుస్తోంది. ఈ దేవాలయ సమీపంలో సుమారు 80 ప్రత్యేక స్థలాలు దర్శింపదగినవిగా ఉన్నాయి. గుమ్చి గ్రామం నెల్లిమర్లకు దగ్గర ఉంది.❋

గుంటూరు జిల్లా

26) శ్రీ గోవర్ధన వీరప్రతాప ఆంజనేయస్వామి దేవాలయం-తెనాలి

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో అతిప్రాచీనమైన శ్రీ గోవర్ధన వీరప్రతాప ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయం క్రీ.శ. 8వ శతాబ్దానికి ముందే నిర్మించబడినట్లు చారిత్రిక ఆధారాలున్నాయి. శ్రీ కృష్ణదేవరాయలు తన దేవేరులు చిన్నా దేవి, తిరుమల దేవులతో ఈ క్షేత్రాన్ని దర్శించినట్లు శిలాశాసనాలు కనిపిస్తున్నాయి. చోళ చక్రవర్తులు కూడా ఆలయ అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలున్నాయి. ఈ ఆలయంలో విశేషం ఏమిటంటే గోవర్ధనగిరి ధారి అయిన శ్రీకృష్ణ పరమాత్మ చెంత వీర ప్రతాప హనుమాన్ ఉండటం. 'గోవర్ధన గిరి ధారీ' అని ఎలుగెత్తి ఆర్తిగా పిలిస్తే స్వామి ఆనందించి కోరిన కోర్కెలు తీరుస్తాడని విపరీతమైన నమ్మకం. భూత ప్రేత పిశాచ బాధలు అనుభవించేవారు ఈ వీర ప్రతాప హనుమాన్‌ను దర్శిస్తే అవన్నీ మాయమై శారీరక మానసిక శాంతిని ప్రసాదిస్తాడు. అందుకే భక్తులు విశేషంగా దర్శించి ఉపశమనం పొందుతారు.*

27) శ్రీ ధూళిపాళ నిర్మించిన శ్రీ సువర్చలాంజనేయ దేవాలయం - గుజ్జన గూళ్ళ

పౌరాణిక నాటకాలలో అనేక విభిన్నపాత్రలు పోషించి దుర్యోధన పాత్రద్వారా విశేష ఖ్యాతిపొంది, సినిమా రంగ ప్రవేశం చేసి అక్కడా పౌరాణిక పాత్రలతో మెప్పించి తనదైన అభినయం, వాచికంతో నభూతోగా నిలిచిపోయిన శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి గారు మహాభక్తులు. గుంటూరులో గుజ్జన గూళ్ళలో మహిళా పాలిటెక్నిక్ వెనుక శ్రీ సువర్చలాన్జనేయ దేవాలయాన్ని స్వయంగా నిర్మించి శ్రీ ధూళిపాళ్ళ చరితార్ధులయ్యారు. ఆలయం చాలా సుందరంగా సకల సదుపాయాలతో నిర్మించారు. అక్కడే ఆయన విశ్రాంత జీవితాన్ని ఒక సాధారణ సన్యాసిగా, నిరాడంబరంగా గడుపుతూ స్వామి సేవలో ధన్యత చెందారు. శ్రీ ఆంజనేయ స్వామి శ్రీ సువర్చలాదేవి చాలా కన్నుల పండువుగా దర్శనమిస్తారు. సుమారు నాలుగడుగుల విగ్రహాలు. బహు ఆకర్షణీయమైన కనుముక్కుల తీరుతో ఉంటాయి. వరద హస్తంతో దంపతులు భక్తులకు వరప్రదాతలుగా గోచరిస్తారు. దివ్య సుందర విగ్రహాలవి చూస్తూ ఉంటే పరవశమే కలుగుతుంది. చక్కని సమయపాలనతో ఆలయం పని చేస్తుంది. స్వామి చుట్టూ ప్రదక్షిణకు అనువుగా ఉండటం ముఖ్యమైన విషయం. సర్వాలంకార భూషితులుగా హనుమ దంపతులు దర్శనమిస్తారు. శ్రీరామనవమి, ఉగాది, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వైశాఖ బహుళ దశమి శ్రీ హనుమజ్జయంతిని మహా వైభవోపేతంగా నిర్వహిస్తారు. నిరంతరం హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుంది. శ్రీ ఆంజనేయ

చరిత్రపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి గారు 'ఆంజనేయ స్వామి గురించి శ్రీమద్రామాయణంలో వాల్మీకి మహర్షి చాలా తక్కువగా రాశారు. హనుమ చిరంజీవి. భవిష్యత్ బ్రహ్మ. అన్ని యుగాలలో ఆయన ఉన్నారు. వ్యాసమహర్షి తండ్రి పరాశర మహర్షి ఆంజనేయస్వామి చరిత్రపై 150 గ్రంథాలు రాశారు. దీనికే "పరాశర సంహిత' అని పేరు. హనుమ గురించిన సర్వవిషయాలు అందులోనే ఉన్నాయి" అని వివరించారు. శ్రీ చిదంబర శాస్త్రి పరిశోధించి 'ఆంజనేయునికి నవ అవతారాలు' ఉన్నాయని పరాశరుడు చెప్పారన్నారు. అందులో 'అరవ అవతారమే'– 'సువర్చలాంజనేయ స్వామి'. సూర్య భగవానుడు హనుమను శిష్యునిగా గ్రహించి నవ వ్యాకరణాలు బోధించి తన కుమార్తె సువర్చలాదేవిని ఆంజనేయునికిచ్చి 'జ్యేష్ట శుద్ధ దశమి నాడు వివాహం చేశాడు' అని అంటారు. అందుకే చిదంబర శాస్త్రిగారు ఒంగోలు పట్టణంలో 'నవావతార క్షేత్రం' నిర్మించి హనుమ నవావతారాలకు అక్కడ ప్రాధాన్యత కల్పించారు. అందరూ చూడదగిన క్షేత్రం అది.❋

28) 79 అడుగుల అభయాంజనేయ దేవాలయం-గుంటూరు

గుంటూరులో అయిదవ నంబర్ జాతీయ రహదారి ఏటుకూరు బైపాస్‌రోడ్ దగ్గర ప్రమాదాలను నివారించటం కోసం 79 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని నెలకొల్పారు. భారత దేశంలోనే మొట్టమొదటి భారీ ఆంజనేయ విగ్రహం ఇది. దీని తర్వాతే కృష్ణాజిల్లా పరిటాలలో 108 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దానితో ఇది రెండవ స్థానంలోకి వచ్చింది. ఈ విగ్రహం పెట్టక ముందు ఇక్కడ భారీగా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోవటం జరిగేది. ఈ విగ్రహ ప్రతిష్ట తర్వాత యాక్సిడెంట్‌లు తగ్గిపోయాయని చెబుతారు. ఈ ప్రాంతంలో ఉన్న మిల్లు యజమానులు, ముఠా కార్మికులు

కలిసి 1955లో ప్రఖ్యాత పౌరాణిక నాటక, సినిమా నటులు, హనుమ భక్తులు అయిన శ్రీ ధూళిపాళ సీతారామశాస్త్రి గారి చేత ప్రతిష్టింప జేశారు. ప్రక్కనే శ్రీ ఆంజనేయస్వామి దేవాలయమూ నిర్మించారు. నిత్య పూజలు, ప్రతి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ భక్తులు 27 సార్లు ప్రదక్షిణ చేయటం ఇక్కడి ప్రత్యేకత. నవగ్రహాలు అధిదేవతలు ప్రత్యది దేవతలు కలిసి 27 అవటం వలన, నక్షత్రాల సంఖ్య కూడా 27 అవటం వలన ఇలా 27 ప్రదక్షిణలు చేస్తారు. ఈ ఆలయంలోకి నాగేంద్రుడు వచ్చి కుబుసం విడిచిందట. అప్పటి నుంచి ఈ ఆలయానికి 'నాగాంజనేయస్వామి దేవాలయం' అనే పేరొచ్చింది. ఆంజనేయస్వామి నాగేంద్రుని పడగ నీడలో ఉండటం ఇక్కడ మరో ప్రత్యేకత.❋

29) శ్రీ ఆంజనేయ దేవాలయం-పొనుగుపాడు

గుంటూరుజిల్లా పొనుగుపాడులో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాచీనమైనది. బ్రిటీషువారి ఈస్టిండియా కంపెనీ మన దేశంలో వ్యాపార ఉద్దేశ్యంతో 16వ శతాబ్దములో ప్రవేశించిన సంగతి మనందరుకు తెలుసు. ఆ తర్వాత కొంతకాలానికి అంటే సుమారు 18వ శతాబ్దం ద్వితీయార్థం తర్వాత అనేక ప్రాంతాలలో పరిపాలన అధికారం సాగించింది. పూర్వం పరిపాలన ఉంటే ప్రజలపై అనేకరకాల పన్నుల విధించి వసూలు చేయటమే. కొద్దికాలానికి బ్రిటీషువారు (1767) సర్వే ఆఫ్ ఇండియా ఏర్పాటుచేసి, అందులో భాగంగా భారతదేశ సహజవనరులపై దృష్టిపెట్టి పరిశోధనకు నాంది పలికారు. ఆ కనుగొనుటలో భాగంగా గ్రామ అధ్యయనాలు జరపడంలో 1784 నుంచి 1816

మధ్య కోలిన్మెకంజీ (1754–1821) చేసిన సర్వే మరియు ఆయన కృషి వలన ఇవాళ మన తెలుగు ప్రాంతంలలో అత్యధిక భాగం కనీసం పదిజిల్లాల గ్రామాల చరిత్ర మనకు తెలుస్తుంది.

కోలిన్మెకంజీ 30 సంవత్సరంల వయసులో (1783) ఉద్యోగం కోసం భారతదేశానికి వచ్చాడు. ఉద్యోగిగా ఇంజనీరింగ్విభాగంలో చేరి సైన్యం వెంట పయనిస్తూ 1784–90 మధ్య నెల్లూరు, రాయలసీమ ప్రాంతాలలో రహదారుల, మార్గాల పటాలు తయారుచేశాడు. బ్రిటీష్పాలకులు కోలిన్మెకంజీలోని నిబద్ధతను గుర్తించి 1790లో ఆయనకు గుంటూరు సర్కారును సర్వే చేసే బాధ్యతను అప్పగించారు.

కాలిన్మెకంజీ చేసిన కృషి

1790 నుంచి 1793 వరకుకోలిన్మెకంజీ గుంటూరు సర్కారును మాత్రమేకాక, పొరుగున ఉన్న కడప, కర్నూలు ప్రాంతాలను, నల్లమల, ఎర్రమల కొండలను కూడ సర్వే చేశాడు. ఆ తర్వాత 1794లో పెన్నా, కృష్ణానదుల మధ్య ఉన్న నిజాం సరిహద్దు ప్రాంతాలన్నిటిని కూడ సర్వే చేశాడు. ఆయన చేసిన కృషి వల్ల మెకంజీ ఆ తర్వాత ఈస్టిండియా కంపెనీ అధికారంలో ఉన్నతస్థానానికి ఎదిగాడు. ఆయా గ్రామాల గురించి పాలకులకు అవసరమైన సమాచారాన్ని రాబట్టడానికి మెకంజీ 1810 నాటికి 2070 స్థానిక చరిత్రలు వ్రాయించాడు. ఆనాటి ప్రాంతీయ సర్వే యర్జనరల్స్థానం నుండి 1816లో భారతదేశపు మొదటి సర్వే యర్జనరల్పదవి చేపట్టాడు. అప్పటికి కొన్ని గ్రామాలలోని భూములు, పంటలు మరియు పన్నుల గురించి సమాచారాన్ని భద్రపరచిన కవిలె, లేదా దండకవిలె అనే కరణీకపు చిట్టాలే ఈగ్రామ కైఫియ్యత్తులు.

ఇవి చాలావరకు గ్రామాలచరిత్రకు ఆధారంగా నిలిచాయి. వాటన్నిటినీ గ్రామకైఫియ్యత్తులు అని అంటుంటారు. మెకంజీ కూడా ఆనాటి సమాజంలో మంచి చదువుకున్న, గ్రామం గురించి అహగాహన ఉన్న కరణాలతో వారి గ్రామాల గురించి ఈ స్థానిక చరిత్రలు రాయించాడు. ఇవన్నీ కనీసం రెండువందల సంవత్సరాల క్రింద వాడకంలో ఉన్న భాషలో, పదప్రయోగాలతో, అది కూడ పండితులు వ్రాసినట్లుగా ఉన్నవి. వాటిని చదవడానికి కష్టపడవలసి వచ్చినా కొంత విలువైన సమాచారం మనకు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్స్టేట్ ఆర్కైవ్సారు వీటిని 1988లో ప్రచురించారు.❋

30) శ్రీ పాతూరు ఆంజనేయస్వామి దేవాలయం-నరసరావుపేట

అసలు ఆ ఊరు మొదట పుట్టిందే ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో. ఇప్పుడు 'పాతూరు' అని పిలిచే చోట అట్లూరు అనే చిన్న గ్రామం ఉండేది. అదేక్రమంగా ఇప్పటి నరసరావుపేట అనే రూపుని సంతరించుకుంది. అక్కడ ఉన్న ఆంజనేయస్వామి గుడిని 'పాతూరు ఆంజనేయస్వామి గుడి' అంటారు. అదేవరసలో పాండురంగస్వామి గుడి, పట్టభిరామస్వామి గుడి, ఇంకో రాములవారి ఆలయం ఇలా మొత్తం నాలుగు ప్రఖ్యాత ఆలయాలున్నాయి. అలాగే ఇంకా శివాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, (ఈ వెంకటేశ్వరస్వామి గుళ్ళు రెండు. ఒకటి శివాలయాన్ని ఆనుకునే ఉంటే, ఇంకోటి బరంపేటలో ఉంది), భావనారాయణస్వామి గుడి, ఇలా చాలా ఆలయాలున్నా, చాలామందికి ఆంజనేయస్వామి గుడి అంటే, స్టేషన్రోడ్డులో ఉన్న గుడే. అంతలా పేరు తెచ్చుకున్న ఆ ఆలయం పెద్దగొప్పగా ఉంటుందా అంటే, చుట్టుప్రక్కలున్న ఇళ్ళలో, షాపుల్లో కలగలసిపోయి ఉంటుంది.❋

ఆధారం-శ్రీ గీతాచార్య వ్యాసం 5-1-2010

31) శ్రీ సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయస్వామి వారి ఆలయం-దాసుపాలెం

గుంటూరుజిల్లా, గుంటూరు మండలంలోని గ్రామం దాసుపాలెం. గ్రామంలోని ప్రధాన దేవాలయం సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయం. ఈ దేవాలయం ఎంతో ప్రాచీన దేవాలయంగా ప్రసిద్ధి చెందినది. వైశాఖ బహుళ దశమి ఆంజనేయ స్వామి జన్మదినంనాడు శ్రీ హనుమజ్జయంతిని మరియు ప్రతి సంవత్సరం స్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయస్వామి వారి కల్యాణాన్ని చాల వైభవంగా జరుపుతారు. సాధారణంగా ఆంజనేయస్వామి దేవాలయాలు భక్తాఞ్జనేయంగానో దాసాఞ్జనేయంగానో ఎక్కువగా వుంటాయి. సువర్చలతో కూడిన ఆంజనేయ దేవాలయాలు చాలా అరుదు. అలాంటి అరుదైన సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయస్వామి వారి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లాలో గుంటూరు మండలంలోని దాసుపాలెం గ్రామంలో రావిచెట్టు, జమ్మిచెట్టు, వేపచెట్ల మధ్యన మరియు రామదాసు చెరువు సమీపంలో ఉంది. ఆలయం ముందర మహామండపము ఉంది. ఈ మహామండపములో భక్తులు 'హరిభజన' చేయుదురు మరియు బ్రమేత్సవాల సమయములో స్వామి వారికి వైఖానస ఆగమ విధానంలో హోమములు, యాగములు నిర్వహించబడును. మహామండపం ముందుగల ధ్వజస్తంభం ఇత్తడి తొడుగుతో చూడముచ్చటగా వంటుంది. ధ్వజస్తంభం క్రిందబాగంలో నాగేంద్ర స్వామివారి ప్రతిమలు, స్వామివారి పాదపద్మములు, దాసాంజనేయ స్వామివారి ప్రతిమలను దర్శించవచ్చును. ఇంతటి ప్రాచీన దేవాలయం నిర్మించిన పుణ్యాత్ముల పేర్లు తెలియవు.నిత్యము భక్తులు సువర్చలా సహిత శ్రీ వీరాంజనేయస్వామి వార్లను సేవించి తరిస్తున్నారు. తమల పాకుల పూజ, పండ్లతో పూజ గంధ శింధురంతో అర్చనా విశేషంగా జరుగుతాయి. ధనుర్మాసం నెల రోజులు భక్తులు ప్రదక్షణలు చేసి తమ మనోభీస్తాన్ని స్వామి వారికి నివేదించుకొని సఫల మనోరదులవుతున్నారు. భక్తుల పాలిటి కొంగు బంగారం స్వామి.❋

ప్రకాశంజిల్లా

32) శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం-చీమకుర్తి

ప్రకాశంజిల్లా చీమకుర్తిలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి గాలిధూళి సోకిన వారి పాలిట కల్ప ద్రుమం. 1970లో చిన్నగుడిగా ఉన్న ఈ దేవాలయం నేడు సర్వవిధ అభివృద్ధితో విస్తరించింది. నిత్యం వేలాది భక్తులకు కొంగు బంగారమైంది, రామనామస్మరణతో ప్రాంగణమంతా మారుమోగుతుంది. మానసిక వికలాంగులకు, దెయ్యం, భూతం, పట్టినవారికి ఈ ప్రసన్నాంజయ స్వామి యేఘన వైద్యుడు. ఒక్క దర్శనంతో సకల రుగ్మతలు మటుమాయం చేసే భిషగ్వరుడు. అన్ని పర్వదినాలను వైభవంగా, హనుమజ్జయంతి మరింత వైభవంగా నిర్వహిస్తారు. మానసిక రుగ్మతలున్నవారు గాలి ధూళి సోకిన వారు దెయ్యం, భూతం పట్టినవారు ఆలయంలో వికృత చేష్టలతో అరుపులు కేకలతో సామాన్యభక్తులకు భయం కల్గిస్తారు. భక్తులపై దాడి కూడా చేసి ఆందోళన కల్గిస్తారు. దీనితో భక్తుల ఏకాగ్రతకు భంగంకలుగుతోందని వాపోతున్నారు.*

33) పెరిగిన పెద్ద హనుమంతుడు-పెద్దవరం

ప్రకాశంజిల్లాలో పెద్దవరం గ్రామం సమీపంలోని వీరాంజనేయస్వామి శక్తిక్షేత్రం ఒకటి. ఇక్కడ స్వామి చూడగానే వళ్ళు జలదరించే రూపంతో కనిపించటమే కాదు అక్కడ ప్రవేశించగనే మన మనస్సులో కల్లోలాలు సమసిపోయి ఆధ్యాత్మిక శక్తి తరంగాలు మనలను నిలువెల్లా ముంచుతున్న భావన అనుభవంలో కొస్తుంది. ఏకాంత ప్రదేశం పక్కనే నిండుగా పారుతున్న సాగర్కెనాల్పచ్చని ప్రకృతి దగ్గరలో కొండపై కనిపించే నృసింహస్వామి వెలసి ఉన్న కొండ, వెంటనే మన మనస్సు స్వామి పాదాలపై లగ్నమవుతుంది. అనుకోకుండానే ఏకాగ్రత లభిస్తుంది. గ్రహ బాధలతో మానసిక సమస్యలతో అనారోగ్యాలతో పీడింపబడేవారికి సత్వరం విముక్తి ప్రసాదిస్తాడీయన. ఎప్పుడో పురాతన కాలంలో ఋషిప్రతిష్టితము. ఏకాంతంలో ఎలా ఉన్నాడో అలాగే ఇక్కడ జనులు కూడా ఏ కొద్దిమంది మాత్రమో ఈ క్షేత్రంలోని హనుమత్శక్తిని సరిగా గ్రహించి సాధన చేస్తున్నారు. నాగార్జున సాగర్కాలువలు తవ్వేప్పుడు దరిశి బ్రాంచి కెనాల్డిజైన్ ఈ హనుమక్షేత్రం నుండే వెడుతుంది. అందువలన అక్కడ విగ్రహాలు, ఆలయం తొలగించి మరొక్కచోటకు తరలించాలని నిర్ణయం జరిగింది. కాలువల తవ్వకం మొదలెట్టి ఈ క్షేత్రంను తొలగించేందుకు బుల్డోజర్లు తదితర యంత్రాలు దింపారు. ముందుగా క్షేత్రంలో నిలువెత్తు ఉన్న స్వామిమూర్తిని తవ్వి తొలగించేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. ఇక యంత్రాల సహాయంతో తొలగించాలని ప్రయత్నం మొదలెట్టారు. చిత్రంగా యంత్రాలు స్వామి సమీపానికి రావటం, ఆగిపోవటం, రావటం, ఆగిపోవటం. మరలా స్టార్ట్చేసినా ఇదే స్థితి. మరొక డ్రైవర్ల చేత ప్రయత్నించినా ఇదే పరిస్థితి.

ఇక యంత్రాల డ్రైవర్లకు అకారణంగా విపరీతమైన భయం ఆవహించి చెమటలుపట్టి కూలబడటంతో భీతిల్లిన పర్యవేక్షకులు వెంటనే కాంట్రాక్టర్కు కబురుచేయటం జరిగింది. ఆయన వచ్చి పరిస్థితి చూసి అధికారులతో సంప్రదించి తన పలుకుబడి ఉపయోగించి డిజైన్లో మార్పులు చేయించి క్షేత్రం ముందుగా తవ్వకాలు జరిపేట్లు చేశారు. ఇప్పటికీ నాటి పరిస్థితిని కళ్ళారా చూసిన వృద్ధులు కళ్ళకు కట్టినట్లు స్వామి మహాత్మ్యాన్ని వివరిస్తుంటారు. ఆమధ్య కురిచేడులో జరిగిన కార్యక్రమానికి ఈ ఊరిలో ఉన్న హనుమద్దీక్షాధారులందరినీ పిలిచారు కానీ ఒక్క స్వామే వచ్చాడు. కార్యక్రమానంతరం అతను స్వామీ ఖర్చు ఎంతైనా నేను భరిస్తాను మా ఊరి దగ్గరున్న వీరాంజనేయ క్షేత్రంలో ఈ హనుమత్శక్తి జాగరణ పూజలు జరపాలని కోరాడు. ఇది ఒక్కరితోటి ఒక్కరి కోసం చేసే కార్యక్రమం కాదు. ఇది అందరి కోసం అందరి చేత చేపించే పూజ. అదీగాక వ్యవసాయ పనుల సీజన్గ్రామాల్లో. ఒక్కని వల్ల కాదు వేసవి కాలంలో చూద్దాములే! అనుకొన్నారు. ఒకాయన ఈ క్షేత్రం గుడి దగ్గరకు వెళ్లి. నమస్కరించుకుని బండి స్టార్ట్చేయబోయేంతలో వెనుకవైపు నుంచి ఒక వ్యక్తి 'పంతులూ!' అంటూ వచ్చాడు. ఏవిటబ్బా? ఇక్కడ పూజ కుదరదన్నావట? మాట కోపంగా, హుంకారంగాఉంది. . 'ఓహో! ఇది స్వామివారి నుంచి వస్తున్న గద్దింపన్న మాట అనుకుని చాల వినయంగా. ఎలా సాధ్యమవుతుంది. మీ ఊరిలో ఉన్న దీక్షాధారుల వరకైనా కలసి మాట్లాడుకుని నా దగ్గరకు రమ్మను అప్పుడుమాట్లాడదాము అని ఒక్కముక్కలో సమాధానం చెప్పి వెళ్లిపోయాడు! ఈ కార్యక్రమంలో ఎవరినీ డబ్బు అడగకూడదు. కావలసిన వస్తువులలిస్టీసుకుని ఇంటింటికి వెళ్ళి అందులో మీరేమి తెస్తారు అని అడగాలి. ఎవరు ఏమన్నా పట్టించుకోకూడదు. బలవంతం చేయకూడదు. అలాగే నిరుపేదలైనా సరే చిన్నతమలపాకుల కట్టనైనా తమవంతుగా తీసుకుని వచ్చేలా చేయాలి. ఇందులో డబ్బులిస్తాము మీరు అవసరమైనవి తెండి అని ఎవరడిగినా ఒప్పుకోరాదు. శ్రద్ధాశక్తులు ఉంటే వాళ్ళే కొనుక్కుని వచ్చి గుడివద్ద మనకు అందజేయాలి అన్నాను. నూట ఎనిమిది చాలీసా పారాయణములు జరపాలి మీకు చదువురాదు కదా? ఇంతకుమునుపు పారాయణం చేసిన అలవాటు మీకు లేదు కదా ఎలా?సందేహం కలిగింది. దరిశి నుంచి స్వాములను పిలుస్తాము అన్నారు వాళ్లు స్వామి ఎన్ని ఆటంకాలు కల్పించాలని చూసినా వీళ్ళచేత జరిపిస్తాడీ కార్యక్రమాన్ని అని మరి నూటా ఎనిమిది పొంగళ్ళు చేసి నివేదన జరపాలి

అన్నాడు. అలాగే అన్నారు వారు.
కేవలం రెండున్నర రోజులలో ఇన్ని ఏర్పాట్లు ఎలా చేస్తారు? చేయగలగాలంటే కేవలం స్వామివారి అనుగ్రహం ఉంటేనే సాధ్యం. దుర్గమకాజజగతకేజేతే! సుగమ అనుగ్రహతుమ్హరేతేతే. అన్నారు కదా సంత్తులసీదాస్ వెళ్లి ఆ రోజు సాయంత్రమే ప్రయత్నాలు మొదలుపెట్టటం ఒక్క వీధి తిరిగేసరికే కావలసినవన్నీ వచ్చేసాయి. పొద్దుటనే చాలీసాలు ప్రింటేప్పించే వ్యక్తి గుంటూరు వెళ్ళివాటిని అచ్చేపించారు. ఇవతల గ్రామంలో ఎవరూ ఆదివారం పనులకు వెల్లరాదని మన ఊరినుంచే ఇంటికొక పొంగలి వండి స్వామికి సమర్పించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇక శనివారం పత్రికలలో వార్త చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆదివారం రోజు ఒక్క హైదరాబాద్నగరంలోనే ఇరవై వేల పెళ్లిల్లు ఉన్నాయని, చాలామంచి ముహూర్తమని, సారాంశం.

ఇక ఆదివారం నిలువెత్తు స్వామిని భక్తులు ఆవుపాలు, నారికేళ జలం, శుద్ద గంగోదకంలతో నిలువెల్లా అభిషేకిస్తూ తమ స్వంతబిడ్డకు స్నానం చేపిస్తున్నట్లు రుద్ది రుద్ది మరీ సేవించారు ఆయనను. మహిళలు క్షేత్రం వద్దనే పొయ్యిలు ఏర్పాటుచేసుకుని పొంగళ్ళువండుతున్న దృశ్యం చూడాలి. ఎంత శ్రద్దాభక్తులో చెప్పతరం కాదు. ఒకవంక దరిశి నుంచి వచ్చిన దీక్షాధారులు నూటా ఎనిమిది చాలీసాలపారాయణం చేస్తుండగా సంతోషంతో భజనలతో చిందులు తొక్కుతున్న దీక్షాధారులు. అనంతరంత మాలార్చనలు. చెప్పనలవి కాని సంతోషం. ప్రతి ఒక్కరికీ హనుమత్రక్షలు చాలీసా కార్డులు ప్రసాదంగా ఇవ్వబడ్డాయి. ఇక హనుమ త్హోమానికి ఏర్పాట్లు జరిగాయి. యజ్ఞానికి కూర్చోగనే పొద్దున్నుంచి కొద్దిగా చల్లగా ఉన్న వాతావరణం మబ్బులుకమ్మి చిరుజల్లులు చల్లబోయింది. స్వామీ!స్వామీ! ఒక్కగంట సమయమివ్వు అని వేడుకున్నారు. యాగం మొదలవ్వగానే మబ్బులు విడిపోయాయి. ఏ ఆటంకం లేకుండా ఎంతో చక్కగా జరిపించుకున్నాడు యాగాన్ని. తన అనుగ్రహం ఉంటే ఎలా ఉంటుందో చూపారు. ఒకపక్క నిండుగా పారుతున్న సాగర్కెనాల్. పిల్లలు ఈ కాలువలో ఈ తలకు దిగి ఏ ప్రమాదం తీసుకురాకుండా జాగ్రత్త పడ్డారు ముందుగానే. కానీ స్వామి దయవలన ఎటువంటి ఆటంకాలు లేకుండా ఎంతో చక్కగా సాగిందంటే స్వామి అనుగ్రహమే కదా మరి!*

34) శ్రీ భక్తాంజనేయ దేవాలయం-ఈతముక్కల

శ్రీ రామవనవాసంలో శూర్పణఖ మోహంతో రామలక్ష్మణులను సమీపించగా లక్ష్మణుడు ఆమె ముక్కూచెవులు కోసిన ప్రదేశమే ఇది. 'ఇంతిముక్కల' అనేదే కాలక్రమంలో ఈతముక్కలగా మారింది. తర్వాత కాలంలో ఈత చెట్లు దట్టంగా పెరగటం వలన కూడా ఆ పేరు వచ్చి ఉండవచ్చు. ఇది ప్రకాశంజిల్లా కొత్తపేట మండలంలో ఉన్నది.

గ్రామసౌభాగ్యం కోసం పండితుల సలహాపై శ్రీ మునగాల శేషయ్యగారి కుమారుడు శ్రీ శేషగిరిరావుగారు 1983ల్లో శ్రీ భక్తాంజనేయ దేవాలయ నిర్మాణం ఆగమ విధానంగా జరిపారు. అప్పటినుంచి పూజా దికాలన్నీ ఆయన పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. 1993లో కోటినాగవల్లీ దళాల అంటే తమలపాకుల పూజ, యజ్ఞం 40 మంది వేదపండితుల చేతనిర్వహించారు. 1-2-2004న శ్రీ భక్తాన్జనేయస్వామికి బీజాక్షర యంత్రంతో ప్రాణప్రతిష్ట చేశారు. శ్రీరామనవమి హనుమజ్జయంతి వైభవంగా చేస్తారు.❋

నెల్లూరుజిల్లా

35) శ్రీ అభయాంజనేయ దేవాలయం-ప్రభగిరిపట్నం

నెల్లూరుజిల్లా పొదలకూరు మండలం ప్రభగిరిపట్నంలో అతిప్రాచీన శ్రీ అభయ ఆంజనేయ దేవాలయంతోపాటు శివపార్వతుల సీతారాముల దర్శనభాగ్యమూ కలుగుతుంది. దీనికి దగ్గరలో చోళరాజులు కట్టిన రామలింగేశ్వరాలయం ఉంది. అమ్మవారు కామాక్షీదేవి.❋

అనంతపురంజిల్లా

36) శ్రీ అభయాంజనేయ దేవాలయం-మౌనగిరి

అనంతపురంలో అత్యంత విలువైన ప్రసిద్ధమైన దేవాలయం శ్రీ మౌనగిరి అభయాంజనేయ స్వామి దేవాలయం. ఆలయ నిర్మాణం శ్రీ ఈశ్వరయ్య స్వామి అనే మహాభక్త శిఖామణి పూనికతో 'మౌనగిరి గ్లోబల్ ట్రస్ట్ అండ్ ఫిలసాఫికల్ సొసైటీ' ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. ఆయన శిష్యులు అభిమానులు సుమారు 500 మంది, 1000 మంది శిల్పులు, కళాకారులు ఎంతో శ్రమపడి నిర్మిస్తున్నారు. శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికే 40 లక్షల రూపాయలు ఖర్చు అయిందట. సిటీకి దూరంగా ప్రశాంత వాతావరణంలో 36 అడుగుల ఏకశిలతో భారీ విగ్రహంగా నిర్మిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వలన పని నెమ్మదిగా జరుగుతోంది. దాతల సహాయం కోసం సొసైటీ ఎదురు చూస్తోంది. ఆసక్తి ఉన్నవారు 'mounagiri.com' ద్వారా సంప్రదించ వచ్చు.❋

37) శ్రీ బెనకానహళ్లి ఆంజనేయదేవాలయం-దేవగిరి

ఆంధ్రప్రదేశ్ అనంతపురంజిల్లా బొమ్మనహల్ మండలం దేవగిరి గ్రామానికి దగ్గరలో శ్రీ బెనకానహళ్లి ఆంజనేయ స్వామి దేవాలయం ఉంది. ఇది మహిమాన్విత క్షేత్రం. వ్యాస రాయ ప్రతిష్ఠితం. అంటే సుమారు నాలుగు వందల ఏళ్ళ చరిత్ర ఉన్న ఆలయం. మంగళ శనివారాలలో పూజలు బాగా జరుగుతాయి. శ్రావణ కార్తీక మాసాలలో ప్రత్యేక పూజలుంటాయి. శ్రావణ మాసం మూడవ వారంలో 'జెల్ది' అనే కార్యక్రమాన్ని కన్నుల పండువుగా చేస్తారు. అన్నదానమూ ఉంటుంది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని తరిస్తారు. ఈ సమయంలో కర్నాటక భక్తుల సంఖ్య బాగాఎక్కువ.

మార్గశిర శుద్ధ త్రయోదశినాడు శ్రీ హనుమద్ వ్రతాన్ని చేస్తారు. వైశాఖ బహుళ దశమి నాడు శ్రీ హనుమ జ్జయంతిని వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఆలయం చుట్టూ వరి పండే పొలాలున్నాయి. తుంగభద్రా నది కాలువ ఆలయం ముందే ఉండటంతో దీని పవిత్రత ద్విగుణీకృతమైంది. ఆహ్లాదమైన వాతావరణంలో ఆలయం ఉండటంతో భక్తులు మానసిక ప్రశాంతతను పొందుతారు. హనుమాలయానికి నైరుతిలో శ్రీ కొల్హాపురీ దేవి ఆలయం తప్పక దర్శించాలి. పడమర పురాతన శివాలయం ఉన్నది. ఆగ్నేయంలో శమీవృక్షం, నాగ విగ్రహాలున్నాయి. ఈ ఆంజనేయ దేవాల యంలో పంచరాత్ర ఆగమ విధానంలో పూజాదికాలు జరుగుతాయి.❋

38) జనమేజయ మహారాజు ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయ దేవాలయం -చౌళూరు

అనంతపురంజిల్లా హిందూపురం మండలంచౌళూరు గ్రామంలో జనమేజయ మహారాజు ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయ దేవాలయం ఉన్నది. అంటే అతిప్రాచీన ఆలయం. చౌళుడు అనే రాజు పాలించిన ప్రాంతం కనుక చౌళూరు అనే పేరొచ్చింది. హనుమ స్వామిది ఏకశిలా విగ్రహం. ఈ గ్రామంలో శివాలయం, మసీదు కూడా ఉన్నాయి. ప్రజలు సామరస్యంగా జీవిస్తారు.❋



39) శ్రీ చిప్పగిరి హనుమాన్ దేవాలయం-చిప్పగిరి

అనంతపురంజిల్లా గుంతకల్లు దగ్గర గుంతకల్లుకు 10 కిలోమీటర్ల దూరంలో చిప్పగిరి గ్రామం ఉన్నది. ఇక్కడి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పురాతనమైనది. స్వామిపై శ్లోకాలు బాగా ప్రచారంలో ఉన్నాయి- 'అజ్ఞాన తిమిరాంధస్యబుద్ధి సంపత్ప్రదాయకం-విజ్ఞాన విమలం శాంతం విజయాఖ్యం గురుంభజే ' విజయదాసు అనే భక్తుని ఆరాధన కార్తీక శుద్ధ నవమి దశమిలలో, ఉత్థాన ద్వాదశినాడు చిప్పగిరిలో నిర్వహిస్తారు. ఈయన ముఖ్యశిష్యుడు గోపాలదాసు 'కట్టే' అనే ప్రదేశానికి ముందు శ్రీ ఆంజనేయ దేవాలయాన్ని కట్టించాడు. గుడి ప్రక్కనే ఆనందతీర్థం అనే కోనేరు ఉంది. విజయదాసు గారు మూడవసారి కాశీని సందర్శించి వస్తూ తెచ్చిన పవిత్ర గంగాజలాన్ని ఈ కోనేటి నీటిలో కలపటం వలన దీని పవిత్రత పెరిగింది. 1682-1755 కాలం వాడైన విజయదాసు భ్రుగుమహర్షి అంశతో జన్మించాడు. పురందరదాసు అంతటి మహాభక్తుడు ఈయన.❋

40) శ్రీ దుర్గాంజనేయ దేవాలయం-శింగనమల

అనంతపురంజిల్లా శింగనమల గ్రామంలో శ్రీ దుర్గాంజనేయస్వామి దేవాలయం విశేషమైనది. విజయనగర సామ్రాజ్యా కాలంలో శ్రీకృష్ణదేవరాయల గురువు శ్రీ వ్యాసరాయతీర్థులు ప్రతిష్ఠించి నిర్మించిన పురాతన చారిత్రాత్మక ఆలయం.⁕

41) శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయ దేవాలయం-కదిరి

అనంతపురంజిల్లా నల్లచెరువుమండలం కదిరికాలూకా పాలపాటి దిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామినే శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిగా పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి కూడా అశేషంగా వచ్చి దర్శించుకొనే దేవాలయం ఇది.⁕

42) వ్యాసరాయల ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి దేవాలయం-మురడి

మురడి అనంతపురంజిల్లా డీ.హిర్చల్ మండలానికి చెందిన గ్రామము. ఈ గ్రామం రాయదుర్గం పట్టణానికి 16 కి.మీ, కర్నాటకలోని బళ్ళారి నగరానికి 45 కి.మీ.దూరంలోఉంది.

ఆంజనేయుడి ఆలయం

ఇక్కడి ఆంజనేయస్వామి దేవాలయం బాగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం శ్రీ కృష్ణ దేవరాయల పరిపాలనా కాలంలో వారి ఆస్థాన పండితులైన వ్యాసరాయల వారు ప్రతిష్ఠించిన 108 పవిత్ర ఆలయాల్లో ఒకటిగా పురాణాలు చెబుతున్నాయి. స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రతియేటా ఉగాది పర్వదినాన స్వామివారి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. అలాగే ప్రతియేటా శ్రావణమాసం శని, మంగళవారాలలో స్వామివారి పూజలు భక్తి శ్రద్ధలతో జరుపబడును. ఆ రోజులలో భక్తులకు అన్నసంతర్పణ జరుగును. భక్తుల సౌకర్యార్థం దేవాలయంలో వసతిగృహాలు, భోజనశాల, స్నాన గదులు కూడా ఉన్నాయి. వివాహాది శుభకార్యాలు జరిపించుటకు కూడా అన్ని సదుపాయాలు ఉన్నాయి. ప్రయాణీకులకు రాయదుర్గం నుండి బస్సు సౌకర్యం ఉంది. రాయదుర్గం నుండి బయలుదేరి పల్లేపల్లి, కల్యం, మురడి గ్రామాల మీదుగా గొడిశలపల్లి చేరును. మురడి నుండి రాయదుర్గానికి ఆటో సౌకర్యం కూడా ఉంది. శ్రావణ శనివారాలలో మురడి, నేమకల్లు (బొమ్మనహాళ్మండలం), కసాపురం (గుంతకల్లు మండలం) గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజు దర్శించుటకు జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి ఎ.పి.ఎస్.ఆర్.టి.సి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించును. ❋



కర్నూలు జిల్లా

43) శ్రీపేట హనుమాన్-కర్నూలు

కర్నూలులోని పేట హనుమాన్ దేవాలయం 13వ శతాబ్దికి చెందిన ప్రాచీన ఆలయం. ఆలయం తుంగభద్రా నదీతీరంపై ఉన్నది. ద్వైతమత మధ్వాచార్య గురుపరం పరకు చెందిన ప్రస్తుత ఉత్తరాదిమఠ పీఠాదిపతి స్వామి సత్యార్థతీర్ధ గారు తెలియజేసిన దాని ప్రకారం మధ్వాచార్యుల వారి రెండవ శిష్యులు నరహరి తీర్థులవారు పేట శ్రీ ఆంజనేయస్వామి వారి ప్రతిష్ట చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ గెజెట్‌లో కూడా ఈ విషయం ప్రచురింపబడింది. ఇక్కడే ఈ హనుమను ఎందుకు స్వామివారు ప్రతిష్టించారు.

గురువు శ్రీ మధ్వాచార్య గారి ఆదేశానుసారం శ్రీ నరహరి తీర్థులవారు ఒరిస్సా, ఆంధ్ర దేశాలలో సంచరిస్తూ ద్వైత మత ప్రచారం చేశారు. కళింగ, ఆంధ్ర రాజవంశాల వారిని మధ్వమతంలోకి మార్చటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కన్నడంలో యక్ష గాన, దాస సాహిత్యాలకు ఆయనే ఆద్యులు. వందలాది కీర్తనలు రచించారు. అప్పుడు కర్నూలు వచ్చి ఇక్కడ పేట ఆంజనేయ స్వామిని శ్రీ వెంకటేశ్వరస్వామిని ప్రతిష్టించారు. నరహరి తీర్థులవారు ఇక్కడే కాక సింహాచలంలో కూడా వరాహ నరసింహ స్వామివారికి ఎదురుగా శ్రీ ఆంజనేయస్వామిని 1291లో ప్రతిష్టించారు. శ్రీ కూర్మంలో సీత రామలక్ష్మణ ఆంజనేయస్వామి వార్లనూ ప్రతిష్టించారు. హాస్పేట దగ్గర నారాయణ కేరేలో శ్రీ శ్రీమన్నారాయణ స్వామినీ ప్రతిష్టించారు నరహరి తీర్థులవారు. పేట ఆంజనేయస్వామిని మంగళ శనివారాలలో భక్తులు వేలాదిగా వచ్చి సందర్శిస్తారు. తమలపాకు పూజ ఇక్కడ విశేషం. శుక్రవారం కుంకుమ పూజ కూడా చేస్తారు. కోరిన కోర్కెలను తీర్చే స్వామిగా పేట హనుమాన్ ప్రసిద్ధుడు. విద్య కోసం వివాహం, కోసం, ఉద్యోగం కోసం స్వామిని ప్రార్థిస్తే సఫల మనో రదులౌతారు. 'అర్చకస్య తపో బలం' అనే సామెత ఉంది. నిత్యార్చన చేసే అర్చక స్వామి దీక్ష, భక్తీ వలననే అర్చా మూర్తికి వైభవం పెరుగుతుంది. ఇక్కడి ముంజి కుటుంబానికి చెందిన అర్చకస్వామి దైవ అర్చన వలన కూడా ఆలయ ప్రాభవం బాగా పెరిగింది.❋

44) శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయం-మంత్రాలయం

మంత్రాలయానికి 20 కిలోమీటర్ల దూరంలో చిన్న కొండపై శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయం తుంగభద్రా నదీతీరంలో ఉంది. శ్రీ రాఘవేంద్రస్వామి ఇక్కడ 12 ఏళ్ళు తపస్సు చేసి, మంత్రాలయం ప్రవేశించారు. హనుమాలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. హనుమజ్జయంతి నాడు మరీ విపరీతం. పంచముఖి హనుమాన్ దేవాలయం ఎక్కడున్నా రామాయణంతో సంబంధము ఉంటుంది. రాఘవేంద్రస్వామి శ్రీరామ, హనుమల పరమ భక్తులు.❋



45) స్వామి పేరే జనం పేరుగా ఉన్న-
శ్రీ గిడ్డ ఆంజనేయస్వామి దేవాలయం-వెంకటగిరి

కర్నూలుజిల్లా కోడుమూరు మండలం వెంకటగిరిలో శ్రీ గిడ్డ ఆంజనేయ స్వామి దేవాలయం ఉంది. ఆ గ్రామ వాసులంతా గిడ్డ ఆంజనేయ స్వామి భక్తులే. తమ మగ ఆడ సంతానానికి తప్పకుండా గిడ్డతో ప్రారంభమయ్యే పేరే పెట్టుకొంటారు. గిడ్డయ్య, గిడ్డమ్మ, గిడ్డాంజనేయ గిడ్డరెడ్డి, గిడ్డేయ్య సామి, రామ గిడ్డయ్య,

సీత గిద్దేమ్మ వగైరా పేర్లు అక్కడ సర్వ సాధారణం. గిద్ద పేరుతో పేరు పెట్టక పోతే శిశువు ఏడుపు ఆపదట. ఆ పేరు పెట్టగానే ఏడుపు ఆపేస్తారట. ఊరిలో 'గిద్దయ్య కట్ట' అనే రచ్చబండ కూడా ఉంది. ఇంటి పేరు లేకుండా గిద్దయ్య అని పిలిస్తే ఇంటికొకరు పలుకుతారు.

సుమారు 400 ఏళ్ళ క్రితం వేంకటగిరి గ్రామంలో నాలుగు ఇళ్ళు మాత్రమే ఉండేవి. అప్పుడు ఒకసారి గ్రామస్తులు దగ్గరున్న హంద్రీ నది దాటుతుంటే ఆంజనేయస్వామి తాను నదిలో కూరుకుపోయి ఉన్నానని బయటికి తీసి గుడి కట్టిస్తే గ్రామానికి మేలు కలుగుతుందని చెప్పాడు. అలాగే గ్రామస్తులు చేసి, నిత్యం స్వామిని కొలిచారు. స్వామిపై అపార నమ్మకం కలిగి స్వామి పేరే తమ పేరుగా పెట్టుకొనే సంప్రదాయం ఏర్పాటు చేసుకొన్నారు. మొదటి పేరు సంతానానికి తప్పక గిద్దతో ప్రారంభమయ్యే పేరు పెట్టాలి. తర్వాత వారికి ఆ పేరుతోనే పేరు పెట్టినా, తర్వాత పేరు మార్చుకోవచ్చు, ఇప్పుడు గ్రామంలో సుమారు మూడు వేల జనాభా ఉన్నారు. గిద్దపేరు లేకుండా పేరు పెడితే ఏదో అనిష్టం తప్పక జరుగుతుందని విశ్వాసం వారికి. తమ కోరికలు తీర్చి నిత్యం కంటికి రెప్పలాగా గ్రామాన్ని ప్రజలను శ్రీ గిద్ద ఆంజనేయ స్వామి కాపాడి రక్షిస్తాడని వెంకట గిరి ప్రజల అపార నమ్మకం.*

46) శ్రీ ఆంజనేయ దేవాలయం-బేతంచర్ల

కర్నూల్ జిల్లా బేతంచర్ల పాత పట్టణంలో 700 యేళ్ళనాటి పురాతన శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. అక్కడ ప్రసిద్ధమైన నల్లరాతి చెక్కలతో విశేషమైన నిర్మాణంగా ఈ ఆలయం ఉంటుంది. 6 అడుగుల ఎత్తున స్వామి విగ్రహం ఉబ్బెత్తుగా ఉంటుంది. హనుమంత రాయడు అనే పాలెగాడు నిర్మించిన ఆలయమిది. అటవీ ప్రాంతమైన ఇక్కడ ఆ పాలెగానికి హనుమ దేవాలయం నిర్మించాలనే కోరిక కలిగితే స్వామి కలలో కన్పించి విగ్రహం చేక్కించే ప్రయత్నం చేయవద్దని తాను అక్కడే వెతికితే దొరుకుతానని, ఇంక దానికి ఉలితో ఏ నగిషీలు చెక్కకుండా దొరికిన విగ్రహాన్ని యధాతధంగా ప్రతిష్టించి గుడి కట్టించమని స్వామి ఆజ్ఞ.

ఈ ప్రాంతం అంతా పౌరుషాల గడ్డ. ఇక్కడి నీళ్ళు తాగితే పౌరుషం పొంగి పొరలుతుంది. ఆ రాజు ఇక్కడికి వచ్చేసరికి ఒక మేకపిల్లను తోడేలు వెంటాడటం చూశాడు. మేక దానికి లొంగకుండా ఉపాయంగా తప్పించుకోవటం ఆశ్చర్యం కలిగించి మేకపిల్లను సంరక్షిస్తానంటే మళ్ళీ నా రాజ్యానికి వెళ్లి పాలిస్తాను లేకపోతే ఇక్కడే ఉండిపోతాను అని మనసులో అనుకొన్నాడు . వెంటనే ఒక కర్ర దొరికితే తోడేలు మీదకు విసిరితే, అది మేకపిల్లకు తగిలి. అది ప్రాణ రక్షణకోసం పరిగెత్తి అక్కడే ఉన్న దేవుని బావి దగ్గరకు వెళ్ళింది. ఆ బావి నీటి మహత్యమా అన్నట్లు దానిలో పౌరుష జ్వాల రగిలి, మళ్ళీ వెనక్కి వెళ్లి, తోడేలు పైకి కలబడింది. ఈ దృశ్యం చూసి రాజు ఆశ్చర్యపడి అక్కడే దేవాలయం నిర్మించాడు. బేతం చర్ల ఆంజనేయ స్వామి మహా మహిమాన్వితుడుగా ప్రసిద్ధి చెందాడు. ఆయన్ను తలచుకొంటే,

పూజిస్తే కాని పని ఉండదని విశ్వాసం.

ఆంజనేయ స్వామి ఆలయానికి ఎడమవైపు శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంతోపాటు శ్రీ మాధవ స్వామి దేవాలయాలున్నాయి. మాధవాలయంలో దీపారాదనే తప్ప పూజా పునస్కారాలు ఉన్నట్లు కనిపించదు. కుడివైపు శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి, శ్రీ కాశీ విశ్వేశ్వరాలయమూ, శ్రీరామ, శ్రీ వినాయక శ్రీ గట్ల నరసింహ స్వామి ఉపాలయాలున్నాయి. ఇక్కడ బసవేశ్వరాలయం ప్రత్యేకం. నందికి విడిగా ఒక ఆలయం ఉండటం అరుదైన విషయం శివ కేశవులు కొలువై ఉన్న ఈ ప్రాంగణంలో రుద్రాంశ సంభూతుడు, రామభక్త హనుమాన్ దివ్య దేవాలయం ఉండటంతో టెంపుల్ కాంప్లెక్స్‌గా బేతంచర్ల శ్రీ ఆంజనేయ దేవాలయానికి ప్రశస్తి కలిగింది.❋

47) నాగనంది శ్రీ ఆంజనేయ దేవాలయం-నంద్యాల

నంద్యాలపట్టణంలో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో నాగనందీశ్వరుడు కొలువు దీరాడు. కోదండ రామాలయంగా ఖ్యాతికెక్కిన ఈ ఆలయం కూడా అతిపురాతనమైనదే. ఈ ఆలయం కొన్ని ఆలయాల కూడికగా కాన వస్తుంది. ఈ మందిరంలో భారీ ఆకారంలో ఉన్న ఆంజనేయస్వామి మూర్తి చూపరులను విపరీతంగా ఆకర్షిస్తుంది. విశాల శిల్పమూర్తిగా ఉన్న ఈ ఆంజనేయస్వామి దర్శనం సర్వమంగళకరం. ఆంజనేయస్వామి గర్భాలయానికి సమీపంలో ఉన్న చిన్న మండపంలో నాగనందీశ్వరుడు కొలువు దీరాడు. నవ నందులలో నాగనందీశ్వరుడు రెండవ వాడు.❋

48) 24 అడుగుల శ్రీ హనుమాన్-అంగల్లు

చిత్తూరుజిల్లా మదన పల్లి దగ్గర అంగల్లు గ్రామంలో 6 కోట్ల రూపాయల ఖర్చుతో 24అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని నిర్మించారు. ఆరు కోట్ల రూపాయల అంచనాతో ప్రారంభమైన ఈ భారీ ప్రాజెక్ట్‌ను సంకల్పించింది అతి సామాన్యుడైన వ్యక్తి శ్రీ కోసూరి విశ్వనాధం. ఆయన తాతగారు శ్రీ రాజరత్నం పిళ్లే, తండ్రి పరమ శివం పిళ్లేలు దగ్గరలోనే ఉన్న రిషీవాలీ స్కూలు నిర్మాణం పనులు చేసేవారు. విశ్వనాధం మోటారు పంపుల డీలర్. పదేళ్ళ క్రితమే విశ్వనాధం గారికి శ్రీ ఆంజనేయ దేవాలయం నిర్మించాలనే సంకల్పం కలిగింది. అనంతపురం హైవే రోడ్‌లో ఒక ఎకరం స్థలం కొన్నాడు.

రియల్ ఎస్టేట్ బూమ్ బాగా ఉండటంతో కొన్న స్థలంలో కొంత స్థలాన్ని చాలా ఎక్కువ రేటుకు అమ్మి ఆ డబ్బుతో తన దేవాలయ నిర్మాణ కల సార్ధకం చేసుకోవాలనుకొన్నాడు. పడుకున్నా కూర్చున్నా నిద్రిస్తున్నా అదే ఆలోచన. అప్పటి నుంచి మద్యం, మాంసం, తాగుడు, సిగరెట్ వగైరా చెడు అలవాట్లను మానేశాడు. ఉప్పు కూడా ఆహార పదార్ధాలలో వేసుకోకుండానే

తినేవాడు. అదొక పవిత్ర వ్రతంలాగా ఆచరించాడు. మనసు కల్మషరహితమై పవిత్రమై దైవ కార్యానికి శరీరం, మనసు సిద్ధమైనాయి.

2005 జూన్‌లో ఈ ప్రాజెక్ట్ పని ప్రారంభమైంది. దగ్గరలో చిన్న తిప్ప సముద్రం గ్రామంలో ఉన్న కొండపైన ఉన్న 300 అడుగుల, 130 టన్నుల బరువున్న రాయిని విగ్రహం కోసం ఎంపిక చేశారు. దాన్ని కావలసిన సైజుకు తెచ్చేందుకు చిత్రిక పట్టి బరువును 80 టన్నులకు తగ్గించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం 24 అడుగుల పొడవు 8 అడుగుల వెడల్పు ఉండేట్లు చెక్కించారు. విగ్రహ పద్మపీఠం అయిదు అడుగులు. దానిపైన మరో అయిదడుగుల ఎత్తుపీఠం పైన ఆంజనేయ విగ్రహం ఉంటుంది. దీనికింద పదకొండు అడుగుల లోతులో కాంక్రీట్ దిమ్మ దానిపై ఇవన్నీ అమర్చారు. ఇంత భారీ విగ్రహ నిర్మాణంలో ఎక్కడా ఒక చిన్న క్రాక్ కూడా రాక పోవటం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసి శిల్పాచార్యుని ప్రతిభను అందరూ మెచ్చుకొన్నారు. దైవ కటాక్షం కూడా తోడ్పడిందని విశ్వాసం. లో బెడ్ ట్రైలర్ మీద విగ్రహాన్ని రెండు హై కేపాసిటి. క్రేన్‌ల సహాయంతో మే ఇరవై తొమ్మిదిన అంగల్లు చేర్చారు.

తమిళనాడు కుంభకోణ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ రమణి అయ్యర్ 'స్వర్ణ పంచముఖి తంత్రం' శ్రద్ధగా తయారు చేసి ఇచ్చారు. దాన్ని విగ్రహ పీఠం కింద అమర్చి శక్తి చేకూర్చారు. తమిళనాడులోని మాయవరం నుండి తెచ్చిన 'అష్ట బంధనం'తో జూన్ ఇరవై ఏడున కీటకాలు లోనికి ప్రవేశించకుండా ఖాళీలను పూడ్చారు. భద్రాచలానికి చెందిన డెబ్భై ఏళ్ళ వయోవృద్ధు శ్రీ వెంకటస్వామి తన భక్తబృందంతో వచ్చి శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ నిర్మాణానికి 18 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అప్పటికే ఆరు కోట్లు ఖర్చు చేసి విగ్రహం నిర్మించి ప్రతిష్టించిన నిర్మాత విశ్వనాధంగారు అంత డబ్బు ఎలా సమకూరుతుందోనని ఆవేదన చెందుతున్నారు. దాతలెవరైనా ధన సహాయం చేయదలిస్తే -9-94406 50038 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించ వలసినదిగా తెలియజేశారు.❋

49) శ్రీ బేడీ ఆంజనేయస్వామి-తిరుమల

కలియుగ ప్రత్యక్షదైవం, వడ్డి కాసులవాడు శ్రీ వేంకటేశ్వరుదు కొలువై ఉన్న తిరుమలలో కూడా శ్రీ బేడీ ఆంజనేయస్వామి దేవాలయం ఒకటి ఉంది. వేంకటేశ్వరస్వామి, వరాహస్వామి దేవాలయం తర్వాత తిరుమల కొండపై ఎక్కువమంది సందర్శించుకొనే దేవాలయం ఈ బేడి ఆంజనేయస్వామి దేవాలయం. ఆ రెండు దేవాలయాల్లో నైవేద్యం సమర్పించిన తర్వాత ఈ బేడీ హనుమాన్ దేవాలయంలోకి నైవేద్యాన్ని తీసుకు వస్తారు. అయితే ఇక్కడ ఆంజనేయస్వామిని ఎందుకు బంధించారో చూద్దాం. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా సంనిది వీధిలో స్వామికి అభిముఖంగా అంజలి బద్ధుడై ఉన్న ఆంజనేయస్వామి బేడి ఆంజనేయస్వామి. కాళ్ళకు, చేతులకు బేడీలు తగిలించిన మూర్తి కనుక ఈయనకు ఆ పేరు వచ్చింది. ఆంజనేయుడు అంజనాదేవి పుత్రుడు. తిరుమలలో తపస్సు చేసి ఆమె స్వామిని కన్నది. బాల్యంలో కోతిచేష్టలు, అల్లరి పనులు చేస్తూ తిరుగుతున్నా కుమారుణ్ణి కట్టడి చేయడానికి అంజనాదేవి బేడీలు వేసి ఆ వేంకటేశ్వరస్వామికి ఎదురుగా నిలబెట్టిందని ఇతిహాసం. పూర్వం దేవస్థానానికి పాలకులైన పూరీ జగన్నాథంలోని సంప్రదాయం ప్రకారం బేడి ఆంజనేయమూర్తిని స్వామి కెదురుగా నిలిపినారని కుడా పెద్దలు చెపుతారు.❋

50) వాలేశ్వర ఆంజనేయ ఆలయం-రామగిరి

చిత్తూరుజిల్లా పిచ్చాటూరు మండలం రామగిరి గ్రామంలో వెలిసిన వాలీశ్వర దేవాలయం, కాళభైరవక్షేత్రం పల్లవుల కాలం నాటి ప్రాచీన దేవాలయం. ఈ ఆలయంలో ఆది దేవుడైనా పరమేశ్వరుని శివలింగం కొద్దిగా వాలి దర్శనం ఇవ్వడంతో ఇక్కడ శివునికి వాలీశ్వరస్వామి అని పేరొచ్చింది. ఆలయంలో శివునితోపాటు మరదాంబికా అమ్మవారు, సంతాన కాలభైరవ స్వామి కొలువు దీరారు. ఈ ఆలయంలో వీటితోపాటు పలు ప్రాచీన, ఉత్సవ మూర్తులు ఉన్నాయి. ఈ ఆలయానికున్న విశిష్టత ఏమంటే అన్ని శివాలయాల్లో శివుని ఎదుట నందీశ్వరుడు కొలువుతీరి ఉండడం పరిపాటి. రామగిరి ఆలయంలో మాత్రం శివలింగం ఎదుట ఆంజనేయస్వామి కొలువుదీరి ఉండడం ఇక్కడి విశేషం.

ఈ ఆలయానికి రామాయణానికి సంబంధించిన ఆసక్తికరమైన గాథ ఉన్నది. రాముడు రావణ సంహారం తర్వాత లంక నుండి అయోధ్య వెడుతూ రామేశ్వరం చేరుకొన్నాడు. రావణసంహారంతో రామునినికి బ్రహ్మహత్యా దోషం తగులుతుంది. ఈ దోష పరిహారానికై కాశీ నుండి శివలింగాన్ని తెప్పించాలని

కులగురువు వశిష్టుడు సూచించాడు. అప్పుడు రాముడు ఆంజనేయుని పిలిచి కాశీ నుండి శివలింగాన్ని తీసుకొని రమ్మని పురమాయిస్తాడు. ఆంజనేయుడు శివలింగానికై కాశీకి వెడతాడు.

ఆంజనేయుడు తన తిరుగు ప్రయాణంలో రామగిరి చేరుకొంటాడు. అప్పుడు ఈ ప్రాంతాన్ని కాళింగ మధుకర్రై, తిరుక్కారికర్రై అని పిలిచేవారు. అక్కడ కాలభైరవ స్వామివాసం చేస్తుంటాడు. కాలభైరవుడు ఆంజనేయుడు శివలింగాన్ని తీసుకొని రావడం చూసి, ఆ లింగం తన ప్రాంతంలో ప్రతిష్ఠ కావాలని ఆశిస్తాడు. తన ఆశ ఫలించడానికి భైరవుడు సూర్యుని, వాయుదేవుని సహకరించమని కోరుతాడు. సూర్యుడు ఎండ వేడిమిని పెంచగా, వాయుదేవుడు బలమైన వేడిగాలి వీచేలా చేస్తాడు. వాటితో ఆంజనేయునికి దాహం వేస్తుంది. పైగా చెమట పడుతుంది, స్నానంచేయాలని అనిపిస్తుంది. క్రింద చూస్తే పశువుల కాపరి బాలుడి వేషంలో ఉన్న కాలభైరవుడు కనిపిస్తాడు. ఆంజనేయుడు క్రిందికి దిగి వచ్చి ఆ ప్రాంతంలో నీటి వనరు ఉన్నదా అని ప్రశ్నిస్తాడు. భైరవుడు గంగను ప్రార్థించి సమీపంలో ఒక కొలను ఏర్పడేలా చేస్తాడు. అతడు ఆంజనేయునికి ఆ కొలను చూపించగా అతడు తన చేతిలోని శివలింగాన్ని కాస్సేపు ఉంచుకోమని కోరి దాహం తీర్చుకోవడానికి తీర్థానికి వెడతాడు. భైరవుడు వెంటనే లింగాన్ని నేలపై ఉంచి వెళ్ళిపోతాడు. ఆంజనేయుడు నీరు త్రాగి తిరిగి వచ్చేసరికి బాలుడు ఉండడు. లింగం నేలపై కూరుకుపోయి ఉంటుంది. అతడు దానిని పైకి ఎత్తడానికి ఎంతో ప్రయత్నిస్తాడు. అయితే వీలు కాదు. తన తోకను లింగం చుట్టూ కట్టి పైకెత్తడానికి కూడా ప్రయత్నిస్తాడు. అది కూడా ఫలితం ఇవ్వలేదు. గత్యంతరం లేకుండా ఆంజనేయుడు మరొక శివలింగం తీసుకొని రావడానికి కాశీకి ప్రయాణం కడతాడు. అప్పుడు వాతావరణం చల్లగా ఉంటుంది. వేడిగాలి స్థానే చల్లని గాలి వీస్తుంది. ఇదేదో చమత్కారమని ఆంజనేయుడు భావిస్తాడు. అతనికి కొపం వస్తుంది. ఆ కొలను కారణంగా ఇలా జరిగిందని తలచి ఆంజనేయుడు ఆ కొలను ఒక కొండగా మారాలని శపిస్తాడు. శాప ఫలితంగా కొలనుకొండ రూపం దాల్చుతుంది. ఈ కొండపై ఇప్పుడు కార్తికేయుని గుడిఉన్నది. ఆంజనేయుడు తెచ్చిన శివలింగం కొండ అడుగు భాగంలో ప్రతిష్ఠితమై ఉన్నది. అప్పటి నుండి రాముని కోసం ఆ లింగం వచ్చింది కాబట్టి ఈ ప్రాంతాన్ని రామగిరి అని, తోకతో లింగాన్ని ఎత్తడానికి ప్రయత్నించిన ఆంజనేయుని వాలీశ్వరుడని పిలువసాగారని ఐతిహ్యం. ఇప్పటికీ లింగం ఉత్తరం వైపుగా కొంత ఏటవాలుగా

ఉన్నది. లింగంపై తోక గుర్తు కూడా ఉన్నది. రామగిరి వాలీశ్వరుని సందర్శించే వారు తొలుత భైరవేశ్వరుని సందర్శిస్తారు. ఇక్కడ శివరాత్రి సందర్భంగా విశేష పూజలు జరుగుతాయి.

రామగిరి నామ వివరణ

శ్రీరామ కార్యంగా వచ్చిన శివలింగం ఇక్కడ ప్రతిష్ఠించబడి నందువల్ల రామ అనే పదం ఆంజనేయ శాపం వల్ల మడుగు మరుగున పడి పర్వతం (గిరి) ఏర్పడింది. దీనికి గిరిని చేర్చి అప్పటి నుంచి తిరుక్కరికరిరు అనే పూర్వం పిలువబడే గ్రామానికి రామగిరి అనే పేరు ఏర్పడి శివక్షేత్రంగా బాసిల్లుతోంది.

ఆలయంలో సొరంగ మార్గం

ఆలయంలో పరమేశ్వరుడు కొలువు తీరిన గర్భగుడి పక్కన ఓ సొరంగ మార్గం ఉంది. ఈ మార్గం రెండో ద్వారం శ్రీ కాళహస్తిలోని శ్రీ వాయులింగేశ్వరుని ఆలయంలోఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ సొరంగం శిధిలమై ఉంది. కొన్నేళ్ల క్రితం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం ఈ సొరంగాలలో తవ్వకాలు జరిపారు. దీనితో అధికారులు ఎవ్వరూ తవ్వకాలు చేయకుండా ఆ సొరంగ మార్గానికి తలుపులు బిగించారు.❋

కడపజిల్లా

51) గండి వీరాంజనేయ దేవాలయం-పులివెందుల

త్రేతా యుగానికి చెందిన గండి వీరాంజనేయ దేవాలయంలోని శ్రీ ఆంజనేయ మూర్తిని స్వయంగా శ్రీరాముడు తన బాణం ములికితో చెక్కాడు. అయితే హనుమ ఎడమ చేతి చిటికెన వ్రేలు అసంపూర్తిగా చిత్రింపబడింది. వ్యాసరాయలవారు స్వామిని దర్శించి ఆ వ్రేలిని సరి చేయాలని శిల్పితో ప్రయత్నం చేయిస్తే ఉలి మొన తాకగానే రక్తం కారటం మొదలైంది. అంటే హనుమకు మానవ మాత్రుడు చెక్కిన వ్రేలు ఇష్టం లేదని, శ్రీరామచంద్రుడు చెక్కిన అసంపూర్తి వ్రేలే తనకు ఇష్టమని అర్థమయింది. వ్యాసరాయలు హనుమ హృదయ మెరిగిన పరమ భక్తులు కనుక మళ్ళీ ఆ ప్రయత్నం చేయించలేదు. ఈ విషయం వాయు పురాణంలో కూడా ఉన్నట్లు చెబుతారు. కనుక ఇక్కడి మారుతీమూర్తి సజీవమూర్తి అని విశ్వాసం. రావణ సంహారం తర్వాత శ్రీరాముడు లంక నుంచి తిరిగి వస్తూ ఇక్కడ కొంతకాలం గడిపాడని,

అప్పుడు హనుమమూర్తిని చిత్రించాడని స్థల పురాణం. గండి అంటే ఇరుకు మార్గంలో ప్రవహించే నీటి దారి అని అర్ధం. హనుమ తండ్రి వాయుదేవుడు శ్రీరాముని ఆహ్వానించటానికి ఇక్కడ బంగారు పుష్పాల తోరణంఏర్పాటు చేశాడు. ఇప్పుడు ఈ స్వర్ణ పుష్ప తోరణం మృత్యువు సమీపించిన వారికి మాత్రమే కనిపిస్తుందని స్థానికుల విశ్వాసం.

ఈ గండి వీరాంజనేయ క్షేత్రం తూర్పు కనుమలలో కడపజిల్లా పులివెందుల-రాయచోటి తాలూకాల సరిహద్దులో కడపకు 34 కిలోమీటర్ల దూరంలో, పాపాఘ్ని నదీతీరంలో రెండు కొండల మధ్యన ఉన్నది. పాపాఘ్ని అంటే పాపాలను దాహించేది. అలాంటి ఈ పవిత్ర నదిలో పుణ్య స్నానం చేసి భక్తులు గండి హనుమను దర్శించి తరిస్తారు. స్వామి అభయ హస్తంలో దర్శనమిస్తాడు కనుక అభయహస్త ఆంజనేయ దేవాలయంగా ప్రసిద్ధమైంది. ❋



52) ముస్లిం నవాబు కట్టించిన శ్రీ ఝూల్ ఆంజనేయ దేవాలయం-కడప

కడపను చోళ, కాకతీయరాజులు పాలించారు. 14 శతాబ్దం చివరలో విజయనగర రాజుల అధీనంలోకి వెళ్ళింది. విజయనగర రాజ ప్రతినిదులైన గండికోట నాయకులు కడప ప్రాంతాన్ని పాలించారు. 1565 మీర్జుమ్లా నాయక రాజులను ఓడించటంతో కడప గోలుకొండ నవాబుల అధీనంలోకి వెళ్ళింది. తర్వాత 1800లో బ్రిటిషువారి స్వాధీనమైంది. 18వ శతాబ్దం అంతా కడప మయానా నవాబుల ఏలుబడిలో ఉంది. బ్రిటిషువారి కాలంలో మేజర్ మన్రో కడప కలెక్టరుగా ఉండేవాడు. కడప పట్టణం పెన్నా నదికి దక్షిణాన 8 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. కడప చుట్టూ నల్లమల, పాలకొండ కొండలున్నాయి. తిరుమల సందర్శనానికి ఇది 'గడప' అంటే ప్రవేశ ద్వారం 'దేవుని గడప'గా ఉండేది. కాలక్రమంలో గడప కడపగా మారింది. ఇక్కడి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించి తిరుమలకు వెళ్ళటం సంప్రదాయం. కడప దగ్గర వేంపల్లిలో గండిక్షేత్రం పాలకొండల లోయలలో ఉంది. ఇక్కడి పురాతన ఆంజనేయ దేవాలయాన్ని గండికొండ ఆంజనేయస్వామి అంటారు.

కడప పట్టణంలో కూడా ఒక ప్రాచీన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం బ్రాహ్మణ బజారులో ఉంది. ఈ ఆలయానికి మూడు అంతస్తుల రాజగోపురం అయిదు కలశాలతో ఉంటుంది. ఆంజనేయ, రాఘవేంద్రస్వాముల పెయింటింగ్స్ ఉంటాయి. సింహద్వారం వద్ద ద్వారపాలకుల విగ్రహాలున్నాయి. లోపలి ప్రవేశించగానే కుడి ప్రక్క మంచినీటి బావి ఉంటుంది. దీని నీరే అభిషేకానికి ఉపయోగిస్తారు. గర్భాలయంను 'సన్నిధి' అంటారు. అందులో శ్రీ ఆంజనేయస్వామి కొలువై ఉంటాడు. సన్నిధి అంతా రంభావనం అంటే అరటి పిలకలతో అలంకరిస్తారు.

1565 నుండి 1800 వరకు కడప నిజాం నవాబుల పాలనలో ఉందని ముందే చెప్పుకొన్నాం. ఒకసారి ఇక్కడి నవాబుకు శ్రీ ఆంజనేయస్వామి కలలో కనిపించి, తన విగ్రహం ప్రతిష్టించి దేవాలయం నిర్మించి, నిత్య పూజాదికాలు ఏర్పాటు చేయమని ఆదేశించాడు. మర్నాటి నుంచి నవాబు హనుమ విగ్రహం కోసం పెన్నానదీ ప్రాంతంలో వెతికించటం ప్రారంభించాడు. నదీప్రవాహంలో చాకలి వారు ఉతికే బండను గుర్తించారు. దాన్ని తిరగేసి చూసి ఆశ్చర్యపోయారు. అది 'అర్ధశిల ఆంజనేయ విగ్రహం'. నవాబు ఆనందాశ్చర్యాలకు అవధులు లేవు. చాలా జాగ్రత్తగా తనతో తీసుకువచ్చి ఇప్పుడు దేవాలయం ఉన్నచోట విధి విధానంగా ప్రతిష్ఠ చేయించి గొప్ప దేవాలయం నిర్మించాడు. పాదకండ్ల నుంచి మధ్వ పూజారులను ఆహ్వానించి వారిచే స్వామికి నిత్య పూజాదికాలు చేయించే ఏర్పాటు చేశాడు నవాబు. పూర్తిగా హనుమ భక్తుడై, రోజూ దేవాలయానికి వచ్చి శ్రీ హనుమస్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించేవాడు. స్వామికి హారతి ఇచ్చే సమయంలో హనుమ ఆనందంతో ఊగిపోతున్నట్లు నవాబుకు కనిపించేవాడు. అప్పటి నుంచి ఈ ఆంజనేయుడికి 'ఝూల్ ఆంజనేయ' అనే పేరొచ్చింది. ఝూలనా అంటే ఊగటం అని అర్థం. ఆ తర్వాత కలెక్టర్ మన్రో కూడా తప్పకుండా ఈ ఆంజనేయస్వామిని దర్శించేవాడు.

ఝూల్ ఆంజనేయస్వామి మహాకాయ విగ్రహం. పడమర వైపు తిరిగి దక్షిణ గమనంగా ఉంటాడు . పైకెత్తి ఉన్న దక్షిణ హస్తం అభయహస్తం. ఎడమ చేయి నడుముపై ఆనించి సౌగంధ పుష్పం ధరించి ఉంటుంది. కర్ణకుండలాలతో, తోక తలపైన ఉండి, ముడత పడి చివర గంట కట్టబడి కనిపిస్తాడు, ఈ రకం హనుమ అంటే వ్యాసరాయ ప్రతిష్ఠితం అని రూఢిగా చెప్పవచ్చు. శిరసుపై చిన్న పిలకముడి వేసినట్లు ఉంటుంది. భుజం 'చంచలద్వాల సన్నద్ధల్మంబమాన శిఖోజ్వలాయ'గా విశేషంగా కనిపిస్తుంది. కేయూరాలు కడియాలు మెడలో మూడు రకాల పుష్పహారాలుతో సర్వాభరణ భూషితుడై దర్శనమిస్తాడు. మీసం పౌరుషత్వానికి చిహ్నంగా మహావీరుడనిపిస్తాడు. విశాలమైన కనులు కృపా వర్షాన్ని కురిపిస్తున్నట్లుంటాయి. స్వామికి మంగళస్నానం అంటే అభిషేకం చేసేటప్పుడు శరీరంపై రోమాలు కనిపిస్తాయని అర్చకులు చెబుతారు. దసరాలలోనూ, హనుమజ్జయంతి నాడు, మధ్వ నవమినాడు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. ❋



53) మహిళా ప్రవేశంలేని శ్రీ ఆంజనేయాలయం-తిప్పాయపల్లి

కడపజిల్లా పుల్లంపేట మండలం తిప్పాయపల్లిలో శ్రీ సంజీవరాయ దేవాలయం ఉన్నది. భక్తుల కోర్కెలు తీర్చే దీనబాంధవుడిగా ప్రసిద్ధి. అయితే ఇక్కడ మహిళలకు ప్రవేశం నిషిద్ధం. కొన్ని దశాబ్దాలుగా ఈ ఆచారం అమలులో ఉంది. కొన్నేళ్ళ క్రితం ఈ ప్రాంతం కరువు కాటకాలతో అలమటించింది. అప్పుడు ఒక సాధువు ఇక్కడి కొచ్చి శ్రీ సంజీవరాయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించాడు. స్వామివారు ఆ జన్మ బ్రహ్మచారి కనుక అంటూ మైలా తగలరాదని అందుకోసం మహిళలకు ప్రవేశం నిషిద్ధమని ఆ స్వామీజీ ప్రకటించాడు. గుడికి వచ్చిన స్త్రీలు బయట నుంచే దర్శించి వెళ్ళిపోతారు. బయట ఉన్న ఈశ్వరుని విగ్రహాన్ని పూజిస్తారు. ప్రతి సంక్రాంతికి ముందువచ్చే ఆదివారంనాడు పొంగళ్ళ ఉత్సవం రంగ రంగ వైభవంగా నిర్వహిస్తారు. మగవాళ్ళే పొయ్యిలు వెలిగించి, పొంగళ్ళు వండి నైవేద్యం పెట్టి మగవారు మాత్రమే ఆ ప్రసాదం తింటారు. తమ గ్రామాన్ని కాపాడేది సంజీవరాయుడే అనే గట్టి నమ్మకంతో ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు.*

54) సంజీవిని మూలికను చేత ధరించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం-రామాపురం

సంజీవినీ మూలికా సహిత సంజీవ రాయుడు

కడపజిల్లా రామాపురం అనే చిన్న పల్లెటూరులో ఒక శిధిల శివాలయం ఉంది. అందులో అపురూపమైన విగ్రహాలున్నాయి. అందులో ఒకటి అపురూపమైన ఆంజనేయ విగ్రహం దర్శనమిస్తుంది. స్వామి సంజీవినీ పర్వతంతో పాటు 'సంజీవినీ మూలికను' కూడా చేతిలో ధరించి ఉండటం చాలా వింతగా ఉంటుంది. ఇలాంటి విగ్రహం మరెక్కడా లేదు. ఈ గ్రామంలో ఇదొక్కటే కాదు, ఇంకా వింత అయిన విగ్రహాలను మనం దర్శించవచ్చు.

ద్విముఖ షణ్ముఖ స్వామి

రెండుముఖాలతో ఉండే సుబ్రహ్మణ్యస్వామి ఇక్కడ దర్శనమిస్తాడు. ఇదీ చాలా వింత విషయమే. మరెక్కడా ఈలాంటి విగ్రహం ఉండదు. ఈ విగ్రహానికి 1500 ఏళ్ళు. గ్రామస్తులు దీనికి పునర్వైభవం తెచ్చి పుణ్యం కట్టుకొన్నారు. ద్వికంఠ షణ్ముఖ మూర్తి ప్రపంచంలో మరెక్కడా లేదు. సాధారణంగా వల్లీ దేవసేనా సమేత షణ్ముఖస్వామి ఉంటాడు. ఇంకో విశేషం ఏమిటంటే ఈ షణ్ముఖ విగ్రహానికి అభిషేకం చేసే ఆవుపాలు అభిషేకం తర్వాత నీలం రంగులోకి మారిపోవటం సంభ్రమాశ్చర్యాలను కలిగించే విషయం కదా.

మోక్ష నారాయణ స్వామి

పై రెండు వింత విగ్రహాలేకాకుండా, మోక్షనారాయణ స్వామి, కౌలినీ

మాత, ఉగ్ర భైరవ మూర్తుండటం ప్రత్యేకత. ఈ విగ్రహాలన్నీ పదిహేను వందల సంవత్సరాలకంటే పూర్వపు వేనని పురాతత్వ శాస్త్రవేత్తలు ఉవాచ. మోక్ష నారాయణ విగ్రహం కూడా ప్రపంచంలో మరెక్కడా లేదు. విష్ణుమూర్తి మోక్ష నారాయణుడిగా పూజలందుకొంటున్న ఏకైక క్షేత్రం ఇదే. ఈ విగ్రహానికి వామ హస్తంలో శంకువు, కాస్త కిందకు ఉంటుంది. ఇదో వింత. మోక్షానికి మార్గంగా దక్షిణ హస్తం చూపుడు వేలి పైకి చూపు తున్నట్లు కనిపిస్తుంది. మోక్ష నారాయణమూర్తి దివ్య తేజస్సుతో విరాజిల్లుతూ ఉంటాడు. ప్రతినెల శుక్ల ఏకాదశినాడు స్వామి ఉత్తర ద్వారా దర్శనమిస్తాడు. ఇది ఇంకో ప్రత్యేకత. అప్పుడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి సాయంత్రం స్వామి వారికి శాంతి కల్యాణం చేస్తారు.

కౌలినీ మాత

అలాగే లలితాంబికా రూపమైన కౌలిని మాత విగ్రహం కూడా ప్రత్యేకతే. లలితా సహస్రనామాలలో ఈ నామం ఉంది. కౌలినీ మాతకు ఉజ్జయినిలో ఆలయం ఉండేదని, కాని ఇప్పుడు అది శిథిలమై పోయిందని స్థానికుల కథనం. అలాంటి దేవాలయం ఇంకెక్కడా లేదు.

బటుక్ భైరవ

రుద్రాంశ సంభూతుడైన భైరవుడు ఇక్కడ క్షేత్ర పాలకుడుగా వెలిశాడు. అరుదైన 'బకుట్ భైరవ' రూపంలో దర్శనమిస్తాడు. ఉగ్ర భైరవునితో బాటు భైరవీమాత, కాలభైరవ విగ్రహాలను ప్రత్యేకంగా ప్రతిష్టించారు.

ఈ పునః ప్రతిష్ఠా కార్యక్రమానికి శ్రీ కాశీభట్ల సాయినాధశర్మ ముఖ్యపాత్ర వహించారు. ఆలయ నిర్వహణకు 'పుణ్య భూమి చారిటబుల్ ట్రస్ట్' ఏర్పడి వైభవోపేతంగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రామాపురం వెళ్లి అరుదైన ఆ దేవతామూర్తులను దర్శించి జీవితాన్ని సార్ధకం చేసుకొందాం. ❋

మరికొన్ని ఆంధ్రప్రదేశంలోని హనుమాన్ దేవాలయాలు

వీటివివరాలు తెలియలేదు. అయినా చూడదగ్గ హనుమాలయాలే.

❋ శ్రీకాకుళంజిల్లా పాలకొండలో శ్రీ అభయ ఆంజనేయస్వామి భారీ ఎత్తైన విగ్రహం చూడాల్సిందే.

❋ గుంటూరుజిల్లా 'కొత్తపేట' హనుమంతుడు తన భక్తులు అనారోగ్యాల బారిన పడకుండా కాపాడతాడని అంటారు. మహిమాన్వితుడైన హనుమంతుడు ప్రాచీనకాలం నుంచి ఇక్కడ కొలువై ఉన్నాడని చెబుతారు. స్వామివారు వెలసిన మందిరం శిధిలావస్థకు చేరుకోగా, చాలాకాలం క్రిందటే వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆలయాన్ని పునర్మించాడు. ఆ రోజు నుంచి స్వామివారికి నిత్యపూజలు, ఉత్సవాలు జరుగుతున్నాయి. వివిధ రకాల భంగిమలతో ఆలయమంతటా హనుమంతుడి రూపాలు దర్శనమిస్తూ వుంటాయి. గర్భాలయంలో స్వయంభువు హనుమంతుడు పరిమాణం పరంగా చిన్నగా కనిపిస్తున్నప్పటికీ జీవకళ ఉట్టిపడుతూ వుంటుంది.

❋ దాహం తీర్చే హనుమంతుడు: హనుమంతుడి క్షేత్రం 'బొర్రగూడెం'లో దర్శనమిస్తుంది. స్వామి స్వయంభువుగా ఆవిర్భవించిన ఈ క్షేత్రం, కృష్ణాజిల్లా మైలవరం మండలంలో దర్శనమిస్తుంది. ఇక్కడి హనుమంతుడు మహిమాన్వితుడని స్థానికులు చెబుతుంటారు. ఈ ఆలయానికి ముందు నుంచి వెళ్లే వాళ్లు, వచ్చేవాళ్లు తప్పనిసరిగా ఆగి మరీ స్వామి దర్శనం చేసుకుని వెళుతుంటారు. అలా ఆగని వారు ప్రమాదాల్లో పడుతుంటారని ఇక్కడి వారు అనుభవ పూర్వకంగా చెబుతుంటారు. ఇక్కడి స్వామి తన దర్శనార్థం వచ్చిన వారికి దాహం తీర్చమని ఓ భక్తుడికి చెప్పాడట. నాటి నుంచి ఆలయ సిబ్బంది అదొక నియమంగా పాటిస్తూ వస్తున్నారు. కాలమేదైనా చల్లని రుచికరమైన మంచినీళ్లు భక్తులకు అందిస్తుంటారు. కొన్ని సంవత్సరాలుగా ఈ నియమం కొనసాగుతూనే వస్తోంది. అందుకే ఇక్కడి స్వామిని దప్పిక తీర్చే హనుమంతుడుగా కొలుస్తుంటారు.

❋ ఖడ్గ ఆంజనేయుడు: హనుమంతుడు చేతిలో 'గద' కాకుండా ఆయన

చేతిలో మరే ఆయుధం కనిపించినా వింతగా విచిత్రంగా అనిపిస్తూ వుంటుంది. అలా ఆశ్చర్యచకితులను చేసే హనుమంతుడు మనకి కృష్ణాజిల్లా 'మొవ్వ'లో కనిపిస్తాడు. అందుకు కారణం ఇక్కడ హనుమంతుడి చేతిలో 'గద' కాకుండా 'వీర ఖడ్గం' ఉండటమే. కృష్ణాజిల్లా 'మొవ్వ' అనగానే క్షేత్రయ్య గుర్తుకు రావడం సహజం. ఈ క్షేత్రంలో ఆవిర్భవించిన వేణుగోపాలస్వామి పైనే క్షేత్రయ్య పదాలను రచించి పరవశింపజేశాడు.

❋ రామాయంపేట మండల పరిధిలోగల 'తొనగండ్ల'లో భారీ హనుమంతుడి విగ్రహం ఈ నేపథ్యంలో ఏర్పాటు చేయబడినదే. అత్యంత బలిష్టంగా అభయ ముద్రలో, 108 అడుగుల ఎత్తున కనిపించే ఇక్కడి హనుమంతుడు.

❋ గుంటూరు జిల్లా పరిధిలో గల బెల్లంకొండకి 'కోళ్ళూరు' నుంచి కొంతకాలం క్రితం హనుమంతుడు తరలివచ్చాడు. పులిచింతల ప్రాజెక్టు కారణంగా ముంపుకి గురయ్యే గ్రామాల్లో ఈ గ్రామం వుండటం వలన ఇక్కడి ప్రజలతో పాటు హనుమంతుడు కూడా తరలించబడ్డాడు. కొంతకాలం క్రితం వరకూ ఈ హనుమంతుడు చల్లపల్లి జమీందారు రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కోళ్ళూరులో నిర్మించిన ఆలయంలో కొలువై భక్తులకు దర్శనమిస్తూ వచ్చాడు. ఒకానొక దోష పరిహారార్థం ఆయన ఈ ఆలయాన్ని నిర్మించినట్టు స్థలపురాణం చెబుతోంది. ఒక కన్ను, ఒక కాలు, ఒక చెయ్యి కలిగిన వ్యక్తి, సాక్షాత్తు హనుమంతుడి ఆదేశంతో ఈ విగ్రహాన్ని మలిచినట్టు చెప్పుకుంటూ వుంటారు.

❋ గుంటూరు జిల్లా నకిరేకల్ మండలం 'బొగ్గరం' గ్రామంలో కనిపిస్తుంది. భారీ రూపాన్ని సంతరించుకున్న ఇక్కడి ప్రసన్నాంజనేయుడు మహిమల గల వాడిగా చెబుతుంటారు.

❋ కృష్ణాజిల్లాలోని కృత్తివెన్ను మండలం 'పాశ్చాపురం'లో ప్రాచీనమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా కనిపిస్తుంది. తీర్చిదిద్దినట్టుగా ప్రాకారాలు, రాజగోపురం దర్శనమిస్తుంటాయి. విశాలమైన ఆలయ ప్రాంగణం మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తూ వుంటుంది. ప్రధాన ఆలయ స్థంభాలపై హనుమంతుడు వివిధ భంగిమలలో కనిపిస్తుంటాడు. ఆలయ ప్రాంగణంలో అందమైన కల్యాణ మంటపమును, యాగశాలను ఏర్పాటు చేశారు. గర్భాలయంలో స్వామి సువర్చలా దేవితో కలిసి ఆశీనుడై వుంటాడు. ఇక్కడి స్వామి మహిమాన్వితుడని

చెబుతుంటారు. 11 మంగళ వారాలపాటు స్వామిని పూజించడం వలన మనసులోని కోరికలు నెరవేరతాయని విశ్వసిస్తుంటారు. సువర్చలా సమేతుడైన స్వామిని ఆరాధించడం వలన కార్యసిద్ధి కలుగుతుందని అంటారు. ఆపదలు, అనారోగ్యాలు తొలగిపోయి, ఆయురారోగ్యాలు చేకూరతాయని చెబుతారు.

❋ సింహాచలం మెట్లమార్గం మధ్యలో ఉన్న 'శ్రీ వీరాంజనేయ స్వామి' గుడి చాలా విశిష్టమైనది మరియూ మహా మహిమాన్వితమైనది. ఇది స్వయంభూ దేవాలయము. ఇక్కడ స్వామి పశ్చిమాభిముఖంగా శ్రీ లక్ష్మీ వరాహ నరసింహస్వామిని చూస్తున్నట్టు ఉంటారు.

❋ సాక్షి ఆంజనేయస్వామి వరాహస్వామి దర్శనానికి కాలినడకన మెట్లమార్గం గుండా వచ్చిన భక్తులు వరాహస్వామి దర్శనానికి ముందు ఆ తరువాత కూడా ఈ స్వామిని దర్శనము చేసుకుంటారు. తద్వారా వరాహస్వామి దర్శనమునకు 'సాక్షి'గా నిలుస్తారంటారు. ఆలాగే కోత్తగా పెళ్ళి చేసుకున్న దంపతులు ఈ స్వామి దర్శనము చేసుకొనడం ద్వారా వారి వివాహాలకు స్వామి 'సాక్షి'గా నిలుస్తారని భక్తుల విశ్వాసం.

❋ తణుకు దగ్గర గల తీపర్రులో ప్రసన్న ఏకాదశముఖి వీరాంజనేయస్వామి.

❋ కాకినాడకు దగ్గరలోని మామిడాడ వద్దగల గంద్రేడు గ్రామంలో పంచముఖ ఆంజనేయస్వామి గుడి ఉంది.

❋ ఎగువమత్యం, తవణంపల్లి, చిత్తూరుజిల్లా కార్యసిద్ధ శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానం, ఆంధ్రప్రదేశ్లో ఇది రెండువ 18 అడుగులకల ఏకశిల.

❋ భర్తిపూడి, బాపట్లమండలం, గుంటూరుజిల్లా: ప్రసన్నాంజనేయస్వామి

❋ కృష్ణాజిల్లా తిరువూరులో రాజుపేటలో ప్రసిద్ధ ఆంజనేయ స్వామి దేవాలయం ఉన్నది.

❋ కృష్ణాజిల్లా ఆగిరిపల్లి శోభనగిరి కొండపైకి వెళ్ళే మెట్లమార్గంలోని ఆంజనేయస్వామిక్షేత్రంలో చతుర్భుజములతో, శంఖు, చక్రములతో,

యోగ ఆసనములో కూర్చుని దర్శనమిచ్చే శ్రీ బ్రహ్మభట్ట ఆంజనేయస్వామి వారు భక్తుల కోరికలు తీర్చి, సర్వరోగ, భయ, పీడా నివారణకు మార్గంగా దర్శనమిస్తారు.

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

❋ పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరు దగ్గర పెదపాడుగ్రామంలో శ్రీ ఆంజనేయ దేవాలయం దర్శించ దగినది.

❋ ఆదోని మార్కెట్, పట్టణంలోని దొండగిరి ఆంజనేయస్వామి ఆలయం

❋ తెనాలిలో చిట్టి ఆంజనేయ స్వామి గుడి. ఈ గుడీ శ్రీ రామనవమీ ఉత్సవాలకి ప్రసిద్ధి.

❋ దెందులూరు మండలం కండ్రిక నరసింహాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం.

❋ గుంటూరుజిల్లా గుంటూరు మండలంలోని లాలూపురం వీరన్నపాలెంలోని శ్రీ అభయాంజనేయస్వామి.

❋ అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరాలయం ముందున్న ఆంజనేయ స్వామివారి ఆలయం. ప్రతినిత్యం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామివారికి మంగళవాయిద్యాలతో పూజాభిషేకాలు నిర్వహించి, తర్వాత శ్రీవారికి అభిషేకాలు పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యాన్ని కలుగజేస్తారు. ఇక్కడకు వచ్చే భక్తులు తక్కువ ఉన్నందున ఆలయం ప్రశాంత వాతావరణములో ఉన్నందున భక్తులు సావధానంగా చిత్తశుద్ధితో దైవదర్శనం చేసుకోవచ్చు. అప్పలాయగుంట తిరుపతికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. తిరుపతి నుండి ప్రతిగంటకు బస్సులు ఉంటాయి. తిరుపతి నుండి పరిసర ప్రాంతాలలోని ఆలయ సందర్శన బస్సులు కూడా ఇక్కడి వస్తుంటాయి. తిరుపతికి వచ్చినవారు తప్పక చూడవలసిన ఆలయమిది.❋

తెలంగాణ

55) శ్రీ ఏదుల యెర్రగట్టు వీరాంజనేయ స్వామి-మహబూబ్‌నగర్

తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా గోపాలపేట మండలంలో ఏదుల గ్రామంలో యెర్రగట్టు (అరుణాద్రి) పై శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో కొలువై ఉన్నాడు. ఆయనతోబాటు అక్కడ శివ పంచాయతనం, శ్రీ రామాలయం కూడా ఉన్నాయి. ఈ గ్రామం కొల్లాపూర్, నాగర్ కర్నూల్, వనపర్తి మూడు తాలూకాలకు మధ్య కేంద్రంగా ఉంది. ఒకప్పుడు బండ రాళ్ళతో, పొదలతో డొంకలతో చేరటానికి వీలుకాని ప్రదేశంగా ఉండేది. ఇప్పుడు దేవాలయ సముదాయంతో శోభిల్లుతోంది.

కారకుడు ఎవరు?

ఎర్రగట్టు వీరాన్జనేయుడికి మొగిలి మశన్న అనే భక్తుడే కర్త కర్మా క్రియగా ఉండేవాడు. అధికారం కాని ఆర్ధిక బలం కాని లేకుండానే హనుమ భక్తికి, గ్రామస్తుల సహకారానికి, సంఘటిత శక్తికి నిదర్శనంగా ఉన్నాడు మశన్న. రజక కులంలో నిరుపేద కుటుంబంలో కోటయ్య, కిష్టమ్మ అనే శ్రమజీవులకు చివరి సంతానంగా జన్మించాడు. ఇక పిల్లలు వద్దు అనుకోని కడుపులోని పిండం చావటానికి తల్లి మందు తాగినా చావక బతికి బయటపడ్డ గట్టి పిండం మశన్న. కారణజన్ముడు కనుకనే స్వామి సేవకోసం భూమిపై పడి స్వామి సేవలో తరించాడు. చిన్నతనం అంతా కష్టాలతోనే గడిచింది. ఊళ్ళో ఉన్న స్కూల్‌లో ఏడవ తరగతి వరకు మాత్రం మిణికాడు. చదువులో చాలా మందకొడిగా ఉండేవాడు. బాల్యం నుండి ఆంజనేయ స్వామి బొమ్మలు

వేయటం మహా ఇష్టం. కలర్ పెన్సిళ్ళతో రంగులు వేసి గోడకు అంటించి మురిసిపోయేవాడు. అతని నోటు పుస్తకాలన్నీ వీరహనుమాన్ బొమ్మలతో నిండిపోయేవి. ఉపాధ్యాయులు తిట్టినా దండించినా పద్ధతిలో ఏ మాత్రం మార్పు రాలేదు. హోమ్ వర్క్ బదులు 'హనుమ వర్క్' చేసేవాడు. బొమ్మ పూర్తియ్యే దాకా అన్నం నీళ్ళు ముట్టే వాడు కాదు. అమ్మానాన్నలూ చాలాసార్లు చెప్పి చూశారు. తిట్టారు తిమ్మారు. ఏం చేసినా పద్ధతిలో మార్పు రానే లేదు. వీరహనుమాన్ బొమ్మలు వేసి బంధు మిత్రులకు ఉచితంగా ఇచ్చేసేవాడు.

బొమ్మలు వేయటమేకాదు ఆంజనేయ దండకం బాగా నోటికి వచ్చేది. ధారాళంగా చదివేవాడు. ఎవరికైనా జ్వరమో జబ్బో వస్తే ఊదుకడ్డీ వెలిగించి ఆంజనేయ దండకం చదివి 'ఇక తగ్గిపోతాదిలే' అని చెప్పి కిలకిలా నవ్వేవాడు. ఇలా ఉంటే చదువెం సాగుతుంది? గుంటకొట్టింది. పుస్తకాలు అటకెక్కాయి. కూలి పనులు చేయటం మొదలెట్టాడు. అన్న బిచ్చన్న గ్రానైట్ రాయి పనిలో ఉంటే మశన్న కూడా ఆపనిలో చేరాడు. చాలీచాలని డబ్బులు అర్ధాకలితో అలమటించేవాడు. అయినా ఆంజనేయ బొమ్మ వేయకుండా మాత్రం ఉండలేదు. అక్కడున్న చిరుతల రామాలయంలో రాముడి పాత్ర, ఆంజనేయ వేషం ధరించి బాగా నటించి అందరిని మెప్పించేవాడు. వీర బ్రహ్మేంద్రస్వామి నాటకంలో సిద్దయ్య వేషం వేసేవాడు.

సంకల్పం సగం బలం

మొగిలి మశన్నకు భజనలంటే భలే ఇష్టం. ఆంజనేయస్వామి కీర్తనలు పాడటమంటే మహా ఇష్టం. ఎప్పటికైనా ఆంజనేయ దేవాలయం కట్టాలి అనే సంకల్పం మనసులో గాఢంగా ఉండేది. చిన్నప్పటినుండే నాయకత్వ లక్షణాలుండేవి. ఎప్పుడూ వెంట పిల్లలు ఉండేవారు. రాళ్ళు కొట్టే వారిని, ఇరుగుపొరుగు కుర్రాళ్ళను కలుపుకొని ఒక జట్టు ఏర్పాటు చేసుకొన్నాడు. ఎవరికైనా అన్యాయం జరిగితే ఎదిరించటానికి ముందు ఉండేవాడు. యువజన సంఘ నాయకుడిగా పేరొచ్చింది. పేదల ప్రతినిధి అనిపించుకొన్నాడు. అందరిలో మంచివాడనే పేరు ఎలానూ ఉంది. ధన బలం లేదు కాని జనబలం ఉన్న నాయకుడు మశన్న. ప్రతి కార్తీక మాసంలో తన బృందంతో కలిసి ఆంజనేయ స్వామికి నిష్టగా ఆకుపూజ చేయించేవాడు. పల్లెటూళ్ళలో

ఒకరు ఎదుగుతున్నాదంటే మరొకరికి అసూయ సహజం. ఒకసారి మశన్న భజన చేస్తుంటే విరోధివర్గం వచ్చి అడ్డుకొన్నది. అదే పెద్ద మలుపు తిరిగి దేవాలయ నిర్మాణానికి కారణమైంది.

ఎఱ్ర గట్టు స్థల మహాత్మ్యం

గుడి కట్టాలన్న సంకల్పం మశన్నలో పెరిగింది. యువకులూ ప్రోత్సహించారు. మంచి రోజున అంకురారార్పణ జరిగింది. రాయి తీయటం, మలచటం, చెక్కటం తమ వృత్తిలో భాగమే కనుక అనుకొన్నది చకచకా జరిగిపోతోంది. ఏదుల గ్రామానికి ఉత్తరాన పెట్టని కోటలాగా చిన్న చిన్న గుట్టల సముదాయం ఉంది. ఆ గుట్టల్లో ఎఱ్రమన్ను గుట్ట లేక యెఱ్ర గట్టు ఒకటి ఉంది. దానినే అరుణాద్రి అంటారు. పురాతనకాలంలో దట్టమైన అడవీ ప్రాంతం ఇది. కొండలు గుట్టలు అధికం. ఇక్కడే మునులు వచ్చి తపస్సు చేసుకోనేవారని అనుకొంటారు. ఎఱ్రగట్టుకు ప్రక్కనే ఉన్న రాములయ్య గట్టు (కరుణాద్రి)కు మధ్య పెద్ద 'ఓడిక అనే వరద వాగు' ప్రవహిస్తూ ఉంటుంది. స్నానానికి నీటికి అనువైన ప్రదేశం కూడా. ఈ వరదకు అడ్డంగా రెండు గుట్టల మధ్య చెరువు కట్ట వేశారు. దీనినే ఇప్పుడు 'పెద్ద చెరువు' అంటున్నారు. చెరువు నీటితో నిండి కనులపండువుగా కనిపిస్తుంది. చెరువు లోపల కొంత దూరంలో పెద్ద గట్టు అనే మరో పెద్ద కొండ ఉంది.

దత్త పీఠంకు చెందిన శ్రీ వైకుంఠాశ్రమ పీఠ స్థాపకులు శ్రీ శ్రీ పరమ పూజ్య గొల్లపల్లి వెంకట దాసు గారు పాదచారులై ఈ ప్రాంతంలో పర్యటించారు. ఈ గుట్టలపై సేద తీరారు. వారి పాద స్పర్శతో ఈ భాగం పునీతమైంది. స్వామివారు తమకు తాముగా ఏదుల గ్రామానికి వచ్చి బ్రహ్మంగారి నాటకంలో వేషాలు వేసిన మశన్నతో సహా వారందరికీ బ్రహ్మోపదేశం చేశారు. అజ్ఞునులైనా యువకులలో ఆధ్యాత్మిక బీజాలు నాటారు. వారి ఆధ్యాత్మిక ఉన్నతికి కారణ భూతులయ్యారు. గురువాజ్ఞ చేత మశన్న గొల్లపల్లి వైకుంఠాశ్రమ రాతి స్తంభాలు, ఆంజనేయస్వామి విగ్రహం స్వయంగా చెక్కాడు. మశన్న రాజకీయ రంగప్రవేశానికి కూడా గుర్వాజ్ఞ లభించటం విశేషం. ఇంద్రుని శాపానికి గురైన అరుణాంగి, కోమలాంగి, శ్వేతాంగి కమలాంగి, రమణాంగి వరుణాంగి అనే కన్యలు శాప విమోచనం కోసం ఈ ప్రాంతంలోనే తపస్సు చేసినట్లు

ఐతిహ్యం ఉంది. 'అరుణాద్రి మహాత్మ్యం'లో దీన్ని శ్రీ దేవకాటమ రాజు నరసింహులు వివరించారు. నరసింహులుగారు మశన్నకు అనుగు శిష్యులు.

సుమారు యాభై ఏళ్ళక్రితం ఏదులలో బద్దుల పుల్లయ్య అనే యాదవుడు అమాయకంగా, లోకజ్ఞానం లేని పిచ్చోడుగా తిరుగుతూ ఉండేవాడు. అతను చనిపోయిన తర్వాత అతనిలో భగవంతుడావహించిన 'బ్రహ్మ పిచ్చి' ఉందని గ్రహించారు ఊరి జనం. అంటే పరమహంస లక్షణాలు ఉండేవన్నమాట పుల్లయ్యకు. ఇన్ని విశేషాలు ఇక్కడ ఉండటం వల్లనే ఆలయానికి అనువైన ప్రదేశం అయింది యెర్ర గట్టు.

శ్రమదానంతో వీరాంజనేయ దేవాలయ నిర్మాణం

ఏదుల గ్రామంలో చైతన్యం పెరిగింది. భక్తీ ప్రవహించింది. పేద జనంలో ఏమైనా వీరాంజనేయ స్వామి దేవాలయం నిర్మించి తీరాలి అనే సంకల్పం బలీయమైంది. జట్లు జట్లుగా ఏర్పడ్డారు. కొందరు గుట్టను చదును చేశారు. కొందరు గుట్టపైకి రోడ్డు వేశారు. ఎత్తంగట్టు, రేవల్లి గట్టులలో దేవాలయానికి సరిపడా రాతి స్తంభాలు పైన కప్పే బండలు, గోడ తట్టటానికి రాయి తీసేవారు పగలూ రాత్రీ కష్టపడి పని చేశారు. రాత్రులలో పెట్రోమాక్స్ దీపాలు పెట్టుకొని నిరాటంకంగా పని చేశారు. డబ్బులు తక్కువై ఇబ్బందులేర్పడితే ఆ నాటి తెలుగుదేశం మంత్రి నాగం జనార్దన రెడ్డి సహాయం చేసి వెన్నుదట్టి ప్రోత్సహించేవారు. న్యాయంగా ఈ పనికి లక్షలాది రూపాయలు కావాలి. కాని వీరంతా మశన్న నాయకత్వంలో శ్రమదానం చేసి అతి తక్కువ ఖర్చుతో ఆంజనేయ దేవాలయం నిర్మించి చరిత్ర స్థాపించారు.

వీరాంజనేయ విగ్రహ నిర్మాణం

వీరాంజనేయ స్వామి విగ్రహం చెక్కటానికి మొగిలి మశన్న స్వయంగా పూనుకొన్నాడు. గుండెలో మనసులో ఆంజనేయుడు కొలువై ఉన్నాడు కనుక అతనికి అసాధ్యమన్నది లేనే లేదు. మశన్న బృందం వేములవాడ రాజ రాజేశ్వర దేవాలయంలో ఫ్లోరింగ్ రాళ్ళుమలచటం, పరచటం, మంచాల కట్టలోని వేయిస్తంభాల గుడి మండపం, కొల్లాపూర్‌లో మాధవ స్వామి దేవాలయంలో పని చేసిన అనుభవం ఉంది. కనుక పరమ నిష్టా గరిష్టుడై మశన్న మండలం రోజులలో అంటే నలభై రోజులలో చక్కని స్పూర్తిదాయకమైన

వీరాంజనేయస్వామి విగ్రహాన్ని మలిచి తన భక్తికి సమర్పణగా చేశాడు. మండపంలోని రాతి స్తంభాలపై డిజైనింగ్ చెక్కారు. మశన్న పెద్దల్లుడు అతని బృందం కూడా సహకరించారు. అందరి సహకారంతో మొగిలి మశన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయాన్ని యెర్ర గట్టుమీద నిర్మించాడు. దేవాలయ నిర్మాణంలో వృద్ధాప్యాన్ని లెక్క చేయకుండా జమ్ముల నారాయణమ్మ, కుమ్మరి బాలమ్మ, ఈడిగే బుచ్చమ్మ, ఉల్పాల తారకమ్మ, బుక్క గోపమ్మ, కావలి రత్నమ్మ మొదలైన నారీ శిరోమణులు నీళ్ళు మోసి వంటలు వండి శ్రమ చేసే వారిని ఆదుకొన్నారు అంబలి కుండలు, చద్ది మూటలు మోసి శ్రమజీవుల ఆకలి తీర్చేవారు. పని ఎంతకష్టమో ఈ చాకిరీ అంతకంటే కష్టమైనదీ, అతి విలువైనదీ కూడా.

రామాలయ నిర్మాణం

శ్రీ సూర్య బుచ్చన్న గౌడుకు చాలాకాలం నుంచి రామాలయం కట్టించాలనే కోరిక ఉండేది. ఈ విషయం మశన్నకు చెప్పారు గౌడు దంపతులు. మశన్న తలుచుకొంటే ఎదురేముంది. చక్కని రామాలయం నిర్మించి బుచ్చన్న కోరిక తీర్చాడు మశన్న. కొల్లాపూర్ బృందమూ శ్రమదానం చేశారు. 31-3-1998 శ్రీ సీతారామ లక్ష్మణ హనుమ విగ్రహ ప్రతిష్ట ధ్వజ ప్రతిష్ట జరిగింది. శ్రీ వీరాంజనేయ రామాలయ నిర్మాణాలకు ఎందరో భక్తులు ఎన్నో విధాలా ఆర్ధికాది సహకారం అందజేశారు.

నవ గ్రహ మండపం

వీర బ్రహ్మేంద్ర నాటకం వేసేవారంతా కలిసి 'వీరబ్రహ్మేంద్ర భక్త బృందం'గా ఏర్పడ్డారు. నాటకం వేయగా వచ్చిన డబ్బుతో నవగ్రహ ప్రతిష్ట చేసి దానిపై మండపం కట్టారు.

శివ పంచాయతనం

ఏదుల గ్రామ వాసి బ్రహ్మశ్రీ కాకనూరి కిష్టయ్య గారి పెద్ద కుమారుడు రామచందయ్య శర్మగారు సంతానం లేకపోవటంతో వారి ధర్మపత్ని పద్మమ్మగారు తమ వ్యవసాయ భూమిని అమ్మి వచ్చిన డబ్బుతో శివ పంచాయతన నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ట చేశారు. కర్నూలుకు చెందిన శ్రీ రామేశ్వర సిద్ధాంతి, సూగూరు రామేశ్వరశర్మ మొదలైన వేద పండితులచే

ఆగమోక్తంగా కార్యక్రమాలు జరిగాయి. శ్రీ ఏ.శేఖరరెడ్డి అనే భక్తుడు ఆంజనేయస్వామి పేరు మీదుగా 2000 సంవత్సరంలో ఒక గోమాతను సమర్పించాడు. సీతమ్మ తల్లిలాగా వర్ధిల్లుతూ భక్తుల పూజలనందుకొంటూ వరదాయినిగా వర్ధిల్లుతోంది.

హనుమద్దీక్ష

ప్రతి ఏడాది శ్రీ హనుమ దీక్ష చేసే స్వాములు శ్రమదానం చేసి దేవాలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దుతున్నారు. స్వామి కృపకు పాత్రులవుతున్నారు. 1999లో జయరాం గురూజీ మొదటిసారిగా 41 మందికి 'యెర్ర గట్టు వీరాంజనేయస్వామి మాలధారణం చేసి దీక్ష' నిచ్చారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం దీక్ష కొనసాగుతోంది. చుట్టుప్రక్కల గ్రామాల వారూ వచ్చి పాల్గొంటున్నారు. ఇప్పుడు దాదాపు వేయిమంది ప్రతి ఏడాదీ హనుమద్దీక్షలో పాల్గొని పునీతులవుతున్నారు. దుష్టగ్రహ బాధకు దూరం అవుతున్నారు. స్వామి కృపతో మనోభీష్టాన్ని నేరవేర్చుకొంటున్నారు.

శ్రీ హనుమజ్జయంతి

శ్రీ ఏదుల మశన్న నాయకత్వంలో భక్త బృందం హనుమద్దీక్షా స్వాములు ప్రతి వైశాఖ బహుళ దశమి శ్రీ హనుమజ్జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్నారు. 2008 నుండి ఈ కార్యక్రమం నాలుగు రోజులుగా జరుగుతోంది. మొదటి రోజు వీరభద్ర సేవ, రెండవ రోజు అగ్నిగుండ ప్రవేశం, మూడవ రోజు ఇరుముడి, నాల్గవ రోజు కలశ పూజ హనుమజ్జయంతి హనుమద్ గాయత్రి యజ్ఞం జరుపుతారు. ప్రతి ఏడాది రామాలయంలో శ్రీరామనవమికి సీతారామ కల్యాణాన్ని బుచ్చయ్య గౌడు కుమారుడు అశోక్ గౌడు దంపతులు చేస్తారు.

ప్రయాణ సౌకర్యం

గోపాల్‌పేట నుండి రేవల్లి మీదుగా నాగర్‌కర్నూల్ బస్సులన్నీ ఏదుల మీదుగా వెళ్తాయి. వనపర్తి వెళ్ళే ఆర్ టి సి బస్సులు కూడా ఎదులమీదుగా నడుస్తాయి. చక్కని ప్రకృతి, సువిశాలమైన ప్రాంతం, గొప్ప మహాత్మ్యం. మంచి నీటి వసతి, సులభ ప్రయాణ సౌకర్యం, వాస్తు, శాస్త్ర పూర్వక ఆలయ నిర్మాణం, మనోవాంచా ఫలసిద్ధినిచ్చే భక్తులపాలిటి కొంగు బంగారం అయిన

'ఏదుల ఎర్రగట్టు వీరాంజనేయ స్వామి'ని దర్శించి తరిద్దాం.

ఆధారం- శ్రీ దేవకాటమ రాజు నరసింహులు (సీనియర్ తెలుగుపండితులు-అచ్చంపేట-మహబూబ్ నగర్ జిల్లా) గారు రచించి నాకు ఆత్మీయంగా 28-12-2013న పంపిన గ్రంథం 'ఏదుల యెర్రగట్టు వీరాంజనేయ వైభవం'.❋

56) శ్రీ ఇష్టదైవ హనుమాన్-నిజాంపేట

హైదరాబాద్‌లో నిజాంపేటలో ఉన్న ఆంజనేయ దేవాలయం భక్తుల రద్దీతో ఎప్పుడూ కిక్కిరిసి ఉంటుంది. స్వామి మూర్తి బహు గంభీరంగా ఉండి ఆకర్షణీయమైన మనోభీష్ట దాయకంగా ఉండటం ప్రత్యేకత. శ్రీ వీరహనుమాన్ దేవాలయంగా, మారుతి దేవాలయంగా కూడా ఇది ప్రసిద్ధి చెందింది. రోడ్డుకు దగ్గరలోనే ఉండటంతో ప్రయాణానికి సౌకర్యంగా ఉండి దర్శనానికి చాలా అనువుగా ఉంటుంది. సుఖ సంతోష ప్రాప్తికి దుఃఖ దారిద్ర్య నిర్మూలనకు, పాప పరిహారాలకు, భవిష్యత్తులో సంతానానికి సౌభాగ్యానికి, అనువైన వధూవరులకోసం ఈ వీరాంజనేయ స్వామిని దర్శించి పూజించి మనోభీస్టాన్ని నేరవేర్చుకొంటారు.❋

57) శ్రీ వీరాంజనేయస్వామి చేతిలో 'కొయ్యగద'-మల్లంపేట

మంత్రం శాస్త్ర విధానం లో విగ్రహం నిర్మించిన శిల్పి

రాతి విగ్రహానికి కొయ్యగద ఏమిటి అని అనుమానం వస్తుంది. ఆ కొయ్యగదకు ఒక కథ ఉంది. 14వ శతాబ్దానికి చెందిన ప్రాచీన వీరాంజనేయ దేవాలయం హైదరాబాద్‌లో మల్లంపేట గ్రామంలో (బాచుపల్లికి దగ్గర) ఉన్న ఆంజనేయస్వామికి కొయ్యగద ఉండటం విచిత్రమే అయినా యదార్థం. ఎన్నో శతాబ్దాల క్రిందట మల్లాపురం గ్రామస్తులకు ఒక ఆంజనేయస్వామి దేవాలయం కట్టాలనే కోరిక కలిగింది. మంచి శిల్పి కోసం వెతికారు. అనుకోకుండా రుషిలాంటి ఒక శిల్పాచార్యుడు వారికి తారసిల్లాడు. ఆయనకు తమ మనసులోని కోరికను తెలియజేసి శ్రీ వీరాంజనేయమూర్తిని చెక్కి తమకు అందజేయమని అర్థించారు. ఆయన సరే అని కొంత గడువు కావాలని చెప్పాడు. గడవు పూర్తి అయిన తర్వాత వచ్చి అడిగితే ఇంకా విగ్రహం పూర్తికాలేదని వాయిదా వేశాడు. వాయిదా కాలమూ దాటి పోగానే మళ్ళీ ఆయన్ను చేరి పూర్తయిందా అని అడిగితే మళ్ళీ సమయం కావాలన్నాడు. ఇలా శిల్పి చుట్టూ తిరిగి తిరిగి విగ్రహం పూర్తికానందుకు కోపం వచ్చి ఆయన్ను గట్టిగా నిలదీశారు.

భూమిని చీల్చుకొని వచ్చిన శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహం

అప్పుడు శిల్పి "విగ్రహం తయారవుతోంది. తయారవుతుండగా ఎవరూ చూడరాదు. చూస్తే పని పూర్తికాదు" అని తేల్చి చెప్పాడు. ఆగ్రహావేశాలలో ఉన్న జనం శిల్పిని నానామాటలు అని దూషించారు. శిల్పి ఆగ్రహించి తన రాగి చెంబులోని నీళ్ళను నేల మీద చల్లాడు. అంతే అందరికి

ఆశ్చర్యం వేసేట్లు భూమి బ్రద్దలై దానిలో నుంచి శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహం బయటకు వచ్చింది. తాము శిల్పిని తప్పుగా అర్థం చేసుకోన్నామని గ్రహించి ఆయనను క్షమించమని వేడుకొన్నారు.

గద లేకుండా విగ్రహం-కొయ్యగద ఏర్పాటు

ఇంకా విగ్రహానికి ఏయే పనులు చేయాలి అని శిల్పాచార్యుడిని అడిగారు. "స్వామి గద తయారు కాలేదు. మీరు తొందరపడ్డారు. మంత్రం శాస్త్ర ప్రకారం విగ్రహం తయారు చేస్తున్నప్పుడు నరుల చూపు పడరాదు. పడితే విఘ్నం వాటిల్లుతుంది. కనుక ఇక ఆ పని జరగదు. కొయ్య గద తయారు చేయించి అమర్చి ప్రతిష్టించండి" అని చెప్పాడు. చేసేదిలేక గ్రామస్తులు కొయ్య గద తయారు చేయించే ఏర్పాట్లు చేసుకొన్నారు. ఆ విగ్రహాన్ని ఊళ్లోకి తీసుకొని వెళ్లి ప్రతిష్టించాలనుకొని తరలిస్తుండగా ఇప్పుడు ఆలయం ఉన్న చోటుకు వచ్చిన తర్వాత ముందుకు కదలలేదు. స్వామి ఇక్కడే ఉండాలను కొంటున్నాడని శిల్పాచార్యుడు వారికి చెప్పి అక్కడే వీరాంజనేయ స్వామిని ప్రతిష్టించి కొయ్యగద అమర్చి దేవాలయం నిర్మించమని చెప్పి వెళ్ళిపోయాడు. ఆయన కోసం ఎంత ప్రయత్నించినా మళ్ళీ కనిపించలేదు. ఇక్కడే స్వామిని ప్రతిష్టించి కొయ్య గద చేతిలో అమర్చి ఆలయం నిర్మించారు. శిల్పాచార్యుడు ఎక్కడి నుండి వచ్చాడో ఎక్కడికి వెళ్ళిపోయాడో ఎవరికీ అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలిపోయింది.

శిల్పాచార్యులు నివశించిన స్థలాన్ని 'దేవతల గుట్ట' అంటారు. అది మల్లంపేటకు సుమారు ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఉంది. శిల్పాచార్యులు తయారు చేసిన విగ్రహం చుట్టూ అనేక గుట్టలు, పొదలు ఉండేవి. మరి అక్కడి నుండి నుండి ఇక్కడికి విగ్రహంను ఆ రాళ్ళు రప్పలలో ఎలా తరలించారో తెలియని ఒక మిస్టరీ. వీరాంజనేయస్వామి ఏక శిలా విగ్రహమే. గద మాత్రమే కొయ్యతో చేసినది.

ఆలయ ప్రాచీనత

ఆలయంలో ఒక గంట ఉండేది. దానిపై శ్రీ ఆనంద నామ సంవత్సర మాఘ బహుళ పంచమి గురువారం తేది 24సం 1324 అని రాయబడి ఉండేదట ఆ గంటను దొంగలు ఎత్తుకు పోయారట. గంటపై ఉన్న తేదీ

వగైరా గంట సమర్పించబడిన తేదీయా లేక విగ్రహం ప్రతిష్టించబడిన తేదీయా అని ఇంకా సందేహంలోనే ఉంది. మల్లంపేట వీరాంజనేయస్వామి భక్తుల పాలిటి కొంగుబంగారం. భూత ప్రేత పిశాచాదుల బారినపడిన వారు స్వామిని దర్శించి అర్చిస్తే ఆ పీడలు తొలగిస్తాడని పూర్తి విశ్వాసం.

భాగవత మహాపురాణంలో వేద వ్యాస మహర్షి భారత దేశంలో 108 ఆంజనేయ విగ్రహాలు ప్రతిష్టించినట్లు ఉన్నదని అందులో ఒకటి మల్లంపేట శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహం అని. శ్రీమద్రామాయణం యుద్ధ కాండలో కాలనేమి అనే రాక్షసుని సంహరించే సందర్భంలో ఈ ఏకశీలా ఆంజనేయుని వివరం ఉందని శ్రీ వేదాంతి శ్రీనివాసాచార్యులు తెలియజేస్తున్నారు.

'పంచనామ భీమాయ-కాలనేమి హరాయచ-మల్లంపేట్ గ్రామ నివాసాయ-వీరాంజనేయతే నమః'❋

58) శ్రీ సువర్చలాంజనేయ దేవాలయం-ఎల్లెందు

ఖమ్మం జిల్లాలో ఎల్లెందు జంక్షన్‌లో శ్రీ సువర్చలాసహిత ఆంజనేయస్వామి దేవాలయం గొప్ప చరిత్ర కలిగి ఉంది. సింగ రేణి కాలనీ జెనరల్ మేనేజర్ పురుషోత్తం గారి భార్యకు కలలో శ్రీ ఆంజనేయస్వామి దర్శనమిచ్చి తనకు ఒక దేవాలయాన్ని నిర్మించమని కోరాడు. వెంటనే పురుషోత్తం దంపతులు ఉన్న వనరులతో శ్రీ సువర్చలాంజనేయ దేవాలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి సింగరేణిలో పనిచేసే కొద్ది మంది అధికారులు మాత్రమే ధనవ్యయం భరించి అత్యంత సుందరంగా కట్టించారు. ఎన్నో ఏళ్ళుగా అక్కడ ఆంజనేయస్వామి ఆలయం లేని కొరతను తీర్చారు. స్వామికి మొక్కుకొని మనసులోని కోర్కెను తెలియజేస్తే వెంటనే అది నేర వేరుతుందని అఖిలజనుల నమ్మకం. సికందరాబాద్ రాజమండ్రి గుంటూరులలో ఉన్న సువర్చలాన్జనేయ దేవాలయ తర్వాతా ఎల్లెందు ఆలయానికే మళ్ళీ అంతటి ప్రాశస్త్యం కలిగింది. సిందూర ప్రియుడైన హనుమ మనశ్శాంతిని ప్రసాదిస్తాడు. సిందూర వృక్షాలను మహారాష్ట్రలో పెంచుతారు. శ్రీ సువర్చల ఆంజనేయ స్వాముల కల్యాణం ముహూర్తాన్ని దేవ గురువులు బృహస్పతులవారు 'జ్యేష్ఠ శుద్ధ దశమి భానువారం (ఆదివారం) ఉత్తరా నక్షత్ర యుక్త సింహ లగ్నం'గా నిర్ణయించారు. ఆనాడు 32 కోట్ల దేవతలు వీరి వివాహాన్ని తిలకించారని సూర్య భగవానుడే స్వయంగా ఆంజనేయస్వామి పాదాలు కడిగి సువర్చలాదేవిని ఆంజనేయ స్వామికి కన్యాదానం చేశాడని పరాశర సంహిత తెలియ జేస్తోంది. కనుక ఇక్కడ స్వామివార్ల కల్యాణం అదే ముహూర్తానికి నిర్వహించటం ఆచారం. ఎల్లరూ ఎల్లెందు వెళ్లి ఎలుగు బంటి నాయకుడు జాంబవంతుని శిష్యుడు, ప్రియమిత్రుడు అయిన శ్రీ సువర్చలాంజనేయ స్వామిని దర్శిద్దాం.❋

59) శ్రీ ఆంజనేయ దేవాలయ సమూహం-బోధన్

బోధన్ అంటే ఒకప్పటి ఏక చక్రపురమే. బహుధాన్య అనేది బోధన్‌గా మారింది. బహుధాన్య కాలడి అంటే అత్యంత విలువైన ధాన్య సమృద్ధి అని అర్ధం. ఇక్కడ ధాన్యపు పంట విస్తారం కనుక ఆ పేరు సార్ధకమయింది. మహా భారతంలో బకాసుర వధ కథ ఈ ఏక చక్ర పురం అనే బోధన్లోని రాకాసి పేటలోనే జరిగింది. ఇక్కడే పాండవులు బ్రాహ్మణ కుమారులుగా మారువేషంతో తల్లి కుంతీదేవితో ఒక బ్రాహ్మణ కుటుంబం వారి ఇంట అతిధులుగా ఉన్నారు. యాయవారం చేసి పాండవులు జీవించారు. నగరానికి దగ్గరలో ఒక కొండ గుహలో బకాసురుడు ఉండేవాడు. ఊరి మీద పడి విచక్షణా రహితంగా జనాన్ని తినేస్తుంటే ఊరిజనం వాడికి రోజూ ఆహారం పంపే ఏర్పాటు చేసుకొన్నారు. తర్వాత భీముడు ఆహారంగా వెళ్ళటం వాడిని చంపేయటం నగరానికి భయం లేకుండా చేయటం మనకు తెలిసిన కథే.

నిజామాబాద్ జిల్లాలోని ఈ బోధన్‌లో షుగర్ ఫాక్టరీ ఉంది. ఇక్కడ ముఖ్యమైన దేవాలయం ఏక చక్రేశ్వర దేవాలయం. ఇందులోని శివలింగం అతి పెద్దది. దక్షిణ భారతంలో ఇంత పెద్దలింగం ఇంకా ఎక్కడా లేదు అంటారు. దానితోపాటు చాలా దేవాలయాలున్నాయి. ఇక్కడి రేణుకా దేవి దేవాలయం పన్నెండు వందల సంవత్సరాల నాటిది. కార్తికేశ్వర, నగరేశ్వర దేవాలయాలు ప్రసిద్ధమైనవే. బొజ్జ గణపతి, లక్ష్మీ వేంకటేశ్వరాలయం చూడ దగినవి.

బోధన్‌లో అనేక ఆంజనేయ దేవాలయాలు ఉండటం ఒక ప్రత్యేకత. మైన్యం మారుతీ హనుమాన్, హనుమాన్ టెకడి, భుజముని గుట్ట హనుమాన్, ఆనందహనుమాన్, పెద్ద హనుమాన్, దక్షిణ ముఖి హనుమాన్, కొండెంగ హనుమాన్, రామ మందిర హనుమాన్, లక్ష్మీ వెంకటేశ్వర మందిర హనుమాన్ దేవాలయాలు చారిత్రిక ప్రసిద్ధి చెందిన ఆలయాలు అందరు తప్పక దర్శించాల్సినవి.❋

60) శ్రీ అభయాంజనేయ దేవాలయం-భద్రాచలం

ఖమ్మం జిల్లా భద్రాచలంలో శ్రీ సీతారామమూర్తి వారి ఆలయం జగద్విఖ్యాతమైనది. భక్త రామదాసు నిర్మించిన ఆలయం. ఇక్కడే శ్రీ రామ పాదారవింద భక్తుడు శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. యాత్రికులు తప్పక దర్శించాలి. ఒక ట్రస్ట్ ఆధ్వర్యంలో 1998లో ఈఆలయం నిర్మించబడింది. కళ్ళు చేదిరే మార్బుల్ ఫ్లోరింగ్ ఉంది. అనేక దేవీ దేవతా విగ్రహాలను సహజ సుందరంగా నిర్మించారు. మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువ ఆ రోజు స్వామికి వడమాల వేస్తారు. శ్రీరామ నవమి శ్రీ హనుమజ్జయంతిలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. సిమెంట్‌తో కట్టిన దేవాలయం అయినప్పటికీ కొయ్యతో నిర్మించినంత సున్నితంగా ఆలయ నిర్మాణం ఉండటం మరో వింత. అక్టోబర్ నుంచి మార్చి దాకా ఆలయం చూడటానికి మంచి సమయం.❋

61) శ్రీ హనుమ సికందరాబాద్-స్కంధగిరి

సికందరాబాద్ పద్మారావు నగర్‌లో స్కందగిరిపై కంచి కామకోటి పీఠంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం శ్రీ ఆది శంకరాచార్య స్వామి దేవాలయం చూడతగినవి. సమీపంలోనే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కోవెల ఉంది. తమిళ కాలెండర్ ప్రకారం ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీ హనుమజ్జయంతిని జనవరిలో జరుపుతారిక్కడ. ఆ సమయంలో శ్రీ హనుమకు వివిధ అలంకారాలు చేస్తారు. గొప్ప ఉత్సవం నిర్వహిస్తారు. మార్గశిర శుద్ధ త్రయోదశి రోజున శ్రీ హనుమద్ వ్రతాన్ని వైభవంగా నిర్వహిస్తారు. స్వామికి తమలపాకు పూజ ఇక్కడ గొప్ప విశేషం. నిలువెత్తు విగ్రహమూర్తి అయిన స్వామి చాలా ఆకర్షణీయంగా ఉంటాడు. భక్త వరదుడని హనుమను భక్తితో అర్చిస్తారు.

శంకర మందిరంలో శ్రీ శంకరాచార్య విగ్రహం పరమ ఆకర్షణీయంగా ఉంటుంది. గురుపాదుకలను అత్యంత భక్తితో అర్చిస్తారు. గణేశ మందిరమూ ఉంది. యజ్ఞాలు యాగాలు నిర్వహిస్తారు. సమావేశ మందిరం విశాలంగా ఉండి ప్రసంగాలకు అనుకూలంగా ఉంటుంది. హనుమాన్ జయంతితోపాటు శ్రీ శంకర జయంతి నవరాత్రి ఉత్సవాలు జరుపుతారు. గురువారం నాడు భక్తజనసందోహం ఎక్కువగా ఉండటం విశేషం.❋



62) శ్రీ ఆత్మలింగ అభయాంజనేయ స్వామిదేవాలయం-పెండల్వాడ

తెలంగాణా అదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్‌కు 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెండల్వాడ కుగ్రామంలో శ్రీ ఆత్మ లింగ అభయాంజనేయస్వామి దేవాలయముంది. దీనికి ఒక విచిత్ర కథ ఉంది. ఒకప్పుడు ఈ దేవాలయం పెండల్వాడకు 8 కిలోమీటర్లలో ఉన్న సైద్పూర్సంఘిలో ఉండేది. 200 ఏళ్ళ క్రితం వచ్చిన భారీ వరదలలో ఆ ఆలయం నీటిలో కొట్టుకుపోయింది. ఆంజనేయస్వామి విగ్రహం పెండల్వాడలో ఉన్న 'పెన్గంగా నది' తీరానికి చేరింది. విగ్రహం తిరగబడి ఉండటంతో అదొక బండరాయి అనుకొని గ్రామస్తులు దానిపై బట్టలు ఉతుక్కునే వారు. ఒకరోజు ఆ గ్రామపెద్దకు స్వామి కలలో కన్పించి తాను నది ఒడ్డున ఉన్నానని, బయటకుతీసి ఆలయం నిర్మించి, నిత్య పూజాదికాలు నిర్వహిస్తే గ్రామానికి అన్నిరకాల శుభం జరుగుతుందని చెప్పాడు. మర్నాడు అయన స్థానికుల సహాయంతో నదిలో ఉన్న ఆంజనేయ బండను బయటికి తీశారు. అది దివ్య మంగళ స్వరూపమైన భారీ ఆంజనేయస్వామి విగ్రహమని తెలుసుకొని, ఇన్నాళ్ళూ గుర్తించక చేసిన పొరబాటుకు క్షమించమని ప్రాధేయపడ్డారు. సామూహికంగా స్వామికి ఆలయ నిర్మాణంచేసి స్వామిని ఆగమ విధానంలో శివరాత్రిరోజులలో ప్రతిష్టించారు. స్వామి మహిమ వ్యాప్తి చెంది దర్శించటానికి తండోపతండాలుగా వస్తున్నారు. తమ కోర్కెలు స్వామికి నివేదిస్తే తప్పక సఫలమవుతాయని గాఢ విశ్వాసం భక్తులలో ఉన్నది.

సింధూర వర్ణంతో భవ్యశిలపై దివ్యతేజో విరాజితంగా ప్రసన్న వదనంతో దర్శనమిస్తాడు స్వామి. 8 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు విగ్రహమూర్తి. కుడిచేయి పైకెత్తి అందులో ఆత్మలింగాన్ని చూపిస్తూ శ్రీ హనుమ పరమ విచిత్రంగా మనోహరంగా కనిపిస్తాడు. రజతకిరీటం, శరీరమంతా వివిధ పుష్పహార శోభితంగా

ధీర గంభీరంగా కనువిందు చేస్తాడు. స్వామి ఎడమ కాలి కింద అణగదొక్కబడిన శనీశ్వరుడు కనిపిస్తాడు. చేతిలో ఆత్మలింగం ఉండటం వలన 'ఆత్మలింగ అభయాంజనేయస్వామి'గా ప్రసిద్ధుడయ్యాడు. ప్రతి మంగళ, శనివారాలలో స్వామికి అభిషేక మహోత్సవం అద్వితీయంగా నేత్రానందంగా జరుగుతుంది. అప్పుడు స్వామి నిజరూప దర్శనంచేసి భక్తులు పులకిస్తారు. పూర్వాభాద్ర నక్షత్రజాతకుడైన ఆంజనేయస్వామి సర్వశక్తి సంపన్నుడు. స్వామిని పూజిస్తే వీర, ధైర్య, శౌర్య, శక్తి, విజ్ఞానాలు లభిస్తాయని నమ్మకం. రుద్రతేజస్సుతో జగద్రక్షణ కోసం ఆవిర్భవించినవాడు, శివుని అష్టమూర్తి రూపాలలో ఒకడు ఆంజనేయుడు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆలయం కనుక మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా ఇతర జిల్లాలనుండి నిరంతరం భక్తులు స్వామి దర్శనానికి తరలి వస్తారు. సీతా రామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలతో ఉన్న దేవాలయం గర్భాలయానికి దగ్గరలోనే ఆలయ ప్రాంగణంలో ఉంది. పాండురంగ ఆలయం కూడా ఇక్కడ ఉంది. ఏటా సీతారామ వసంతోత్సవం, కల్యాణం పట్టాభిషేక ఉత్సవం జరుగుతాయి. ధనుర్మాసపూజలు, కార్తీకదీపోత్సవం ఇక్కడ ప్రత్యేకం. శ్రీరామ నవమి ఉత్సవం రంగ రంగ వైభవంగా చేస్తారు. ప్రక్కనే ఉన్న శివాలయంలోని పంచాతయన శివలింగమైన ఆత్మలింగానికి నిత్యాభిషేకాలు నిర్వహిస్తారు. ముగ్ధమనోహరమైన పాండురంగస్వామి దర్శనం సకల పాపహరణం. భజనలు, సంకీర్తనలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి.

హనుజ్జయంతికి, శివరాత్రికి ఇసుకవేస్తే రాలనంత జనసందోహం వస్తారు. హనుమాన్ దీక్ష ఇక్కడ తీసుకుంటారు. దీక్షపూర్తి అయి మనోభీష్టం నేరవేరాక పునర్దర్శనంచేసి శ్రీ వీరాంజనేయస్వామికి కృతజ్ఞత ప్రకటించుకొంటారు. భక్తులు డప్పులు మోగించుకొంటూ ఆలయ ప్రదక్షిణచేసి, తర్వాత గర్భాలయంలో ఉన్న శ్రీ ఆత్మలింగ అభయాంజనేయ స్వామి దర్శనం చేయటం ఇక్కడ ప్రత్యేకత. ఏటా రెండుసార్లు ఇక్కడ జాతర జరుగుంది. మహాశివరాత్రినాడు ప్రారంభమైన జాతర అయిదు రోజులపాటు చేస్తారు. భక్తుల భయాన్ని తొలగించి అభయమిచ్చే వరదుడుగా ఈ వీర ధీర హనుమాన్ప్రత్యక్షదైవంగా ఉంటాడు. సర్వశక్తులకు ప్రతీకగా, మనోసిద్ధి ప్రదాతగా మానసిక రుగ్మతలను దూరం చేసేవాడుగా స్వామి ప్రసిద్ధుడు. నిత్యచైతన్యస్ఫూర్తి ఐన శ్రీ పెండల్వాడ శ్రీ ఆత్మలింగ అభయాంజనేయస్వామిని దర్శించి తరించాలి. చేతిలో శివుని ఆత్మలింగంతో ఉన్న ఆంజనేయ విగ్రహం ఇదొక్కటే. అందుకే అంత మహిమాన్వితుడు స్వామి. ❋



63) శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం-మద్దిమడుగు

మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూల్ జిల్లా, పదర మండలంలోని మద్దిమడుగు గ్రామంలో ఉన్న ఆలయం. పబ్బతి అంటే గిరిజనుల భాషలో ప్రసన్న, శాంతమూర్తి అని అర్థం.

అమ్రాబాద్ నుండి 45 కిలోమీటర్ల దూరంలో, ఇప్పలపల్లి నుండి 09 కిలోమీటర్లదూరంలో నల్లమలలో తట్టు, అటవీ ప్రాంతంలో స్వామివారు స్వయంగా వెలసినట్లు ప్రతీతి. చైత్రశుద్ధపౌర్ణమి, కార్తీకమాసాలలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

ఈ ప్రాంతం హైదరాబాదుకు 186, మహబూబ్‌నగర్‌కు 147, అచ్చంపేటకు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది.

స్థలపురాణం-విశిష్టత

పూర్వం ఇక్కడ ఇద్దరు వ్యక్తులు బట్టలుతుక్కుంటూ వుండేవారట. వారు బట్టలు పిండి పక్కనేవున్న బండమీద వేసేవారుట. అలా వేసినప్పుడల్లా వేసినవారికి కాళ్ళు నెప్పులూ వగైరాలతో బాధపడే వారట. ఏమటా అని ఒకసారి ఆ రాతిని పరిశీలనగా చూస్తే స్వామి ఆకారం కనబడిందట. వెంటనే

తమ తప్పు తెలుసుకుని, ఆ విగ్రహాన్ని నిలబెట్టి, దీపారాధన చేసి వారికితో చిన పూజలు చేసి, అక్కడ దొరికిన సామాగ్రితో నాలుగుగోడలు, పైన కప్పు వేశారట. సరిగా లేకపోవటం వల్ల ఆ గోడలు, కప్పూ కూలినా, స్వామి విగ్రహానికి ఏమీ కాలేదుట. ఇంకొక కథనం ప్రకారం, స్వామి స్వయంభూ. చెట్టు తొఱ్ఱలోంచి ఉద్భవించారు. నైఋతి దిక్కుగా, కొంచెం వంగినట్లు వుండే స్వామి విగ్రహాన్ని నిటారుగా నిలబెట్టాలని ఎంత ప్రయత్నంచేసినా కుదరలేదు. ఇప్పటికీ విగ్రహం కొంచెం ఒరిగినట్లే వుంటుంది. ఈ స్వామి గురించి అందరికీ తెలిసింది శ్రీ మాణిక్ సింగ్ బాపూజీ వల్ల. ఈ ఆలయంలో ఆ బావూజీ ఫోటో కూడా వుంది. ఆ బావూజీనే ఆలయం వెలుపల ధుని ఏర్పాటు చేశాడు. ఆ ధుని అలాగే 365 రోజులూ వెలుగుతూనే వుంటుందట. అది స్వామి మహత్యం అని చెబుతారు. ఇక్కడ వుండే లంబాడీ వారికీ, చెంచులకీ ఈ స్వామి మీద అపరిమితమైన భక్తి.

పూజలు

చైత్ర శుద్ధ పౌర్ణమి, కార్తీక మాసాలలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా హనుమద్గాయత్రి యజ్ఞం చేస్తారు. శని, మంగళ వారాలలో భక్తులరద్దీ ఎక్కువగా ఉంటుంది. బెల్లం, గోధుమ రొట్టెలతో చేసిన ప్రత్యేక ప్రసాదాన్ని భక్తులు స్వామివారికి నైవేధ్యంగా సమర్పిస్తుంటారు.

దీక్ష

1992లో గురుస్వామి జయరాం ఆధ్వర్యంతో 15 మంది భక్తులతో మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దీక్ష ప్రారంభమైంది. చుట్టుపక్కల జిల్లాలనుండి కూడా ప్రజలకు ఇక్కడకు వచ్చి కార్తీకమాసంలో ఈ దీక్ష స్వీకరిస్తారు. మాలలు ధరించి ఈ దీక్షను చేపట్టిన స్వాములు 41 రోజులు నియమ నిబంధనలతో ప్రతి రోజు తెల్లవారుజామున, సాయంత్రం చన్నీటి స్నానంచేసి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని చేపట్టి, దీక్షాకాలం మద్దిమడుగులో జరిగే మహాయజ్ఞంలో పాల్గొంటారు.

ఆలయం మరీ పెద్దది కాదు. కానీ అపురూప మహిమ కలది. ఆలయం చేరుకోగానే ముందు కనబడింది ఆలయం వెలుపల పెద్దధుని.

ఏదైనా యజ్ఞంలాంటిది జరిగిందేమో అనుకున్నారట. కానీకాదుట. ఆ ధుని అలాగే 365 రోజులూ వెలుగుతూనే వుంటుంది. పెద్ద వాన వచ్చినప్పుడు కూడా ఏదో తాత్కాలిక ఆఛ్ఛాదన వేస్తారుగానీ మరీ షెడ్డులాగా ఏమీలేదు. అయినా ఆ ధుని ఇప్పటిదాకా ఎప్పుడూ ఆరలేదు. అది స్వామి మహత్యం అంటారు. అక్కడ దొరికిన సామాగ్రితో నాలుగు గోడలు, పైనకప్పు వేశారు. సరిగా లేకపోవటంవల్ల ఆ గోడలు, కప్పూ కూలినా, స్వామి విగ్రహానికి ఏమీకాలేదు. స్వామి మహత్యం అందరికీ తెలియజేయటానికే అలా జరిగిందనుకున్నారు.

వారు ఇక్కడ హోమగుండంలో ఒక ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. గోధుమపిండి, బెల్లం కలిపి 'మలేజా' అని తయారు చేస్తారు. దానిని ఇక్కడి కొచ్చిన ప్రతివారూ ధునిలో నివేదన చేస్తారు. ఇద్దరు స్త్రీలు ప్రదక్షిణలు చేస్తూ, ఈ మలేజా వుండలు చిన్నవి హోమంలో వెయ్యట ఇదేకాక స్వామికి పాదుకలు సమర్పించటం కూడా ఇక్కడి భక్తులకు అలవాటు. శనివారంనాడు ఇక్కడికి భక్తులు బాగా వస్తారు. ఇక్కడే వండుకుని తిని, రాత్రి నిద్ర చేసి మరునాడు వెళ్తారు.

స్వామికి కుడి పక్కన ఎదురుగా శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామిని ప్రతిష్టించారు. అతులిత మహిమాన్వితుడైన ఈ స్వామి ఆలయానికి ఆదాయం బాగానే వస్తుంది. 6 సంవత్సరాల క్రితం దేవాదాయ శాఖ వారు ఈ ఆలయాన్ని తమ అధీనంలోకి తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వేదం చదువుకున్న విద్యార్థిని రోజూ ఇక్కడ వేదం చదవటానికి నియమించారు. ఆ విద్యార్థే ఈ ఆలయ వివరాలు చెప్పారు. అమాయక గిరిజనులు అమిత విశ్వాసంతో కొలిచే ఈ స్వామి ఆలయానికి హైదరాబాదు నుంచీ రోజూ మూడు బస్సులు నడుపబడుతున్నాయి. దేవరకొండ, అచ్చంపేట నుంచి కూడా బస్సులు న్నాయి.*

64) శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయము-ఉరుకొండపేట

ఊరుకొండపేటలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయము అతి పురాతనమైనది, రోగాల నుండి ఉపషమనం కలిగించు దేవాలయంగా ప్రసిద్ధిచెందింది. ఈ ఆలయమునకు రెండువైపులా రెండు ఎత్తైనకొండలు ఉండుటచే వాటికి ఊరుకొండలు (పెద్దకొండలు) అని పిలిచెవారు. ఆ కొండల మధ్యలో వెలసిన గ్రామమే ఊరుకొండపేట.

ఆలయచరిత్ర :

నిజాంపాలనలో శిల్పులు తమ గ్రామాల్లో దేవాలయాలు నిర్మించుకోవడానికి విగ్రహాలకోసం కొండల వెంబడి వెతుకు సమయంలో ఊరుకొండపేట కొండపై లభించిన పెద్దశిలపై ఆంజనేయస్వామి విగ్రహాన్ని మలిచారు. ఆ శిల్పాన్ని గట్టు ఇప్పలపల్లికి తరిలించే సమయంలో ఊరుకొండపేట వద్ద విగ్రహం తీసుకొని వెళ్తున్న బండి కదలడానికి మొడికేసి ముందుకు సాగలేదు. వారు ఆ రాత్రికి అక్కడే విశ్రమించారు. శిల్పి భోజరాయలకు స్వామి కలలో కనిపించి విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించాలని ఆదేశించినట్లు, స్వామి ఆజ్ఞానుసారం అక్కడే విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు కథ ప్రచారంలో ఉంది.

కొండపై కోనేరు: అభయాంజనేయస్వామి ఆలయానికి తూర్పు దిశలో కొండపై కోనేరు ఉంది. ఆ కోనేటిలో స్నానం చేసి స్వామి చుట్టూ 21 రోజుల ప్రదక్షిణ చేస్తే ఎలాంటి ఆపదలో ఉన్నవారికైనా క్షేమం కలుగుతుందని భక్తుల నమ్మకం.

భోజరాయపల్లికి అతిసమీపంలో ఆనాడు అమ్మపల్లి అనే గ్రామం ఉంది. ఆ రెండు గ్రామాల ప్రజలు ఏదో విషయమై తగాదాపడి వారి గ్రామమును వీరూ, వీరి గ్రామంను వారు తగుల పెట్టుకోవడంతో భోజరాయలు గ్రామం ఖాళీ చేయించి గట్లనడుమ ఇప్పచెట్లలోనూ తన గ్రామం నిర్మింప చేసాడు. అదే నేటి గట్టుఇప్పలపల్లి. భోజరాయలు శివోపాసకులు అయినందున గట్టుఇప్పలపల్లిలో కాళికాదేవితోపాటు పంచలింగాలను ప్రతిష్ఠించారు.

శివుని విగ్రహం: శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో 24 అడుగుల ఎత్తుగల శివుని విగ్రహం ఉంది. అభయాంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులు శివుని విగ్రహాన్ని కూడా దర్శిస్తారు. ప్రతిసంవత్సరము పుష్య బహుళ ద్వాదశికి అనగా ఇంగ్లీషు క్యాలెండర్ ప్రకారం జనవరి లేదా ఫిబ్రవరి మాసాలలో శ్రీ ఆంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవాలు 8 రోజులపాటు ఘనంగా జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకి చుట్టుప్రక్కల గ్రామల నుండే కాకుండా జిల్లా నలుమూలల నుండి అలాగే మహబూబ్ నగర్, గద్వాల (జోగులాంబ), వనపర్తి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలనుండి కూడా పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించుకుంటారు.

ఊరుకొండపేట గ్రామము ఊర్కొండమండలం, జడ్చర్ల నియోజకవర్గం నాగర్కర్నూల్ జిల్లాలో కలదు, కాని కల్వకుర్తి నుండి 12 కిలోమీటర్ల దూరంలో ఉండటంవల్ల ఎక్కువ రాకపోకలు కల్వకుర్తి నుండే జరుగుతాయి. కల్వకుర్తి నుండి ప్రతిరోజు తెలంగాణా రవాణ సంస్థ బస్సులు నడుస్తాయి. మొదటి బస్సు ఉదయం 7 నుండి, మరియు చివరి బస్సు రాత్రి 7కి ఉంది.

ఊరుకొండపేట ముఖ్యంగా రెండు విషయాలకి ప్రసిద్ధి.

1. ఇక్కడ జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయము ఉంది.

2. రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన ఎముకల ఆసుపత్రి కలదు. (అనగా కాళ్ళు చేతులు విరిగినవారికి గొల్లభీమయ్య మరియు వారి తనయులు ఇక్కడ కట్లుకడతారు)❋

65) శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం-మక్తల్

మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ పట్టణంలో వెలసిన మహిమన్వితమైన ఆంజనేయ క్షేత్రం పడమటి ఆంజనేయస్వామి దేవాలయం. జాంబవంతుడు ఈ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించాడు. ఇక్కడ స్వామివారు పడమటవైపు కనిపిస్తుంటారు. మన దక్షిణ భారతదేశంలో ఎక్కడా స్వామివారు పడమటకు ఉండరు. అందుకేది దీనిని 'పడమటి ఆంజనేయస్వామి దేవాలయం' అని కూడా అంటారు. ఈ క్షేత్రం చాల మహిమన్వితమైనది. కష్టాలు వచ్చినప్పుడు కానీ, దుష్టశక్తులబారి నుంచి కాపాడుకోడానికి స్వామివారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని స్థలపురాణం!!

హైదరాబాద్ నుండి మక్తల్‌కు చాలా బస్సు సర్వీస్‌లున్నాయి.

దేవాలయంలో జరిగే ప్రత్యేక పూజలు: చైత్రపూర్ణిమ (హనుమాన్జయంతి) జాతరమహోత్సవం (మార్గశిర శుద్ధ త్రయోదశి నుండి మార్గశిర బహుళ సప్తమి వరకు) రథోత్సవం (మార్గశిర శుద్ధ పూర్ణిమ రోజున) ఆకర్షణీయంగా జరుగుతాయి. ❋

66) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-కోదండరాంనగర్

భక్తజనకోటికి ఆపద్బాంధవుడు, కోరిన కోరికలు నెరవేర్చే దయాహృదయుడు. శ్రీ కోదండరామ్ నగర ప్రసన్నాంజనేయుడు. 1978వ సంవత్సరంలో కాలనీ వాసులచే నిర్మించబడిన దేవాలయము శ్రీ ప్రసన్నాంనేయస్వామి కృపతో దిన దినాభివృద్ధి చెందుతూ ప్రతి సంవత్సరం పెద్ద ఉత్సవాలు జరుపుకునే స్థాయికి ఎదిగింది. ఆలయప్రాంగణంలోనే నవగ్రహాల ప్రతిష్ట, ధ్యాన కేంద్రం, పూజారులకు నివాసగృహం ఇలా ప్రసన్నాంనేయస్వామి దేవాలయం అభివృధికి చిరునామాగా మారి విశిష్ట దేవాలయంగా పేరు గాంచినది.

2016 దేవాలయ ప్రాంగణము అభివృద్ధికై ప్రక్కన గల 250 గజాల స్థలము రూపాయులు 80 లక్షలతో సేకరించుట జరిగినది. అనేకమంది భక్తులు విరాళములతో అది సాధ్యమైనది. స్వామిదయతో ఆ స్థలమునందు ప్రస్తుతం నిర్మాణము చేపట్టడం జరిగినది.❋

67) చిన్న హనుమంతుడు-బడీచావడి

బడిచావిడీలో, పోలీస్ స్టేషన్ ప్రక్కన ఆలయం వుంటుంది. చాలా చిన్న దేవాలయము. రావిచెట్టు చుట్టూ కట్టి వుంటుంది. చెట్టుకి ఓ పక్కన దాదాపు కింద విగ్రహం వుంది. అన్ని దేవాలయాలలోలా కాకుండా చాలా చిన్న విగ్రహము. కొంచము కిందికి వంగే నమస్కరించుకోవలసి వుంటుంది. ప్రదక్షణ చేసేటప్పుడు వెనుకవైపు చిన్న సందులా వుంటుంది. ఒకొక్కరే వెళ్ళగలరు. ఈ దేవాలయము 100 సంవత్సరాల క్రితముది అన్నారు అక్కడున్న పూజారి. మధ్యలో కొన్ని సంవత్సరాలు ఈ గుడిని మూసేసి వుంచారు. మళ్ళీ ఈ మధ్యనే తెరిచారట.❋

68) శ్రీ హనుమాన్ గుడి- ఖైరతాబాద్

ఖైరతాబాద్, నిలోఫర్ హాస్పిటల్ దగ్గర ఓ హనుమాన్ దేవాలయము వుంది. అది బహుశా మార్వాడిలు కట్టించారనుకుంటాను. చాలా పెద్ద ప్రాంగణములో వుంది. గుడి కూడా కొంచము పెద్దదే. ఆ ప్రాంగణములోకి ప్రవేసిస్తునే మన్సంతా ప్రశాంతముగా అవుతుంది. ఈ దేవాలయములో ప్రతి గురువారము, ఆదివారము ఒక పూజారి, పిల్లలకు దిష్టి తీస్తాడు. పిల్లలకనే కాదు, పెద్దలకు కూడా తీస్తాడు.❋

69) స్వయంభు శ్రీ వీరాంజనేయ దేవాలయం-కందుకూరు

హైదరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో కందుకూరు దగ్గర ఘట్టుపల్లిలో స్వయంభు శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం 500 ఏళ్ల నాటిది. క్షేత్రపురాణం ప్రకారం ఈ స్వామి విగ్రహం 500 సంవత్సరాల క్రితం కొంతమంది స్థానికులకు కనపడింది. ఇక్కడి నుంచి మహేశ్వరం తీసుకొనివెళ్లి ప్రతిష్ఠించాలని ప్రయత్నించారు. హనుమమూర్తి కదలలేదు. తర్వాత ఒక స్థానికుని కలలో కన్పించి తాను ఇక్కడే ఉంటానని చెప్పాడు. ఇక కదిలించే ప్రయత్నం చేయకుండా, ఇది స్వయంభు విగ్రహమని భావించి ఇక్కడే దేవాలయం నిర్మించి స్వామిని ప్రతిష్ఠించారు. స్వామి భారీమూర్తి. గంధసిందూరం పూతతో కప్పబడి ఉంటాడు. దేవాలయం ఎండోమెంట్ అధీనంలో ఉన్నది.❋

70) శ్రీ అష్టదిక్పాలక ఆంజనేయ దేవాలయం-యల్లందు

ఖమ్మంజిల్లా యల్లందులో అష్ట దిక్పాలక ఆంజనేయ విగ్రహం ప్రతిష్ఠాపన జరిగింది. 1887లో దాలినేలు అనే ఆయన భక్తబృందంతో కలిసి గుడి కట్టించాడు. 1939లలో గుడిని అంబాసత్రంవారికి ధారాదత్తం చేశారు. వాళ్ళు దీనిపై ఉపేక్షభావంతో ఏమీ అభివృద్ధి చెయ్యలేదు. నిజాం బూజు వదిలాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేర్పడినాక, 1971 నుంచి నిత్యపూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అని దాని పూజారి చెప్పారు. దేవాలయం శిదిలమైపోగా భక్తులే పూనుకొని చందాలతో స్లాబ్వేసి మళ్ళీ పూజాదికాలకు వీలు కల్పించారు. ధ్వజస్తంభం చుట్టూ గోడ ఏర్పరచాలి.❋

71) 51 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం-ధూల్పేట

హైదరాబాద్ దూలిపేటలోని ఆకాష్ పురిలో 150 అడుగుల ఎత్తున్న కొండపై 51 అడుగుల శ్రీ ఆంజనేయ విగ్రహం నిర్మించారు. సుదూర ప్రాంతాలవారికీ సులభంగా దర్శనమిస్తాడు. గృహనిర్మాణాన్ని 2007లో ప్రారంభించి 9 ఏళ్ళలో పూర్తిచేశారు. ప్రతిఏడాది శ్రీరామనవమికి ధూల్పేట్నుంచి కోఠీ వరకు భక్తులు శోభాయాత్ర నిర్వహిస్తారు. అనేక రామాయణపాత్రలు ధరించి మేళతాళాలతో వైభవంగా ఈ యాత్ర జరుపుతారు. సారాబట్టీలు గుడుంబాల అడ్డాగా ఉన్న ధూల్పేటను భక్తిభావ బందురంగా, ఆధ్యాత్మిక భావతరంగాలతో నింపాలనే సత్సంకల్పంతో ఈ విగ్రహ సృష్టి చేశారు. ఘోషా మహల్ శాసన సభ్యుడు శ్రీ రాజాసింగ్. ఇదివరకు శోభాయాత్ర మాత్రమే జరిగేది ఇప్పుడు హనుమాన్స్వామి దర్శనంతో పులకిస్తున్నారు. మంచి చేయాలని సంకల్పబలం ఉంటే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు.❋

72) శ్రీ వీరాంజనేయ దేవాలయం-భీమునిమల్లారెడ్డి

తెలంగాణా రాజన్న సిరిసిల్లజిల్లా భీముని మల్లారెడ్డిలో శ్రీ వీరాంజనేయ దేవాలయం ప్రసిద్ధమైనది. పాండవుల ప్రతిష్ట అని మాండవ్య మహర్షి దర్శించిన ప్రదేశమని కాకతీయ శిల్ప వైభావానికి నిదర్శనమని అంటారు. ఆలయం ప్రక్కనే నది ఒడ్డున మాండవ్య మహర్షి తపస్సు చేశాడు. ఇక్కడి బండరాళ్ళ కింది నుంచి జల ప్రవాహం నిరంతరం నీరు జల జలారాలుతుండటం విశేషం. ఈ నీరు ఎక్కడి నుంచి వచ్చేదీ అంతు చిక్కడం లేదు. పూర్వం ఇక్కడున్న రావిచెట్టుపై ఒక బ్రహ్మరాక్షసుడు ఉండేవాడు. అటువైపు వచ్చే జనం ఈ ఆలయంలో దాక్కుని స్వామి దయతో వాడి బారినుండి తప్పించుకోనేవారు. ఒకరోజు స్వామివారికి తాను ఇక్కడెక్కడో విగ్రహరూపంలలో ఉన్నానని బయటికితీసి ప్రతిష్టించమని చెప్పాడు. వాళ్ళు బండీ కట్టుకొని వెతికి విగ్రహాన్ని తెస్తుండగా ఇక్కడే బండి ఆగి పోయింది. ఇక్కడే విగ్రహం ప్రతిష్టించి చిన్న గుడికట్టి పూజ ప్రారంభించారు. క్రమంగా ఆలయం విశాలంగా కట్టారు. సత్యనారాయణ వ్రతాలు ఉపనయనాలు వగైరా శుభకార్యాలు ఇక్కడే చేస్తారు. 'స్వయంభు స్వామిగా ప్రసిద్ధుడు. మహామహితాన్విత మూర్తి భక్తుల కోరికలు తీర్చే వరదుడుగా ప్రసిద్ధి. మంగళ, శనివారాలలో జనం బాగా వస్తారు. తమలపాకు, పూజలు ఎక్కువ. వడమాల వేయిస్తారు భక్తులు. సంతానం కోసం ముడుపులు కడతారు. మాఘమాసంలో పెద్ద జాతర జరుగుతుంది. హనుమజ్జయంతి వైభవంగా చేస్తారు. ఇక్కడ కాకతీయరాజులు విశ్రాంతి తీసుకున్న రెండస్తుల మేడ ఉంది. వెయ్యేళ్ళ చరిత్ర ఉన్న దేవాలయంగా స్థానిక కథనం. ఇక్కడ వెంకటేశ్వరస్వామి విగ్రహం,

భద్రాచలంలో ఉన్నట్లు సీతారామ విగ్రహాలున్నాయి. పంచపాండవులు ఇక్కడ కొంతకాలం ఉన్నట్లు చెప్పుకొంటారు. దీని ఆనవాళ్ళు కనిపిస్తాయి. ఇక్కడున్న పెద్దబండరాయి కింద వారు విశ్రాంతి తీసుకొన్నారు. అందుకే దీనికి 'భీమునిబండ' అంటారు. శ్రీరామనవమి అయిదు రోజుల కార్యక్రమంగా చేస్తారు. అన్నదానం చేస్తారు కనుక దీనికి శ్రీరామక్షేత్రం అనే పేరుంది. ఇక్కడున్న రావిచెట్టు కింద ఉన్న ఒక బండమీద కూర్చున్నా, దాన్ని తాకినా భక్తులకు ఆంజనేయస్వామి స్వయంగా మనసులో దర్శనమిచ్చి కోరిన కోర్కె తీరుస్తాడనే నమ్మకం జాస్తి. మానసిక రుగ్మతలు గాలి ధూళి సోకినా భూతప్రేతాలు పట్టినా ఈ స్వామిని దర్శిస్తే పూర్తిగా నయమైపోతాయని విశ్వాసం.❋

73) శ్రీ గుండు ఆంజనేయస్వామి దేవాలయం-రాఘవపట్నం

తెలంగాణా గొల్లపెల్లి మండలం రాఘవపట్నంలో విశిష్టమైన శ్రీ గుండు ఆంజనేయ దేవాలయం ఉంది. ప్రకృతి సోయగం ఎక్కువ. చాలా ప్రాంతాలనుండి భక్తులు వచ్చి సందర్శిస్తారు. భక్తుల, గ్రామస్తుల సహాయ సహకారాలతో 50 లక్షల రూపాయలతో ఆలయం బాగా అభివృద్ధి చెందింది.❋

74) శ్రీ జంబి హనుమాన్ దేవాలయం-ఆర్మూర్

తెలంగాణాలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్లో శ్రీ జంబి ఆంజనేయ దేవాలయం ప్రసిద్ధమైనది. సిద్దులగుట్ట అనే చిన్నకొండపై ఈ ఆలయముంది. ఒకప్పుడు కొందరు సిద్ధులు ఇక్కడ తపస్సు చేయటం వలన ఆ పేరొచ్చింది. గర్భాలయంలో సింధూర పూతతో స్వామి దర్శనమిస్తాడు. ఇక్కడ శివ, విఘ్నేశ్వర విగ్రహాలూ ఉన్నాయి. దర్శన మాత్రంతో సకల కోరికలు తీర్చే, భయాలు నివారించే మహిమాన్వితుడు స్వామి. సినీ, రాజకీయ ప్రముఖులందరూ జంబి హనుమాన్ను దర్శించి విజయం సాధిస్తారు.❋

75) వ్యాసమహర్షి ప్రతిష్టిత శ్రీ ఆంజనేయ దేవాలయం-చిన్నరాజమూరు

తెలంగాణా పాలమూరు (మహబూబ్ నగర్) జిల్లా చిన్నరాజమూరు గ్రామంలో 400 ఏళ్ళనాటి పురాతన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. దీన్ని చిన్నరాజమూరు ఆలయం అంటారు. ఇక్కడి స్వామి విగ్రహాన్ని వ్యాసమహర్షి ప్రతిష్టించాడని ప్రతీతి. తుంగభద్రా నదీతీరాన వడ్డేపల్లి మండలం రాజోలికి దగ్గరగా ఉంటుంది. కాలక్రమాన విగ్రహం మట్టిలో కలిసిపోయింది. ఒకరోజు ఒక రైతు నాగలి దున్నుతుంటే విగ్రహం బయటపడింది. ఆ రాత్రి స్వామి అతనికి కలలో కనిపించి విగ్రహాన్ని బండీమీద ఉత్తర దిశ వైపుకు తీసుకువెళ్ళమని చెప్పాడు. ఇక్కడికి బండి రాగానే చక్రం ఇరుసు విరిగి బండి కదలలేదు. అప్పుడు ఇక్కడే ప్రతిష్టించారు. మార్గశిర మాసంలో స్వామికి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మండల కేంద్రం దేవకద్ర నుంచి 10 కిలోమీటర్లు. నారాయణపేట నుంచి చేరుకోవచ్చు.❋

76) కాలా హనుమాన్ దేవాలయం-అత్తాపూర్

హైదరాబాద్ అత్తాపూర్లో అనంతగిరిలో శ్రీ కాలా హనుమాన్ దేవాలయం అన్నిటా భిన్నమైంది. కారునలుపు రాతివిగ్రహం హనుమంతుడిది. దాదాపు ఆంజనేయ దేవాలయాలలో స్వామి శరీరం అంతా దక్షిణముఖంగా ఉండటం ముఖం తూర్పువైపు ఉండటం సర్వసాధారణం. కాని ఇక్కడ అత్తాపూర్‌లో మాత్రం ఆంజనేయస్వామి విగ్రహ శరీరం, ముఖమూ కూడా దక్షిణ ముఖంగా ఉండటం మరో వింత. కాలా హనుమాన్ విగ్రహానికి ఎదురుగా స్వయంభు శ్రీ అనంతపద్మనాభస్వామి దేవాలయం ఉంది. ఇది గుహాలయం. దీన్ని జనమేజయమహారాజు నిర్మించాడు. జనమేజయుడు ఇక్కడే సర్పయాగం చేశాడు. ఆ యజ్ఞగుండమే ఇప్పుడు ఉన్న పుష్కరిణి. ఈ పవిత్ర జలాన్ని శిరసుపై చల్లుకొంటే అన్ని దోషాలు పోతాయని విశ్వాసం. ఈ ఆలయానికి 1100 ఏళ్ళ చరిత్ర ఉన్నది. అంత పురాతనమైనదని భావం. ఇదే ఆవరణలో శ్రీ వెంకటేశ్వర, శ్రీమహాలక్ష్మి శ్రీరామానుజ దేవాలయాలు కూడా ఉన్నాయి. లక్ష్మీదేవి విగ్రహం ఇక్కడి పుష్కరిణిలో లభిస్తే బయటికి తీసి ప్రతిష్ఠించారు. సర్వదోషహరం ఈ దాసాంజనేయస్వామి దర్శనం. ఈయన భక్తిభావంగా రెండుచేతులూ కలిపి నమస్కరిస్తూ అనంత పద్మనాభస్వామిని చూస్తూ ఉంటాడు. కాలాహనుమాన్ దర్శనం చేశాకే అనంత పద్మనాభస్వామిని భక్తులు సందర్శించటం రివాజు. ఆలయ అర్చకులకు స్వామి స్వప్నంలో చెప్పిన ప్రకారం స్వామికి చందనం పూయకుండా సంపంగి నూనె పూయటం అనూచానంగా వస్తున్న ఆచారం. సంపంగి నూనె వలన స్వామి రూపం రోజు రోజుకూ నల్లబడి కాలాహనుమాన్‌గా పిలువబడుతున్నాడు. ఇలాంటి నల్లహనుమాన్ దేవాలయం రాజస్థాన్లో మాత్రమే ఉంది.❋

77) మీసాలు గడ్డాల హనుమాన్-జగద్గిరి గుట్ట

సాలాసర్జగద్గిరిగుట్ట కొండపై నెలకొన్న ఈ ఆలయం పలు ప్రత్యేకతలను కలిగివుంది. మీసాలు, గడ్డం వుండి కేవలం తల భాగం మాత్రమే ఇక్కడి మూలవిగ్రహానికి వుంటుంది. రాజస్థానీ శైలిలో రెండంతస్తుల్లో విశాలమైన ఆలయం, ప్రాకారం వున్నాయి. హనుమజ్జయంతి, వార్షికోత్సవం, పర్వదినాలతో ఉత్సవాలు, నిత్యం ప్రత్యేక పూజలు సాగుతుంటాయి.❋

78) శ్రీ కేసరి హనుమాన్ దేవాలయం-కార్వాన్

కార్వాన్ నియోజకవర్గం పరిధిలో కార్వాన్లో మూసీ నది చెంత ఉన్న కేసరి హనుమాన్ ఆలయానికి నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది.

ఆలయ విశిష్ఠత క్లుప్తంగా- సీతాదేవిని రావణుడు అపహరించి లంకకు తీసుకు వెళ్ళిన పిమ్మట హనుమంతుడు ఆమెకోసం వెతుకుతూ ముచుకుందా (మూసీ) నది ప్రాంతానికి చేరుకున్నాడు. నదిలో స్నానమాచరించి తలపై ఉన్న నీళ్లను విదిలించటంతో పరిసర ప్రాంతాల్లో పడ్డాయి. అక్కడే కేసరి హనుమాన్ ఆలయాన్ని ఛత్రపతి శివాజీ గురువు శ్రీ సమర్థ రామదాసు నిర్మించారని ప్రతీతి. మన దేశాన్ని ఔరంగజేబు పరిపాలిస్తున్న కాలంలో అణగారిపోతున్న హిందూ సంస్కృతిని పునరుద్ధరించటానికి శ్రీ సమర్థ రామదాసు తన శిష్యబృందంతో దేశమంతటా పర్యటిస్తూ 'శ్రీరామ జయరామ జయ జయ రామ' అనే త్రయో దశాక్షర మహామంత్రాన్ని ప్రచారం చేస్తూ దక్కన్ (దక్షిణాది)కి విచ్చేశారు. ముచుకుందా (మూసీ) నదీతీరంలోని సువిశాలమైన స్థలంలో 1647లో కేసరి హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు.❋

79) శ్రీ విజయాంజనేయ దేవాలయం-విజయనగర్ కాలని

ఏడు దశాబ్దాల కిందట ఆలయం నిర్మితమైన స్థలంలో విజయాంజనేయస్వామి విగ్రహం బయల్పడింది. అత్యంత మహిమాన్వితుడైన విజయాంజనేయస్వామిగా అప్పటి నుంచి పూజలందుకుంటున్నాడు స్వామి. భక్తుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో రామాలయం, శివాలయం, నవగ్రహాలు నిర్మితమయ్యాయి. 1986 నుంచి దేవాదాయశాఖ ఆలయ నిర్వహణను చేపట్టింది. రామకోటి మహాయజ్ఞం కార్యక్రమానికి ఆలయం ప్రసిద్ధికెక్కింది. ఆలయంలో ఉన్న గోవుల్ని పూజించేందుకు భక్తులు తరలివస్తుంటారు. ప్రతివేసవిలో సమైక్య హైందవ సమాఖ్య ఆధ్వర్యంలో హిందూసంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకోసం ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తుంటారు. మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు ఆలయనిర్వాహకులు పేర్కొన్నారు. గణపతి స్తోత్రాలు, సరస్వతీపూజ, నిత్యపారాయణం, ప్రార్థనలు, హయగ్రీవస్తుతి, హనుమాన్చాలీసా, విష్ణు సహస్రనామార్చనలు, లింగాష్టకం, లలితాసహస్రనామార్చనలు, శ్రీరామ ఆపదుద్ధారక స్తోత్రం తదితర అంశాల్లో శిక్షణ నిస్తుంటారు. స్లోకాలు, వాటి అర్థాలు, హిందూధర్మ సూత్రాలతోపాటు హనుమాన్చాలీసాపఠనం, శివస్తుతి, సామూహిక విష్ణుసహస్ర నామార్చనల్ని నేర్పటం జరుగుతుంటుంది.*

80) శ్రీ మహావీర్ హనుమాన్ దేవాలయం -సలాబత్పూర్

నిజామాబాద్‌జిల్లా సలాబత్పూర్‌లో కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా బాసిల్లుతున్న ఆంజనేయస్వామి మద్నూర్ మండలంలో కొలువై అశేష భక్తుల పూజలందుకుంటున్నాడు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో వెలసిన సలాబత్పూర్ ఆంజనేయస్వామిని కొలిస్తే పీడలు దరిచేరకుండా అభయమిస్తూ అభయాంజనేయస్వామిగా వెలుగొందుతున్నాడు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది భక్తులు ప్రత్యేక పూజల కోసం విచ్చేస్తారు.

చారిత్రక నేపథ్యం– ఎంతో మహిమాన్యుతుడిగా పేరొందిన ఈ స్వామి ఆలయం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు తెలంగాణ సరిహద్దులో ఉండి స్వామిని దర్శించుకునేందుకు ఆలయానికివచ్చే భక్తులతో ఎల్లప్పుడూ కళకళలాడుతుంటుంది. అతి ప్రాచీన కాలం నాటి ఈ ప్రదేశం 400 సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. నిజాం పరిపాలన కాలంలో అరణ్య ప్రాంతంలో వెలసి ఉన్న ఈ విగ్రహాన్ని స్థానికులు గుర్తించారు. గుట్టల మధ్య ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని కిందికి తెచ్చి ప్రతిష్ఠించినట్లు ఇక్కడి వృద్ధులు కథలు కథలుగా చెబుతుంటారు. మహారాష్ట్ర వీరుడు, హైందవ బాంధవుడు శివాజీ మహ రాజ్ పరిపాలన సందర్భంగా ఆయన గురువు సమర్థ రామదాసు ఇక్కడ కొన్ని నెలలు గడిపినట్లు ఆనవాళ్లు ఉన్నాయని స్థానికులు చెబుతారు. రామదాసు శివాజీ మహారాజ్ పరిపాలన కాలంలో స్వయంభువుగా వెలసిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి భక్తులు రావడం వారి కోరికలు తీరడంతో ఆలయం దిన దినాభివృద్ధి చెందుతూ భక్తుల విశ్వాసాన్ని

చూరగొంటున్నది.

దుష్ట శిక్షకుడు.. శిష్ట రక్షకుడిగా... భక్తుల దృష్టిలో కోరిన కోరికలు తీర్చే భగవంతుడిగానే కాకుండా తప్పు చేసిన వారిని శిక్షించే ఆంజనేయస్వామిగా ఇక్కడి భక్తులు నమ్ముతారు. ఆంజనేయస్వామి ఆలయానికి పడమర దిశలోని కొండపైన శివాలయం ఉంది. ఈ ఆలయంవద్ద రాతిపై పాము చెక్కబడి ఉంది. ఈ విగ్రహం తోక భాగంలో చేతు ఉంచితే పని కావాల్సి ఉంటే పడగ వరకు చెయ్యి జరుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగం ఒక రూపాయి నాణెం అతుకుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ ఆలయంలోకి అడుగుపెట్టిన భక్తజనానికి ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణం మనస్సుకి ఆహ్లాదం కలిగించడమే కాకుండా భక్తి భావాలతో ఒళ్లు పులకరిస్తుంది. ప్రతినిత్యం మందిరంలో ప్రభాత సమయంలో జైహనుమాన్ జై జై హనుమాన్ నామస్మరణతో మొదలై మైమరిపించే ఆధ్యాత్మిక గీతాలు భక్త జనుల సంకీర్తనలతో మారుమోగుతుంటాయి. శ్రావణమాసం సందర్భంగా ప్రతీ శనివారం ఉదయం 4 గంటల నుంచే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు కాలినడకన వస్తుంటారు. ఈ ఆలయం నిరంతరం వచ్చిపోయే భక్తులు, దూర ప్రాంతాలకు వెళ్లే టూరిస్టుల సందడితో కళకళలాడుతుంటుంది.

పర్యాటకాభివృద్ధికి అవకాశాలు మెండు.. ఆధ్యాత్మికతతో కూడిన ప్రశాంత వాతావరణం వెల్లివిరిసే సలాబత్పూర్ ఆంజనేయస్వామి వారి ఆలయ పరిసరాలు నిజామాబాద్ జిల్లా మద్నూర్ మండలంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులను తాకుతూ తెలంగాణలో ఉండడం వల్ల మూడు రాష్ట్రాల భక్తులకు సుపరిచితమైనది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి సుమారు 200 కి.మీ.దూరంలో 156వ జాతీయ రహదారిపై ఈ ఆలయం ఉంది. ఈ రహదారి గుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా వాహనాలు నడుస్తుంటాయి. భక్తులు ఐదు రాష్ట్రాలల్లోని దేవాలయాలను సందర్శించే ముందు ఈ మందిరంలోనే బస చేస్తారు. ఈ మందిరానికి 1973లో స్థానికులు పాలకవర్గం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి వేలల్లో ఆదాయం రావడంతో అభివృద్ధిపనులు చేపట్టారు. ఈ ఆలయానికి

ఆదాయం పెరగడంతో ప్రభుత్వం 1997లో ఈ ఆలయాన్ని దేవదాయ పరిధిలోకి తీసుకుంది. ప్రస్తుతం ఈ ఆలయానికి లక్షల రూపాలయల్లో ఆదాయం ఉంటుంది. ఈ మందిరానికి గతంలో పర్యాటక కేంద్రంగా గుర్తిస్తామని మాజీ సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఎంపీ మధుయాష్కీగౌడ్ ఆంజనేయస్వామిని దర్శించుకొని కల్యాణ మండపం కోసం నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. ఎవరి హామీలు నెరవేర్చకపోయినప్పటికీ తనను నమ్మిన భక్తుల కోరికలు తీర్చడానికి అభయాంజనేయుడు సిద్ధంగా ఉండి భక్తుల కొంగు బంగారమై పూజలు అందుకుంటున్నాడు. మహారాష్ట్ర ఎంపీ భాస్కర్రావు పటేల్ ఈ ఆలయానికి గతంలో ధర్మశాల కోసం నిధులు అందజేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఇక ఈ ఆలయం ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకంగానూ అభివృద్ధి చెందుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.❋

81) మాంసం మద్యం నైవేద్యం పొందే శ్రీ ఆంజనేయస్వామి-

పాతపల్లి చింతలకుంట

ఆంజనేయస్వామికి భక్తులు పూజలు ఏవిధంగా చేస్తారో మనకందరికి తెలుసు. దేశంలో, కానీ రాష్ట్రంలో కానీ తమలపాకులతో అలంకరణచేసి నైవేద్యంగా స్వీట్లతో చేసిన వంటకాలను తయారుచేసి స్వామి ముందు పెట్టి పూజలు చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్దంగా కోళ్లు, గొర్రెలు, మేకలను బలిచ్చి వాటిమాంసంతో ఆంజనేయస్వామికి నైవేద్యంగా పెడుతారు. కనుక 'నాన్వెజ్ ఆంజనేయస్వామి'గా ప్రసిద్ధి.

వనపర్తిజిల్లా పెబ్బేరు మండలం 'పాతపల్లి' గ్రామ సమీపంలో వెలసిన 'చింతలకుంట ఆంజనేయస్వామి' ఈ పేరు ఏ విధంగా వచ్చిందంటే గుడి చుట్టూ చింతచెట్లు, పక్కనే ఓ నీటకుంటి కూడా వుండేదని అందుకే ఈ

స్వామికి 'చింతలకుంట ఆంజనేయస్వావి' అనే పేరు వచ్చిందని ఆలయ పూజారి చెబుతున్నాడు. ఈ ప్రాంత ప్రజల మొక్కులను తీర్చే అరాధ్యదైవం కొరిన కోర్కెలను తీర్చి కొంగుబంగారం చేసే దేవుడు ఈ ఆంజనేయస్వామి.

ఈ స్వామికి గతకొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతభక్తులే కాకుండా ఇతరప్రాంతాల భక్తుల నుండి పూజలు అందుకుంటున్నాడు. ఈ స్వామికి ప్రత్యేకత ఏమిటంటే గత కొన్ని సంవత్సరాలుగా మాంసాహారంతో పూజలు చేస్తున్నారు. మొదట్లో ఇదేంటి ఆంజనేయస్వామికి కోళ్లు, గొర్రెలు, మేకలుబలిచ్చి మాంసంతో పూజలు చేయడం మంచి పద్దతి కాదు అన్నవారు ఎంతోమంది. కానీ అది రాను రాను అనవాయితీగా కొనసాగుతుందని వారంలో సోమ, శనివారాల్లో భక్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులను తీర్చుకుంటున్నారని, అంతే కాకుండా సంక్రాంతి, ఉగాది, దసరా పండుగలకు భక్తులు ఇసుకేస్తే రాలనంతగా వస్తారని, భక్తుల సందడి రోజు రోజుకు పెరుగుతూ వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంత భక్తులే కాకుండా ఇతరజిల్లాల, రాష్ట్రాల నుండి భక్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులను తీర్చుకుంటున్నారని మొదటిసారి వచ్చే భక్తులు స్వామి వద్దకు వచ్చి తమ కోర్కెలను కోరుకుని వెళ్ళాక తమకు అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే బందు, మిత్రులతో వచ్చి స్వామికి కోళ్లు, గొర్రెలు, మేకలను తెచ్చి బలిచ్చి వంటలు చేసుకుని కల్లుతో గుడి చుట్టూ కుటుంబ సభ్యులతో ప్రదక్షణలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించిన తర్వాత భక్తులు బోజనాలు చేసుకుని తిరిగి తమ ప్రాంతాలకు వెళ్తారు.❋

82) శ్రీ పసన్న ఆంజనేయ దేవాలయం-వెస్ట్ వెంకటాపురం

హైదరాబాద్ వెస్ట్ వెంకటాపురం ఆల్వాల్లో శ్రీ ప్రసన్న ఆంజనేయ దేవాలయం ఉంది. దీని దగ్గర రైలుమార్గం రాకముందు ఇదంతా అరణ్య ప్రాంతం. వాగునీటిలో బయల్పడిన విగ్రహమే ఇక్కడి ప్రసన్నాంజనేయస్వామి. అక్కడే అలాగే ఉంచి పూజలు చేసేవారు. 1992లో ముఖమండపం కట్టారు. స్వామి దక్షిణాభిముఖుడు. గుడి ముందు రావిచెట్టు, లోపల వినాయకుడు ఉన్నారు. స్వామి సిందూరవర్ణ శోభితం సకల హారభూషితుడుగా కనిపిస్తాడు. శివాలయంలో శివలింగం, బాలాత్రిపురసుందరీ ఉన్నారు. శ్రావణమాసం మూడవ శుక్రవారం లక్షపుష్పాలతో అమ్మవారి విశేష పూజ కడు రమణీయం. నవగ్రహ మండపమూ ఉన్నది.*

83) శ్రీ జోడీ ఆంజనేయ దేవాలయం-లింగాపూర్

తెలంగాణా కరీంనగర్ జిల్లా ఎల్లెద్దుపేట మండలంలో సముద్రాల లింగాపూర్‌లో ఉన్న శ్రీ జోడీ ఆంజనేయ దేవాలయం విశేషమైనది. ఇక్కడ స్వామి శ్రీ భక్తాంజనేయ, శ్రీ వీరాంజనేయ అనే రెండు రూపాలలో గర్భగుడిలోనే దర్శనమిస్తాడు కనుక ఆ పేరొచ్చింది. ఈ ఆలయ నిర్మాణం జరిగి 60 ఏళ్ళయింది. అప్పుడు ఒక బెల్లం వ్యాపారి గౌరీశెట్టి రాజేశం ఇక్కడికి వచ్చి రాత్రి అయినందున ఒక చెట్టుకింద పడుకోగా, కలలో హనుమ కనిపించి దగ్గరలోనే తన విగ్రహాలున్నాయని వెతికి గుడికట్టించమని కోరగా వెతికితే రెండు విగ్రహాలు దొరకగా చిన్న గుడికట్టి ప్రతిష్టించాడు. తర్వాత కాలంలో అతని కొడుకు గ్రామస్తులు భక్తులు ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కలిసి రాజగోపురం వగైరా నిర్మించి శోభ కూర్చారు. బయట రాజగోపురం వద్ద 20 అడుగుల శ్రీ ప్రసన్నాంజనేయ విగ్రహం ఉన్నది. శ్రీ రుద్ర లింగేశ్వర, జ్ఞానసరస్వతి, తులసి అమ్మవార్లకు ఉపాలయాలు కట్టారు. పూజాదికాలు వైభవోపేతంగా జరుగుతాయి.❋

84) శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం-మూండామార్కెట్

హైదరాబాద్ మూండా మార్కెట్ వద్ద శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయమున్నది. హనుమ అహి రావణుని నుంచి రామలక్ష్మణులను కాపాడటానికి వారిద్దరి చుట్టూ వాలంతో కోట కట్టిన గాథకు ప్రతిరూపమే ఈ పంచముఖ ఆంజనేయస్వామి. హయగ్రీవ, నారసింహ గరుడ, వరాహ వానర రూపాలతో స్వామి దర్శనమిస్తాడు.❋

85) శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం-జమ్మికుంట

తెలంగాణా కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం త్రేతాయుగంతో సంబంధమున్నది. మహి రావణుని హనుమ పాతాళంలో చంపి బయటికొచ్చి విశ్రమించిన చోటు అని స్థానిక కథనం. మహి ప్రాణాలు అయిదు తుమ్మెదలలో ఉన్నాయని వాటిని ఒకేసారి చంపితేనే వాడు చస్తాడని తండ్రి వాయుదేవుడు చెప్పగా పంచముఖాలతో వాటిని ఒకేసారి భక్షించి మహిరావణుని కూల్చాడు హనుమ.❋



86) శ్రీ అభయం ఆంజనేయం దేవాలయం-గోదావరిఖని

తెలంగాణా కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో ఫర్టిలైజర్ సిటీలో శ్రీ అభయాన్జనేయ దేవాలయం ఆ ప్రాంతానికి రక్ష అని భావిస్తారు. 40 ఏళ్ళ క్రితం భక్తులు నిర్మించిన ఆలయం. ఆంధ్రాలో విశాఖపట్నం గాజువాకలో శ్రీ ఆంజనేయ దేవాలయం ప్రసిద్ధమైనదే.❋

87) శ్రీ హనుమ దేవాలయం-భువనగిరి

తెలంగాణా బోన్‌గిరి అని పిలువబడే భువనగిరిలో కొండపై విక్రమాదిత్యుని కాలం నాటి కోట ఉన్నది. కష్టపడి పైకి ఎక్కితే అందమే ఆనందం. అక్కడ శ్రీ హనుమాన్ దేవాలయం ప్రాచీనమైనది. అక్కడే చిన్న చిన్న కొలనులు, తమలపాకు తోటలు చూసి తీరాల్సిందే.❋

88) మునుల కోరికపై వెలసిన శ్రీ స్వయంభు ఆంజనేయ దేవాలయం-తపస్థలి-కూచారం

శ్రీరామ నామం ఎంతో మధురం. పిలిస్తే పలికి వరాలు కురిపించే దైవం శ్రీరామ చంద్రుడు. కూచారంలో స్వయంభుగా వెలిసిన ఆంజనేయస్వామికి ప్రత్యేకత ఉంది. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, మనోహరాబాద్ మండలంలో ఉన్నది. కూచారం, మనోహరాబాద్ మండలం నుండి 13 కి.మీ. దూరంలోను, సమీప పట్టణమైన హైదరాబాదు నుండి 40 కి.మీ. దూరంలోనూ ఉంది.

ఆలయ పురాణం- దశాబ్దాల నుంచి వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూన్నది. కష్టపడి పైకి ఎక్కితే అందమే ఆనందం. అక్కడ శ్రీ హనుమాన్ దేవాలయం ప్రాచీనమైనది. అక్కడే చిన్న చిన్న కొలనులు, తమలపాకు తోటలు చూసి తీరాల్సిందే. ఈ ఆలయంలో వెలిసిన ఆంజనేయస్వామి వారికి హైదరాబాద్, మహారాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో భక్తులు ఉన్నారు. ఈ ఆలయాన్ని 1977లో అప్పటి ప్రభుత్వం గుర్తించి దేవాదాయశాఖలో కలిపింది. మనోహరాబాద్మండలం కూచారంగ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం అత్యంతప్రసిద్ధి గాంచినది. పూర్వం ఇక్కడ మునులు తపస్సు చేయగా ఆంజనేయస్వామి స్వయంభుగా వెలిశారని ఆలయ పూజారుల కథనం. ఈ ఆలయం వద్ద ఉన్న కోనేరులో స్నాన మాచరించి, పూజలు నిర్వహిస్తే శనిపీడలు, నవగ్రహ దోషాలు, శత్రుపీడలు తొలుగడంతోపాటు సంతానం కలుగనివారికి సంతానం కలుగుతుందని పూజారులు పేర్కొంటున్నారు. అత్యంత పురాతనమైన ఆలయం అయినప్పటికీ ఎలాంటి స్థిరాస్తులులేని ఈ ఆలయం గ్రామస్తుల ఆదరణతో కొద్దిగా కొద్దిగా అభివృద్ధికి

నోచుకున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇటువైపుగా వస్తే స్వామివారిని తప్పనిసరిగా దర్శించుకుంటారు. ప్రతిసంవత్సరం ఆలయంలో హనుమాన్జయంతి, సీతారామచంద్రుడి కల్యాణాన్ని ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి నిర్వహిస్తుంటారు.

కోనేరుమహిమ: బైంసా, మహారాష్ట్ర, నాగ్పూర్ ఇతరప్రాంతాల నుంచిభక్తుల వచ్చి కోనేరులోని నీటిని బూరల్లో తీసుకొని తమ ప్రాంతాలకు కాలి నడకన వెళ్లేవారట. వారి వారి ప్రాంతాలకు చేరుకోగానే బాజా భజంత్రీలతో కోనేరు నీటిని తమ ఇంటికి తీసుకెళ్లేవారని, అతంటి మహిమ ఈ కోనేరులో ఉందని ఆలయపూజారి వివరించారు.

కోదండరాముడి ఆలయ నిర్మాణం: స్వయంభుగా వెలిసిన ఆంజనేయుడి ఆలయం ఆవరణలో సీతారాముల ఆలయం లేదు. కాగా రెండుసంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన ఓ రామభక్తుడి కలలో కోదండరాములవారి ఆలయాన్ని నిర్మించాలని ఆంజనేయస్వామి చెప్పాడని, ఆ భక్తుడు గ్రామస్తులకు తెలుపడంతో రూ. 6లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు సంకల్పించారు. దీంతో ప్రతి ఇటుకపై శ్రీరామనామాన్ని రాసి 2015 నవంబర్ 30న ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. కేవలం రూ. 6లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారని నగరంలో, ఇతర రాష్ట్రాల్లోని భక్తులకు తెలువడంతో అడుగకముందే వారు తోచినంత సాయాన్ని అందించారు. దీంతో రెండు సంవత్సరాల కాలంలోనే ఆలయం రూ.1 కోటి 10 లక్షలతో రాష్ట్రంలోనే ఐదో అత్యంత పెద్దదైన కోదండ రామచంద్రుడి ఆలయాన్ని నిర్మించారు.

అన్నిహంగులతో ఆలయ నిర్మాణం: కూచారంగ్రామస్తులు, భక్తుల సహకారంతో నిర్మించిన కోదండ రామచంద్రుడి ఆలయాన్ని చూసేందుకు రెండు కన్నులు సరిపోవు. 30 మంది తమిళనాడు శిల్ప కళాకారులు ఆలయ ప్రాకారాన్ని అందంగా తీర్చిదిద్దారు. కింది భాగంలో ఒకేసారి 650 మంది కూర్చుని వ్రతాలు చేసేందుకు ప్రవచన, వ్రతమండపాన్ని నిర్మించారు. పైఅంతస్తులో స్వామివారి గర్భగుడి చుట్టూ చతుర్మూతుల పరివారం, గరుడ, ఆలువార్ల విగ్రహాలను ఏర్పాటుచేశారు. అదేవిధంగా ఆలయం చుట్టూహంస, సింహం, ఏనుగుబొమ్మలను ఏర్పాటుచేశారు.

5 అడుగుల కోదండరాముడి రాతివిగ్రహం: ఆలయగర్భగుడిలో ఏర్పాటుచేసేందుకు కోదండరాముడు, సీతమ్మ, లక్ష్మణుడు, హనుమంతుడి రాతివిగ్రహాలను మహాబలిపురంలో తయారుచేయిస్తున్నారు. వీటి ఎత్తు 5 అడుగులు, ఇంత ఎత్తుగల విగ్రహాలు రాష్ట్రంలోని రామాలయాల్లో కొన్నిచోట్ల మాత్రమే ఉన్నాయని ఆలయ పూజారులు తెలిపుతున్నారు.
(ఆధారం-'నమస్తే తెలంగాణ' పత్రిక 26-12-18)❋



89) వనమూలికా కేంద్ర శ్రీ ఆంజనేయాలయం-శ్రీరామకొండ

శ్రీరామకొండ వనమూలికలకు మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచింది. శ్రీరామకొండపై ఉన్న ప్రతిచెట్టును వనమూలికగా భావిస్తారు. ఆంజనేయస్వామి సంజీవిని కొండను తీసుకెళ్తున్న సమయంలో ఒకమూలిక ఈ కొండపై పడడంతో ప్రతిచెట్టు వనమూలికలుగా మారిపోయాయని భక్తులు నమ్మకం. కొండపై ఉన్న కోనేటి నీటికి కూడా ఔషధ గుణం ఉన్నట్లు భక్తులు భావిస్తారు. ప్రతి అమావాస్య రోజు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాలనుంచి భక్తులు భారీ సంఖ్యలో రామకొండకు చేరుకొని స్వామివారిని దర్శించుకుంటారు. వనమూలికలకు ప్రసిద్ధిగాంచిన శ్రీరామకొండ మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట నియోజకవర్గంలోని కోయిలకొండ మండలకేంద్రానికి అర కిలోమీటర్ దూరంలో ఉంటుంది.

అంతేకాకుండా ఈ కొండ ఆధ్యాత్మికంగానూ ప్రసిద్ధి గాంచింది. త్రేతా యుగంలో సీతమ్మ జాడకోసం శ్రీరాముడు లక్ష్మణుడితో కలసి రామకొండకు చేరుకున్నారని పురాణాలు చెబుతున్నాయి. కొండపై ఉన్న ప్రకృతి అందాలను చూసి తన్మయం పొంది అక్కడే సేద తీరారు. శ్రీరాముడు సేద తీరిన చోట బండపై స్వామి వారి కూడి పాద ముద్రిక ఏర్పడ్డాయి. శ్రీరాముడు రామకొండకు వచ్చారని తెలుసుకొన్న రుషులు కొండకు చేరుకొని స్వయంభూ రామపాదాన్ని చూసి అక్కడే చిన్న గుడి నిర్మాణం చేసి సీతారామ, లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. కొండపైనాగు ఋషులు నిర్మించుకున్న గుహలు, ఇతర కట్టడాలు నేటికీ కనిపిస్తాయి. కొండపై తాగునీటి కోసం ఒక కోనేరు, స్నానపు నీటి కోసం మరో కోనేరును తవ్వించారు. ఈ కోనేటిలో నీళ్లు మండు వేసవిలోను లభిస్తాయి. స్నానపు కోనేరు పెద్ద తామర ఆకులు, ఇతర మూలికలతో కప్పబడి ఉండటంతో నీళ్లు వేసవిలో కూడా చల్లగా ఉంటాయి. కొండపై నుంచి కోయిల్సాగర బ్యాక్వాటర్, ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

శ్రీరామకొండపై ఉన్న ప్రతి చెట్టును వనమూలికగా భావిస్తారు. ఆంజనేయస్వామి సంజీవిని పర్వతాన్ని తీసుకెళ్తున్న సమయంలో ఒకమూలిక ఈ కొండపై పడడంతో ప్రతి చెట్టు వనమూలికలుగా మారిపోయావని భక్తులు నమ్మకం. అదే విధంగా ఈ కొనేరులలో ఉన్ననీటికి కూడా ఔషధగుణం ఉన్నట్లు భక్తులు భావిస్తారు. ప్రతి ఆదివారం అమావాస్య రోజు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో రామకొండకు చేరుకొని స్వామివారిని దర్శించుకుంటారు. తిరుగు ప్రయాణంలో కొండపై వనమూలికలుగా భావిస్తున్న చెట్ల కొమ్మలను, కొనేరులోని నీటిని ఇంటికి తీసుకువెళ్తారు.

కొండపై చూడదగ్గ ప్రాంతాలు-

శ్రీరామకొండపైకి వెళ్తున్న కొద్దిదూరంలో విశాలమైన పెద్ద బండరాయి కనిపిస్తుంది. ఈబండపై నుంచి కింద మిషన్భగీరథ ట్యాంకు, వింజామూ రోడ్డు, కోయిలకొండ పెద్దచెరువు అద్భుతంగా కనిపిస్తాయి. కొండపైకి

చేరుకొగానే తామరాకులతో కప్పబడిన స్నానవు పర్యాటకులను ఆకుట్టుకుటుంది. దానిపై భాగంలో తాగునీటి కొనేరు ఉన్నది. అటునుంచి శ్రీరామచంద్రస్వామి దేవాలయం కొంత దగ్గరలో ఉంది. అక్కడి నుంచి దూరంలో ఉన్న గ్రామాలు కనిపిస్తాయి. దేవాలయం దగ్గరలో సీతమ్మగుండు ఉంది. స్నానపు కోనేరు దగ్గర అంజనేయస్వామి దేవాయలం కనిపిస్తుంది. స్నానపు కొనేరు నుంచి ఎడమవైపు పైకి వెళ్తే చల్లగుండ్లు ఉంటాయి. ఇక్కడ పెద్దరాళ్ల మధ్య చల్లగా గాలి వస్తుంది. అందుకే ఈ గుండ్లను చల్లగుండ్లుగా పిలుస్తారు. ఇక్కడ నుంచి కోయిల్సాగర్ప్రాజెక్టు ప్వాటర్, డ్యాంతోపాటు పచ్చని పంటపోలాలు ప్రకృతి అందాలు ఇక్కడికి వచ్చే పర్యాటకులను ఆనందింపజేస్తాయి. కొంత ముందుకు వెళితే నగర గుండు వస్తుంది. కొండ ఏ రాయిని కొట్టిన శబ్దం రాదు కాని అక్కడ ఒక రాయిని కొడితే నగర వాయిద్యం వినిపిస్తుంది. అక్కడ నుంచి అంకిళ్ల పెద్దవాగు కనిపిస్తుంది.

ఇలా వెళ్లాలి- మహబూబ్‌నగర్ నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోయిలకొండ మండల కేంద్రంలో ఉన్న వివేకానంద చౌరస్తా వరకు బస్సులు, ఆటోలలో చేరుకోవాలి. అక్కడ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ప్రైవేట్ వాహనాలు వెళ్తాయి. వాహనాలను ఇక్కడే పార్క్ చేసి కాలి నడకన అర కిలోమీటర్ కొండపైకి వెళ్తే రామకొండ దేవస్థానం వస్తుంది. రామకొండ దేవాలయంతోపాటు వెనుక ప్రాంతంలో కోయిల్సాగర్బ్యాక్వాటర్, అంకిళ్ల పెద్దవాగును చూడవచ్చు.❋

(ఆధారం- నమస్తేతెలంగాణ-28-5-18)

90) ఊరంతా హనుమంతా(లయాలు)-వెల్లుల్ల మెట్ పల్లి

వీధివీధికో ఆంజనేయస్వామి ఆలయం వెల్లుల్ల మెట్ పల్లి, ఊరిలో వీధి వీధికో ఆంజనేయస్వామి ఆలయంతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. ఒకటికాదు, రెండుకాదు, పదులసంఖ్యలో 42 అంజన్న ఆలయాలతో విలసిల్లుతుందా గ్రామం. నిత్యంభజనలు, పూజలు, సంకీర్తనలతో సందడి చేస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరెన్నికగన్నది జగిత్యాలజిల్లా మెట్పల్లి మండలం వెల్లుల్ల గ్రామం. వీధి వీధిన కొలువైన అంజన్న గ్రామంలో అంజన్న విగ్రహాలు అధికంగా ఉన్నాయి. గ్రామానికి పడుమటి దిక్కుకు అభిముఖంగా నైరుతిలో గండిహన్మాన్ ఆలయం ఉంది. పెద్దగుండురాయికి ఆంజనేయస్వామి కొలువై ఉన్నాడు. అప్పట్లో ఈ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేది. వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఇక్కడి నుంచే వెళ్లడం, హన్మాన్ ఆలయం ఉండడంతో అనేక కుటుంబాలు భక్తులుగా మారిపోయారు. దీంతో గ్రామపరిసరాల్లో ఎక్కడ హన్మాన్ విగ్రహం కనిపించినా ఆలయం నిర్మించి పూజించడం మొదలుపెట్టారు. ఇక్కడ గ్రామంలోనే కాకుండా పంటపొలాల్లో, చెరువు సమీపంలో హన్మాన్ విగ్రహాలున్నాయి. గ్రామంలో అడుగుపెట్టిన తర్వాత రోడ్ల కిరువైపులా, పంటపొలాల్లో ఎటూ చూసినా హనుమాన్ విగ్రహాలు దర్శనమిస్తాయి. గ్రామస్థులు ఆంజనేయస్వామిని నిత్యం కొలుస్తుంటారు. ప్రతి శని, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. హన్మాన్ జయంతికి అధిక సంఖ్యలో దీక్షలు స్వీకరిస్తూ భక్తిభావాన్ని చాటుతారు. జయంతి రోజున హనుమాన్ ఆలయాలవద్ద పెద్ద ఎత్తున అన్నదానాలు నిర్వహిస్తారు.

గ్రామస్థులందరూ ప్రత్యేక పూజలు చేస్తారు. దీక్షాపరుల భజనలు, సంకీర్తనలతో గ్రామం మారుమోగుతుంది. చరిత్ర ఇదీ.. గ్రామంలో పదుల సంఖ్యలో ఆలయాలు ఉండడం వెనుక భిన్నమైన చారిత్రక కథనాలు వినిపిస్తున్నాయి. 14వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని జైనులు పాలించేవారు. ఆ సమయంలో గ్రామంలో సుమారు 250కి పైగా బ్రాహ్మణ కుటుంబాలుండేవి. బ్రాహ్మణపురి వీధిలో నివాసమున్న ఈ కుటుంబాలను జైనులు పోషించేవారు. అప్పట్లో జైనులు నిర్మించిన ఆలయాలతోపాటు బ్రాహ్మణ కుటుంబాలు కొన్ని దేవుడి విగ్రహాలను ప్రతిష్ఠించుకుని పూజలు జరుపుతుండేవారు. మరికొంతమంది కోరిన కోర్కెలు తీరినందుకు ఆలయాలు నిర్మించారు. ఇలా క్రమేణా ఆలయాలు పెరుగుతూ పోయాయని స్థానికులు చెబుతున్నారు.❋
(ఆధారం-ఈనాడు-31-3-18)

91) శ్రీ వీరాంజనేయ దేవాలయం-చాకరిమెట్ల

పిరికితనంలో ధైర్యం కావాలన్న, లక్ష్యం కోసం పోరాడే శక్తి కావాలన్న మనం వీరంజనేయుడినే ప్రార్థిస్తాం. ఆంజనేయస్వామి వారికి తెలుగు రాష్ట్రాలలో ఉన్న అతి మహిమాన్విత దేవాలయాలలో మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని చాకరిమెట్ల హనుమాన్ ఆలయం కూడా ప్రధానమైనది. హైదరాబాద్ నుండి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఈ దేవాలయం నిర్మింపబడి ఉన్నది.

ఈ పవిత్రమైన దేవాలయాన్ని ప్రతిరోజు భక్తులు దర్శించుకుంటారు కాని వారంలో శనివారం, మంగళవారంలో మాత్రం వేలసంఖ్యలో భక్తులు ఇక్కడికి

చేరుకుంటారు. ఒక్క శనివారం రోజే 10,000 మంది భక్తులు ఆంజనేయస్వామివారిని దర్శించుకుంటారు. పూర్వం ఆంజనేయస్వామివారు ఇదే ప్రాంతంలో స్వయంభూగా వెలిశారని నమ్మకం. తర్వాత సుమారు 60 సంవత్సరాల క్రితం ఆంజనేయస్వామివారి మహాభక్తుడైన సీతారామశర్మగారు స్వామివారి ప్రతిమను ఇక్కడి దట్టమైన అడవిలో గుర్తించి 41 రోజులపాటు మాల ధరించి ప్రతిష్ఠించారట. ఆ తర్వాతి కాలంలో భక్తులు కోరుకున్న కోరికలు నెరవేరడంతో భక్తులు రోజు రోజుకు పెరగడంతో ఈ దేవాలయానికి విశేష గుర్తింపు లభించింది.

ప్రతి సంవత్సరం కార్తీకమాసం, శ్రావణ మాసాలలో ఇక్కడికి పెద్ద యెత్తున భక్తులు, కొత్తగా వివాహం జరిగిన దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు జరుపుతారు. ఒకేసారి ఎక్కువ మంది వ్రతాలలో పాల్గొనేలా ఇక్కడ ఆలయప్రాంగణం నిర్మింపబడి ఉండడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగదు. హనుమాన్జయంతి, శ్రీరామనవమి పర్వదినాలలో ఇక్కడ పూజలు, పండుగలు, వ్రతాలు వైభవంగా జరుగుతాయి. కేవలం మెదక్‌జిల్లా నుండి మాత్రమే కాకుండా తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికై తరలివస్తారు.❋

(ఆధారం- శ్రీ విజయకుమార్ వ్యాసం-10-2-17)

92) స్వయంభు శ్రీ బాలాంజనేయ దేవాలయం-బాగ్ అంబర్‌పేట

సాధారణంగా హనుమంతుడు భక్తాంజనేయుడిగా, ప్రసన్నాంజ నేయుడిగా, వీరాంజనేయుడిగా దర్శనమిస్తుంటాడు. అలాంటిది బాలాంజ నేయుడిగా కొలువై వుండటం ఇక్కడి విశేషంగా చెబుతుంటారు. వందల సంవత్సరాల క్రితమే ఇక్కడ హనుమంతుడు వెలిశాడని స్థానికులు చెబుతుంటారు. ఈ ప్రాంతం అడవిని తలపించే కాలంలో పాదచారులకు స్వామి దర్శనమిచ్చి, తన జాడను తెలియజేశాడని అంటారు. ఆనాటి నుంచి స్వామివారికి పూజాభిషేకాలు నిర్వహిస్తూవస్తున్నారు.

కాలక్రమంలో స్వామివారికి ఆలయాన్ని నిర్మించడం, దానిని అభివృద్ధి పరుస్తూ రావడం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆలయ ప్రాంగణంలో భవానీ సమేత అమరలింగేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాలు కొలువు దీరాయి. ఇక్కడి బాలాంజనేయుడు భక్తసులభుడని అంటారు. భక్తిశ్రద్ధలతో ఆయనను సేవించిన వారిని గ్రహదోషాలు బాధించవని చెబుతుంటారు. జ్ఞానాన్ని, సంపదలను ప్రసాదించే బాలాంజనేయ స్వామికి ప్రతి మంగళవారం ఆకుపూజలు, వడమాల సమర్పణలు జరుగుతుంటాయి. హనుమజ్జయంతి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ రోజున విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన ఆశీస్సులను, అభయాన్ని పొందుతుంటారు.❋

93) అఖండజ్యోతితో శ్రీ ఆంజనేయస్వామి-మున్ననూరు

పాలమూరుజిల్లా గోపాలపేట మండలంలో మున్ననూరులో పురాతనమైన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. సుమారు 200 సంవత్సరాల క్రిందట బొబ్బిలి రాజులు యుద్ధంకి వెడుతూ ప్రతిష్ఠించిన విగ్రహం. అఖండ జ్యోతిదీపం ఆరకుండా వెలుగుతోంది. దీన్ని బొబ్బిలి రాజులు వెలిగించారు.❋

94) ఉత్తరాదిమఠం ఉత్తరాముఖ ఆంజనేయస్వామి-గద్వాల

గద్వాల జిల్లా గద్వాల ఉత్తరాది మఠం ఉత్తరాముఖ ఆంజనేయస్వామి దేవస్థానం మఠం నిర్వాహకుల సంకల్ప బలంతో ఆలయంపు నర్జీవం పోసుకుంది. నూతన హంగులను తీర్చిదిద్దుకుంది. తన పూర్వవైభవాన్ని చాటుకుంది. 2017 జూన్ 26న ఉత్తరాది మఠాధిపతులైన శ్రీ శ్రీ 1008 శ్రీ సత్యాత్మతీర్థుల చేతుల మీదుగా విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతన ఆలయ శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగనున్నాయి. అందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆలయ విశిష్టత- జిల్లాకేంద్రంలోని రాజవీధిలో ఉన్న ఉత్తరముఖ ఆంజనేయస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఆలయానికి 150 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు నాటి చరిత్రకారులు చెబుతున్నారు. శ్రీమాన్మ ధ్వాచార్య మూల మహా సంస్థానాదీశులు ఉత్తరాదిమఠం అప్పటి పీఠాధిపతి సత్యబోదుల తీర్థుల చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠగా వించినట్లుగా చరిత్ర చెబుతోంది. 18వ శతాబ్దంలో స్వామి గద్వాల సంస్థానాన్ని సందర్శించి తన అపార పాండిత్యంతో సంస్థానంలోని మహా మహా పండితులను ఓడించారు. ఇందుకు సంతసించిన గద్వాల రాజులు కొంత భూమిని, ప్రస్తుత రాజవీధిలోగల ఉత్తరాదిమఠం స్థలాన్ని బహుమానంగా సమర్పించుకున్నారు. స్థల మహిమను గుర్తించిన స్వామివారు వెను వెంటనే ఉత్తర ముఖాన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. స్వామి సూచన మేరకు రాజులు నిత్యం స్వామివారిని కొలిచేవారని నాటి చరిత్రకారులు చెబుతున్నారు.

ఉత్తర ముఖాన ఆలయం- మనకు ఎక్కడ చూసినా ఆంజనేయస్వామి ఆలయాలన్ని కూడా దక్షిణ ముఖాన ఉంటాయి. కానీ ఈ ఆలయం మాత్రం

ఉత్తర ముఖాన ఉంటుంది. అందుకే ఉత్తరాధి ఆంజనేయస్వామి అనిపిలుస్తారు. ఉత్తర ముఖాన స్వామి కొలువై ఉండడంతో ఎంతో ప్రాధాన్యత ఈ ఆలయానికి సంతరించుకుంది. స్వామిని దర్శించుకున్నంతనే కోరిన కోరికలు తీరి సకల పాపాలు తొలుగుతాయన్నది భక్తుల నమ్మకం.

ఆలయానికి పూర్వవైభవం- ఎంతో విశిష్టత కలిగిన ఉత్తరాది ఆంజనేయస్వామి ఆలయం గత కొంత కాలంగా నిత్యపూజలకు కూడా నోచుకోకుండా ఉండేది. మఠపీఠాధిపతి ఆదేశానుసారం నిర్వాహకులు కౌన్సిలర్భీంషేన్రావు, మోహన్రావు, ప్రహ్లాదాచారిలు ఆలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. పీఠాధిపతి, భక్తుల సహకారంతో ఆయానికి పూర్వవైభాన్ని తీసుకొచ్చారు.

పూజలు ప్రారంభం- ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ, శిఖరం ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 6 గంటల నుంచే ప్రత్యేకపూజలు ప్రారంభం అయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవాచనము, ఋత్విగ్వర్ణము, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, జప హోమాధులు తదితర పూజాకార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠ- నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆలయంలో సోమవారం ఉత్తరాధిమఠం పీఠాధిపతులు శ్రీ శ్రీ 1008 శ్రీ సత్యాత్మ తీర్థుల చేతుల మీదుగా స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శిఖరస్థాపన, ధ్వజస్తంభ స్థాపన కూడా స్వామి చేస్తారు. భక్తాదులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

మరికొన్ని తెలంగాణ ప్రసిద్ధమైన హనుమాన్ దేవాలయాలు

వీటి వివరాలు తెలియలేదు. అయినా చూడదగ్గ హనుమాలయాలే.

❋ నల్లబండగూడెం, నల్గండజిల్లా: పంచముఖ ఆంజనేయస్వామి

❋ సప్తముఖ హనుమ క్షేత్రం: రంగారెడ్డి జిల్లాలోని 'కాళ్లాపూర్' సమీపంలోని 'సప్తముఖ హనుమ క్షేత్రం'. ఈ క్షేత్రం అత్యంత పురాతనమైనదిగా చెప్పబడుతోంది. త్రేతాయుగంలో సీతారాములు తిరుగాడిన పుణ్య ప్రదేశం కనుక, హనుమంతుడు ఈ ప్రదేశంలో స్వయంభువుగా ఆవిర్భవించాడని అంటారు. మహర్షులు, మునులు, మహాభక్తులు దర్శించిన స్వామి ఆలయం,

ఆ తరువాత కాలంలో శిధిలావస్థకు చేరుకోగా ఓ భక్తుడు పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టాడు. కొన్ని వందల సంవత్సరాల క్రితమే ఈ పునరుద్ధరణ కార్యక్రమాలు జరిగాయి. ఆనాటి నుంచి స్వామివారికి నిత్యపూజాభిషేకాలు జరుగుతూ వస్తున్నాయి. గర్భాలయంలో స్వామివారు విగ్రహ రూపంలో కాకుండా రాతి పలకల రూపంలో దర్శనమిస్తూ వుంటాడు. పురాణపరమైన నేపథ్యం వున్న కారణంగా ఈ క్షేత్రానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. పర్వదినాల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతూ వుంటుంది.

❋ నల్గొండ జిల్లా చిట్యాల మండల పరిధి 'వెలిమినేడు'లో దర్శనమిస్తుంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కనే ఈ ఆలయం కనిపిస్తూ వుంటుంది. చూడటానికి ఆలయం చిన్నదే అయినప్పటికీ, ఇక్కడి హనుమంతుడికి వందల సంవత్సరాల చరిత్ర వుంది. ఇక్కడి హనుమంతుడు చల్లని మనసున్న వాడని భక్తులు చెబుతుంటారు.

❋ నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని 'బాదలాపురం'లో హనుమంతుడు కూడా రక్షకుడిగా ఊరు మొదట్లోనే దర్శనమిస్తూ వుంటాడు. చాలాకాలం క్రితం ఈ గ్రామానికి చెందిన ఓ భక్తుడు, ఇక్కడ హనుమంతుడికి ఆలయాన్ని నిర్మించాలని అనుకున్నాడట. సూర్యాపేట మండలానికి చెందిన 'దురాజ్ పల్లి' గుట్టపైన గల ఒక బండరాయిని ఎంచుకుని హనుమంతుడి విగ్రహాన్ని చెక్కిస్తాడు. శిలపై స్వామివారి రూపాన్ని మలచడం పూర్తి కావడంతో, దానిని తీసుకు వెళ్లడానికి గ్రామస్తులు కొందరు వస్తారు. కానీ కొండ భాగంలో వున్న ఆ విగ్రహాన్ని కిందికి దింపి ట్రాక్టర్లో ఉంచడానికి వాళ్లు ఎంతగా ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోతుంది. ఇక తమ వలన కాదనీ, దయచేసి తమతో రమ్మని వాళ్లు స్వామివారిని ప్రాధేయపడతారు. అంతే! అంతా చూస్తుండగానే ఆ విగ్రహం పైనుంచి జారుతూ వచ్చి ట్రాక్టర్ తొట్లోకి చేరింది. ఊహించని ఈ సంఘటనకి వాళ్లంతా ఆశ్చర్యపోతారు. ఆనందోత్సాహాలతో స్వామివారిని తీసుకుని వచ్చి ప్రతిష్ఠిస్తారు. ఆ రోజు నుంచి స్వామివారికి నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.

❋ నల్గొండ జిల్లా పరిధిలో 'కోదాడ'లో ఈ క్షేత్రం, కోదాడ నుంచి హుజూర్ నగర్ వెళ్లే రహదారి పక్కన కనిపిస్తూ వుంటుంది. ఇక్కడ స్వామి

'అభయాంజనేయుడు'గా దర్శనమిస్తూ వుంటాడు.

❋ నల్గొండ జిల్లా త్రిపురారం మండలం పరిధిలో ఈ 'తుంగపాడు' క్షేత్రం విలసిల్లుతోంది. ఇక్కడి గుట్టపై కొన్ని వందల సంవత్సరాల క్రితమే హనుమంతుడు వెలిశాడట. అప్పటి నుంచి గిరిజనులు స్వామిని తమ ఇలవేల్పుగా భావించి పూజిస్తూ వస్తున్నారు. తమని కాపాడుతున్నది ఈ స్వామియేనని చెబుతుంటారు. కొంతకాలం క్రితమే అంతా కలిసి స్వామికి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి స్వామివారిని పరిసర ప్రాంతాల్లోని గ్రామస్తులు సైతం దర్శిస్తున్నారు.

❋ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో విశేషమైన శ్రీ శివ,ఆంజనేయ దేవాలయం.

❋ అప్పాలే నైవేద్యం నల్గొండ జిల్లా నేరేడుచర్ల మండలంలో ఈ క్షేత్రం దర్శనమిస్తుంది. సువిశాలమైన ప్రదేశంలో నిర్మించబడిన ఈ ఆలయంలో స్వామివారు వీరాంజనేయుడుగా కొలువుదీరి వుంటాడు. ప్రతి మంగళవారం, శనివారాల్లో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. స్వామివారికి సిందూరాభిషేకం, ఆకుపూజను నిర్వహిస్తుంటారు. ప్రాచీనకాలం నుంచి ఇక్కడి హనుమంతుడు పూజలు అందుకుంటున్నాడనీ, ఆయన మహిమలు ఎంతోమంది అనుభవంలోకి వచ్చాయని చెబుతారు. హనుమంతుడికి అప్పాలంటే చాలా ఇష్టమనీ, వాటిని ఆయనకి నైవేద్యంగా సమర్పిస్తే ప్రీతిచెందుతాడని అంటారు. అలా ఆయన ప్రీతి చెందడం వలన ఆశించిన ఫలితం త్వరగా దక్కుతుందని భక్తులు విశ్వసిస్తుంటారు.

❋ నల్గొండజిల్లా గరిడేపల్లి మండలం పరిధిలో 'హనుమంతుల గూడెం' ఈ ఆలయం కొలువై ఉంది. ఇక్కడ ఆవిర్భవించిన హనుమంతుడికి వందల సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతుంటారు. ముందుగా స్వామివారే ఇక్కడ ఆవిర్భవించాడనీ, ఆ తరువాతే గ్రామం ఏర్పడిందని అంటారు. ఈ కారణంగానే ఈ గ్రామానికి హనుమంతులగూడెం అనే పేరు వచ్చిందని చెబుతారు.

❋ నల్గొండజిల్లా మిర్యాలగూడ మండలంలో 'రాళ్లవాగుతండ' ఈ ఆలయం దర్శనమిస్తుంది. ఇక్కడి హనుమంతుడు ప్రాచీనకాలం నుంచి పూజలు అందుకుంటూ ఉన్నాడని అంటారు.

❋ నల్గొండ జిల్లా నేరేడుచర్ల మండలంలో 'బొత్తలపాలెం'లో. ప్రాచీనకాలం నాటి ఈ ఆలయంలో 'భక్తాంజనేయుడు' దర్శనమిస్తూ వుంటాడు. ఈ స్వామిని దర్శించి పూజించడం వలన ఆపదలు తొలగిపోతాయని భక్తులు అనుభవపూర్వకంగా చెబుతుంటారు.

❋ వరంగల్ జిల్లా హసన్ పర్తి మండలం 'బీమారం' రహదారిలో దర్శనమిస్తుంది. భక్తుల సంకల్ప బలం కారణంగా ఇక్కడ దాసాంజనేయస్వామి దర్శనమిస్తూ వుంటాడు. కుదురుగా కనిపించే ఈ ఆలయంలోకి అడుగుపెట్టగానే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. కొత్తగా ఏదైనా పనిని ప్రారంభించేవాళ్లు ఈ స్వామివారితో చెప్పుకుని ఆయన ఆశీస్సులు తీసుకుంటూ వుంటారు.

❋ నల్గొండ జిల్లా గరిడేపల్లి మండలంలో 'పరెడ్డిగూడెం'ఆలయం అలరారుతోంది.

❋ ఖమ్మం జిల్లా కేంద్రానికి సమీపంలో ఈ 'అల్లిపురం'క్షేత్రం విలసిల్లుతోంది. ఇక్కడి ప్రసన్నాంజనేయుడి ఆలయం ప్రాచీనతను ప్రతిబింబిస్తూ ఉంటుంది.

❋ అమ్మ వున్న చోటునే హనుమంతుడు: హనుమంతుడి తల్లి అంజనాదేవి పేరుతో ఈ గ్రామం 'అంజనాపురం'గా ఏర్పడిందనీ, అయితే కాలక్రమంలో ఈ పేరు మార్పుకిలోనై 'అంజలీపురం'గా పిలవబడుతోందని చెబుతుంటారు. నల్గొండ జిల్లా హుజూర్ నగర్ మండలం పరిధిలో ఈ క్షేత్రం విలసిల్లుతోంది. పూర్వకాలంలో అంజనాదేవి ఈ ప్రదేశంలో తపస్సు చేసుకుందట. తల్లి తపస్సు చేసుకున్న ఈ ప్రదేశమంటే హనుమంతుడికి ఎంతో ఇష్టమట. అందువలన ఆయన ఈ ప్రదేశంలో విగ్రహరూపంలో కొలువుదీరడం జరిగిందని అంటారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఇక్కడి హనుమంతుడికి ఒకప్పుడు చిన్నమందిరం ఉండేది. **స్థలపురాణం–** స్వామివారి మహిమలు వెలుగులోకి రావడంలో గ్రామస్తులంతా కలిసి ఆయనకి ఆలయాన్ని నిర్మించారు. చాలాకాలం క్రితమే నిర్మించబడిన ఈ ఆలయం అంచెలంచలుగా అభివృద్ధి చెందుతూ వస్తోంది.

❋ ప్రదక్షిణలు చేస్తే చాలట! నల్గొండ జిల్లా త్రిపురారం మండలం పరిధిలో 'కంపాలపల్లి' గ్రామం. విశాలమైన ప్రదేశంలో నిర్మించబడిన ఈ ఆలయంలో

'భక్తాంజనేయస్వామి' కొలువుదీరి వుంటాడు. ప్రాచీనకాలం నుంచి స్వామి ఇక్కడ పూజాభిషేకాలు అందుకుంటున్నాడని చెబుతుంటారు. ఇక్కడి హనుమంతుడు ప్రదక్షిణలతోనే ప్రీతిచెందుతాడని అంటారు. అందువలన భక్తులు స్వామివారికి తమ మనసులోని కోరికను చెప్పుకుని, ముందుగా అనుకున్న ప్రకారం ప్రదక్షిణలు చేస్తుంటారు. అలా అనునిత్యం గానీ, మంగళవారాల్లోగాని ప్రదక్షిణ చేసినవారి మనోభీష్టాలు తప్పక నెరవేరతాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు. స్వామి అనుగ్రహం లభించాక ఆయనకి సిందూరంతో అభిషేకం, ఆకుపూజ చేయిస్తుంటారు. స్వామి కరుణా కటాక్షాల వలన శారీరక, మానసిక పరమైన అనారోగ్యాల నుంచి బయటపడినవాళ్లు, ఆశించిన శుభాలను పొందినవాళ్లు ఎంతోమంది వున్నారని అంటారు. ఇక్కడి భక్తాంజనేయస్వామికి భక్తితో ప్రదక్షిణలు చేస్తే చాలు, ఆయన వెన్నంటి కాపాడుతూ ఉంటాడనే ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటిస్తుంటారు.

-నల్గొండ జిల్లా వేములపల్లి మండలం పరిధిలో గల ఈ'రావులపెంట' క్షేత్రంలో ప్రాచీనకాలానికి చెందిన 'వీరాంజనేయుడు' దర్శనమిస్తూ వుంటాడు. ప్రాచీనకాలానికి చెందిన ఇక్కడి హనుమంతుడు నిరాదరణకి గురికాగా, స్వామివారు ఒక భక్తురాలికి స్వప్నంలో కనిపించి ఆలయ జీర్ణోద్ధారణ గావించి తనకి నిత్యసేవాలు జరిగేలా చూడమని చెప్పాడట. అక్కడి అర్చకుడికి ఈ విషయాన్ని తెలిపిన ఆమె, ఆయన సహకారంతో స్వామివారి ఆదేశాన్ని పూర్తిచేసింది. ఆనాటి నుంచి ఈ ఆలయాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇక్కడి హనుమంతుడికి పదకొండు ప్రదక్షిణలు చేసి, సిందూర అభిషేకం చేయించి, వడమాలను నైవేద్యంగా సమర్పిస్తే చాలు, మనసులోని కోరికలు అనతి కాలంలోనే తీరిపోతాయని చెబుతుంటారు. స్వామి దర్శనం భాగ్యం వలన తలపెట్టినకార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవుతాయనీ, సమస్యలన్నీ తొలగిపోయి సకలశుభాలు కలుగుతాయని అంటారు.

❋ నల్గొండ జిల్లా 'ఆళ్లగడప' సమీపంలో 'అమృత్ నగర్' ఈ ఆలయం కనిపిస్తూ వుంటుంది. చాలాకాలంగా ఇక్కడ 'భక్తాంజనేయస్వామి' కొలువై వున్నాడు. ఇక్కడి స్వామివారిని పూజించడం వలన అనారోగ్యాలు తొలగి పోతాయని భక్తులు చెబుతుంటారు.

❋ వరంగల్ జిల్లా జనగామ మండలం పరిధిలో ఈ 'నిడుగొండ' క్షేత్రం అలరారుతోంది. ప్రధాన రహదారి పక్కనేగల ఈ క్షేత్రాన్ని చూడగానే, ఇది ప్రాచీనమైనదనే విషయం అర్ధమవుతుంది. ఇక హనుమంతుడి పట్ల ఇక్కడి భక్తులు అపారమైన విశ్వాసంతో కనిపిస్తుంటారు. ఆ స్వామి దర్శనమాత్రం చేతనే ఆయన అభయం లభిస్తుందని అంటారు.

❋ నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం పరిధిలో 'కొండ్రపోలు' ఈ క్షేత్రం అలరారుతోంది. మిర్యాలగూడ నుంచి 'వాడపల్లి' వెళ్లే దారిలో రహదారికి కాస్త దూరంలో గుట్టపై ఈ క్షేత్రం కనిపిస్తూ ఉంటుంది. ఇటు నుంచి వెళ్లే ప్రయాణికులు, అటు నుంచి వచ్చే ప్రయాణికులు ఈ క్షేత్రాన్ని ఎక్కువగా దర్శించుకుంటూ వుంటారు.

❋ అదిలాబాద్ జిల్లా నస్పూర్‌లో శ్రీ రామాంజనేయ దేవాలయం ప్రసిద్ధమైనది.

❋ ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ అడవిలో శ్రీహనుమాన్ దేవాలయం ఉన్నది. దీనినే జంగిల్ హనుమాన్‌అంటారు.

❋ హైదరాబాద్ ఉప్పల్-హబ్సిగూడ మార్గంలో అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. పర్వదినాల్లో భక్తులతో ఆలయం కిట కిటలాడుతోంది.

❋ ఉప్పల్ రింగ్‌రోడ్డు దగ్గర శ్రీ బాలాంజనేయస్వామి దేవాలయం కూడా ఉన్నది.

❋ శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం-నామాలగుండు

❋ కామారెడ్డి పట్టణంలోని ఆర్బినగర్ కాలనీలో ఉన్న హనుమాన్ దేవాలయం.

❋ మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి ఆంజనేయస్వామి ఆలయం 1810-1840ల మధ్య కాలంలో నిర్మితమైనట్టు భావిస్తున్నరు. 1878లో ఉద్దాల మండపాన్ని నిర్మించగా, నగారాబంగ్లా (నవత్ఖాన బంగ్ల) వాద్యకారుల కోసం 1857-78 మధ్యకాలంలో నిర్మితమైనట్టు చెబుతున్నరు.

❋ బూర్గంపాడు మండలం సారపాకలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయం.

❋ వేములవాడ, సిరిసిల్లకి మధ్యన అగ్రహారం. ఆంజనేయస్వామి గుడి, భీమన్న గుడిలోని ఆంజనేయస్వామి గుడి.❋

కర్ణాటక రాష్ట్రం

95) వ్యాసరాయ ప్రతిష్టిత ప్రాణరాయ హనుమాన్ బొమ్మఘట్ట-బళ్ళారి

కర్ణాటకలో బళ్ళారి జిల్లా బొమ్మ ఘట్ట అనే చిన్న గ్రామంలో వ్యాస రాయలు ప్రతిష్టించిన ప్రాణరాయ హనుమాన్ మహా మహిమాన్వితమైనది. ఈ స్వామినే 'హులికుంట రాయ' అనీ ఆప్యాయంగా పిలుస్తారు. ఇక్కడ జరిగే రథోత్సవం కన్నుల పండువుగా ఉండటం ప్రత్యేకత. ఈ ఆలయానికి ఒక స్థానిక కథనం ఉంది.

వింత ఆవు

ఒకప్పుడు ఒక పసువులకాపరి తన ఆవులను అడవిలోకి తీసుకొని వెళ్లి మేపేవాడు. అప్పుడు ఒక వింత ఆవు అతనికి కనిపించి మందలో కలిసిపోయింది. అన్ని ఆవులు మేసే చోట కాకుండా అది వేరే చోట మేత మేసేది. దీన్ని గమనించాడు కాపరి. మిగిలిన అవులకంటే పాలు కూడా తక్కువే ఇచ్చేది. కోపం వచ్చి కర్రతో కొట్టాడు గోవు దేవత అనే విచక్షణ కూడా మర్చిపోయి. తర్వాత పశ్చాత్తాప పడ్డాడు. అంతలో ఆ ఆవులో గొప్ప వెలుగు గోచరించింది. అది దివ్య ధేనువు అని అర్ధమైంది. ఆ రోజు రాత్రి కలలో అతనికి ప్రాణ దేవర (ఆంజనేయుడు) కనిపించి గోవు ద్వారా తాను చేస్తున్న లీలయే ఇదంతా అని చెప్పాడు. ఆవు ఎక్కడ నిలబడి పాలు కురిపిస్తోందో అక్కడికి వెళ్లి గమనించమని కూడా చెప్పాడు.

మర్నాడు ఉదయం గ్రామ పెద్దలందరికీ జరిగిన సంగతి వివరించి చెప్పాడు. ప్రాణ దేవర తమ గ్రామంలో స్థిరపడటానికి ఇష్టంగా ఉన్నాడని గ్రామస్తులు చాలా సంతోషించారు. అందరూ ఆ పొద దగ్గరకు వెళ్ళారు.

ఈ వింత ఆవు అక్కడ గంటలకొద్దీ నిలబడి పోవటం గమనించి ఆశ్చర్యపోయారు. అక్కడ ఉన్న పొద, గట్రా తొలగించి చూశారు. అక్కడ శిలా రూపంలో 'ప్రాణ దేవర' కనిపించాడు.

ప్రాణ దేవర హనుమాన్

ప్రాణ దేవర స్వామి కుడి చేయి పైకెత్తి రావణాసురుని మర్దిస్తున్న రీతిలోనే కాక భక్తులందరికీ ఆశీస్సులు అందజేస్తున్నట్లుగా కూడా ఉంటుంది. పైకి ఎత్తిన లాంగూలం (తోక) ధైర్య సాహసాలను ప్రబోదించేదిగా ఉంటుంది. భీమునిలాగా గదాయుదాన్ని ధరించి ఉంటాడు స్వామి. సిగ ముడి మధ్వాచార్య సిగముడిని పోలి ఉండటం విశేషం. శిల పైభాగంలో ఉన్న సూర్య చంద్రులు శ్రీ జనమేజయునితో సంబంధాన్ని తెలియజేస్తుందని అంటారు. స్వామి కాళ్ళ కింద దుష్ట స్వభావానికి ప్రతీక అయిన రాక్షసుడు మర్దింప బడుతూ ఉంటాడు. అంటే స్వామి దుష్ట శిక్షణ చేస్తాడని భావం. ఇంతకాలం పూజా పునస్కారాలకు నోచుకోకుండా స్వామి అక్కడ అక్కడ పడి ఉన్నాడంటే ఆయనకు తగిన ప్రదేశం లభించక పోవటమే అని అందరూ భావించారు.

స్వామి కోరుకొన్న చోటనే ప్రతిష్ట

మర్నాడు ఉదయం గ్రామస్తులంతా శ్రీ ప్రాణ దేవర శిలా విగ్రహాన్ని గ్రామంలోకి తీసుకొని వెళ్లి ప్రతిష్ట చేయాలని నిర్ణయించారు ఒక రధంలో స్వామిని పూల హారాలతో ముంచేసి ఊరేగింపుగా తీసుకొని వెళ్ళే ప్రయత్నం చేశారు కాని రధం అక్కడి నుండి అయిదు వందల అడుగులు ప్రయాణం చేసిన తర్వాత ఆగిపోయి అందరినీ ఆశ్చర్యపరచింది ఎంత ప్రయత్నించినా వారి ప్రయత్నాలు విఫలమైనాయి. ఆ రాత్రి వారందరూ అక్కడే నిద్రించారు. అందులో ఒక మంచి మనిషి కలలో స్వామి కనిపించి తనను రధం ఆగిన చోటు వద్దే ప్రతిష్ట చేయమని కోరాడు.

స్వామి మనోభీష్టం మేరకు అక్కడే ప్రాణ దేవర హనుమాన్ మూర్తిని రంగ రంగ వైభవంగా ప్రతిష్టించారు. నిత్య ధూప దీప నైవేద్యాలను ఆ రోజునుండే ప్రారంభించారు. అర్చకస్వామిగా 'హులియప్పన్' నియమింపబడ్డారు. 'హులి పూదే' అనే పొద వద్ద లభించిన విగ్రహం కనుక ఈ క్షేత్ర స్వామి అయిన ప్రాణ దేవరకు 'హులి కుంటేశ స్వామి' లేక

'హులికుంట రాయ' అని పేరు వచ్చింది.

వ్యాస రాయల పునః ప్రతిష్ట

వ్యాసరాయలు ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు ఈ స్వామి విశేషాలు తెలుసుకొని ఈ క్షేత్రంలో చాతుర్మాస్య దీక్ష నిర్వహించారు. వ్యాసరాయల వారి ఆధ్వర్యంలో గర్భగుడి నిర్మాణం, ప్రాణ ప్రతిష్ట జరిగాయి. వ్యాసరాయలవారు ప్రాణదేవర హనుమాన్ మూర్తిని తమ దివ్య హస్తాలతో పునః ప్రతిష్ట చేశారు. ఆలయానికి తూర్పు వైపు ఒక పుష్కరిణిని గ్రామప్రజలు త్రవ్వించే ప్రయత్నం చేశారు. పుష్కరిణి కోసం మట్టి తవ్వుతుంటే 'పెద్ద నిధి' బయటపడింది. దీన్ని ఉపయోగించి పుష్కరిణిని తీర్చి దిద్దారు. వడిరాజ స్వామి ఈ పుష్కరిణి ప్రాంతానికి ఒకప్పుడు నడిచి వచ్చినప్పుడు అక్కడ పుష్కరిణిలో రుద్రమూర్తి దొరికింది. దాన్ని పుష్కరిణి ఒడ్డున ప్రతిష్ఠించి 'శ్రీ గంగాధర' అని పేరుపెట్టారు.

శ్రీ రామచంద్రమూర్తి దేవాలయం

1807లో మంత్రాలయ రాఘవేంద్రస్వామి వారసులు శ్రీ సుభోదేంద్ర తీర్థ స్వామి, శ్రీ నంజన్ గూడు శ్రీ రామశాస్త్రి దేవర అందజేసిన శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ గరుడ విగ్రహాలను ప్రతిష్టించి శ్రీ రామాలయం న్నిర్మించారు. తర్వాత నవ గ్రహ ప్రతిష్టను సుసమీంద్ర తీర్దులవారు నిర్వహించారు. మధ్వాచార్య మతానికి చెందిన ఎందరో ప్రముఖులు ఈ క్షేత్రాన్ని సందర్శించారు. అంటే ఈ క్షేత్ర ప్రసిద్ధి ఎంతటిదో తెలుస్తుంది. ప్రతి ఎదాది జరిగే రదోత్సవానికి వేలాది మంది భక్తులు దేశం నలుమూల నుండి వచ్చి దర్శించి తరిస్తారు.❋



96) శ్రీ ఆనెగొంది ఆంజనేయస్వామి-హాస్పేట

కర్ణాటక రాష్ట్రం బళ్ళారి దగ్గరున్న హాస్పేట్‌కు సమీపంలో ఆనెగొంది చారిత్రక ప్రదేశం. దీనికి సమీపంలో అంజనాద్రిపై శ్రీ ఆంజనేయస్వామి కొలువై ఉంటాడు. ఆనే గొంది అంటే కన్నడంలో 'ఏనుగుల మడుగు'. ఇక్కడే ఏనుగులు విశ్రాంతి తీసుకొనేవి. 'కృష్ణ దేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యంలో దీనికి ప్రాధాన్యం ఉంది. అలాగే రామాయణ కాలానికీ ఈ ప్రదేశానికి సంబంధం ఉంది. తుంగభద్రా తీరంలో కొప్పల్ జిల్లా గంగావతి తాలూకాలో ఆనెగొంది ఉంది. హంపికి ఇది అయిదు కిలో మీటర్ల దూరం. ఇదే రామాయణంలోని కిష్కింద. ఇది విజయనగర సామ్రాజ్యానికి వ్యతిరేక దిశలో ఉంటుంది. ఆనేగొంది శిల్పకళా వైభవం ఇప్పటికీ చెక్కు చెదరకుండా కాపాడబడుతోంది. ఇక్కడ ఎన్నో దేవాలయాలు దేవాలయ సముదాయాలు ఉన్నాయి అందరూ చూసి తీరాల్సినవే.

శ్రీ కృష్ణ దేవరాయల సామ్రాజ్య వైభవానికి స్ఫూర్తి చిహ్నం ఆనే గొంది. హంపీ పురాతన వార సత్వ సంపదకు ప్రపంచ గుర్తింపు ఉన్నచోటు.

ఇక్కడి అంజనాద్రి పైననే వానర వీరుడు శ్రీ హనుమాన్ జన్మించాడు. ఇక్కడి ఋష్యమూక పర్వతం వాలి సుగ్రీవుల కథకు ప్రాధాన్యత కలిగి ఉంది. ఆనెగొంది దాని చుట్టు ప్రక్కల ప్రదేశాలు రామాయణ గాధతో ముడిపడి ఉన్నాయి. మహా బలి వాలి కిష్కింధ సామ్రాజ్యం ఇదే. శ్రీరాముడు వాలి తమ్ముడు సుగ్రీవునికి అన్న వాలిని చంపి కిష్కింధకు పట్టం కట్టాడు. ఇక్కడే సుగ్రీవ శ్రీరామ సఖ్యాన్ని ఆంజనేయస్వామి కుదిర్చాడన్న సంగతీ మనకు తెలిసిందే. 'ది కిష్కింధ ట్రస్ట్' ఆధ్వర్యంలో టూరిజం డిపార్ట్మెంట్ ఆనే గొందిని రోల్ మోడల్ విలేజ్‌గా రూపొందించారు. ఇక్కడ దర్శించాల్సిన ముఖ్య ప్రదేశాలలో ముందుగా చెప్పుకోదగినది 'నవ బృందావనం'. ఇది తుంగభద్రా నదిలో ఉన్న చిన్న ద్వీపంలో ఉన్నది. మధ్వాచార్య మతానికి చెందిన ప్రసిద్ధ యోగులకు చెందిన తొమ్మిది బృందావనాలు అంటే సమాధులున్నాయి. ఆనె గొంది దగ్గర నది దాటి నవ బృందావనం చేరుకో వచ్చు. లేకపోతే హంపీ గుండా చేరుకోవచ్చు. పవిత్రమైన ఈ మధ్వాచార్యుల బృందావనాలను భక్తీ ప్రపత్తులతో దర్శించి తరిస్తారు.

రెండవ దర్శనీయ స్థలం 'నింబ వనం'. ఇదే వానర వీరుడు వాలిని దహనం చేసినచోటు. ఆతని శరీర చితాభస్మం పెద్ద కుప్పగా కనిపించి ఆశ్చర్యమేస్తుంది. మరొకటి ఆర్కలాజికల్ మ్యూజియం. ఇందులో విజయనగర సామ్రాజ్యానికి చెందిన అనేక వస్తువులు భద్రపరచారు. అంజనాద్రిపై శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం చూసి స్వామి జన్మించిన ప్రదేశాన్ని దర్శించి పునీతులౌతారు. ఇక్కడే 'ఏడు తలల సర్పం' ఆరాధనీయంగా కనిపిస్తుంది. శ్రీ కృష్ణ దేవరాయలు 64 విద్యలలో మహా నేర్పరి. ఆ విషయాన్ని గుర్తు చేయటానికి ఇక్కడ 64 స్తంభాలతో ఆయన సమాధిపై ఒక మండపం నిర్మించారు. ఇదీ చూడదగిన ప్రదేశమే. ఆనె గొంది ఇతిహాస, చారిత్రాత్మక ప్రాధాన్యత గల నగరం.❋

97) శ్రీ వీరాంజనేయ దేవాలయం-కక్కలూరు

కర్ణాటక రాష్ట్రం తిరువళ్లూర్ దగ్గర కక్కలూరు గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం చాలా పురాతనమై సుప్రసిద్ధమైనది. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీ కృష్ణ దేవరాయల ఆధ్యాత్మిక రాజ గురుదేవులు వ్యాసరాయలవారు భారత దేశ మంతా కాలినడకన పర్యటించి 732 ఆంజనేయ విగ్రహాలను ప్రతిష్టించారు. అవన్నీ ఒకే విధంగా ఉత్తరాభిముఖంగా ఉండటం ఒక చేతిలో పుష్పం కలిగి ఉండటం తోక చివర చిన్న గంట కట్టబడి ఉండటం ప్రత్యేకత. వ్యాస రాయల వారి పూర్వావతారం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామియే అని మనకు తెలిసిన విషయమే. ఈ చిన్న దేవాలయం లోనే శ్రీ రాఘవేంద్రస్వామి 14 సంవత్సరాలు ఉండి తపస్సు చేస్తూ తన కిష్టదైవమైన ఆంజనేయస్వామి వైభవంపై అనేక కీర్తనలు రాశారు. ఆలయంలో ఆనాడు రాఘవేంద్రస్వామి కూర్చుని తపస్సు చేసిన చోటుకు గుర్తుగా ఒక చిత్ర పటం ఉంటుంది. గోడలపై కక్కలూరు వీరాంజనేయ స్వామిపై రాఘవేంద్రస్వామి రచించిన కీర్తనలు చెక్కించారు.

ఈ ఆలయానికి మరో ప్రత్యేకత ఉంది. ఆలయం వెలుపల రావి, వేప వృక్షాలు పెనవేసుకొని విస్తృతంగా పెరిగి కనిపిస్తాయి. ఇవి దేవతా వృక్షాలు అని నమ్మకం. ఈ రెండు వృక్షాల మధ్య ఆలయ ముఖ ద్వారం వద్ద నిలబడి భక్తులు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించి త్రివిధ ఫలితాలను ఏక కాలంలో పొందుతారు. మనసులో కోరిన కోర్కెలన్నీ వెంటనే నెరవేరుతాయి. అంత మహిమాన్వితం ఆ చోటు. ఆలయానికి కొద్ది దూరంలో పాతాళ శివలింగం ఉన్నది. దీన్ని అగస్త్య మహర్షి పూజించాడని స్థానిక కథనం.❋

98) పురాతన శ్రీ ఆంజనేయ దేవాలయం-చేలూర్

ఆంధ్రకర్ణాటక సరిహద్దులోచేలూర్ గ్రామం చిక్క బల్లాపూర్ జిల్లాలో ఉంది. అందమైన ప్రకృతి దృశ్యాల మధ్య ఈ ప్రదేశం మహా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. చోళ రాజులు పాలించిన ప్రదేశం కనుక దీనికి చేలూర్ అనే పేరు వచ్చింది. ఇక్కడ పాపఘ్ని నదిలో లభించే ఇసుక చాలా నాణ్యమైనదని పేరు. అందుకే ఇక్కడి ఇసుకకు మహా గిరాకీ ఉంటుంది. పాపాఘ్ని నది ఒడ్డున శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. ఆలయ కుడ్యాలపై అనేక ప్రాచీన లిపులకు చెందిన రాతలు ఉండటం విశేషం. హనుమాలయం దగ్గరే శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయమూ చూడ ముచ్చటగా ఉంది. పురావస్తు శాఖ దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం చాలా ఉందనిపిస్తుంది. ఈ ప్రాచీన కళాఖండాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిదీ.❋

99) వ్యాస రాయ ప్రతిష్ఠిత హనుమాన్ దేవాలయం-మూల భగల్

కృష్ణదేవరాయల రాజ గురువు శ్రీ వ్యాస రాయలు భక్త కనక దాసుకు, వాగ్గేయ కారుడు పురందర దాసులకు కూడా గురువే. సుమారు అయిదు వందల ఏళ్ళక్రితం వ్యాస రాయలు 732 ఆంజనేయ దేవాలయాలను ప్రతిష్టించినట్లు చరిత్ర చెబుతోంది. వ్యాసరాయలవారు-శంకు కర్ణుల, శ్రీవల్లభుల, రాఘవేంద్ర స్వాముల, భక్త ప్రహ్లాదుల అవతారం అంటారు. అలాగే కర్ణాటకలోని మూల భగల్‌లో కూడా వ్యాస రాయ ప్రతిష్టిత శ్రీ ఆంజనేయ దేవాలయం ఉన్నది.❋

100) శ్రీ ప్రసన్నాంజనేయ స్వామిదేవాలయం-రాగి గుడ్డ
రాగి ధాన్యం గుట్ట ఆంజనేయ విగ్రహంగా మారటం

కర్ణాటక రాష్ట్రంలో బెంగుళూరు మహానగరంలో జయనగర్ ప్రాంతంలో తెలుగు వారు ఎక్కువగా ఉన్నారు. జయనగర్ దగ్గరున్న రాగి గుడ్డ (గుట్ట) దగ్గర శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చాలా ప్రసిద్ధి చెందింది. బెంగుళూరు వెళ్ళిన పర్యాటకులు తప్పని సరిగా ఈ ఆలయాన్ని దర్శిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఈ స్వామిని భావిస్తారు. ఆలయం అయిదు యకరాల సువిశాల ప్రదేశంలో ఉంది. ఒకప్పుడు ఇక్కడి రైతులు తమ పొలాలలో పండిన రాగి ధాన్యాన్ని ఇక్కడ ఒక కుప్పగా పోస్తే అది ఆంజనేయ స్వరూపంగా మారిపోయి దర్శనమిచ్చాడట. అందుకనే ఈ క్షేత్రానికి రాగి గుట్ట లేక రాగి గుడ్డ ఆంజనేయస్వామి క్షేత్రం అని పేరు వచ్చిందట.

యువకులు కట్టిన ఆలయం-నేడు ప్రసిద్ధ దేవాలయాలలో ఒకటైంది

ఈ క్షేత్రం ఊరికి చాలా దూరంగా ప్రశాంత వాతావరణంలో ఎత్తైన ప్రదేశంలో ఉండటం ప్రత్యేకత. అక్కడ ఎన్నో రకాల ఫల వృక్షాలు పూల చెట్లు ఉండి ఎంతో రమణీయంగా ఉంటుంది. చూడదగ్గ క్షేత్రం. ఆంజనేయ ఆలయంతో బాటు, విఘ్నేశ్వర, రాజ రాజేశ్వరి దేవాలయాలు కూడా ఇక్కడ ఉన్నాయి. రాగి గుడ్డపై వెలసిన హనుమకు ఆలయం కట్టించటానికి సుమారు యాభై ఏళ్ళ క్రితం కొందరు యువకులు నడుం కట్టి పూనుకొన్నారు. ప్రజలందరినీ సమీకరించి అందరి సహకారంతో ఇక్కడ ఆలయ నిర్మాణం నిర్విఘ్నంగా పూర్తి చేశారు. ఇప్పుడు ఈ ఆలయం బెంగుళూరులోనే ఒక

ప్రసిద్ధ దేవాలయంగా విరాజిల్లుతోంది. ఇక్కడి ఆలయ సముదాయాలన్నీ ఒకే విధంగా ఉండి చూపరులకు పరమ వైభవ వోపేతంగా కనిపిస్తాయి. శారీరక, మానసిక ప్రశాంతతకు ఈ క్షేత్రం నిలయమై విరాజిల్లుతోంది. ఇక్కడ స్వామివారి గర్భ గుడిలో ఉన్నంత సేపు బాహ్య ప్రపంచం కనిపించనే కనిపించదు. కొండపైకి కష్టపడి మెట్లు ఎక్కివచ్చి స్వామిని దర్శించాలి. మోకాళ్ళ నొప్పులతో బాధ పడే వాళ్ళు సైతం మనసారా స్వామిని స్మరించి ఎక్కటం ప్రారంభిస్తే అలసట లేకుండా ఎక్కుతారు. అదీ ఇక్కడి జన విశ్వాసం. ఇదే స్వామి వారి మహిమగా భక్తులు గుర్తిస్తారు. దీనికి ఎందరో భక్తుల అనుభవాలే సాక్షాలు. చీడ, పీడా రోగాలబారిన పడిన వారిని స్వామి ఆదుకొని బాధా నివృత్తి చేస్తాడు. గాలి ధూళి భయాలను పోగొడతాడు. భక్తులు తమ వాహనాలపై స్వామి చిత్రం స్టిక్కర్ అంటించుకొని ప్రమాదాల నుండి రక్షించుకొంటారు. ప్రతి మంగళ శనివారాలలో స్వామికి తమల పాకు పూజలు చేస్తారు వడమాల వేస్తారు.

ఉత్సవాలు

రాగి గుడ్డ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ హనుమజ్జయంతిని 12 రోజులు మహా వైభవంగా నిర్వహిస్తారు. పన్నెండు రోజల్లో స్వామికి పన్నెండు అలంకారాలతో ముస్తాబు చేస్తారు. శ్రీరామనవమికి సీతారామ కల్యాణోత్సవం జరుపుతారు. ఇక్కడి వినాయక స్వామిని దర్శించి పూజిస్తే పనులలో ఏర్పడ్డ విఘ్నాలు తొలగిపోతాయన్న నమ్మకం ఉంది. ఇక్కడ చేసే గణపతి హోమానికి ప్రత్యేకత ఉంది. అలాగే అమ్మవారు శ్రీ దేవీ రాజ రాజేశ్వరికి నవరాత్రి ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహిస్తారు.

త్రిమూర్తులు దర్శించిన క్షేత్రం

రాగి గుడ్డపై శ్రీ ఆంజనేయస్వామి వెలసినప్పుడు త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఇక్కడికి వచ్చి బస చేశారాని పౌరాణిక కథనం ఉంది. అంతేకాక ఒకే పానవట్టంపై త్రిమూర్తులు అధిష్టించి ఉండటం మరో గొప్ప ప్రత్యేకత. ఇక్కడ హనుమాన్ ధారా అనే జలపాతం విశిష్టమైనది. యాగ శాల, గో శాలలు కూడా ఉన్నాయి. ఇక్కడి గోశాలలో పెంచే గోవుల నుండి పిండిన ఆవు పాలను శ్రీ ఆంజనేయ స్వామి అభిషేకానికి వినియోగిస్తారు.

మిగిలిన పాలను నర్సరీ విద్యార్థులకు ఉచితంగా అందజేస్తారు.

ఆలయ ట్రస్ట్ సేవలు

ఒక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయానికి అనుబంధంగా ఒక హైస్కూల్ నడుపుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. ఇంజనీరింగ్ వంటి వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు కోచింగ్ ఇస్తారు. వివిధ విద్యా సంస్థలలో పని చేసే ప్రొఫెసర్లు, లెక్చరర్లు ఇక్కడికి వచ్చి విద్యార్థులకు శిక్షణనివ్వటం గమనించ దగిన విషయం. ఈ కేంద్రంలో ఉచితంగా వైద్య సలహాలు, ఇ.సి.జి. వంటి సదుపాయాలూ ఉన్నాయి. వివేకానంద యోగా కేంద్రం ద్వారా ఉచిత యోగా శిక్షణనిస్తున్నారు. దక్షిణాది భాషలలోను సంగీతంలోను ఉచిత శిక్షణ నిస్తున్నారు. ఆలయం ట్రస్ట్ బోర్డ్ స్వామి సేవలోనే కాక విద్యా వైద్య సేవలోనూ ధన్యమౌతోంది. రాగి గుడ్డ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దర్శనం సకల పాపహరం, మనోభీష్ట సిద్ధికరం.❋

101) శ్రీ ఆంజనేయ దేవాలయం-బెంగళూర్-బనస్వాది

కర్ణాటకలోని బెంగళూర్ దగ్గర కుందపురా–ఉడిపి మధ్య సాలిగ్రాంలో శ్రీ బనస్వాది ఆంజనేయ దేవాలయం వందేళ్ళ చరిత్ర కలిగి ఉన్నది. చైత్ర పూర్ణిమ రోజున శ్రీ హనుమజ్జయంతి చేస్తారు. ఆ రోజున ఆంజనేయ స్వామి కనుల నుండి కన్నీరు కారుతుంది. దీన్ని ప్రత్యక్షంగా వీక్షించటానికి వేలాది భక్తులు వస్తారు. ఆలయం ద్రావిడ శిల్పకళా రీతిలో నిర్మించబడింది. శ్రీరామశివ గణపతి దేవుళ్ళకు చిన్న చిన్న ఆలయాలున్నాయి. నిత్యార్చన నైవేద్యం హారతి అన్నీ సంప్రదాయ రీతిలోనే చేస్తారు. మధ్యాహ్న నివేదన అవగానే భక్తులకు స్వామి ప్రసాదంగా భోజనం పెడతారు . ఈ హనుమ మహా మహిమాన్వితుడని కోర్కెలను తీర్చే దైవమని అందరి నమ్మకం. స్వామి శంఖు చక్రాలతో రజత కవచంతో వరద హస్తంతో తోక పైకెత్తి దర్శనమిస్తాడు. సంవత్సరం అంతా ఏదో ఒక ప్రత్యేక పూజ నిర్వహిస్తారు. ఉగాది పండుగ నుండి అన్నదానం, అభిషేకం అలంకారం జరుపుతారు. హనుమజ్జయంతిని మహా వైభవంగా చేసి రథం మీద స్వామిని ఊరేగిస్తారు. ప్రతి శని, ఆదివారాలలో అన్నదానం జరుగుతుంది. కనీసం రెండు వేలమంది స్వామి ప్రసాదంగా భోజనం చేస్తారు.❋

102) శ్రీ ప్రసన్న వీరాంజనేయ దేవాలయం-బెంగళూర్

శ్రీ ప్రసన్న వీరాంజనేయస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహింప బడుతున్న శ్రీ ప్రసన్న వీరాంజనేయస్వామి దేవాలయం బెంగళూర్‌లో మహాలక్ష్మి లే అవుట్ దగ్గరలో ఉంది. పదమూడు ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ ఆలయంతోబాటు 12 అడుగుల ఎత్తైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారున్న శ్రీ మహాలక్ష్మి ఆలయం కూడా ఉంది. అమ్మవారు అయిదు అడుగుల పద్మంపైన ఉండటం విశేషం. ప్రశాంత వాతావరణంలో ఈ ప్రాంతం ఉంది. శ్రీ కోదండరామస్వామి శ్రీ ధ్యానాంజనేయ స్వామి కూడా కొలువై ఉంటారు.

ప్రధాన ఆలయం నలభై అడుగుల పొడవు నలభై అడుగుల వెడల్పు ఉంటుంది. గర్భగుడిలో శ్రీ ప్రసన్న వీరాంజనేయ స్వామి ఉంటారు. ఆలయ పైభాగం నలభై అడుగుల ఎత్తు ఉంది. దానిపైన గోపురం ఉంటుంది. స్వామిది నిలబడి ఉన్న ఏక శిలా విగ్రహరూపం. ప్రసన్నమైన కనుదోయితో వీరత్వం ఉట్టిపడే ఆకారంతో హనుమ కనిపిస్తాడు. భక్త వరదుడని విశ్వాసం.

మైసూరు మహా రాజా పాలనలో ఈ మహా లక్ష్మీపురం షూటింగ్ ప్రాక్టీస్‌కు కేంద్రంగా ఉండేది. చిన్న కొండపైన నిలువుగా ఉన్న ఒక పెద్ద రాయి 22 అడుగుల పొడవు 16 అడుగుల వెడల్పు కలిగి గురికి అనువుగా ఉండేది. అందమైన ప్రదేశం. పరవశింపజేసే ప్రకృతి. 1973లో ఈ ఆలయం ప్రారంభించబడి పూజాదికాలు ప్రారంభమైనాయి. ఒక కమిటీ ఏర్పడి శ్రీ షణ్ముఖానంద స్థపతి గారి చేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహాన్ని చెక్కించారు. ఇది ఇరవై రెండడుగుల నల్లరాయి విగ్రహం.

మాఘ శుద్ధ త్రయోదశినాడు శ్రీ హనుమజ్జయంతి చేస్తారు. వారం రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. జ్యేష్ట శుద్ధ దశమినాడు ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తారు. శ్రీరామ పట్టాభిషేకం సీతారామ కల్యాణం సత్యనారాయణ వ్రతం లక్ష్మీ పూజలు చేస్తారు.❋

103) శ్రీ సుందర ఆంజనేయ దేవాలయం-కాల్కెరి, బెంగళూర్

కర్ణాటకలోని బెంగళూర్ దగ్గర కాల్కేరిలో రామమూర్తి నగర్‌లో 'శ్రీ ముఖ్య ప్రాణ సేవా ట్రస్ట్' వారి ఆధ్వర్యంలో శ్రీ మురళీ ధరస్వామి వారి ఆశీస్సులతో నిర్మించబడి నిర్వహించబడుతున్న శ్రీ సుందర ఆంజనేయ దేవాలయం చాలా సుందర ప్రకృతి మధ్య మానసిక ఆహ్లాదిన్నిస్తుంది. ఇది వేద వ్యాస పురాణ పాఠశాలలో ఉంది.

ఈ ఆలయ నిర్మాణం వెనుక ఒక కథ ఉంది. ఒకసారి శ్రీ మురళీధర స్వామీజీ బెంగుళూర్ సందర్శించి ఈ ప్రదేశానికి వచ్చారు. భక్తులు స్వామీజిని అక్కడ ఒక పాఠశాలను, ఆంజనేయ దేవాలయాన్ని నిర్మించమని అర్ధించారు. ఆ మాట వినగానే స్వామీజీ ధ్యాన సమాధిలోకి వెళ్ళారు. సమాధి నుండి బయటికి వచ్చిన తర్వాత స్వామీజీ ఆ ప్రదేశమంతా శ్రీ ఆంజనేయస్వామి దివ్య విభూతి స్పందనలున్నాయని చెప్పారు. అప్పుడే ఒక ఆశ్చర్య సంఘటన జరిగింది. ఆకాశంలో సంజీవినీ పర్వతం ధరించిన ఆంజనేయస్వామి ఆకారంలో మేఘం దర్శనమిచ్చింది. దీన్ని దర్శించిన కొద్ది మంది భక్తులు తమ జీవితం ధన్యమైనదనుకొని అవాక్కయ్యారు. అందరూ ఆంజనేయస్వామి ఇక్కడ ప్రత్యక్షమైనాడని భావించారు. ఇక ఆలస్యం చేయలేదు. అప్పటికప్పుడే నిర్ణయం తీసుకొన్నారు. అక్కడే శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేయాలని సంకల్పించి స్వామీజీ ఆశీస్సులతో పని ప్రారంభించి హనుమత్ స్వామి, మురళీధర స్వామిజీ ఆశీస్సులతో ఆలయం అతి త్వరలో రూపు దిద్దుకొని 25-4-2008న మహా కుంభాభిషేకం నిర్వహించారు.

వాల్మీకి రామాయణంలో సుందర కాండలో ఆంజనేయస్వామిని

సుందర హనుమాన్ అంటారు. ఆ పేరే ఇక్కడి స్వామికి సుందర హనుమాన్ అని స్వామీజీ నామకరణం చేశారు. నిలబడి ఉండే ఆంజనేయ స్వామి అత్యంత సుందర రూపుడుగా భక్తుల కన్నుల పండువుగా దర్శనమిచ్చి పేరును సార్ధకం చేశాడు. ఈ స్వామి దర్శనం సకల అభీష్ట సిద్ధిదాయకం. ఆలయంలో నిత్యం సుప్రభాతం, పూజ, ప్రబోధం జరుగుతాయి. బాలభోగం పెడతారు. తర్వాత సహస్ర నామార్చన దాని తర్వాతా మహాపూజ చేస్తారు. పిమ్మట పుష్ప హారాలు సమర్పించి మహా నైవేద్యం అర్పించి మహా మంగళహారతి ఇస్తారు. సాయం పూజ నిర్వహించి నిత్యం డోలోత్సవం చేస్తారు.❋

104) శ్రీ ఆగార హనుమాన్ దేవాలయం-బెంగళూర్

కర్ణాటకలోని బెంగళూర్‌లో ఆగ్నేయ భాగంలో అందమైన ఆగారా సరస్సు ఉంది. దాని దగ్గరే శ్రీ ఆగారా ఆంజనేయ స్వామి 102 అడుగుల భారీ విగ్రహం ఉంది. ఇటీవల ఏర్పడినదే. ఇక్కడే ఉన్న జగన్నాథ స్వామి దేవాలయమూ దర్శించ తగినదే. ఈ రెండు ఆలయాలు చిన్నవే కాని బయట ఉన్న హనుమ విగ్రహం బృహత్తర రూపం. స్వామి పద్మంలో నిలబడి తూర్పు ముఖంగా ఉండటం ప్రత్యేకత. ఉదయం పూట స్వామి ముఖం దీదీప్యమానంగా, మధ్యాహ్నం వెనుకభాగం కాంతివంతంగా కనిపిస్తుంది. ప్రక్కనే నాగదేవతలు ఉంటారు. ఈ భారీ హనుమాన్ ముందున్న చిన్న దేవాలయాన్ని 'సీతారామ భక్త హనుమంత దేవాలయం' అని పిలుస్తారు. భారీ విగ్రహం వెనుక మరో ఆంజనేయ దేవాలయం ఉంది.❋

105) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం-మైసూర్

కర్ణాటకలోని మైసూర్‌లో 41 అడుగుల శ్రీ కార్యసిద్ధి హనుమాన్ విగ్రహాన్ని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి 26-12-2012న ఆవిష్కరించారు. విగ్రహం తయారీకి రెండు కోట్లు ఖర్చయింది. విగ్రహ శిల ఆంధ్రప్రదేశ్‌లోని పులివెందల దగ్గరున్న మేల్లెల గ్రామంకు చెందినది. అక్కడే సగంపైగా విగ్రహ నిర్మాణం చేయించి 90 చక్రాల భారీ వాహనంపై ఇక్కడికి తెచ్చి విగ్రహం పూర్తిగా మలిచారు. ముఖ్య స్థపతి శ్రీ సుబ్రహ్మణ్య ఆచార నేతృత్వంలో శిల్పులు పది నెలలు కష్టించి తయారు చేశారు. అష్ట దళ ఆకారం ఉన్న వేదికపై శ్రీ కార్యసిద్ధి హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. విగ్రహం 200 టన్నుల బరువు ఉంది.❋

106) శ్రీ కోటే ఆంజనేయస్వామి దేవాలయం-షిమోగా

కర్ణాటకలో కేలడి వంశానికి చెందిన. శివప్ప నాయకుడు 16వ శతాబ్దంలో పాలించిన ప్రదేశమే షిమోగా లేక శివ మొగ్గ. ఇక్కడే పురాతన ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. ఇదే కోటే హనుమాన్ ఆలయం. దీని చరిత్ర త్రేతాయుగం నాటిది. రామాయణంతో సంబంధం ఉంది. హనుమ సంజీవిని పర్వతం తెచ్చే కథతో ముడిపడి ఉంది. ఇది పెద్ద దేవాలయం భారీ సింహ ద్వారం ఉంది. తుంగా నది తీరంలో ఆలయం ఉంటుంది. ఇక్కడ దూర్వాస మహర్షి తపస్సు చేశాడు. అందుకనే దీన్ని 'దూర్వాస క్షేత్రం' అంటారు.❋



107) శ్రీ కోరంటి హనుమాన్ దేవాలయం-గుల్బర్గా

కర్ణాటకలో గుల్బర్గాలో అబుల్ కలాం హాస్టల్ దగ్గర శ్రీ కోరంటిహనుమాన్ దేవాలయం ఒకప్పుడు చాలా చిన్నది ఇప్పుడు బహు దొడ్డది అయింది. ఐంది శని మంగళవారాలలో కాలేజి విద్యార్ధులు విశేషంగా దర్శిస్తారు. దొడ్డప్ప అప్ప ఇంజినీరంగ్ కాలేజి దగ్గరున్న ఈ అలయాన్ని 1957లో నిర్మించారు.*

108) వ్యాసరాయ ప్రతిష్టిత శ్రీహనుమాన్ దేవాలయం-షామనూర్

కర్ణాటకలోని దావనగిరి దగ్గర షామనూర్ గ్రామంలో వ్యాసరాయలు ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఉన్నది. ఈ గ్రామనిర్మాణ సమయంలోనే అంటే క్రీ.శ.800లోనే ఈ విగ్రహ ప్రతిష్టాపన జరిగిందని తెలుస్తోంది. 2000 సంవత్సరంలో ఆలయం గ్రామస్తుల పూర్తి సహకార సహాయంతో పునర్నిర్మింపబడింది. దావనగిరి, షామనూర్ గ్రామస్తుల ఇలవేల్పు ఇక్కడి హనుమ. స్వామి 6 అడుగుల విగ్రహమూర్తి. మహాశివరాత్రి తర్వాత 10 రోజులకు ఇక్కడ గొప్ప రధోత్సవం మూడురోజులు వైభవోపేతంగా నిర్వహిస్తారు.*

109) శ్రీ సుందర ఆంజనేయస్వామి దేవాలయం-బెంగుళూరు

బెంగుళూర్‌లోని శ్రీముక్త ప్రాణసేవా ట్రస్ట్ వారు రామమూర్తినగర్ వద్ద యెన్.ఆర్.ఐ.లే అవుట్ను అందమైన ప్రకృతిలో కల్కేరాలో ఏర్పాటుచేశారు. ఇందులో వేదవ్యాస పురాణ పాఠశాలను శ్రీ మురళీధర స్వామీజీ పర్యవేక్షణలో నిర్మించారు. శ్రీ సుందర ఆంజనేయ దేవాలయం కట్టించారు . ఒకసారి శ్రీ మురళీధర స్వామీజీ కొద్దిమంది శిష్యులతో ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు అక్కడ ఒక వేదపాఠశాల నిర్మిస్తే బాగుంటుందని శిష్యులు కోరారు. కాసేపు స్వామీజీ ధ్యానంలోకి వెళ్ళిపోయారు. కళ్ళు తెరిచి చూసి ఆ ప్రదేశమంతా శ్రీ ఆంజనేయస్వామి వైబ్రేషన్సట్టంగా ఉన్నట్లు కనబడిందని చెప్పారు. ఇంతలో 'సంజీవి పర్వతం మోసుకు వెడుతున్న శ్రీ హనుమ' ఆకారంలో ఉన్న మేఘం ఆకాశంలో దర్శనమిచ్చింది. అందరూ చూసి పులకించిపోయారు. హనుమ అకస్మాత్తుగా తమముందు ప్రత్యక్షమయ్యాడని అందరూ భావించారు. అంతే! ఇక వెనక్కి తిరిగి చూడకుండా ఆ ప్రదేశంలోనే ఆలయనిర్మాణం స్వామీజీ ఆధ్వర్యంలో మొదలుపెట్టారు. స్వామి అనుగ్రహం, స్వామీజీ పూనికతో సుందర హనుమాన్ ఆలయం అతి తక్కువ సమయంలోనే నిర్మాణమైంది. 25-4-2008న స్వామీజీ చేతుల మీదుగా మహా కుంభాభిషేకంతో ఆలయ ప్రవేశం జరిగింది. వాల్మీకి రామాయణంలో సుందరకాండకు ఉన్న ప్రాముఖ్యాన్ని గుర్తుచేస్తూ ఆలయ నిర్మాణం జరిగి, శ్రీ సుందర ఆంజనేయ దేవాలయంగా ప్రసిద్ధిచెందింది. నిలబడిన భంగిమలో హనుమ బహుసుందరరూపంగా దర్శనమిస్తాడు. నిత్య పూజ విశేష అర్చనలు వైభవంగా జరుగుతాయి. హనుమజ్జయంతి ఘనంగా నిర్వహిస్తారు.*

110) బెంగుళూర్ సిటీని కాపాడే శ్రీ ఆంజనేయ దేవాలయం- యలహంకగేట్

విజయనగర రాజుల పాలనలో కెంపే గౌడ రాజు యలహంక ముఖ్య కేంద్రంగా 1513-1569 వరకు పాలించాడు. తర్వాత ఇక్కడి నుంచి రాజధానిని బెంగుళూర్ నగరానికి మార్చటానికి అప్పటి విజయనగర రాజు అచ్యుతరాయల అనుమతి, ఆర్ధిక సాయం పొంది 1527 బెంగుళూరులో కొత్తరాజధాని నిర్మించాడు. నగరాన్ని పేటలుగా విభజించాడు. చిక్కపేట అంటే చిన్న వ్యాపార కూడలి అని, దొడ్డపేట అంటే పెద్ద వ్యాపార కూడలి అనీ అన్నాడు. ఇప్పటికీ ఇక్కడే వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. కోటను మట్టితో నిర్మించాడు. చుట్టూ అగడ్తలు ఏర్పాటు చేశాడు. కెంపేగౌడ కొడుకు రెండవ కెంపేగౌడ కాలంలో దేవాలయాలు తటాకాలు నిర్మించాడు. బెంగుళూరును తొమ్మిది ద్వారాల సిటీగా ఏర్పాటు చేశాడు. పూర్వ రాజధాని యలహంకకు వెళ్ళేదారిలో ఉన్న గేటును యలహంక గేటు అంటారు. ఇదీ పెద్ద వ్యాపార కూడలే.

రాజధాని నిర్మాణం వాస్తుప్రకారం జరిగింది. బెంగుళూరు వృషావతి, పశ్చిమావతి నదుల తీరంలో కట్టారు. వృషావతి నది నగరానికి పశ్చిమ అంచుగా ఉంటుంది. ఆగ్నేయంలో 'ధర్మాంబుధీ' అనే తటాకం, శ్రీ అన్నమ్మ అనే గ్రామదేవత ఆలయం కట్టారు. విజయనగర రాజులు రాజధాని నిర్మాణంలో ఎప్పుడూ ఒక ఆంజనేయ దేవాలయం కట్టటం సంప్రదాయం. పశ్చిమ ద్వారం వద్ద 'గాలి ఆంజనేయ' దేవాలయం కట్టారు. ఉత్తర ద్వారమైన

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

యలహంక గేటువద్ద బెంగుళూరు నగరాన్ని విజయనగర సామ్రాజ్యాన్ని రక్షించే శ్రీ ఆంజనేయ దేవాలయం నిర్మించారు. ఆలయం చిన్నదే. మూడు సన్నిధులు ఉంటాయి. ముఖ్యసన్నిధిలో ఆంజనేయస్వామి ప్రతిష్ఠితమై దర్శనం అనుగ్రహిస్తాడు. ఈ దేవాలయం 'యలహంక ఆంజనేయ దేవాలయం'గా పేరు పొందింది. స్వామి ఈశాన్యాన్ని చూస్తున్నట్లు ఉంటాడు. మూడు అడుగుల విగ్రహం. ముందుకి చాచిన స్వామి ఎడమ పాదం శత్రువులకు హెచ్చరికగా శత్రు సంహార పాదంగా ఉంటుంది. కుడిపాదం భక్తులను రక్షించటం కోసం కదలటానికి సిద్ధంగా ఉన్న భంగిమలో కనిపిస్తుంది. చీలమండలకు, కడియాలు, తుంటికి కటిసూత్రం, వక్షస్థలానికి కవచం, తొడకు ఉర్ధామం ఉంటాయి. స్వామి ఉపవీతం అంటే యజ్ఞోపవీతం ఆయన బ్రహ్మచర్యాన్ని తెలియజేస్తుంది. ఎడమ చేయి ఎడమ తొడపై ఆన్చి, పైకియెత్తి పట్టిన గదతో ప్రయోగ భంగిమలో ఉంటాడు. అభయహస్తంగా కుడిచేయి శిరసుపైకి పైకెత్తి ఉంటుంది. వాలం శిరస్సుపైన 'ప్రణవం' ఆకారంలో దర్శనమిస్తుంది. తోక చివర చిన్నగంట ఉంటుంది. కుడి పైభుజంపై బాహువలయం, ముంజేతికి కంకణం, కంఠసీమలో మూడు హారాలు, స్వామి శిఖ గట్టిగా భద్రంగా ముడివేయబడి కోరదంతాలతో, శతృ భయంకరంగా, సంహారకంగా కనిపిస్తాడు. ఇవన్నీ చూస్తున్న భక్తులకు ఇక తమకు శత్రువుల వలన భయం ఉండదనే గొప్ప విశ్వాసమేర్పడుతుంది. కనులలో కరుణ జాలువారుతూ భక్తులకు వరప్రదుడుగా గోచరిస్తాడు. ఈ స్వామిని దర్శిస్తే చాలు గొప్ప ఆత్మవిశ్వాసం, భద్రతా కలుగుతాయి.❋

111) శ్రీ ఆంజనేయ దేవాలయం-మల్లేశ్వరం

బెంగుళూరులో మల్లేశ్వరంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర మఠంలో శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. స్వామి నాలుగు అడుగుల అర్ధశిలా విగ్రహమూర్తి. 1900లో నిర్మాణమైన ఆలయం. ధ్వజస్తంభం ప్రదక్షిణ మార్గం ఉంటాయి. గర్భాలయంలో స్వామి కొలువై ఉంటాడు. స్వామి చుట్టూ ప్రదక్షిణం చేసే వీలు ఉంటుంది. స్వామి పడమరకు నడుస్తున్నట్లు ఉంటాడు. కుడి పాదానికి నూపురం ఉండి, ఎదమ పాదం కొంచెం పైకి ఎత్తినట్లుగా, కుడి చేతికి ఆభరణాలతో తొడకు ఆనించి, చేతిలో పూర్తిగా వికసించిన సౌగంధిక పుష్పం కలిగి ఉంటాడు. మరొక చేయి అభయ ప్రదానంగా ఉంటుంది. వాలం శిరసు పైదాకా ఉండి వంపు తిరిగి చివర అందమైన చిన్న గంట కట్టబడి ఉంటుంది. కేశాలు ముడి వేయబడి ఉంటాయి. చెవులకు ఆభరణాలుంటాయి. శిరసుపై కిరీటం శోభాయమానంగా ఉంటుంది. కరుణారస దృక్కులతో భక్తులను అనుగ్రహిస్తున్నట్లు దర్శనమిస్తాడు.❋



112) శ్రీ కరేకల్లు ఆంజనేయ దేవాలయం-బెంగుళూరు

కరేకల్లు అంటే నల్లరాయి. అంటే నల్లరాతి ఆంజనేయ దేవాలయం. ఇది బెంగుళూరు కోటలో ఉంది. సైనికులు తమ ఆయుధాలను స్వామి పాదాల వద్ద ఉంచి పూజచేసి యుద్ధానికి తీసుకువెళ్ళటం ఆనవాయితి. ఆలయం కోట వెలుపలకు మారినా సంప్రదాయం మాత్రం మారలేదు. ఈ ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహం ఆరు అడుగుల ఎత్తు అర్ధశిలా విగ్రహం. ఉత్తర దిశకు నడుస్తున్న భంగిమలో ఉంటాడు. ఎడమ పాదం కొంచెం ముందుకు ఉంటుంది. కుడి పాదం కొంచెం పైకెత్తి మడమ భూమికి ఆనినట్లు ఉంటుంది. రెండు పాదాలకు ఆభారణాలుంటాయి. నడుముకు ధోవతి కట్టబడి ఉంటుంది. పైన వడ్డాణం అలంకారంగా ఉంటుంది. దానిలో చిన్న కత్తి ఉండటం విశేషం. ఎడమ చేతిలో వికసించీ వికసించని సౌగందికా పుష్పం ఉంటుంది. పైకెత్తిన కుడి చేయి అభయ హస్తంగా దర్శనమిస్తుంది. భుజాలకు ముంజేతులకు ఆభరణాలుంటాయి. మెడలో రెండు హారాలలో ఒకదానికి పతకం వ్రేలాడుతూ ఉంటుంది. ఛాతీపై యజ్ఞోపవీతం, భుజాలపై ఉత్తరీయం ఉంటాయి. వాలం శిరసు పైదాకా ఉండి, ఓంకార రూపం పొంది, చివర చిన్న గంట కట్టబడి ఉంటుంది. చెవులకు కర్ణాభరణాలు, కేశం బంధింపబడి, శిరసున కిరీటంతో, ముఖంలో ప్రశాంతత ధైర్యాలతో స్వామి అనుగ్రహమూర్తిగా దర్శనమిస్తాడు. పొడుచుకు వచ్చిన దంతాలు ఆయన బలసంపన్నతకు నిదర్శనాలు. ప్రకాశవంతమైన, భయరహితమైన స్వామి విశాల నేత్రాలు స్వామి వర్చస్సును ద్విగుణీకృతం చేస్తున్నట్లు ఉంటాయి. ❋

113) కుంచితగర శ్రీ హనుమాన్ దేవాలయం-బెంగుళూరు

విజయనగర సామంతరాజు కెంపెగౌడ బెంగుళూరు నగర నిర్మాణం చేసి, కుంచితిగరపేటలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మించాడు. దీన్ని కుంచితగర ఆంజనేయ దేవాలయం అని పిలుస్తారు. దక్షిణ ముఖ ఆలయం. మూడు అంతస్తుల రాజగోపురం, దాటగానే ధ్వజస్థంభం, దీన్ని దాటగానే పెద్ద ముఖ్య మండపం దాటితే గర్భాలయంలోకి ప్రవేశిస్తాం. గర్భాయ స్తంభాలపై పంచముఖ, యోగ, వీర ఆంజనేయ విగ్రహాలుంటాయి. సన్నిధిలో ఎడమవైపు శ్రీ రామ పరివార ఉత్సవమూర్తులు ఉంటాయి. ఎనిమిదడుగుల ప్రాకారం స్వామి చుట్టూ ప్రదక్షిణ చేసే వీలుగా ఉంటుంది. గర్భాలయ ద్వారం శిల్ప శోభతో కనిపిస్తుంది. ముఖద్వారం రజత మయంగా బహు భంగిమల ఆంజనేయస్వామి రూపాలతో స్వామి చరిత్రను కళ్ళకు కట్టినట్టుగా నయనానందం కల్గిస్తాయి. గర్భాలయంలో శ్రీ ఆంజనేయస్వామి 6 అడుగుల అర్ధశిలా విగ్రహ రూపంలో దర్శనమిస్తాడు. దక్షిణాభిముఖంగా, తూర్పు వైపుకు నడుస్తున్నట్లు ఎడమపాదం కొంచెం ముందుకు వేసినట్లు కనిపిస్తాడు. కుడిపాదం గట్టిగా నేలకు ఆని ఉంటుంది. కుడి కాలి పెద్ద బొటన వ్రేలికింద నలిగిపోతున్న రావణుని కొడుకు అక్షయ కుమారుడి శిరస్సు కనిపిస్తుంది. రెండు కాళ్ళ పిక్కలకు ఆభరణాలు, నడుముకు ధోవతి, నడుము చుట్టూ ఆభరణం, ఎడమ చేతిలో వికసీ వికసించని సౌగంధిక పుష్పం, కుడిచేయి అభయ హస్తంతో దర్శనమిస్తాడు. చెవులకు, భుజాలకు, మడమలకు, ముంజేతులకు సర్వాభరణ శోభితంగా కనిపిస్తాడు. తోక, తల పైదాకా చివర చిన్నగంటతో ఉంటుంది. కేశాలు ముడి వేయబడి, కనులు విశాలంగా కరుణాపూరితంగా ఉంటాయి.*



114) శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధిలో శ్రీ వీరాంజనేయస్వామి-మల్లేశ్వరం

బెంగుళూరులోని మల్లేశ్వరంలో శ్రీ వేణుగోపాలకృష్ణస్వామి దేవాలయంలో నారాయణకట్టే నుంచి తెచ్చి ప్రతిష్టించిన శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహం ఉన్నది. నారాయణకట్టే దేవాలయం రెండు వందల ఏళ్ళ నాటిది. ఆలయం శిధిలమైతే ఆంజనేయ విగ్రహాన్ని తెచ్చి ఇక్కడ ప్రతిష్టించారు. స్వామి రజతకవచం, ధోవతితో ఉంటాడు. కనులకు అమెరికన్ రాళ్ళు పొదగబడి, కర్ణాభరణాలతో సుందరమూర్తిగా ఉంటాడు. మూడడుగుల స్వామి విగ్రహం తూర్పుముఖంగా, ఉత్తర గమనంగా ఉంటుంది. కుడిచేయి అభయ ముద్రతో, ఎడమచేత సౌగంధిక పుష్పంతో, సర్వాభరణ భూషితుడుగా దర్శనమిస్తాడు. తోక తల పైకి ఉండి చివర్లో చిన్న గంట కట్టబడి ఉంటుంది. స్వామి కనులు కటాక్ష వీక్షణాలతో విరాజిల్లుతాయి.❋

115) శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయం-సుబేదార్-బెంగుళూరు

బెంగుళూరు కెంపేగౌడ బస్‌స్టేషన్ దగ్గర శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఉన్నది. ఇక్కడ భక్తులకు ప్రసాదంగా తులసితీర్థం ఇవ్వటం ప్రత్యేకత. స్వామి విగ్రహం అయిదు అడుగులు. విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేసే వీలు ఉంది. అర్ధ శిలావిగ్రహమే అయినా పూర్ణ శిలావిగ్రహం అనిపిస్తుంది. తూర్పు ముఖంగా, ఉత్తర గమనంగా, ఎడమ పాదానికి నూపురం, కుడిపాదం కొద్దిగా పైకెత్తి, ఎడమ చేతిలో సౌగంధిక పుష్పం, కుడి అభయ హస్తం, వాలం శిరస్సును దాటి చివర చిన్న గంటతో, కర్ణాభరణాలు, కేశబంధనం, శిరసున కిరీటం, విశాల దయాపూరిత కనులతో స్వామి దర్శనమిస్తాడు.❋



116) శ్రీ తులసిగిరేశ్వర హనుమాన్ దేవాలయం-తులసిగిరి

కర్ణాటకలో హుబ్లికి 126, బెంగుళూర్కు 486, బాగల్కోట్కు 14 కిలోమీటర్ల దూరంలో రాయచూర్-బెల్గాం హైవేలో తులసిగిరి ఉన్నది. ఇక్కడి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం 11వ శతాబ్దం నాటిది. స్వామిని తులసి గిరేశ్వర్ అంటారు. ఇక్కడి ఈ హనుమంతుడు తిరుపతి వెంకటేశ్వరస్వామికి సమానంగా భక్తులు భావిస్తారు. ఆలయ శిల్పకళ పరమ రమణీయంగా ఉంటుంది. ఆలయప్రాంగణంలో శివాలయం, నరసింహాలయమూ ఉన్నాయి. శనివారం భక్తుల రద్దీ ఎక్కువ. 'దసరా పరం పరే' అనే పురాతన భక్తిగీతం ఇప్పటికీ ఆలయంలో గానం చేయటం విశేషం. బాగల్కోట పరిసర ప్రజలకు తులసిగిరీశ్వర హనుమాన్ ఇలవేలుపు.❋

117) శ్రీ చిక్కోడి హనుమాన్ మందిరం-చిక్కోడి

కర్ణాటక బెలగావి జిల్లాచిక్కోడి గ్రామం ఉంది. చిక్కోడి అంటే చిన్న ఊరు. దీని ప్రక్కన హిరేకూడి అంటే పెద్ద వూరు ఉంది. వ్యవసాయ భూములెక్కువ. ముఖ్యంగా చెరుకుకు శ్రేష్టమైన భూములున్నాయిక్కడ. ఈ స్వామినే చిక్కోడి మారుతి అని కూడా పిలుస్తారు.❋

118) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం-గుడియనోదురన్న

కర్ణాటకలో బెంగుళూర్ గిరి నగర్ గుడియ నోదురన్నలో దత్తపీఠంలో కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం ఉన్నది. హనుమంతుడు లంకలో సీతామాతను చూసినప్పుడు అతని ధ్యైర్యసాహసాలను మెచ్చి అతనితో 'త్వమస్మిన్కార్యనిర్యోగే-ప్రమాణంహరిసత్తమ-హనుమాన్యత్నమాస్థాయ-దుఃఖక్షయకరోభవ' అంటుంది. ఈ శ్లోకమే కార్యసిద్ధి హనుమాన్మంత్రంగా లోకం ప్రసిద్ధి చెందింది. ఇలా కార్యసిద్ధి కలిగిస్తాడు కనుక కార్యసిద్ధి హనుమాన్ అయ్యాడు. స్వామి విగ్రహాన్ని శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ప్రతిష్టించారు.*

119) శ్రీ అంజప్ప ఆంజనేయ దేవాలయం-కోలార్

కర్ణాటక బంగారు గనుల కోలార్ 'చిన్నకంచి త్యాకల్' అని పిలువబడి, ఒకప్పుడు 101 దేవాలయాతో నూటొక్క నూతులతో వర్ధిల్లింది. ఇక్కడి వరదరాజ సోమేశ్వర దేవాలయాలు గొప్ప ఆకర్షణ. దీని పేరు కన్నడ పదమైన 'ముదలబాగిలు' నుంచి వచ్చింది అంటే తూర్పు వాకిలి అని అర్ధం. ఇది విజయనగర సామ్రాజ్య, మైసూర్ నగరాల ప్రవేశానికి తూర్పు వాకిలి. దీని సమీపంలోనే ఉన్న కొండపై సూర్యుడు మొదటిసారిగా కర్ణాటకలో కనిపిస్తాడు. 'మహాభారత యుద్ధం అయ్యాక అర్జునుడు ఇక్కడ శ్రీ హనుమ దేవాలయం నిర్మించాడని ప్రతీతి. వసిష్ట మహర్షి ఇక్కడే సీతా, రామ విగ్రహాలు ప్రతిష్టించాడు. భక్త హనుమాన్‌గా ఇక్కడ ఆంజనేయుదు ముకుళిత హస్తాలతో, సర్వాభరణ భూషితుడిగా దర్శనమిస్తాడు. కోలార్లోనే 62 అడుగుల భారీ జైభజరంగ బలి హనుమ విగ్రహం కూడా దర్శించాలి. విగ్రహం పడుకోబెట్టే ఉన్నది.*

120) శ్రీ హనుమ దేవాలయం-బెల్గాం

కర్ణాటక బెల్గాంలో శ్రీ హనుమాన్ దేవాలయ వైభవం చూసి తెలుసుకోవలసిందే మాటలతో చెప్పనలవి కాదు. బహుశా వ్యాసరాయ ప్రతిష్టితం అయి ఉంటుంది.*



121) శ్రీ సాలిగ్రామ హనుమాన్-ఉడిపి

కర్ణాటక ఉడిపిలో సాలి గ్రామం అనే గ్రామంలో శ్రీ సాలిగ్రామ హనుమాన్ దేవాలయం చారిత్రాత్మక ప్రసిద్ధి చెందింది. ఇక్కడి సాలిగ్రామ నరసింహక్షేత్రం కూడా సుప్రసిద్ధమైనదే. హనుమ విగ్రహ ప్రతిష్ట వ్యాసరాయలు చేసి ఉంటారు. హనుమకు నువ్వులనూనెతో అభిషేకం చేయటం ఇక్కడ విశేషం.*

122) శ్రీ హనుమాన్ దేవాలయం-నుగ్గికేరి

కర్ణాటక ధార్వాడ్‌కు 8 కిలోమీటర్లలో నుగ్గికేరిలో శ్రీ ఆంజనేయ దేవాలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. నుగ్గి కెర దేశాయ్ కుటుంబం వారు ప్రతిష్టించారు. ఆలయం జీర్ణమైతే వ్యాసరాయలు పునః ప్రతిష్టించారు. దేశాయ్కుటుంబ నిర్వహణలోనే ఆలయమున్నది. చైత్ర పౌర్ణమినాడు హనుమాన్జయంతి ఘనంగా చేస్తారు.*

123) శ్రీ వీరప్రతాప హనుమ దేవాలయం-బెలగూర్

కర్ణాటక అర్శికేరే-హోసదుర్గ మార్గంలో ఉన్న చిన్న గ్రామం బెలగూర్. స్థానికులకే కొత్తగా ఉంటుంది. ఎవరికీ దీన్ని గురించి తెలియదు. టూరిస్ట్ స్పాట్ కూడా కాదు. దీని అదృష్టం ఒక్కసారిగా 1972లో మారిపోయింది. ఇక్కడి హనుమాన్దేవస్థాన పూజారి బిందు మాధవశర్మ పూర్వీకులు నిద్రాణమై చీకటిలో ఉన్న ఈ ఊరుకు శ్రీ వీరప్రతాప హనుమ వలన కాంతిమయం చేసి వెలుగుల ఊరు అంటే కన్నడంలో 'బెలక్కు ఊరు' – 'బెలుగూరు'గా మార్చారు.❋

124) శ్రీ ఆంజనేయ దేవాలయం-రామాంజనేయ గుడ్డ

కర్ణాటక బెంగుళూరులో కెంగల్ హనుమంతయ్య శ్రీరాముడు హనుమంతుని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్న భారీవిగ్రహం ప్రతిష్టించాడు. దూరం నుంచి చూపరులను ఆకర్షిస్తుంది. హనుమంతనగరిలో ఈ విగ్రహం ఉన్న ప్రదేశాన్ని హనుమంతగుడ్డ అంటారు. ఇక్కడే స్వామి రామునికి భక్తుడు హనుమకు 'డిషుండిషుం' అంటే రామాంజనేయ యుద్ధం జరిగి మళ్ళీ ఇద్దరూ కలిసిపోయారు. ఇక్కడే పార్కు కూడా ఉన్నది. గుడ్డ అంటే గడ్డ అంటే చిన్న గుట్ట లేక కొండ అని అర్థం.❋



125) శ్రీ యోగపురి క్షేత్ర హనుమాన్ దేవాలయం-వాగట గ్రామం

కర్ణాటక బెంగుళూర్‌కు 8 కిలోమీటర్ల దూరంలో వాగట గ్రామంలో శ్రీ వరదరాజ స్వామి శ్రీ దేవీ భూదేవిలతో కొలువై ఉంటాడు. ఇక్కడే భక్తుల మనోభీష్టాలు తీర్చే అందమైన మారుతి ఆలయం ఉన్నది. ఈ క్షేత్రాన్ని 'యోగపురి' అంటారు. ఏదైనా పని మొదలు పెట్టేముందు స్వామిని ప్రార్థిస్తే విగ్రహం శిరస్సు నుండి పుష్పం జారి మన కుడివైపు పడితే కోరిక నెరవేరుతుంది. ఎడమవైపుకు పడితే ఒకటికి రెండుసార్లు ఆలోచించి పని మొదలు పెట్టమని సూచన కలుగుతుంది.❋

126) శ్రీ హనుమ గుహాలయం-యలగూరు

కర్ణాటకలో కృష్ణాతీరంలో యలగూరులో ఉన్న హనుమ గుహాలయం ప్రాచీనమైనది. శ్రీరాముడు అయోధ్య నుంచి లంకకు వెళ్ళేటప్పుడు ఇక్కడికి వచ్చాడని స్థానిక కథనం. నిత్యం వేలాది భక్తులు సందర్శించే హనుమ క్షేత్రమిది. ఆలమట్టికి 9, బాగల్ కోట్‌కు 50 కిలోమీటర్లలో ఉంటుంది. యలగురేశ్వర స్వామిగా హనుమాన్ ప్రసిద్ధుడు.❋



127) శ్రీ ముత్తేత రాయ హనుమాన్ దేవాలయం-ముత్తాతి

కర్ణాటక బెంగళూర్‌కు వంద కిలోమీటర్లలో ముత్తాతి గ్రామంలో ఉన్న హనుమను ముత్తేతిరాయ హనుమాన్ అంటారు. దీనికి ఒక కథ ఉంది. ఒకప్పుడు సీతాదేవి ఇక్కడి కావేరీ నదిలో స్నానం చేస్తుంటే ముక్కుపుడక నీటిలో జారిపోయింది. హనుమ వెతికి అమ్మవారికిచ్చాడు. అందుకే ఆ పేరొచ్చింది. ఇక్కడ ప్రవాహ వేగం బాగా ఎక్కువ కనుక స్నానం నిషిద్ధం. దీనికి దగ్గరలో భీమేశ్వరి ఉన్నది. ఇక్కడ భీముడు మహాదేవ లింగాన్ని స్థాపించాడు.❋

128) ముఖ్య ప్రాణ కటాక్ష హనుమాన్ దేవాలయం-పూర్ణ ప్రసాద్

1746లో తమిళనాడు కోయంబత్తూర్ జిల్లాలోని గ్రామంలో పూర్ణయ్య అనే ఆయన మధ్వ కుటుంబంలో కృష్ణమాచార్య, లక్ష్మీబాయి దంపతులకు జన్మించి, చిన్ననాటే తండ్రి చనిపోతే హైదరాలీకి మిలిటరికి వస్తువులు అందజేసే వ్యాపారంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి బాగా సంపాదించాడు . సంస్కృత కన్నడ పర్షియన్ భాషలలో ప్రావీణ్యం పొంది హైదరాలీ దృష్టిని ఆకర్షించి అకౌంటెండ్‌ంట్ అయి, నవాబ్ సర్దార్ సభ్యుడై, ఆర్మీ సప్లై, లాజిస్టిక్స్ అధిపతి

అయ్యాడు. మైసూర్ రాజ్యాన్ని హైదరాలీ తర్వాత కొడుకు టిప్పుసుల్తాన్ పాలించినప్పుడు వాళ్లకు అత్యంత విశ్వసనీయుడుగా పూర్ణయ్య ప్రాభవం బాగా ఉండేది.

మధ్వమతానుయాయిగా నిత్యం పూజా పునస్కారాలతో సంప్రదాయబద్ధంగా జీవిస్తూ తన ఇలవేల్పు శ్రీ ఆంజనేయస్వామికి 'ముఖ్యప్రాణ ఆంజనేయదేవాలయం' నిర్మించి పూజించాడు. బెంగుళూరు సిటీ మధ్యలో అద్భుతమైన భవనంకట్టి 'పూర్ణప్రసాద్' అని పేరు పెట్టాడు. అది గొప్ప రాజ హర్మ్యాన్ని తలపోస్తుంది. యుద్ధాలలో శిధిలం కాగా అందులో ఒక భాగం మాత్రమే ఆ పేరుతో పిలువబడుతోంది. అందులోనే ముఖ్యప్రాణ ఆంజనేయస్వామి ఉన్నాడు. ఇప్పుడు ఇది 'పూర్ణప్రసాద్ కాంప్లెక్స్'లో ఉంటుంది. బెంగుళూర్ స్పోర్ట్ మైదానం దగ్గరకు వెడితే ఆలయ విమానం కనిపిస్తుంది. ఈ ఆలయం పూర్ణప్రసాద్ ఆలయమే అయినా ఇప్పుడు బి.టి.సి.హనుమాన్ దేవాలయంగా పిలువబడుతోంది. ఆలయ విమానం ఎనిమిది వైపులా, 12 అంతస్తులతో షడ్భుజాకార శిఖరంతో ఉంటుంది. విమానం అన్నివైపులా విష్ణు అవతార, అష్టలక్ష్మీ శిల్పాలుంటాయి.

హనుమాన్ ఆలయం చిన్నదే కాని ప్రాకారం విశాలమైనది. రామాయణ, మహాభారత ఘట్టాల శిల్పాలు జెల్లీ రక్షణలో ఏర్పాటుచేయబడ్డాయి. మధ్వాచార్యుల జీవిత విశేష విగ్రహాలూ ఉన్నాయి. గర్భాలయంలో రెండున్నర అడుగుల ఎత్తున్న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం ఉంటుంది. ఇది పవిత్రమైన 'అర్ధశిల' విగ్రహం. అనంత కటాక్ష వీక్షణాలతో హనుమస్వామి భక్తులకు దర్శనమిస్తూ కోరికలను నెరవేరుస్తాడు. స్వామిని చూస్తుంటే బాహ్యప్రపంచాన్ని మర్చిపోతాం. అంతటి తన్మయత కలుగుతుంది. మధ్వ సంప్రదాయంలో పూజాదికాలు నిర్వహిస్తారు.❋

మరికొన్ని ప్రసిద్ధమైన హనుమాన్ దేవాలయాలు

❋ శృంగేరి పర్యాటకులు శ్రీ చప్పర ఆంజనేయ దేవాలయం తప్పక చూడాలి. దీనిలో హనుమంతుడి విగ్రహం ఉంటుంది. నల్లరాతితో చేసిన విగ్రహం ఇది.❋

తమిళనాడు

129) శ్రీ ఆరుళ్‌మిగు ఆంజనేయ దేవాలయం-ఇడుగం పాలెం

తమిళనాడులో కోయం బత్తూర్ జిల్లాలో ఇడుగం పాలెం గ్రామంలో శ్రీ వ్యాస రాయలు ప్రతిష్టించిన 655 ఏళ్ళ ప్రాచీన ఆంజనేయ స్వామి దేవాలయం ఉన్నది. స్వామి బృహద్రూపుడు. అయిదు అడుగుల ఆరు అంగుళాల ఎత్తు 'సుయంబు ఏకశిలా' ఆంజనేయ విగ్రహం ఇది. ఆంజనేయస్వామి విగ్రహానికి కుడివైపు వినాయక, నంది విగ్రహాలు కూడా 'సుయంబు రాతి'తోనే చెక్కబడి ఉన్నాయి. వినాయక విగ్రహానికి దగ్గరలో పాలధార కారుస్తున్న కామధేనువు విగ్రహం ఉంటుంది. దీని వెనుక స్వయంభు లింగేశ్వర శివలింగం ఉంది. ఇక్కడ శివలింగం ప్రతిష్టించాలని భావించిన శ్రీరాముడు ఆంజనేయుడిని శివలింగం తీసుకొని రమ్మని పంపితే ముహూర్త సమయానికి రాకపోతే రాముడే స్వయంగా లింగాన్ని తయారుచేసి ప్రతిష్టించాడని స్థలపురాణం. ఆంజనేయుడు వచ్చి చూసి కోపంతో ఈ లింగాన్ని పీకేయాలని విఫల ప్రయత్నం చేశాడు. రాముని అనుమతితో సుయంబు లింగేశ్వరం ప్రక్కనే హనుమ తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్టించాడు.

కోయంబత్తూర్ వాతావరణానికి దూరంగా ప్రశాంతంగా ఉండే ఈ ఇడుగం పాలెం గ్రామంలో శ్రీ ఆంజనేయ దేవాలయం భక్తికి, ప్రశాంతతకు నిలయంగా ఉంటుంది. ఆలయం చిన్న కొండపైనే ఉంటుంది. ఆ కొండ రాయినే తొలిచి ఈ భారీ ఆంజనేయస్వామి ఏకశిలా విగ్రహాన్ని శిల్పీకరించారు. ఈ స్వామిని 'జయ మంగళ హనుమాన్' అని భక్తిగా పిలిచి కొలుస్తారు. శ్రీ

హనుమజ్జయంతి మహా ఘనంగా నిర్వహిస్తారు. వేలాది భక్తులు ఆనాడు వచ్చి స్వామిని సందర్శించి పునీతులౌతారు. ఈ గుడి దూరం నుంచి కనిపించదు. కొంతమంది భక్తులు స్వామి విగ్రహానికి కొన్నేళ్ళ క్రితం చిన్న గుడి కట్టారు. ఇందులో హనుమాన్ విగ్రహం ఒకటే ఉంటుంది. ఇక్కడి వినాయక విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. ముందుభాగం వినాయకుడు వెనుక వైపు శివలింగం, సూర్య, చంద్రులు చెక్కబడి ఉంటారు.❋

130) శ్రీ కాడు హనుమంతరాయ దేవాలయం-ధర్మాపురం

తమిళనాడులో ప్రసిద్ధ సుబ్రహ్మణ్య క్షేత్రమైన పళనికి 32 కిలోమీటర్ల దూరంలో ధర్మాపురం ఉంది. ఇక్కడి కాడు హనుమంతరాయ దేవాలయం మధ్వ మతస్తులకు పరమ పూజనీయమైనది. వారి తొమ్మిది ముఖ్య ఆలయాలలో ఇది ఒకటి. 1447-1539 కాలంలో విజయనగర సామ్రాజ్య పాలకుడు శ్రీ కృష్ణదేవరాయల రాజగురు శ్రీ వ్యాసరాయలు ప్రతిష్టించిన విగ్రహం ఇది. అందుకే అంతటి వైభవం. అంటే ప్రాచీన ఆలయాలలో ఒకటి అన్నమాట. స్వామి వెండి కవచంతో సర్వాలంకార శోభితంగా దర్శనమిస్తాడు. ఉత్తర దిశలో వీక్షిస్తూంటాడు. అభయ హస్తం కమలం ధరించి ఉంటాడు. అయిదు వందల యాభై ఏళ్ళ చరిత్ర ఉన్న దేవాలయం ఇది. ఇక్కడి రథోత్సవం చాలా ముచ్చటగా ఉంటుంది. వేలాది భక్తులు పాల్గొంటారు. హనుమజ్జయంతి వైభవంగా నిర్వహిస్తారు. నిత్యం అన్నదానం ఉంటుంది.❋

131) శ్రీ వీర మంగళ ఆంజనేయ దేవాలయం-తిరుత్తని
వీర మంగళ స్వామి విశేషాలు

తమిళనాడు తిరుత్తని దగ్గర నల్లట్టూర్‌లో శ్రీ వ్యాసరాయ ప్రతిష్టిత శ్రీ వీరమంగళ హనుమాన్ దేవాలయం అతి ప్రాచీనమైనది. ఇక్కడి స్వామి విగ్రహానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. కుడి చేయి ఆకాశం వైపు చూపిస్తూ ఆశీర్వదిస్తున్నట్లు ఉంటుంది. ఎడమ చేతిలో దేవ పుష్పమైన సౌగంధిక పుష్పం ధరించి ఉంటాడు. స్వామి వారి వాలం వెనుక వైపు బాగా పైకి ఉండి చివర ఓం ఆకారంలో ఉండటం విశేషం. విగ్రహం వెనుక దశావ తారాలు చెక్కబడి ఉండటం మరో విశేషం. తోక చివర ఒక చిన్న గంట కట్టబడి ఉండటం మరో ప్రత్యేకత. ఇవి కాకుండా నవరత్నాల హారం మెడలో ధరించటం ఇంకొక విశేషం.

వ్యాస రాయల వారి 732 ఆంజనేయ విగ్రహ ప్రతిష్టలకు అసలు కారణం

విజయనగర సామ్రాజ్యంలో ఆరుగురు చక్రవర్తులకు రాజ గురువుగా ఉన్నారు వ్యాసరాయల వారు. ఒకసారి విజయ నగర చక్రవర్తి కృష్ణదేవరాయలు అకాల మరణం చెందటం కాని, లేక సామ్రాజ్యం పతనమైపోవటం కాని జరుగుతుందని జ్యోతిష్కులు చెప్పారు. అప్పుడు చక్రవర్తి ఒక సన్యాసిగా మారిపోయి తన రాజ్యాన్ని, వ్యాస రాయల వారికి అప్పగించి ఆయన శిష్యుడైనాడు. అప్పటి నుండి ప్రజలు 'వ్యాస రాజ స్వామి' అని పిలిచేవారు. ఇష్టం లేకపోయినా వ్యాసరాయలు రాజ్యభారం వహించాల్సి వచ్చింది. అదేరోజు రాత్రి వ్యాసరాయ చక్రవర్తి కృష్ణ దేవరాయల తల్పంపై నిద్రించారు. అప్పుడు ఒక కోడె త్రాచు లోపలి ప్రవేశించి రాజును కాటు వేయటానికి సిద్ధపడింది. పాము అలికిడి గ్రహించిన వ్యాసరాయలవారు లేచి పైన కప్పుకొన్న

వస్త్రాన్ని తీసి ఆ నాగుబామును చేత్తో పట్టుకొని శ్రీ ఆంజనేయ స్తోత్రాలు చదువుతూ నేల మీదకు విసిరేశారు. కాని ఆ నాగు పగబట్టి ఆ వస్త్రాన్ని రెండుసార్లు కాటు వేసింది. చూస్తుండగానే వస్త్రం కాలి బూడిదయింది. వెంటనే కృష్ణ దేవరాయలను వ్యాసరాయల వారు పిలిపించి ఆయనకు ఉన్న దోషం తొలగిపోయిందని తెలియజేసి విజయనగర సామ్రాజ్యానికి చక్రవర్తిగా మళ్ళీ పట్టాభిషిక్తుని చేసేశారు వ్యాస రాయలవారు. తాను నాగుబాము కాటు నుండి బయట పడటానికి కారణం హనుమ మంత్రాల ఉచ్చారణ వల్లనే అని గ్రహించిన వ్యాస రాయల వారు వెంటనే దక్షిణ దేశమంతటా శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి పూనుకొన్నారు. పూను కోవటమే కాదు 732 విగ్రహాలు ప్రతిష్టించారు కూడా.

నల్లట్టూర్ విగ్రహ ప్రతిష్టకు కారణం

కాని ఇక్కడ హనుమ విగ్రహ ప్రతిష్ఠాపన వేరే విధంగా జరిగింది. వ్యాసరాయల వారు తిరుపతిలో ఆంజనేయ విగ్రహం ప్రతిష్టించాలనుకొన్నారు. తిరుత్తని నుండి తిరుపతికి తాను కాలినడకన సంచారం చేస్తూ విగ్రహాన్ని కూడా తనతో తీసుకు వెడుతున్నారు. కుశస్థల నది తీరంలో ఉన్న నల్లట్టూర్ గ్రామానికి రాగానే చీకటి పడింది. సాయం సంధ్యా కృత్యాలు నిర్వహించటానికి వ్యాసరాయల వారు ఇక్కడ ఆగారు. తిరుపతిలో ఈ విగ్రహ ప్రతిష్టకు రెండే రెండు రోజుల వ్యవధి ఉంది. కాని ఆ రాత్రి బ్రహ్మాండమైన తుఫాను వచ్చి నది వరదలతో ముంచెత్తి పదిహేను రోజులదాకా కదిలే వీలు లేకుండా చేసింది. స్వామి పూజ చేస్తూ వ్యాసరాయల వారు ఈ అవాంతరాలకు కారణమేమిటని హనుమనే ప్రశ్నించారు. ఆయన ప్రత్యక్షమై తన విగ్రహాన్ని ఇక్కడే ప్రతిష్ట చేయమని ఆనతిస్తూ ఈ అడ్డంకులన్నీ తాను కల్పించినవేనని చెప్పాడు. అలాగే స్వామి ఆదేశాన్ని నెరవేర్చి నేలట్టూర్‌లోనే వీరాంజనేయ విగ్రహాన్ని వ్యాస రాయలు ప్రతిష్ట చేశారు. విగ్రహాన్ని గమనిస్తే స్వామి తిరుపతి వైపు నడుస్తున్నట్లు అటువైపే చూస్తున్నట్లు కనిపిస్తుంది అదీ ప్రత్యేకత.

శిధిలమైన ఆలయ పునర్నిర్మాణం

శతాబ్దాలు గడిచిపోయాయి. కాలగర్భంలో ఈ ఆలయం శిధిలమై చరిత్ర గర్భంలో కూరుకుపోయింది. ఏవో కొన్ని శిధిల ఆనవాళ్ళను మాత్రం

మిగిల్చింది. నల్లట్టూర్ గ్రామ ప్రజలు 1977 వరకు స్వామికి ఏదో విధంగా పూజాదికాలు నిర్వహిస్తూ వచ్చారు.

అమరావతి గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎక్సి క్యూటివ్ డైరెక్టర్ శ్రీ ఎం.చక్రవర్తి ఒకసారి ఢిల్లీలో ఉండగా ఆంజనేయస్వామి కలలో కన్పించి తనకు నల్లట్టూరులో ఆలయాన్ని పునర్నిర్మించి పూజాదికాలు ఏర్పాటుచేసి భక్తులకు సకల సౌకర్యాలు కలుగజేయమని ఆదేశించాడు. పెద్దగా దేవాలయాలకు వెళ్ళని చక్రవర్తికి ఈ కల సంభ్రమాశ్చర్యాలను కలిగించింది. స్వామి ఆజ్ఞ శిరోధార్యంగా భావించి ఆలయ పునర్నిర్మాణానికి సంకల్ప బద్ధుడైనాడు. తనకు తెలిసిన మిత్రుల సహకారంతో, స్వామి అనుగ్రహంతో ఎనిమిది నెలలలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేశాడు. శతాబ్దాల చారిత్ర కలిగిన శ్రీ వీరమంగళ ఆంజనేయ స్వామిని పునః ప్రతిష్టించి సీతారామ లక్ష్మణుల విగ్రహాలనూ ప్రతిష్టించారు. గణేష్ దేవాలయం నవగ్రహాలయమూ నిర్మించారు. ఇరవై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఆలయ సముదాయం ఉంది. కాంచీపురం వరదరాజ స్వామి దేవాలయ ముఖ్య పూజారి శ్రీ శ్రీనివాస పట్టార్ చేత మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు.❋



132) ఒకే అడుగు ఎత్తున్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం- కుళ్ళు కూజి

తమిళనాడులో తిరుచి జిల్లాలా కుళ్ళు కూజిలో ఉన్న శ్రీ ఆంజనేయ దేవాలయంలో స్వామి విగ్రహం ఎత్తు ఒక్క అడుగు మాత్రమే. అది కూడా రాతి స్థంభంపై చెక్కిన విగ్రహం. అర్ధ చిత్ర శిలా విగ్రహం. కాలు ఎడమవైపుకు వంగి ఓంకార మంత్రం స్వరూపంగా కనిపించటం గొప్ప విశేషం. ఎడమ చేతిలో పారిజాత పుష్పాన్ని కుడి చేత అభయ ముద్రను కలిగి సదా తానూ భక్తులను రక్షిస్తూ ఉంటాను అని చెబుతున్నట్లు గోచరిస్తాడు. ముఖం ఉత్తరాభిముఖంగా ఉండటం మరొక ప్రత్యేకత.❋

133) శ్రీ సంజీవరాయ దేవాలయం-తిరుచి

తమిళనాడులో తిరుచి అనబడే తిరుచిరాపల్లిలో శ్రీ సంజీవరాయ దేవాలయానికి సుమారు నాలుగు వందల ఏళ్ళ చరిత్ర ఉంది. నాయక రాజుల కాలపు ఆలయం. చెట్టియార్‌ల అధీనంలో ఇప్పుడు ఆలయం నడుస్తోంది. నగర మధ్యంలో శ్రీ భూమినాథ ఆలయానికి సమీపంలో ఉన్నది. విశాలమైన ప్రాంగణంలో మూడు అంతస్తుల గోపురంతో మూడు కలశాలతో ఆలయం విరాజిల్లుతోంది. రాజగోపురం ఉన్న అతి తక్కువ ఆంజనేయ దేవాలయాలలో ఇది ఒకటి. అదీ దీని ప్రత్యేకత. విశాలమైన హాలు స్తంభాలపై నిర్మించబడింది. గర్భాలయం పైనున్న విమానంపై నాలుగు వైపులా గరుడ విగ్రహాలు ఉండటం మరో ప్రత్యేకత. గర్భ గృహానికి ముందు పదహారు స్తంభాల హాలు ఉంది. దీన్ని 'కోటికంభం' అంటారు. ఈ రాతి స్తంభాలు నాయక రాజుల కట్టడపు శైలికి ఆనవాలు. ఒకప్పుడు ఇక్కడి స్థంభం పైభాగాన ఆంజనేయ విగ్రహం ఉండేది. ఇప్పుడు తీసి గర్భాలయంలోనే ఉంచారు.

శ్రీ సంజీవరాయ హనుమాన్ విగ్రహం రెండున్నర అడుగుల ఎత్తు ఉంటుంది. 'అంజలి హస్తం'తో స్వామి నిలబడి దర్శన మిస్తాడు. తోక చుట్టలు చుట్టుకొని కాలిని పెనవేసుకొని కనిపిస్తుంది. సర్వావయవాలకు ఆభరణాలు ధరించి స్వామి ధగ దగా మెరిసిపోతూ ఉంటాడు. విశాలమైన నేత్రాలతో సూటిగా చూస్తూ కనిపిస్తాడు. దీర్ఘ కటాక్షంతో స్వామి భక్తుల మనవి వింటూ పరి పూర్ణంగా అనుగ్రహిస్తూ కోరికలను తీరుస్తాడు. పంచలోహ ఉత్సవమూర్తిని 1929లో ఏర్పాటు చేశారు. 1972, 2002లలో రెండుసార్లు మహా కుంభాభిషేకాలు నిర్వహించి స్వామి బింబ శుద్ధి చేసి మరింత వైభవాన్ని చేకూర్చారు. ప్రతి శనివారం తిరు మంజనం చేస్తారు. హనుమజ్జయంతిని పరమ వైభవంగా నిర్వహిస్తారు. తిరుఊనం నాడు సంజీవ రాయనికి గ్రామోత్సవం అంటే ఊరేగింపు కన్నుల పండువుగా చేస్తారు. సంజీవరాయ దర్శనం శుభప్రదం.❋

134) శ్రీ ఆంజనేయ ద్వయ దేవాలయం-పట్టేశ్వరం

భీమాంజనేయ కథ

తమిళనాడులోని కుంభకోణం దగ్గర పట్టేశ్వరంలో ఒకే రూపంలో ఉండే శ్రీ ఆంజనేయ ద్వయం విగ్రహాలు చూడ ముచ్చటగా ఉంటాయి. ఈ ఆలయానికి త్రేతాయుగ, ద్వాపర యుగాలతో సంబంధం ఉంది. త్రేతాయుగంలో ఆంజనేయస్వామి ఇక్కడ కదళీ వనం మధ్య ఉన్న అందమైన కోనేటి ఒడ్డున కూర్చుని రామనామ జపం చేసుకొనేవాడు. ఆ కోనేటిలో సహస్ర దళ పద్మం ఒకటి వికసించి పరిమళాలను చాలా దూరం వరకు వ్యాపింప జేసేది. ద్వాపర యుగంలో ద్రౌపదీ దేవి ఈ పద్మ గంధాన్ని దూరం నుంచే ఆఘ్రాణించి భీముడిని ఆ పద్మాన్ని తీసుకొని రావలసిందిగా కోరింది. భీముడు ఇక్కడికి వచ్చాడు. అతన్ని పరీక్షించటానికి హనుమ ముసలి కోతి వేషంలో దారికి అడ్డంగా తోక జాపుకొని కూర్చున్నాడు. దారి తొలగమంటే కోతి తొలగ లేదు. ముసలి వాడిని కనుక తోక ఎత్తి ప్రక్కన పెట్టి వెళ్ళమన్నాడు. కోతి తోకను భీముడు యెంత ప్రయత్నించినా కదప లేక పోయాడు. అప్పుడు ఆ ముసలి కోతి సాక్షాత్తు ఆంజనేయస్వామిగా గ్రహించి క్షమాపణ కోరాడు. హనుమ ప్రత్యక్షమై ప్రసన్నుడై తామిద్దరూ వాయు సుతులమేనని సోదరులమని చెప్పి భీముని కోర్కెను తెలుసుకొని సహస్రదళ పద్మాన్ని భీమునకిచ్చి ద్రౌపదికి అంద జేయమన్నాడు.

హనుమ ద్వయం

ఇక్కడ హనుమాలయాలు చాలా ఉన్నా శ్రీ గోపీనాధ స్వామియే ముఖ్య

దైవంగా ఉంటాడు. ఇప్పుడు ఆంజనేయ ద్వయ దేవాలయంగా బాగా ప్రసిద్ధి చెందింది. రెండు వేర్వేరు సన్నిధులలో స్వామి వార్లను ఉంచి అర్చించే వీలు కల్పించారు. వీరిద్దరికీ బృహత్తరమైన ఆలయాలను నిర్మించారు. ఈ క్షేత్రంలోనే భీమాంజనేయ సమాగమం జరిగింది కనుక దీనికి అత్యధిక ప్రాధాన్యత లభించింది. ఆంజనేయ స్వామి వారి రెండు విగ్రహాలు ఒకే మాదిరిగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. రెండు విగ్రహాల ఎడమ చేతిలో సహస్ర దళ పంకజం ఉండటం, కుడి చేయి పైకి ఎత్తి అభయ ఆశీర్వాద హస్తంగా ఉండటం విశేషం. భక్త జనల కొంగు బంగారం ఈ ఆంజనేయ ద్వయం.

గోపీనాథ దేవాలయం

కుంభకోణం దగ్గర పజి యారిలో తొమ్మిదో శతాబ్దంలో చోళ రాజ్యపాలన ఉండేది. చోళ రాజులు ఈ ప్రాంతంలో ఎన్నో దేవాలయాలు నిర్మించారు. అందులో శ్రీ గోపీనాథ అంటే శ్రీ కృష్ణ దేవాలయం ముఖ్యమైంది. గోపీనాథ దేవాలయానికి ఏడు రాజ గోపురాలున్నాయి. వివిధ కాలాలలో చోళరాజులు అనుబంధంగా అనేక కట్టడాలు కట్టారు. మాలికాఫీర్ దండయాత్రలో ఆలయం ధ్వంసం అయినా విజయనగర రాజులు పునర్నిర్మించారు. గోపీనాథ స్వామికి ఇరువైపులా రుక్మిణీ సత్య భామలు ఉండటం ఇక్కడి విశేషం.❋

135) శ్రీ జయ వీరాంజనేయ దేవాలయం-పేరూర్

తమిళనాడులో కోయం బత్తూరు జిల్లా పేరూర్‌లో శ్రీ జయ వీరాంజనేయస్వామి దేవాలయం పురాతనమైనది. దివ్య వైభోగంతో తుల తూగుతూ ఉంటుంది. చిన్న విగ్రహమే అయినా ముగ్ధ మనోహర రూపంలో స్వామి ఉంటాడు. నిత్యం వందలాది భక్తులు సందర్శిస్తారు. మంగళ, శనివారాలలో అధికంగా వస్తారు. హనుమజ్జయంతి వైభవంగా నిర్వహిస్తారు. రథోత్సవం చాలా గొప్పగా ఉంటుంది.❋

136) శ్రీ కట్టు వీరాంజనేయ దేవాలయం-కృష్ణగిరి ప్రాచీన ఆలయం

తమిళనాడులోని హోసూర్ సోదరిగా భావింప బడే కృష్ణగిరిలో జాతీయ రహదారి మీదే శ్రీ కట్టు వీరాంజనేయస్వామి దేవాలయం ఉంది. ఇది 2700 సంవత్సరాల పురాతన ఆలయం. కృష్ణదేవరాయల కాలంలో రాతిగుట్టల మీద విగ్రహాలు ఎక్కువగా ఉండేవి.

కాషాయ రంగు సంచీ

కట్టు వీరాంజనేయస్వామి దర్శనం చేయటానికి పీచు ఉన్న కొబ్బరికాయ, రెండు తమల పాకులు, వక్కలు కలిపి ఒకకాషాయ రంగు సంచీలో మూటకట్టి 50 రూపాయలు కట్టి రసీదు తీసుకొని పేరు నమోదు చేసుకొని, ఎక్కడ ఉంచాలో తెలుసుకొని, శ్రీరామ జయ రామ జయ జయ రామ అంటూ 11 సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయటం ఇక్కడి ప్రత్యేకత. మనసులో కోరిన కోరికను స్వామికి తెలియజేసి ఈ మూటను పూజారికిస్తే ఒక కార్డు ఇచ్చి దాన్ని భద్రపరచి మూడు నెలల తర్వాత కోరికలు కట్టు ఆంజనేయస్వామి కోరిన కోరిక తీర్చగానే తిరిగి వస్తే మన మూట జాగ్రత్తగా మనకు అందజేస్తాడు పూజారి. ఇదీ ఇక్కడి పద్ధతి. భక్తుల కోర్కెల కాషాయ రంగు మూటలతో ఆలయం అంతా నిండిపోయి ఉంటుంది.

శివాంజనేయులు-పెరుగుతున్న నందీశ్వరుడు

స్వామికి గంటసేపు నిత్యాభిషేకం చేస్తారు. ఇక్కడే శివుడూ కొలువై ఉంటాడు. ఇలా ఈ స్వాములిద్దరూ దర్శనమివ్వటం ఎక్కడా చూడని సంగతి. శివుని వాహనమైన నంది ఒక పెద్ద రాతి మీద ఉండి ప్రతి ఏడాది కొద్ది కొద్దిగా పెరుగుతూ ఉండటం మరో విశేషం. దీన్ని చూడటానికి కూడా భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. కట్టు ఆంజనేయస్వామి తన ఆలయం చుట్టూ 11 సార్లు ప్రదక్షిణం చేసిన భక్తు లందరి కోర్కెలూ తీరుస్తాడు.

స్వామికి స్వర్ణ రథం

25 లక్షలు ఖర్చు చేసి ఆంజనేయస్వామికి బంగారు రథం తయారు

చేయించారు. శ్రీ హనుమజ్జయంతి నాడు స్వర్ణ రథంలో స్వామిని ఊరేగిస్తారు. ఎందరో సాధు సంతులు ఈ స్వామిని స్వామిని సందర్శించారు. వివాహాలు ఆలస్యమైనా, దంపతులకు పిల్లలు పుట్టటం ఆలస్యమైనా కోరికను స్వామికి తెలియజేసి మొక్కుకొని 11 సార్లు ప్రదక్షిణ చేస్తే కోర్కెలను స్వామి నెర వేరుస్తాడు అని అందరి ప్రగాఢ విశ్వాసం.❋

137) శ్రీ వీరాంజనేయ దేవాలయం-పుదుప్పాకం

తమిళనాడు రాజధాని చెన్నైలో పుదుప్పాకంలో ఒక చిన్న కొండపై శ్రీ వీరాంజనేయ స్వామి కొలువై ఉన్నాడు. 108 మెట్లు ఎక్కి స్వామిని దర్శించాలి. ఆంజనేయ దేవాలయం ఎదురుగా శ్రీ సీతారామ లక్ష్మణ స్వాములున్న దేవాలయం ఉన్నది. హనుమజ్జయంతి, శ్రీరామనవమి వేడుకలు బాగా జరుపుతారు. ఎగరటానికి సిద్ధంగా నిలబడి ఉన్న ఆరడుగుల అందగాడు హనుమ ఉత్తరంవైపు సంజీవిని పర్వతం కేసి చూస్తూ శరీరం తూర్పుకు ఉన్నట్లు కనిపిస్తాడు. కుడి కాలు భూమికి గట్టిగా ఆనించి ఎడమ కాలితో గాలిలోకి ఎగురున్న భంగిమలో దర్శనమిస్తాడు. కుడి చేయి అభయ ముద్రతో ఉంటే ఎడమ చేయి తుంటి మీద ఆనించి ఉంటాడు. తలపైకి లేచిన పొడవైన వాలం చివర గంట కట్టబడి ఉంటుంది. బొడ్డు మీద పద్మ చిహ్నం ఉంటుంది. ఈ స్వామి అద్భుతాలు ఎన్నో ఉన్నాయని స్థానికులు చెబుతారు.

ఈ కొండ దిగువ భాగాన వినాయకస్వామి కొలువై ఉండి విఘ్నాలను నివారిస్తాడు. ఈ కొండకు 'గజగిరి' అని పేరు. వ్యాస మహర్షి యే హనుమ ఆలయానికి 108 మెట్లు నిర్మించాడని విశ్వాసం. తిరు వేదాంతంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాలలో ఒకటి అయిన శ్రీ నిత్య కళ్యాణ స్వామి దేవాలయానికీ ఈ దేవాలయానికి అనుబంధం ఉంది. ప్రముఖ తమిళ సినీ నటుడు తన ఇష్టదైవంగా ఈస్వామిని భావించి తరచుగా వచ్చి దర్శిస్తాడట.❋

138) శ్రీ తన్నీర్ తురై వీరాంజనేయదేవాలయం-బ్రాడ్వే-చెన్నై

తమిళనాడులోని చెన్నైలో మైలాపూర్‌లో శ్రీ కపాలేశ్వర స్వామి దేవాలయం చాలా ప్రసిద్ధమైనది. ఇక్కడే స్వామి సన్నిధిలో మహాభక్తుడు తిరు జ్ఞాన సంబంధార్ తాపస్సు చేసి శివునిపై రచనలు చేశాడు. ప్రసిద్ధ తమిళ గ్రంథం 'తిరుక్కురళ్' రాసిన తిరువళ్ళు వార్ మైలాపూర్‌లోనే జన్మించాడు. తిరు వేత్రి యూర్ అనేది మద్రాస్‌కు ఉత్తర సరిహద్దు అయితే దక్షిణ సరిహద్దు తిరువన్మయూర్. నగర మధ్యభాగమే మైలాపూర్, తిరువల్లికేని అనే ట్రిప్లికేన్.

తిరువళ్ళు వార్ దేవాలయం దగ్గరే శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ఉంది. చాలాపురాతన ఆలయాలలో ఇదొకటి. ఈ దేవాలయానికి 'తన్నీర్ తురై ఆంజనేయ కోయిల్' అని పేరు కూడా ఉంది. 1940-50 మధ్యకాలంలో తన్నీర్ తురై కూరగాయల మార్కెట్ దగ్గర ఈ ఆలయం ఉండేది. అందుకని ఆ పేరొచ్చింది. ఆ కాలంలో మద్రాస్ మొత్తం మీద ఆంజనేయార్ దేవాలయాలు బహు అరుదుగా ఉన్నాయి. ఇప్పుడు లజ్ కార్నర్‌కు దగ్గరగా ఉండటంతో 'లజ్ ఆంజనేయ దేవాలయం' అంటున్నారు.

ఎన్నో ప్రత్యేకతలు

పురాతన ఆలయం అనే కాక ఈ ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఈ ఆలయానికి దగ్గరలో ఉన్న సంస్కృత కళాశాలలో సుప్రసిద్ధ పండితులు శ్రీ అనంత రామ దీక్షితార్, శ్రీ కప్రానాథ వారియార్ మొదలైనవారు రామాయణం ప్రవచనాలు చేశారు. రామాయణాన్ని ఆంజనేయస్వామి అతి శ్రద్ధగా ఆలకించే వారని అందుకే ఈ ఆలయానికి గొప్ప శోభ, వైభవాలు కలిగాయని భావిస్తారు. ఇంతటి రామభక్తుడు ఇంక ఏ ఆలయంలోను ఉండడని విశ్వాసం. కంచి పరమాచార్యుల వారు శ్రీ శ్రీ

చంద్రశేఖర యతీంద్రులవారు ఇక్కడ సంస్కృత కాలేజిలో చాతుర్మాస్య దీక్ష చేసి, శ్రీ చంద్ర మౌళీశ్వర పూజాదికాలు నిర్వహించారు. సాయం సమయాలలో భక్తులకు ధర్మంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసేవారు. వీటకన్నిటికి శ్రీ ఆంజనేయ స్వామియే సాక్షీభూతుడు. రాజాజీ తను రాసిన రామాయణాన్ని ముందుగా ఈ స్వామి పాదాల చెంత ఉంచాడు.

ఆంజనేయ శిల్ప వైభవం

ఆంజనేయ స్వామి విగ్రహం 'అర్ధ శిల' అనే ప్రత్యేక శిలతో నిర్మించబడింది. పడమటి ముఖంతో దక్షిణం వైపు నడుస్తున్న భంగిమగా ఉంటాడు. చెవులకు కుండలాలు, మంచి వర్చస్సుతో అభయ ముద్రాలంకృతుడై ఎడమ చేయి తొడపై ఉంచి గదా ధారియై కేయూర కంకణాలు ధరించి దర్శనమిస్తాడు. స్వామి పాద పద్మాలకు తొడుగులు అనే ఆభరణాలుంటాయి. స్వామి వాలం శిరస్సు దాటి పైకి వచ్చి దక్షిణ దిక్కును చూస్తూ ఉన్నట్లు కనిపిస్తుంది. లక్ష్మీ సరస్వతీ లాగా పద్మంలో నిలబడి ఉండటం మరొక గొప్ప విశేషం. ఆలయంలో ఉత్సవమూర్తి, శ్రీ పంచలోక వేణుగోపాలస్వామిని కూడా దర్శించవచ్చు. స్వామి ఆలయానికి కుడివైపు శ్రీ రామాలయం ఉంది.

చరిత్ర

మైసూర్‌లోని వ్యాపార వేత్తలైన శ్రేష్టి యార్‌లు మాలికాఫిర్ దౌర్జన్యాలను భరించలేక మూడు వందల ఏళ్ళ క్రితం మైసూర్ వదిలి చెన్నైలోని మైలాపూర్‌లో స్థిర నివాసమేర్పరచుకొన్నారు. అప్పుడు ఇక్కడ కుమ్మరులు కుండలు చేస్తూ ఉండేవారు. అందుకని ఈ ప్రదేశాన్ని అప్పుడు 'కాయ పెత్తై లేక కొస పేట్టై అనే వారు. మైసూర్ నుంచి వచ్చేటప్పుడు ఈ హనుమ విగ్రహాన్ని ఇక్కడికి తమతోబాటు తెచ్చుకొని ప్రతిష్టించారు. కాల క్రమంలో వీరు తమిళులతో కలిసిపోయి 'చెట్టియార్'లు అయ్యారు.

ఈ ఆలయం చిన్నదే కనుక రోడ్డు మీద నుంచే ఆంజనేయ స్వామిని దర్శించవచ్చు. ఈ మధ్యనే రాజగోపురం నిర్మించి ఆలయాన్ని విస్తృత పరచారు. ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదిన 500 మందికి పైగా వేద పండితులతో వేద పారాయణ నిర్వహించటం మరొక గొప్ప విషయం.❋

139) శ్రీ వీరాంజనేయ దేవాలయం-అవినాశి

తమిళనాడులో తిరుపూర్‌జిల్లా అవినాశిలో రెండు చిన్న ఆంజనేయ దేవాలయాలున్నాయి. ఈ రెండు వ్యాసరాయల ప్రతిష్టితాలే. ఈ రెండు ఆంజనేయాలయాలు శివనాశిలోని శివాలయం దగ్గరే ఉన్నాయి. మొదటిది శ్రీ వీరాంజనేయ దేవాలయం. స్వామి విగ్రహం చాలా చిన్నది. ఆలయంలో మరే దేవుడూ లేడు. దీనికి దగ్గరలో నూతన ఆలయం నిర్మిస్తున్నారు.

మరో ఆంజనేయాలయం శ్రీ కరి వరదరాజ స్వామి దేవాలయంలో అవినాశి శివాలయం ద్వారం దగ్గరే ఉన్నది. ఈ రెండు దేవాలయాలు హైవే మీదనే ఉన్నాయి.❋

140) పంచముఖి హనుమాన్ దేవాలయం-కుంభకోణం

మంత్రాలయం రాఘవేంద్రస్వామికి ఇష్టదైవం పంచముఖి ఆంజనేయస్వామి. ఆయన తపస్సు చేసిన చోట పంచముఖి ఆంజనేయస్వామిని ప్రతిష్టించి గుడి కట్టించారు. అందులో తూర్పు ముఖం ఉన్న ఆంజనేయుడు మనశ్శాంతిని విజయాన్ని ఇస్తాడు. దక్షిణం వైపు ఉండే నరసింహ రూపం విజయాన్ని భయ రాహిత్యాన్ని కల్గిస్తాడు. పడమర వైపున్న గరుడ ముఖ భూత పిశాచాలను దూరం చేసి విషం నుండి రక్షిస్తాడు. ఉత్తరానికున్న వరాహ రూపం ఐశ్వర్యాన్ని సంపదను కలిగిస్తాడు. ఆకశం వైపు చూసే హయగ్రీవ ముఖం జ్ఞానాన్ని సత్ సంతానాన్ని ఇస్తాడు.

తమిళనాడులో కుంభకోణంలో40 అడుగుల శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. ఆకుపచ్చ రంగుతో స్వామి కనిపిస్తాడు.❋

141) శ్రీ సంకట హర విశ్వరూప హనుమాన్ దేవాలయం-జ్ఞానపురి

తమిళనాడులో కుంభకోణం దగ్గర కుంభకోణం-అలమ్కుడి రోడ్డులో తిరువారూర్ జిల్లాలో తిరువంమంగళం గ్రామంలో 32 అడుగుల భారీ శ్రీ సంకట మోచన విశ్వరూప హనుమాన్ విగ్రహం ఉన్నది. 60 టన్నుల బరువుగల శిలను మలిచి ఈ విగ్ర హాన్ని వాలాజ్ బాద్ పులియం పాడి రామకృష్ణ స్థపతి నిర్మించారు. ఇక్కడి నుంచి క్రేన్ మీద తరలించి జ్ఞానపురిలో ప్రతిష్టించారు. తొమ్మిది ఎకరాల స్థలం ఈభారీ ప్రాజెక్ట్‌కు కేటాయించారు. ఇందులో అయిదున్నర ఎకరాలలో ఆలయాన్ని నిర్మిస్తున్నారు.❋

142) శ్రీ విశ్వ రూప పంచముఖ హనుమాన్ దేవాలయం-తిరువళ్లూర్

తమిళనాడు రాజధాని మద్రాస్ నగరానికి 45 కిలోమీటర్ల దూరంలో తిరువళ్లూర్ అనే ప్రాచీన గ్రామం ఉంది. ఇక్కడ భారీ వీర రాఘవస్వామి దేవాలయం చాలా ప్రసిద్ధ మైనది. దీనికి మించి ఇక్కడ శ్రీ విశ్వరూప పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణం చేబట్టారు. అంతకు ముందు ఒక ఆశ్రమ ట్రస్ట్ వారు నిర్వహిస్తున్న చిన్న హనుమాలయం ఉంది. ఇప్పుడు 40 అడుగుల మహా భారీ విగ్రాహాన్ని తయారు చేయించారు స్వామికి పంచముఖాలుంటాయి ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఇంత పెద్ద భారీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ఇంకెక్కడా లేదు. దీనితోబాటు పంచలోహాలతో పంచముఖ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని కూడా తయారు చేయించారు. హనుమజ్జయంతి శ్రీరామనవమి ఘనంగా నిర్వహిస్తారు.❋

143) శ్రీ జయ వీర హనుమాన్ దేవాలయం-మదురై

నదిలో దొరికిన హనుమ

తమిళనాడులోని దేవాలయ నగరమైన మదురైలో శ్రీ మీనాక్షి సుందరేశ్వర స్వామి దేవాలయం జగత్ప్రసిద్ధమైనది. మదురైకి సమీపంలో సిమ్మకాల్‌లో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ప్రాముఖ్యమైనది. అక్కడ కుజాంత ఆనందస్వామి అనే యోగి ఉండేవారు. ఆయనను మీనాక్షీ అమ్మవారి కుమారుడుగా అందరూ భావించేవారు. అందుకే 'కుజంత' స్వామి అనే పేరొచ్చింది ఆయనకు. తమిళంలో కుజాంతం అంటే పిల్లాడు అని అర్ధం. వైగై నదికి ఉప నది అయిన కృతమాల నది ఒడ్డున కుటీరం నిర్మించుకొని ఆయన ఉండేవారు. జపంతో జీవితాన్ని ధన్యం చేసుకొనేవారు. ఆయన అవసారాలను కనిపెట్టి స్థానికులు కుజంత స్వామికి అన్నీ అమర్చే వారు. ఒక రోజు ఆ గ్రామస్తులందరి కలలో శ్రీ ఆంజనేయస్వామి దర్శన మిచ్చి తాను కృతమాల నదిలో ఉన్నానని తనను బయటికి తీసి ప్రతిష్టించి ఆలయం నిర్మించమని కోరాడు.

విగ్రహ ప్రతిష్ట తర్వాత పెరుగుతున్న చెట్టు

వారికి ఏమీ పాలు కాక కుజంత స్వామికి విన్నవించారు. ఆయన వారు స్వామి సాక్షాత్కారం పొంది ధన్యులయ్యారని చెప్పి, వారందరిని స్వామి వారికి తాను ఉన్నానని చెప్పిన చోటికి వెళ్లి నదిలో వెతికారు. మొదటగా శ్రీ నరసింహస్వామి విగ్రహం లభించింది. ఆ తర్వాత శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ లక్ష్మి, శ్రీ గణేష్, గరుడ విగ్రహాలు దొరికాయి. స్వామి ఆజ్ఞతో స్వామీజీ నేతృత్వంతో ముందుగా శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని 'ఎలుప్పై చెట్టు' (స్థలవృక్షం) క్రింద స్వామీజీ ప్రతిష్టించారు. అక్కడే దొరికిన మిగిలిన విగ్రహాలనూ ప్రతిష్టించారు. అప్పటి నుంచి ఆ చెట్టు బాగా ఎదగటం ప్రారంభించి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది.

ఆలయ సముదాయం

ఈ రోజు ఆలయం చాలా పెద్దగా ఉంది. విశాలమైన గర్భ గృహం పెద్ద దర్వాజా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఆలయం డోమ్ మీద శ్రీరామ దర్బార్ చూడ ముచ్చటగా ఉంటుంది. గర్భ గృహంలో బయటి చెట్టు భాగం లోపలి వచ్చి ఉంటుంది. దానికిందనే ఆంజనేయస్వామి విగ్రహం దర్శనమిస్తుంది. స్వామికి కుడి వైపున యోగ నరసింహస్వామి, లక్ష్మీదేవి గరుడ విగ్రహాలుంటాయి. రెండు గణపతి విగ్రహాలు గర్భగుడి గోడలకు దగ్గరగా ప్రతిష్టింపబడ్డాయి. ఉత్సవ విగ్రహాలు కూడా ఉన్నాయి. ఆలయ ఆవరణలో విష్ణు, దుర్గా, సుదర్శన స్వాముల ఆలయాలున్నాయి. పెరుగుతున్న స్థల వృక్షం కింద శ్రీ జయ వీర ఆంజనేయ స్వామి మహా వైభవంగా ఉంటాడు.

జయ వీర హనుమాన్ ప్రత్యేకత

శ్రీ జయ వీర హనుమాన్ రెండున్నర అడుగుల ఎత్తు విగ్రహం. ఎడమ చేయి పైకెత్తి నట్లుంది. దానిలో సంజీవిని పర్వతాన్ని కలిగి ఉంటాడు. కుడి చేయి తొడపై ఆనించి గదా దారిగా ఉంటాడు. నడుముకున్న బెల్టు నుండి కత్తి వేలాడుతూ ఉంటుంది. తోకకు చివర చిన్న కొండ ముడి వేయబడి ఉండటం విచిత్రం. దానిపైన ఒక గంట కట్టబడి ఉంటుంది. ఆయన నిలుచున్న భంగిమ చూస్తుంటే శ్రీ రాముడి ఆజ్ఞ వినగానే ముందుకు ఉరికి, ఆయన భక్తుల, తన భక్తుల కోరికలు తీర్చటానికి బయలు దేరుతున్నట్లు అనిపిస్తుంది. కనులలో దీర్ఘ కటాక్షం గోచరిస్తుంది.

అభిషేకం చేయగానే వృద్ధ మూర్తిగా మారటం

అభిషేకం చేయగానే స్వామి 'వృద్ధ మూర్తి'గా దర్శనమివ్వటం ఒక గొప్ప వింత. జూలై ఆగస్టలలో మొదటగా కనిపించిన నరసింహ స్వామి ఉత్సవాలు 15 రోజులు ఘనంగా నిర్వహిస్తారు. అన్ని రోజుల్లో ఆంజనేయస్వామికి రోజుకొక అలంకారం చేస్తారు. అందులో 'వృద్ధ వేష అలంకారం' కూడా ఉండటం మరో విశేషం. ఆంజనేయస్వామి ప్రక్కన గరుడ స్వామి కూడా ఉండటం ఇంకొక ప్రత్యేకత. ఈ ఆలయం శివ కేశవులకు భేదం లేదని తెలియజెప్పే గొప్ప సంస్కృతికి నిలయం.*

144) శ్రీ భక్త హనుమాన్ దేవాలయం-మదురై

తమిళనాడులో మదురైలో మీనాక్షి సుందరేశ్వర ఆలయం జగత్ ప్రసిద్ధి చెందింది. విజయనగర చక్ర వర్తులకాలంలో ఈ నగర ప్రాభవం మహా గొప్పగా ఉండేది. కృష్ణ దేవరాయల రాజ గురువు వ్యాస రాయలవారు వందలాది ఆన్జేయ విగ్రహాలు ప్రతిష్టించారని చెప్పుకొన్నాం. ఇవి మధ్వ మత ఆధ్వర్యంలో నిర్వహింపబడుతాయి. 'ముఖ్య ప్రాణవర్' అని హనుమను పిలుచుకొంటారు. మదురైలో 'కృష్ణ రాయ తెప్పాకులం' ఒడ్డున శ్రీ వ్యాస రాయ ప్రతిష్టిత శ్రీ ఆంజనేయస్వామి విగ్రహమూ ఆలయమూ ఉన్నాయి. గర్భ గృహం చిన్నదిగా ఉండి దానికి అనుసంధానంగా ఉన్న పెద్ద హాలు ఒకప్పుడు యాత్రికుల సత్రంలా ఉపయోగపడేది. దీనిని మద్వ మఠంవారు నిర్వహిస్తున్నారు. 1903లో దేవాలయాన్ని పునరుద్ధరించి పెంచి నిర్మించి మహాకుంభాభిషేకం చేశారు. తర్వాత ఏడాది స్థానిక బ్రాహ్మణ సంఘం వారు విశాలమైన హాలు నిర్మించారు. దీనిలో భజనలు ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తున్నారు. 1988 మే నెల ఆరున సెంధిల్ అంటే మురుగన్ అంటే కుమారస్వామి విగ్రహాన్ని అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్టించారు. తరాత మూడు అంతస్తుల రాజగోపురం, నూతన విమానం నిర్మించి కుంభాభిషేకం చేశారు. ఇప్పుడు శ్రీ ఆంజనేయ ఆలయం సర్వసౌకర్యాలతో విస్తరిల్లి ఆకర్షణగా నిలిచింది. భక్తుల, దాతల సాయంతో ఫ్లోరింగ్ వగైరాలు కల్పించారు.

మదురై ఆంజనేయ స్వామి ప్రత్యేకత

శ్రీ ఆంజనేయ దేవాలయం రోడ్డు మీదకే కనిపిస్తుంది. స్వామి అంజలి హస్తంతో నిలబడి దర్శనమిస్తాడు. విగ్రహం రెండున్నర అడుగుల ఎత్తు మాత్రమే ఉండి భక్తుల మనోభీష్ట సిద్ధి కలిగిస్తుంది. స్వామి విశాల కనుదోయి భక్తులనందర్నీ పర్య వేక్షిస్తున్నట్లుగా గోచరిస్తుంది. భక్తుల కోరికలను వినటానికి, వాటిని తన రామునికి నివేదించటానికి వీలుగా స్వామి చెవులు రిక్కిం చుకొని సావదానంగా ఉంటాయి. మధ్వ సంప్రదాయంలో హనుమ ముకుళిత హస్తాలతో ఎక్కడా ఉండదు. ఇక్కడే అలా కనిపిస్తాడు. సాధారణంగా వ్యాస రాయ ప్రతిష్టిత హనుమాన్ విగ్రహాలు అర్ధశిలతో తోక చివర చిన్న

గంటతో ఉంటాయి. ఇక్కడ అవేవీ కనిపించవు. అదే ఆశ్చర్యం. బహుశా కాలక్రమంలో అసలు శిల దెబ్బ తింటే తీసేసి దాని స్థానంలో ఈ కొత్త శిలపై విగ్రహాన్ని చెక్కి ప్రతిష్టించి ఉంటారని అంటారు. కాని ఇన్ని తేడాలు విగ్రహంలో ఉన్నా మధ్వమత సంప్రదాయం అంటే ద్వైత సంప్రదాయంలోనే వ్యాస రాయలకాలం నుండి నేటివరకూ పూజాదికాలు స్వామికి జరుగుతూనే ఉన్నాయి.❋

145) శ్రీ భక్తాంజనేయ దేవాలయం-పళని

తమిళనాడులో సుప్రసిద్ధ సుబ్రహ్మణ్య క్షేత్రం పళనిలో 51 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. పళని వెళ్ళే దారిలో సెన్న కోట్టై వద్ద దిండిగల్ జిల్లాలో ఇది ఉంది. పళని మలై వేల్లిమలై, రంగ మలై కొండల సముదాయంలో శ్రీ భక్తాంజనేయ స్వామి విగ్రహం ఉన్నది. ఒకప్పుడు దీనిని తులసి వనం అని పిలిచేవారు. యి ఐ సి ఎస్ కంపెనీ చైర్మన్ శ్రీ ఎస్ యెన్ స్వామి ఆయన కుటుంబ సభ్యులు ఇక్కడ 2-8-2008న ఆలయం నిర్మించారు. ఆలయం లోపల ఎడమచేతిలో పెద్ద గదతో హనుమాన్ విగ్రహం ఉంటుంది. ఈ గదతో శత్రుసంహారం పాప వినాశనం చేస్తాడని భక్తుల విశ్వాసం. ఈ దేవాలయం మీదనే 51 అడుగుల ఎత్తున్న శ్రీ హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణంతో అది దేవాలయంపై ఒక సమాధి లాగా అనిపిస్తుంది. ఇలాంటి ప్రత్యేకమైన ఆకర్షణ దక్షిణ తమిళనాడులో ఇంకెక్కడా లేదు. ఆవరణలోనే స్ఫటిక దేవాలయాన్ని పవిత్రమైన మూలలో (కన్ని మూలై)లో ఒక దేవాలయం నిర్మించారు. దీనిలో శ్రీ జయ వీర హనుమాన్‌ను ప్రతిష్టించారు. పవిత్రమైన ఈ మూలలోనే దేవుడు కొలువై ఉంటాడని నమ్మకం. ప్రతి పౌర్ణమి, అమావాస్య, ఏకాదశి పర్వ దినాలలో విశేషంగా భక్తులు ఆలయ సందర్శన చేస్తారు. శనివారం పూజ అనంతరం ప్రసాదంగా అన్నదానం చేస్తారు. చైత్ర పౌర్ణమికి హనుమజ్జయంతి చేస్తారు. పలు ప్రాంతాల నుండి భక్తులు వచ్చి స్వామి దర్శనంతో తరిస్తారు.❋

146) శ్రీ త్రినేత్ర వీరాంజనేయ దేవాలయం-అనంతమంగళం

తమిళనాడులో చిదంబరం-కారైకాల్ మధ్య అనంత మంగళంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చాలా సుప్రసిద్ధమైనది. ఆలయం తూర్పు వైపుకు ఉంటుంది. స్వామి త్రినేత్రుడు అవటం ఒక ప్రత్యేకత. దశ హస్తుడు అవటం మరో వింత. శంఖం చక్రం శూలం, కబళం, ముద్గరం, పాశం, అంకుశం, విల్లు, బాణం, శక్తి, నవనీతం చేతులలో ధరించి ఉంటాడు. స్వామికి రెండువైపులా రెక్కలు ఉండటం మరో ప్రత్యేకత.

రావణ వధ తర్వాత సీతారామ లక్ష్మణ ఆంజనేయులు అయోధ్యకు వెడుతూ భరద్వాజ మహర్షి ఆశ్రమంలో విడిది చేశారు. వీరిని దర్శించటానికి నారద మహర్షి వచ్చాడు. మాటల సందర్భంలో నారదుడు లంక యుద్ధం

అయిపోయినా ముగిసినట్లు కాదు అన్నాడు. ఇంకా రాముని విల్లు బాణాలతో పని ఉందన్నాడు. రాముడు విషయాన్ని వివరంగా చెప్పమని కోరాడు. రావణుడు చనిపోయినా రాక్షసులు జీవించే ఉన్నారని వారు రామునిపై పగ తీర్చుకోవాలను కొంటున్నారాని, వారిలో రక్త బిందు రక్త రక్షణులు సముద్ర తీరంలో ఘోర తపస్సు యాగం చేస్తున్నారని చెప్పాడు. దానివలన బలం పుంజుకొని లోక కంటకులుగా మారిపోతారని కనుక అవశ్యం వారిని వధించాల్సిందేనని హెచ్చరించాడు. కాని తాను అయోధ్యకు అత్యవసరంగా వెళ్లాలని లేకపోతే అక్కడ భరతుడు ప్రాణత్యాగం చేస్తాడని తెలియజేశాడు. 'నారదా-రామావతారంలో నా కర్తవ్యము పూర్తయింది. మరికొన్ని రోజుల్లో ఈ అవతారాన్ని చాలిస్తున్నాను కాబట్టి ఇంకెవరినైనా ఎంపిక చేయండి. లక్ష్మణుడిని అయోధ్యకు పంపమని నారదుడు సలహా ఇస్తే అతడు తన నీడ అని తనను వదిలి ఉండే ప్రసక్తి లేదని చెప్పాడు. అప్పుడు రాముడు ఆ ఇద్దరు రాక్షసులని చంపే బాధ్యతను హనుమంతునికి అప్పగించాడు.

రక్త బిందు రాక్ష సోదర సంహారానికి దేవతలు సహకరించారు. విష్ణువు చక్రాన్ని, శ్రీ దేవి త్రిశూలాన్ని బ్రహ్మ బ్రహ్మ కపాలాన్ని, పాశాంకుశం, మంత్రాష్టకాన్ని, శ్రీరాముడు కోదండ ధనుస్సును అక్షయ తూణీరాలను, శ్రీకృష్ణుడు శక్తిని వెన్నను, శివుడు త్రినేత్రాన్ని శ్రీ ఆంజనేయ స్వామికి ప్రదానం చేశారు. వీటినన్నిటిని పది చేతులతో ధరించి యుద్ధం చేసి రక్త బిందు రాక్షస సోదరులను సమూలంగా సంహరించాడు హనుమంతుడు. ఈ రాక్షస వధ తర్వాత సంతోషంతో హనుమ నాట్యం చేశాడిక్కడ. అందుకనే దీనికి 'అనంత మంగళం' అనే పేరు వచ్చింది.

శ్రీ హనుమజ్జయంతిని, ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహిస్తారు. శని మంగళవారాలలో తమలపాకు పూజ అభిషేకాలు చేస్తారు. అప్పాలు నైవేద్యం పెడతారు. భక్తుల కోరికలను నెరవేర్చే వరదుడిగా శ్రీ త్రినేత్ర వీరాంజనేయ స్వామికి ఘన చరిత్ర ఉంది. దీనికే ఆనంద మంగళ దేవాలయం అనే పేరు కూడా ఉంది.❋

147) 37 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం-అయిపెట్టై

తమిళనాడు కడలూర్జిల్లా అయిపెట్టైలో 37 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం అబ్బురపరుస్తుంది. ఇటీవలే 2015లో నెలకొల్పబడిన విగ్రహమిది.❋

148) బాలికకు కలలో కన్పించి ఆలయం నిర్మించుకొన్న శ్రీ హనుమాలయం-క్రోంపేట

తమిళనాడు చెన్నైలోని క్రోంపేటలోని మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దగ్గర ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఇది. 1930లో ఇక్కడ ఒక ఆంజనేయస్వామి విగ్రహం దొరికింది. అంజనీ అమ్మాళ్ అనే 13 ఏళ్ళ బాలికకు స్వామి కలలో కన్పించి తనకు దేవాలయం కట్టించమని చెప్పాడట. మర్నాడు ఆ పిల్ల తన తలిదండ్రులకు ఆ విషయం చెప్పింది. కొంతకాలం తర్వాత శ్రీ చంద్రశేఖర సరస్వతి మహాస్వాములు ఈ ప్రాంతంలో పర్యటిస్తూ ఈ విషయం తెలుసుకొన్నారు. తమ మనుష్యులను పంపి ఆ పిల్ల చెప్పిన చోట వెదకమన్నారు. ఆమె చెప్పినట్లే అక్కడ ఆంజనేయస్వామి విగ్రహం నేల మీదపడి ఉండటం చూసి ఆశ్చర్యపోయి, వెళ్లి స్వామివారికి తెలియజేశారు . తిరుమల తిరుపతి దేవాలయ నిధులతో ఇక్కడ రంగరంగ వైభవంగా ఆలయ నిర్మాణం చేసి ఆ ఆంజనేయ విగ్రహాన్ని ప్రతిష్టించి ఆ బాలిక అంజనీ అమ్మాళ్ కోరిక తీర్చారు. దీనిని ప్రసన్న యోగాంజనేయ దేవాలయం అంటారు. 'ఆలయం లోపల ఆంజనీ అమ్మాళ్ ఫోటో కూడా ఉంటుంది. నిత్యం వందలాది భక్తులు శ్రీ హనుమను దర్శించి మనోభీష్టాలను నెరవేర్చుకొంటారు. ఆరు నెలల కొకసారి స్వామిని వివిధ రకాల ఫలాలతో (ఫజకాపు)నూ, వెన్నతోనూ (వెన్నకాపు) దేదీప్యమానంగా అలంకరిస్తారు.❋

149) శ్రీ సప్తస్వరసామీరి దేవాలయం-మయిలాడుతురై

భారతదేశంలో సప్తస్వర దేవాలయాలు హంపీ మొదలైనచోట్ల చాలా ఉన్నాయి. వాటిలో ఒక్కో స్తంభంపై కొడితే ఒక్కొక్క స్వరం వస్తుంది కాని తమిళనాడులోని నాగపట్నం జిల్లా మయిలాడుతురై పట్టణసమీపంలో ఉన్న కోజికుట్టి గ్రామంలో వెలసిన శ్రీ హనుమ దేవాలయంలో స్వామి విగ్రహంపైన వేర్వేరుచోట్ల తేలికగా తాకితే చాలు సప్తస్వరాలు అంటే 'సరిగమపధని' పలుకుతాయి. ఇదీ ఇక్కడి ప్రత్యేకత. స్వామి వాలం మెలికలు తిరిగినట్లు ఉండి తోక చివర గంట వ్రేలాడదీయబడి ఉండటం కూడా ఇక్కడ ప్రత్యేకమైన విషయాలే. సాధారణ హనుమాలయాలలో దర్శనం ముందువైపునే ఉంటుంది. కాని ఇక్కడ వెనకున్న స్వామి తోక చూసే అవకాశం కూడా ఉండటం మరో విశేషం. స్వామి విగ్రహం నిలబడి ఉండి 'ఉల్లాసభావం'తో దర్శనమిస్తాడు. ఎడమకాలు కొంచెం ఒంచి, కుడి కాలు భూమిని ఆనించి ఉండటం విశేషం. కవచంతో ఆభరణ భూషితుడుగా ఉంటాడు. రెండుచేతులు కలిపి 'ప్రణామ' భంగిమలో కనిపిస్తాడు. ముంజేతులకు కంకణాలుంటాయి. భుజాలకు కేయూరాలు, వక్షస్థలంపై యజ్ఞోపవీతం, కంఠంలో అయిదు రకాల మాలలు, చెవులకు కుండలాలు, వాటిలో కర్ణపుష్పాలు, కేశాలు కేశబంధనంతో ముడి వేయబడి, వెడల్పైన కళ్ళు పింగళ వర్ణంతో, అనుగ్రహ పూర్వక వదనంతో కనిపిస్తాడు.

ఈ ఆలయం 1400 సంవత్సరాల నాటిది. ఇందులో ముఖ్యదైవం శ్రీనివాసుడు. ఆయనను వనముట్టి పెరుమాళ్ అంటారు. ప్రశాంతతకు నిలయం. ఇక్కడి స్వాముల దర్శనం చేస్తే గ్రహదోషాలు శని పీడ తొలగిపోతాయి. ❋

150) తోకలో కోట్లు విలువ చేసే వజ్రం ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం-నల్లత్తూరు

తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుత్తణికి దగ్గరలో నల్లత్తూరు అనే గ్రామం ఉంటుంది. ఇక్కడ ఆంజనేయ దేవాలయం ఉంటుంది. ఈ ఆలయ దర్శనం వల్ల శత్రువుపై విజయంతోపాటు అంతులేని ఐశ్వర్యం మన సొంతమవుతుందని భక్తులు చాలాకాలంగా విశ్వసిస్తూ వస్తున్నారు. ఈ ఆంజనేయస్వామిని సాక్షాత్తు విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయల గురువు అయిన వ్యాసరాయులు స్వయంగా ప్రతిష్టించినట్లు చెబుతారు. ఆయన ఈ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించడానికి అక్కడ ఒక కథ ప్రచారంలో ఉంది. అదేమిటంటే, స్థానిక కథనం ప్రకారం విజయనగర సామ్రాజ్య రాజగురువు మరియు హనుమంతుడి భక్తుడైన వ్యాసరాయులకు ఒకసారి తీవ్రమైన జబ్బు చేసింది. ఎంతమంది వైద్యులకు చూపించినా ప్రయోజనం లేకపోయింది. దాంతో తన ప్రాణాలు కాపాడమని అతను ఆంజనేయుడిని ప్రార్థించాడు. అంతేకాదు తన జబ్బు నయమైతే దేశం నలుమూలలా హనుమంతుడి విగ్రహాలను ప్రతిష్టించి, ఆలయాలను నిర్మింపజేస్తానని కూడా మొక్కుకొన్నాడు. అతను అలా మొక్కుకున్న కొన్ని రోజుల్లోనే విచిత్రంగా వ్యాసరాయుల జబ్బు పూర్తిగా నయమైపోయింది. దాంతో మొక్కు ప్రకారం అతను తన జీవితం మొత్తంలో దేశవ్యాప్తంగా 732 ఆంజనేయస్వామి దేవాలయాలు కట్టించాడు. అందులో ఎక్కువభాగం దక్షిణాది

రాష్ట్రాల్లోనే ఉన్నాయి. అలా కట్టించిన దేవాలయాల్లో ఒకటి నల్లత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం. ఇక ఈ దేవాలయం నిర్మాణానికి సంబంధించి కూడా ఒక కథనం అక్కడ ప్రచారంలో ఉంది. వ్యాసరాయుల మొక్కుతీర్చడంలో భాగంగా ఆయన సేవకుల చేత తిరుపతిలో ఒక దేవాలయాన్ని నిర్మింపజేయించి ఆ గుడిలో ఆంజనేయుడి విగ్రహాన్ని ప్రతిష్టించాలని భావించాడు. అందుకు అవసరమైన ఆంజనేయుడి విగ్రహాన్ని తిరుత్తణి నుంచి తీసుకొని వెళ్తూ నల్లత్తూరు దగ్గర ఆగి, ఆ విగ్రహాన్ని అక్కడున్న ఒక చెట్టు కిందపెట్టి సేవకులు కొద్దిసేపు విశ్రమించారు. కొద్దిసేపటి తర్వాత నిద్రలేచి, తిరుపతికి బయలుదేరడానికి సమాయత్తమై విగ్రహాన్ని అక్కడి నుంచి కదిలించబోగా ఆ విగ్రహం ఒక్క అంగుళము కూడా కదల్లేదు. వాళ్లు ఎంత ప్రయత్నించినా అది అక్కడ్నుంచి కదలకపోవడంతో ఆ సేవకులు తమ ప్రయత్నాన్ని విరమించుకొని, ఆ విషయాన్ని వ్యాసరాయులకి తెలియజేయాలనుకొంటుండగా, సరిగ్గా అదే సమయంలో నిద్రలో ఉన్న వ్యాసరాయుళవారికి ఆంజనేయస్వామి కలలో కనిపించి తాను నల్లత్తూరులోనే ఉంటానని తనకు అక్కడే దేవాలయం నిర్మించాల్సిందిగా సూచించడం జరిగింది. దాంతో ఆ విగ్రహాన్ని అక్కడే ఉంచేసి, నల్లత్తూరులో ఆంజనేయస్వామి దేవాలయం నిర్మించారు. కొద్దికాలంపాటు ఈ ఆలయానికి పూజాది కార్యక్రమాలు బాగానే నిర్వహించారు. కాలక్రమంలో ఈ దేవాలయం శిథిలమైపోవడంతోపాటు ఆ విగ్రహం యిసుకలో కూరుకుపోయింది. దాని గురించి అందరూ మర్చిపోయారు. కొంతకాలం క్రితం స్థానికంగా ఉంటున్న చక్రవర్తి అనే వ్యాపారికి, ఆయన భార్యకు ఒకేసారి ఆంజనేయస్వామి కలలో కనబడి తాను భూమిలో కూరుకుపోయిన స్థలం ఆనవాళ్లు వారిద్దరికీ తెలిపి తనను వెలికితీయాల్సిందిగా సూచించాడు. దాంతో వారిరువురూ ఆ విగ్రహాన్ని వెలికి తీయించి ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని నిర్మించారు. ఆ దంపతులు ఆ ఆలయాన్ని నిర్మించగానే వారి వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లింది.

ఇక్కడ ఉన్న ఆంజనేయస్వామి ముఖం అచ్చం చిన్నపిల్లవాడి ముఖంలాగా ఉంటుంది. అందువల్లే స్థానికులు ఇక్కడి స్వామి వారిని

'బాలాంజనేయస్వామి' అని పిలుస్తారు. గతంలో ఈ విగ్రహం తోక చివర అమూల్యమైన రత్నం ఒకటి ఉండేది. ప్రస్తుతం ఆ రత్నాన్ని ఎవరో దొగిలించారని చెబుతారు. ఇక్కడ ఆంజనేయస్వామి ఉత్తరదిశలో ఉంటారు. ఈ స్వామి కుడి చేతిలో తామరరేకులతో అభయ ముద్ర, ఎడమచేతిలో తామరమొగ్గ ఉండడం విశేషం. ఇలా ఒక చేతిలో తామరపుష్పం, మరోచేతిలో తామరమొగ్గ ఉన్న ఆంజనేయ విగ్రహాలు మన దేశంలో ఎక్కడా లేకపోవడం విశేషం. స్వామివారి చేతిలో ఉన్న ఈ తామరపువ్వు జ్ఞానానికి, ఐశ్వర్యానికి, విజయానికి చిహ్నం. అందువల్లే స్వామిని కొలిస్తే అవన్నీ లభిస్తాయని భక్తులు నమ్ముతారు. తిరుత్తణి నుంచి 182 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాలు విశేషపూజలు నిర్వహించడంతోపాటు, శ్రీరామనవమి, ఉత్సవాలు, హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు, ఇంతటి మహిమ కలిగిన ఈ క్షేత్రాన్ని సందర్శిస్తే ఆయురైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి.❋

151) సముద్ర ముఖంగా శ్రీ ఆంజనేయ దేవాలయం- సేతుకరై

తమిళనాడులో రామేశ్వరం దగ్గర శ్రీరాముడు లంకకు చేరటానికి సేతువును హనుమ, నలనీలాదికపి ప్రముఖుల సాయంతో నిర్మించినచోట శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఉన్నది. స్వామి ముఖం సముద్రం వైపు చూస్తున్నట్లు ఉంటుంది కనుక 'సేతుకరైహనుమాన్' అంటారు. దీనికి రాతినగరం అని కూడా పేరుంది. తమిళులు 'తిరుఅనై' అంటే పవిత్ర వంతెన అంటారు. ఉపనిషత్తులు 'మృతశైస్యసేతు' అంటే, విష్ణుసహస్రనామం 'ఔసిస్టంజగతఃసేతు' అన్నది. ఇక్కడే రాముడు విభీషణుడికి శరణాగతి ఇచ్చాడు. ఇది తిరుపల్లనికి నాలుగు కిలోమీటర్లు.❋



152) శ్రీరామదాస ఆంజనేయస్వామి దేవాలయం-ధర్మపురి-తమిళనాడు

తమిళనాడులో నిధర్మపురిలో శ్రీరామదాస ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆంజనేయ భక్తుడు నిర్మించాడు. తమిళనాడు కంబ నల్లూర్ వాసి శ్రీ ఆదినారాయణరావు, మద్రాస్ కలెక్టర్ థామస్ మన్రో వద్ద పని చేసేవాడు. ఆంజనేయస్వామి భక్తుడైన రావు నిత్యం ఇంట్లో పూజాది కాలయ్యాక కంబనల్లూర్లోని ఆంజనేయస్వామి కోవెలకు వెళ్లి దర్శనం చేసుకొని ఇంటికి వచ్చి అతిథి, అభ్యాగతులకు భోజనంపెట్టిన తర్వాతే తాను భోజనం చేసేవాడు. ఒకవేళ టూర్లలో ఉంటే కూడా ఈ అతిథి సంతర్పణ జరిగేట్లు చూసేవాడు. ఇలా మూడు తరాల నుంచి వస్తున్న సంప్రదాయం అది. ఒకసారి ధర్మపురికి వచ్చి తన అలవాటు ప్రకారం ఆంజనేయగుడికి వెళ్లి దణ్ణం పెట్టుకోవాలనుకొన్నాడు. కాని ధర్మపురిలో ఆంజనేయగుడి లేనే లేదు. ఆ రోజు ఆయనకు అభోజనమే. ఇలా ఉండటానికి వీల్లేదని చెప్పి వెంటనే ధర్మపురిలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నిర్మించి నిత్య పూజాదికాలకు పూజారిని తన స్వగ్రామం కంబనల్లూర్నుంచి తెప్పించి నియమించి జరిపించాడు. ఈ కథ జరిగి 300 ఏళ్ళు దాటింది.

కాలక్రమంలో ఆలయశోభ తగ్గిపోయింది. నిత్యపూజలు మాత్రం ఆగకుండా జరిగిపోతూనే ఉన్నాయి. భక్తులకు స్వామికి పూర్వవైభవం తెప్పించాలని ఆలోచన వచ్చి కలసికట్టుగా పూనుకొని ధనసేకరణ

ప్రారంభించారు. ధర్మపురిలో ఉపాధ్యాయుడైన కృష్ణమాచార్యుల గారితో నిత్యపూజ జరిపించారు. ఆయన ఈ దేవాలయంలో పురందరదాస కీర్తనలు బహు శ్రావ్యంగా గానం చేసేవారు. స్థానిక సేతు మాధవరావుగారి ఆధ్వర్యంలో దేవాలయంలో నిత్యభజనలు కూడా మొదలుపెట్టారు. ఆంజనేయస్వామి ఈ భజనలకు పులకితుడై ఆనందంతో నృత్యం చేసేవాడని చెప్పుకొనేవారు. ఇలాంటి సందర్భంలో ఒకభక్తుడు దేవాలయానికి పూర్వవైభవం రావాలంటే స్వామికి తేనెతో అభిషేకం చేస్తే మంచిదని సూచించాడు. ఆలోచన రావటం ఆలస్యం మర్నాడే తేనెతో అభిషేకం జరిపించారు. ఆ రోజు రాత్రి డా.జగదీష్ కామత్ అనే ఆయనకు ఈ దేవాలయం ఎక్కడుందో తెలియకపోయినా, ఆలయాన్ని పునర్నిర్మించాలనే కోరిక కలగటం విశేషం. ఆయన వెతుక్కుంటూ ఈ ఆలయానికి చేరాడు. కామత్ గారి స్వంత ఖర్చులతో పని ప్రారంభించి మొదటిదశ పూర్తి చేశాడు. పాద గర్ మఠానికి చెందిన స్వామి విజ్ఞానతీర్థ గారి ఆధ్వర్యంలో 14-5-1993న కుంభాభిషేకం జరిపించారు. దీనితో రెండవ దశ పూర్తయింది. ఈ శ్రీ దాస ఆంజనేయస్వామి దేవాలయం శ్రీహరి హరనాథస్వామి దేవాలయం బజారులో ధర్మపురి బస్టాండుకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్నది. మూలవిరాట్ ఒకటిన్నర అడుగుల ఎత్తువిగ్రహం. స్వామి తూర్పుముఖంగా ముకిళిత హస్తాలతో దాసాంజనేయ భంగిమలో దర్శనమిస్తాడు. వాలం వెనక భాగాన శిరసుపైకి ఉంటుంది. ఆంజనేయస్వామి ప్రక్కనే మూడడుగుల శ్రీరామ విగ్రహం కూర్చున్న భంగిమలో ఉంటుంది. రాముని కుడితొడ మీద సీతామాత కూర్చుని ఉంటుంది. 16-5-1992న మూల బాగల్మఠానికి చెందిన స్వామీజీ శ్రీరామ విగ్రహం ప్రతిష్టించారు. శ్రీ అనంతపద్మనాభస్వామికి చెందిన సాలగ్రామం శ్రీ దాసాంజనేయస్వామి శిరసుపై ఉండటం గొప్ప విశేషం.

ప్రతి శనివారం, ఆదివారం పూర్ణిమ అమావాస్య మొదలైన పర్వదినాలలో ఏకాదశి నాడు తప్ప ఆంజనేయస్వామికి మధు అంటే తేనెతో అభిషేకం చేస్తారు. అభిషేకం జరుగుతుండగా భక్తులు మధ్వాచార్యుల శిష్యులైన శ్రీ తిరు విక్రమపండితాచార్య రచించిన 41 శ్లోకాల 'హరివాయుస్తుతి'ని భక్తి తన్మయత్వంతో గానం చేస్తారు.❋

153) శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం-ముత్తంపట్టి

తమిళనాడు ధర్మపురిజిల్లా ముత్తంపట్టి గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం పురాతనమైనది. హోసూరుకు బస్సులో ఒక గంట ప్రయాణ దూరంలో ఈ ఆలయం ఉంటుంది. ధర్మపురి నుంచి మధ్యాహ్నం వేళ ఒకే ఒక్క బస్సు ఉంటుంది. స్వామి మహా మహిమాన్వితుడుగా ప్రసిద్ధి చెందాడు. 1960 కాలంలో సేలం-బెంగుళూరు మీటర్ గేజ్ రైల్వే నిర్మాణకాలంలో ఒక కాంట్రాక్టర్ ఒకచోట రైల్వేలైన్ కోసం ఎంత ప్రయత్నించినా సాధ్యపడటం లేదు. మట్టి పనులుచేసి సాయంత్రం ఇంటికి వెళ్లి మర్నాడు వచ్చి చూస్తే అదంతా చెల్లా చెదురై కనిపించేది. ఎవరు చేస్తున్నారో అంతు పట్టలేదు. ఒకరోజు జాడ తెలుసుకోవటానికి దగ్గరున్న కొండ ఎక్కాడు. అక్కడ ఒక రాతిపై చెక్కబడిన ఆంజనేయ విగ్రహం కనిపించింది. అప్పుడు స్వామిని ఆర్తిగా తాను నిర్మించే ట్రాక్ ధ్వంసం చేయకుండా చూడమని ప్రార్ధించి, త్వరలోనే స్వామికి పూజాదికాలకు ఏర్పాటు చేస్తానని ప్రార్ధించాడు. చెప్పినట్లుగానే ఆ రాతి హనుమాన్ విగ్రహానికి గోపురం కట్టి ముందు భక్తులు కూర్చునే ఏర్పాటు చేశాడు. ఇదంతా 1960లో జరిగింది. విగ్రహం ప్రక్కగా జలప్రవాహం నిరంతరం ప్రవహిస్తుంది. పూజారిని పెట్టి పూజలు నిర్వహించాడు. హనుమజ్జయంతిని వైభవంగా కాంట్రాక్టర్ జరిపించేవాడు. ప్రయాణ సౌకర్యం లేకపోయినా భక్తులు వచ్చి స్వామిని దర్శించేవారు.❋

154) శ్రీ అష్టాంశవర్ధన ఆంజనేయస్వామి దేవాలయం-కోయంబత్తూర్

తమిళనాడు కోయంబత్తూరు జిల్లా పీలమేడులో సాలగ్రామ హనుమాన్దేవాలయం ప్రసిద్ధమైనది. స్వామి కుడి అరచేతిలోని లక్ష్మీదేవి భక్తులను అభయ ముద్రతో దీవించటం విశేషం. స్వామివారి వాలం ధనాధిపతి కుబేర స్థానమైన ఉత్తరానికి, స్వామి చూపు పడమరకు ఉంటాయి. ఎడమహస్తంలో గద ఉంటుంది. తమిళ ఉగాదికి స్వామికి 10,008 ఫలాలతో ప్రత్యేక పూజ చేస్తారు. రాజామారుతి అలంకారం, వెన్న అలంకారం, వడమాల అలంకారం ఇక్కడి ప్రత్యేకతలు. ప్రతి శనివారం వివిధరకాల అర్చనలు నిర్వహిస్తారు. అలంకార ప్రియఃవిష్ణు అంటాం కాని ఇక్కడ ఆంజనేయస్వామిని నిత్యమూ అలంకారశోభయే. అందుకే ఈ ఆలయం అన్ని హనుమాలయాలకన్నా ప్రత్యేకంగా ఉంటుంది. తప్పక దర్శించి శ్రీ ఆంజనేయ వైభవాన్ని చూసి తరించాల్సిందే.❋

155) జై వీర అభయహస్త హనుమాన్ దేవాలయం-కృష్ణపురం

తమిళనాడు తిరునల్వేలిజిల్లా కడయనర్ దగ్గర కృష్ణపురంలో శ్రీ జైవీర అభయహస్త హనుమాలయం విశేషమైనది. రామాయణ కాలం శ్రీ ఆంజనేయుడు దర్శించిన స్థలం ఇది. ఆరు అడుగుల దక్షిణముఖ ఆంజనేయమూర్తి గంభీర అభయహస్తంతో ఆశీర్వదిస్తూ దర్శనమిస్తాడు. పచ్చని పంటపొలాల మధ్య ఉన్న ఆలయం. సీతాన్వేషణలో స్వయంప్రభ కనిపిస్తే కపి సేన సీత జాడ అడిగితే, ఆమె ఆతిధ్యమిచ్చి తన కథ చెబుతూ ఇది తన తండ్రి మయుడు నిర్మించిన భవనమని, తండ్రిని ఇంద్రుడు వధించాడని, తన పాప ప్రక్షాళనకు శివుని ప్రార్ధిస్తే గంగానదిలో కొంతభాగం ఇక్కడికి వచ్చేట్లు చేశాడని, తనను కపిసేన వచ్చేవరకు ఉండమన్నాడని వారు వచ్చారు కనుక తను వెళ్లిపోతున్నానని చెప్పగా సీతాదేవి జాడ కనుగొని వచ్చే దాకా ఉండమని కోరగా ఉండిపోయింది. రావణ సంహారం తర్వాత హనుమ మళ్ళీ ఇక్కడికి వస్తే, హనుమకు తన పాలన అప్పగించి వెళ్ళిపోయింది. ఆంజనేయుడు పాలించిన కృష్ణపురమే ఇది. ఆలయ నిర్మాణం ఎప్పుడు జరిగిందో ఎవరికీ తెలియదు. అప్పటి నుంచి జైవీర హనుమాన్‌గా స్వామి అర్చింపబడుతున్నాడు. రాముడు సందర్శించి అయోధ్యలో పట్టాభిషిక్తుడు కాకముందు ఇక్కడ యజ్ఞం చేశాడని స్థానిక కథనం. అందుకని సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు ఇక్కడ ప్రతిష్టించి కోవెల కట్టారు. దీనికి దగ్గరలో దీవసేవలాపురంలో 67 అడుగుల ఆంజనేయ విగ్రహం శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం వద్ద ఉన్నది.❋

156) శ్రీ అష్టాంశ శ్రీ వర్ధన ఆంజనేయ దేవాలయం-పీలమనేరు

200 సంవత్సరాల క్రితం తిరునల్వేలి వైఖానస ఆగమ ఆంజేయ ఉపాసకుడైన శ్రీ రాజా మణిభట్టార్ గురువు హరిదాసగిరి స్వామి శ్రీరామ సీతాలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు సాలిగ్రామాన్ని అనుగ్రహించాడు. స్వామి ఆంజనేయస్వామికి త్వరలో దేవాలయం కడతానని మొక్కుకున్నాడు. 2004లో ఆయనకు కోయంబత్తూర్ దగ్గర పీలమనేరులో ఒక దివ్యానుభవం కలిగి హనుమ ఆజ్ఞచే జీవితమంతా హనుమసేవకు అంకితం చేశాడు.

కోయంబత్తూర్ అవినాశిరోడ్డు చివర శ్రీ అష్టాంశ అభయ ఆంజనేయస్వామి దేవాలయం కట్టించాడు. 8 ఆడుగుల పడమరవైపు చూస్తున్న గోముఖి ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్టించాడు. ఇక్కడి హనుమకు 8 ప్రత్యేక లక్షణాలున్నాయి కనుక అష్టాంశవరద ఆంజనేయస్వామిగా సేవలందుకొంటున్నాడు. స్వామి దక్షిణ హస్తం వరద హస్తం. వామహస్తం గదాదారి. పశ్చిమ ముఖం సంజీవ పర్వతం దిశాసూచకం. పాదాలు యమస్థానమైన దక్షిణవైపు ఉండటం మృత్యుభయనాశకం. వాలం ఉత్తరదిశలో ఉండటం అపదుద్ధారకం. స్వామి శివలింగా కృతిలో ఉండటం రుద్రాంశ సంభూతుదని తెలుస్తుంది. కుడి అరచేతిలో లక్ష్మీదేవి సంపత్ప్రదాత. కనులు సూర్యతేజంతో భాసిస్తాయి. ప్రతిరోజు, ప్రతి పండుగలకు విశేష అలంకారంతో స్వామి విరాజిల్లటం విశేషం.❋

157) శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయం-గౌరివాక్కం

తమిళనాడు చెన్నై పలనియప్ప నగర్ గౌరీ వాక్కంలో శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం ప్రసిద్ధమైనది. పంచముఖాలలో ఒక్కొక్క ముఖం ఒక్కో విశేషమైన ఫలితాలనివ్వటం విశేషం. నిత్యం అభిషేకం అలంకరణ మహాద్భుతం.❋

158) శ్రీ స్వయంభు వీరాంజనేయ దేవాలయం-తిరుకోయిల్-పొల్లాచి

తమిళనాడు చెన్నైలో తిరుకోయిల్ వద్ద శ్రీహనుమ 5 అడుగుల విగ్రహ రూపుడు స్వయంభుమూర్తిగా ప్రసిద్ధుడు. సుమారు వెయ్యేళ్ళనాటి ప్రాచీనాలయం. గుడి ప్రక్క కోనేరున్నది. ఇందులో రోజూ రెండు నాగుపాములు స్నానం చేసి హనుమను దర్శిస్తాయి. యోగనరసింహ, వినాయక దేవాలయాలూ ఉన్నాయి. స్వామి భక్త కల్పద్రుమం. సర్వాభరణ భూషితుడు.❋

159) శ్రీ రామాంజనేయ దేవాలయం-తాంబరం

చెన్నైలో తాంబరంలో శ్రీరామాంజనేయస్వామి దేవాలయం 600 ఏళ్ళ చారిత్రకల విశేషమైనది. ఆన్జనేయస్వామితోపాటు వైద్యనాథ శివాలయమూ కలిసి ఉంది. వినాయక విష్ణుదుర్గ, దక్షిణామూర్తి నవగ్రహాలు కూడా కొలువై ఉన్న దేవాలయం.❋

160) శ్రీ రామాంజనేయ దేవాలయం-పోజిచాలూర్

1981లో కంచి మహాస్వాములు శ్రీ శ్రీ చంద్రశేఖర యతీంద్రుల ఆజ్ఞపై సంతానం కోసం పోఝి చాలూర్ దంపతులు శ్రీ హనుమ విగ్రహాన్ని శివాలయంలో అందజేశారు. కాని ప్రత్యేక దేవాలయం కట్టించలేకపోయారు. స్థానిక భక్తుల సహాయంతో తర్వాత ఆలయం నిర్మించారు. కంచిస్వాముల శిష్యుడు రామనాథస్వామి దేశంలో చాలా దేవాలయాలను జీర్ణోద్ధరణ చేసి, మహా కుంభాభిషేకం చేస్తున్నారు. ఈ భక్తులు వారిని తమ దేవాలయంపైనా కనికరం చూపమని వేడారు.❋

161) హనుమ భీమ సమాగమమైన శ్రీ ఆంజనేయాలయం-అనైపత్తి

తమిళనాడు దిండిగల్కు 40 కిలోమీటర్ల దూరంలో నీలకొట్టై దగ్గర అనైపత్తిలో శ్రీ ఆంజనేయ దేవాలయం పురాతన ప్రసిద్ధమైనది. వైగై నదీ తీరంలో ఉన్నది. ఇక్కడి స్వామి ఒక కంటితో అయోధ్యవైపు చూస్తూ మరో కంటితో భక్తులను కాపాడతాడని ప్రసిద్ధి. వైగై నదికి వరదలోస్తే, విగ్రహం మునిగిపోయేది. ఇక్కడ డాం కట్టారు. గుడి వెనకాల ఉన్న మరో ఆంజనేయ విగ్రహం వద్ద భక్తులు దీపాలు వెలిగిస్తారు. పాండవులు వనవాసంలో ఉన్నప్పుడు ద్రౌపదికి దాహం వేస్తే ధర్మరాజు భీముడిని నీటికోసం పంపితే అక్కడ భీముడికి, అడ్డుకున్న ఆంజనేయుడికి యుద్ధం జరిగి భీముడు నీళ్ళు తీసుకువెళ్ళలేక అన్నగారికి విన్నవించి హనుమను ప్రార్థించటం ఒక్కటే మార్గమని తెలిపాడు. భీముడు హనుమను ప్రార్థించి, అనుగ్రహం పొంది నీటిని తెస్తాడు. కనుక ఈ ప్రదేశంలోనే భీమార్జున సమాగమనం జరిగిందని చెప్పుకొంటారు. దీనికి కిలోమీటర్ దూరంలో శ్రీ మల్లేశ్వరాలయం ఉన్నది. స్వామి వీరి కోరిక మన్నించి శ్రీ ఆంజనేయ విగ్రహం బహూకరిస్తానన్నారు. హనుమ విగ్రహానికి సహస్ర సుమంగళుల చేత కుంకుమ పూజ చేయించి, విగ్రహాన్ని ప్రసాదించారు. దీన్ని గమనించిన ఒక మహాస్వామి ఆంజనేయ విగ్రహం అడుగు భాగాన శ్రీ ఆంజనేయ బీజాక్షర యంత్రం స్వయం సిద్ధంగా ఉండటం గమనించి ఆశ్చర్యపోయారు. ఆగమోక్తంగా ప్రతిష్టించి నిత్య పూజాదికాలు ప్రారంభించారు. ఈ క్షేత్రం 108 వైష్ణవ దివ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.*

162) ఆంజనేయస్వామి దేవాలయం-నమక్కల్

తమిళనాడు నమక్కల్ ఆంజనేయస్వామి దేవాలయానికి 1500 సంవత్సరాల కంటే ఎక్కువ చరిత్ర ఉంది. నమక్కల్ కోటను పెద్ద ఆంజనేయస్వామి కాపలా కాస్తుంటాడు. ఈ విగ్రహం చాలా ప్రసిద్ధి చెందిన 'నమక్కల్ హనుమాన్'గా పిలువబడుతుంది. ఆంజనేయుడు దిగంబర దేవాలయంలో (ఆకాశంపై కప్పుగా) లక్ష్మీనృసింహస్వామి మరియు సాలగ్రామం వైపు తిరిగి కొలుస్తూ ఉంటాడు. ఈ క్షేత్రంలోని ఆంజనేయుడు పద్దెనిమిది అడుగుల పొడవు కలిగి లక్ష్మినృసింహస్వామి దర్శనాన్ని సుమారు 250 feet (76 m) దూరం నుండి చేస్తూ ఉంటాడు. ఆంజనేయుడి కన్ను లక్ష్మీనరసింహస్వామి పాదాలతో (పాదపద్మాలు) సరళరేఖలో ఉంటుంది. ఆంజనేయుడు స్వామి యొక్క పాద పద్మాలను దర్శించుకోవడాన్ని నేటికీ గరుడాళ్వార్ సన్నిథి నుండి గమనించవచ్చు. కమలాలం చెరువు మెట్ల మీద ఆంజనేయస్వామి పాదముద్రలను గమనించవచ్చు.

నమక్కల్ చరిత్ర

కనీసం 7వ శతాబ్దం నుండి నేపథ్యం కలిగిన నమక్కల్ ఒక చారిత్రక నగరం. నమక్కల్ అనే పేరు నామగిరి నుండి వచ్చింది, ఇది పట్టణం మధ్యలో ఉన్న ఏక శిలాకృతి. నమక్కల్లోని రెండు గుహాలయాలు

అదియెంద్రవిస్ను గ్రుహ (రంగనాథస్వామి దేవాలయం) మరియు అడియనవాయువిస్ను గ్రుహ (నరసింహస్వామి దేవాలయం)గా పిలువబడతాయి. ఈ రాతి దేవాలయాలు అధియమన్వంశానికి చెందిన గుణశీల రాజుచే నిర్మించబడ్డాయి. పల్లవులతో ఆయన వివాహ సంబంధాల కారణంగా ఈ దేవాలయాలు పల్లవ నిర్మాణశైలిలో 7వ శతాబ్దంలో నిర్మించబడ్డాయి. సాధారణంగా, నమక్కల్ ఒక వైష్ణవ క్షేత్రంగా పరిగణించబడుతుంది, కొన్ని సంవత్సరాల క్రితం వరకు పట్టణంలో ఒక్క శివాలయం కూడా ఉండేది కాదు. మిక్కిలి పెద్దదైన ఈ రాయి-65 మీటర్ల ఎత్తు కలిగి ఒక కిలోమీటర్ కంటే ఎక్కువ చుట్టు కొలతను కలిగి ఉంది. ఈ బ్రహ్మాండమైన రాతి మీద ఒక కోట ఉంది. ఈ కోట 16వ శతాబ్దంలో నమక్కల్ను పాలించిన రామచంద్రనాయకర్ అనే చిన్న రాజు నిర్మించాడు. బ్రిటిష్ వారి నుండి తప్పించుకోవడానికి టిప్పు సుల్తాన్ కొంతకాలం ఈ కోటలో దాక్కున్నాడని నమ్ముతారు. ఈ కోటను టిప్పు సుల్తాన్ నిర్మించలేదు కానీ కొంతకాలం పాటు ఆక్రమించాడు. తరువాత బ్రిటిష్వారు ఈ కోటను వశపరచుకున్నారు. ఈ రాతి యొక్క ముందరి భాగాన్ని తిరు.వి.క. పారై అని పిలుస్తారు మరియు టాక్సీలు నిలుపు స్థలంగా ఉపయోగిస్తున్నారు. నమక్కల్ రాతివాలు పైన 1933లో గాంధీజీ బహిరంగ సభను నిర్వహించారు. తమిళనాడులో, కరువు మరియు యుద్ధం వలన ప్రభావితం కాని అతి తక్కువ ప్రదేశాలలో ఇది ఒకటి.❋

163) కూర్చున్న భంగిమలో 28 అడుగుల శ్రీ ఆంజనేయ దేవాలయం- గేరుగం బాక్కం

బహుభాషా నటుడు హీరో అర్జున్ చెన్నైలోని గెరుగుం బాక్కంలోని తన గార్డెన్లో కూర్చున్న భంగిమలో ఉన్న 28 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం తయారుచేయించి 7-4-12న ప్రతిష్టించాడు. విగ్రహం బరువు 143 టన్నులు. ఈ భంగిమలో ఉన్న ఎత్తైన విగ్రహం ప్రపంచంలోనే ఇదొక్కటే అవటం విశేషం. ఆలయ నిర్మాణం జరుగుతోంది.❋

మరికొన్ని తమిళనాడు హనుమాన్ దేవాలయాలు-

❋ శ్రీ విశ్వరూప అది వ్యాధుహర శ్రీ భక్త ఆంజనేయస్వామి ఆలయం, నంగనల్లూర్, చెన్నై
❋ శ్రీ పెరియ ఆంజనేయార్ దేవాలయం, అంబుర్
❋ శ్రీ విశ్వరూప పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం, తిరువళ్ళూరు
❋ శ్రీ జయాంజనేయస్వామి దేవాలయం, కరూర్
❋ శ్రీ భక్తాంజనేయర్, వేదసుందర్, దిండిగుల్
❋ శ్రీ పునీతపులి ఆంజనేయర్ ఆలయం, పరమకుడి
❋ అరుల్మిగు నవ ఆంజనేయర్ ఆలయం, కులశేఖరపట్టిణం
❋ శ్రీ మూల ఆంజనేయర్ కోళి, తంజావూరు
❋ సంజీవిరయర్ ఆంజనేయర్ కోళి, పిడంపట్టి, త్రిచీ
❋ శ్రీ రామ భక్త భవ్య స్వరూప ఆంజనేయర్ ఆలయం, చెన్నై
❋ శ్రీ గురు హనుమాన్ దేవాలయం, వడవల్లి, కొయంబత్తూర్

పాండిచ్చేరి

164) ఏలకులతో అభిషేకించే పంచవటి ఆంజనేయ దేవాలయం -పాండిచ్చేరి

పాండిచ్చేరిలో ప్రసిద్ధ దేవాలయాలు చాలా ఉన్నాయి. అందులో మనాకుల బినాయక దేవాలయం ఒకటి. కాలతీశ్వార్ వేద పురుషేశ్వర్, వరదరాజ దేవాలయాలున్నాయి. పాండిచ్చేరికి పది కిలోమీటర్లలో దిండీవనం రోడ్డుపై శ్రీ పంచవటి ఆంజనేయ దేవాలయం ప్రసిద్ధమైనది. స్వామి గ్రానైట్ విగ్రహం 36 అడుగుల ఎత్తు.❋

కేరళ

165) వో టి.సి. హనుమాన్ దేవాలయం-పాలయం

కేరళలో తిరువనంతపురంలోని పాలయం ఆఫీసర్స్ ట్రెయింగ్ కాంప్ (O.T.C)లో ఉన్న హనుమాన్‌నే వొ. టి.సి హనుమాన్ అంటారు. తిరువాన్కూర్ రాజు మార్తాండవర్మ పరిపాలన తర్వాత రాజధాని పద్మనాభపురం నుండి తిరువనంతపురానికి మారింది. నాయర్ బ్రిగేడ్ సైన్యం హెడ్‌క్వార్టర్ పాత రాజధాని నుంచి కొత్తదానికి మారింది. తర్వాత కొల్లాంకు మారి మళ్ళీ తిరువనంత పురం చేరింది. ఈ బ్రిగేడ్ దళం వారు పాజ వంగడి నుండి గణేష్ విగ్రహాలను, పాల్యం దేవాలయాలను తమతో తెచ్చుకొన్నారు. ఆశ్విక దళం మాత్రం తమతో శ్రీ హనుమాన్ విగ్రహాన్ని తెచ్చుకొన్నారు. మిలిటరీ కాంప్‌లో ఈ విగ్రహప్రతిష్టించి దేవాలయాన్ని కట్టటం వలన దీన్ని వో.టి.సి. ఆంజనేయ దేవాలయమని పిలుస్తారు. మిగతా దేవాలయాలకూ ఇలా పేర్లు వచ్చాయి.❋

166) మూడు వేల ఏళ్ళ నాటి శ్రీ ఆంజనేయ దేవాలయం-శబరిమల

కేరళ రాష్ట్రంలో ప్రసిద్ధ శబరిమలైలో అయ్యప్పస్వామి కొలువై ఉంటాడు. మాలాపురం జిల్లా తిరూర్ దగ్గర అలట్టియూర్‌లో శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. ఆలయం మూడు వేల ఏళ్ళ నాటి అతి ప్రాచీన ఆలయం. ఆలయ పూజారులు నంబూద్రి బ్రాహ్మణులు. తారూర్, కోజికోడ్ మహారాజుల కాలంలో మహా వైభవంగా దేవాలయం ఉండేది. పురంత్రికోవిల్ విగ్రహం అయిన శ్రీ ఆంజనేయ విగ్రహంను మూడు వేల ఏళ్ళ క్రితం సప్తర్షులలో ఒకరైన వసిష్ట మహర్షి ప్రతిష్టించాడని పురాణ కథనం. ముఖ్య దైవం రాముడే అయినా ఆలయాన్ని హనుమాన్ దేవాలయం అనే పిలుస్తారు.❋

167) శ్రీ దత్త క్షేత్ర హనుమాన్-కాలడి

కేరళ రాష్ట్రంలో పవిత్ర పెరియార్ నదీ తీరంలో దత్త క్షేత్రం ఉంది. పెరియార్ నది ఎర్నాకులం జిల్లాలోని వచ్చి శివాలయం వద్ద రెండు నదులుగా విడిపోతుంది. పడమరకు ప్రవహించేదాన్ని దేశోం నది అంటారు. దేశోం చాలా నిదానంగా ప్రకృతి దృశ్యాల మధ్య ప్రవహిస్తూ ఆనందాన్ని కల్గిస్తుంది. ఇక్కడ మహర్షులు అనేక యాగాలు చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడే శ్రీ దత్త క్షేత్రం ఉన్నది. ఆలువా-అన్నమల్లి హైవేలో ఈ క్షేత్రం ఉన్నది. బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రిమూర్త్యాత్మకమైన శ్రీ సిద్ధ దత్తాత్రేయ స్వామి పరశురామునికి గురువు. 1991లో శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఈ క్షేత్ర నిర్మాణం చేశారు. ఇందులో శ్రీ మహా గణపతి విగ్రహాన్ని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ విగ్రహాన్ని స్వామీజీ ప్రతిష్టించారు.❋

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

168) శ్రీ సంకట నివారణ హనుమాన్ దేవాలయం-అలతియూర్

కేరళ అలతియూర్‌లో ఉన్న సంకట నివారణ హనుమాన్ పిల్లల సంరక్షకుడు. పెద్దల మానసిక, గుండె జబ్బులను నయం చేసే శక్తి గలవాడు. ఇక్కడ నుంచి సముద్రం మీదుగా లంకకు హనుమ వెళ్ళటానికి వేసిన అడుగు గుర్తు ఇప్పుడు కూడా చూడవచ్చు. భక్తులు పరిగెత్తుకొంటూ వచ్చి దీని మీద నుంచి దూకి అనుభావాన్ని పొందుతారు. ఇలా చేస్తే పిన్నలకు, పెద్దలకు ఆరోగ్య సమస్యలు దూరమౌతాయని నమ్మకం.

పూర్వం అలతియూర్‌నుమ దేవాలయం నంబూద్రి బ్రాహ్మణుల అధీనంలో ఉండేది. తర్వాత వత్తాయ్ రాజా అధీనానికి వెళ్ళింది. ఆ తర్వాత కోజికోడ్ రాజు జమోరిన్ రాజు స్వాధీనమైనది. ఇప్పటికీ ఈ రాజవంశీకులే దీని పాలకులు. ఇక్కడి ముఖ్యదేవుడు శ్రీరాముడు. ఆయన పేరు మీదే పూజలన్నీ జరుగుతాయి. కాని దేవాలయాన్ని 'హనుమకావు' దేవాలయం అంటారు. రామభక్త హనుమాన్భక్తి వైభోగానికిది గొప్ప నిదర్శనం. తిరువూర మహోత్సవం, ఆంజనేయ సంగీతోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.*

169) అరేబియా సముద్ర వాయువులను తట్టుకొనే వాయుసుతుడు- ఎజిమలకొండ

కేరళ కన్నూర్ జిల్లా పయ్యమార్‌కు 7 కిలోమీటర్ల దగ్గరలో అరేబియా సముద్ర తీరంలో ఎజిమలహిల్ అనే ఆంజనేయ గిరిపై 41 అడుగుల శ్రీ ఆంజనేయ విగ్రహం సముద్రపు గాలులను తట్టుకొని నిలబడటం ఆశ్చర్యం. సర్వబలశాలి జితేంద్రియుడు మహాప్రశాంత చిత్తంతో ఉన్నట్లు స్వామి వదనం ప్రసన్న గంభీరంగా ఉంటుంది. ఎజిమల ఒకప్పుడు మూషిక వంశరాజుల రాజధాని. మధ్యకాలంలో వర్తక వాణిజ్య కేంద్రం. చోళ, చేర రాజ్యాల మధ్య ఇక్కడే 11వ శతాబ్దంలో చాలా యుద్ధాలు జరిగాయి. భగవాన్ బుద్ధుడు కూడా సందర్శించిన ప్రదేశంగా చెప్పుకొంటారు. చాలా కాలం క్రితం ఇక్కడ 'మృత సంజీవని వనం' ఉండేది. ఆంజనేయుడు సంజీవి పర్వతాన్ని పెకలించుకొని లంకకు తీసుకువెడుతుంటే అందులో ఒక ముక్క విరిగి ఇక్కడేపడి, ఎజిమలగా ప్రసిద్ధి చెందింది. భూమి మీద పడ్డ ఆ పర్వతం ముక్క ఏడు భాగాలైంది. ఆ ఏడు భాగాల సమాహారమే ఎజిమల. ఈ కొండ శిఖరాలపై అనేక వనమూలికలతోపాటు మృత సంజీవని ఔషధ మొక్కలున్నాయని స్థానికుల విశ్వాసం. ఆయుర్వేదంలో ఉపయోగించే వనమూలికలలో 90 శాతం మూలికలు ఇక్కడే లభిస్తాయి. రామనాథ పంచాయితీలోని ఎజిమల చుట్టూ ఎప్పుడూ నీరు ఉంటుంది. అందుకే దీన్ని ఐలాండ్ అన్నారు. సముద్రం నదులు కొబ్బరితోటలు, వృక్షాలు నేత్రానందంగా గోచరిస్తాయి. అస్టమాచల, మాదాయికావు, దేవాలయాలు కునిమంగళం ఇక్కడి టూరిస్ట్ ప్రదేశాలు. ఇక్కడి కొండపై ముస్లిం సంఘ సంస్కర్త షేక్ అబ్దుల్ లతీఫ్ నివశించిన అతి ప్రాచీన మసీదు ఉంది.

ఎజిమలకు వెళ్ళేదారిలో ఎక్కడ చూసినా ఆయుర్వేద మొక్కలే కనిపిస్తాయి.❋

170) ఉడిపి స్వామి ప్రతిష్టించిన ఏకైక హనుమాన్ దేవాలయం- ఎర్నాకులం

కేరళ ఎర్నాకులంలో హనుమాన్ కోవిల్ చాలా ప్రసిద్ధం. 1776-1865 కాలపు ఉడిపి సోదేవాది రాజమఠం స్వామీజీ శ్రీ విశ్వపతి తీర్థ హనుమాన్ విగ్రహం ప్రతిష్టించారు. కొచ్చిన్ దివాన్ వెంకటరావు 1857లో ఆలయం నిర్మించాడు. దీనికి సంబంధించిన శిలా శాసనం సంస్కృతంలో ఉన్నది. ఈయన కర్నాటక వాడు. కొచ్చిన్ రాజులు రామవర్మ, శ్రీరామవర్మలు తరచూ ఆలయాన్ని సందర్శించేవారు. మధ్వసంప్రదాయంలో పూజాదికాలు జరుగుతాయి. ఇక్కడ ముఖ్యదైవం శ్రీకృష్ణుడే. కేరళలో ఉడిపి మఠాధి పతిప్రతిష్టించిన ఆంజనేయ విగ్రహం ఇదొక్కటే. నిత్యం వేలాది భక్తులు సందర్శిస్తారు. శ్రీరాఘవేంద్రస్వామి ఆలయం కూడా ఈ విశాల ఆలయంలో ఉన్నది. శ్రీరామనవమి, హనుమజ్జయంతి, రాఘవేంద్రస్వామి ఆరాధనా ఘనంగా చేస్తారు. దసరా నవరాత్రి ఉత్సవాలు ఆయుధపూజ కూడా బాగా చేస్తారు. నాగదోష, రాహుదోష నివారణకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. స్వామికి ఇచ్చే అయిదు పెద్ద పళ్ళాల నక్షత్రహారతి అందరూ తప్పక చూడాల్సిన వైభోగం. నాగదేవత విగ్రహమూ ఉన్నది.❋

171) శ్రీ హనుమాన్ దేవాలయం -నత్తిక

కేరళ త్రింకూర్ జిల్లాలో త్రింకూర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామం నత్తిక. ఇక్కడి ఆంజనేయస్వామిని నత్తిక ఆంజనేయస్వామి అంటారు. ప్రతి నెల లక్ష తమలపాకు పూజ చేస్తారు. భాగవత సప్తాహం నవాహం, లక్ష హనుమాన్ అఖండ నామసంకీర్తన జపయజ్ఞం, మహా రుద్రయాగం దివ్యంగా నిర్వహిస్తారు. వేదపారాయణతో ఆధ్యాత్మికతరంగ వ్యాప్తి జరుగుతుంది. అన్నప్రాసనలు స్వామి సన్నిధిలో ఎక్కువగా జరుగుతాయి. నిత్యమూ గణపతి, మృత్యుంజయ హోమాలు చేస్తారు. స్వామికి వడమాల ప్రత్యేకం.❋

172) మూషకరాజు కట్టించిన శ్రీ ఆంజనేయ దేవాలయం-రాఘవాపురం

కేరళలో రాఘవాపురంలో 2500 ఏళ్ళనాటి ప్రాచీన ఆంజనేయ దేవాలయం ఉంది. ఆంజనేయుడు సంజీవి పర్వతం తెస్తుంటే ఒక ముక్క విరిగి ఇక్కడ పడి ఎడుముక్కలై ఎఝుమలై అయింది. ఇక్కడ మూషక వంశరాజులు ఏడు హనుమాన్ దేవాలయం నిర్మించారు. తర్వాత ఉదయవర్మ కొల్లాతిరి రాజు కాలంలో పునర్నిర్మాణం చేశాడు. ప్రస్తుతం మలబార్ దేవస్వం అధీనంలో ఆలయం ఉంది.❋

173) మహా దేవాలయంలో శ్రీ మహాబలవీర హనుమాన్-కవియూర్

కేరళ కవియూర్‌లో పాతానమిట్టలో శ్రీ ఆంజనేయ దేవాలయం వెయ్యేళ్ళ చరిత్ర కలది. ఈ ఆలయాన్ని తిక్కవయూర్ మహా దేవాలయం అంటారు. శివుడితోపాటు విష్ణువు, ఆంజనేయుడు కొలువై ఉంటారు. సాన్దారశైలిలో విగ్రహ నిర్మాణం చేశారు. ప్రాచీన దాన శాసనాలు చాలా ఉన్నాయి. పదిరోజులు డిసెంబర్ -జనవరి నెలలో శత కలశాలతో తిరు ఉత్సవం అనే అభిషేకం చేస్తారు. అందులో ఒకటి బంగారు, 10 వెండి, మిగిలినవి రాగి కలశాలు ఉంటాయి. అన్ని ఉత్సవాలు వైభవంగా చేస్తారు.❋

174) శ్రీ హనుమాన్ మఠం-వైకోమ్

కేరళ కొట్టాయంలోని వైకోమ్‌లో శ్రీ హనుమ మఠం ఉన్నది. దీన్ని కులశేఖర మంగళం అంటారు. దీన్ని ఆంజనేయ చారిటబుల్ ట్రస్ట్ వారు 2006 నుంచి నిర్వహిస్తున్నారు. 200 మంది సభ్యులతో లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్నారు. ఇక్కడి హనుమ భక్తుడైన రామచంద్రస్వామి వీరికి మార్గదర్శి. శ్రీరామ, ఆంజనేయులకు దేవాలయాలు కట్టించారు. అనుబంధంగా వృద్ధాశ్రమమూ నడుపుతున్నారు. వీరి సేవా కార్యక్రమాలకు 'కారుణ్యస్పర్శనం' అనే సార్థక నామాన్ని పెట్టుకొన్నారు. చిన్నపిల్లల సంరక్షణ మెడికల్ కాంపులు నిర్వహిస్తారు.❋

175) శ్రీ హనుమ కోట దేవాలయం-కాలాపతి

శ్రీ రాజారామస్వామి 19వ శతాబ్ది ద్వితీయార్ధంలో కేరళలోని పాలక్కాడ్ వద్ద కలాపతి నదీ తీరంలో రామధ్యానమఠం ఏర్పాటు చేశారు. వీరు త్యాగరాజస్వామి వారి ముఖ్య శిష్యులు. ఇక్కడ హనుమతోపాటు శ్రీరామసీతాదేవి విగ్రహాలున్నాయి. పాలక్కాడ్ను అనేక వంశాల రాజులు పాలించారు. అందులో పాలక్కాడ్ రాజులూ ఉన్నారు. 1677లో పాలక్కాడ్ రాజు ఇక్కడ హనుమాన్ కోట కట్టాడు. 18వ శాతాబ్ది వరకు ఆయన పూర్తి అధికారాలతో పాలించాడు. 1757లో రాజ్యాన్నీ, రాజునూ సంరక్షించమని వేలాది మంది భక్తులు మంగళ శనివార దీపోత్సవాలకు ఉదయం నుండీ ఆవునెయ్యిని ఆలయానికి సమర్పించేవారు. భక్తులపాలిటి వరదుడు ఈ హనుమ. దీనుల, అర్ధులను నిత్యమూ అదుకొంటాడని విశ్వాసం.

మరికొన్ని కేరళ హనుమాన్ దేవాలయాలు

❋ కడక్కళ్కిలి మరతుకవు గుడి

❋ కేరళ తిరువళ్ళూర్‌కు 5, 6 కి.మీ. దూరంలో ఉన్న 'చిన్నకవియూర్'లోని శివాలయంలో వంద సంవత్సరాల క్రితం పంచ లోహాలతో నిర్మించబడిన హనుమాన్ విగ్రహం ఉంది. కుంభకోణంలో 40.అ.ఎత్తైన [12.g] పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం గ్రానైట్ రాతితో మలచబడింది. తిరువళ్ళూర్లో పంచముఖ ఆంజనేయ విగ్రహం భక్తుల భయాలు దూరంచేసే అభయమూర్తిగా నిలచి ఉంది. హనుమాన్ ఒక్కడే శని ప్రభావం సోకని వానిగా చెప్తారు. రావణుని నుండి విముక్తి పొందిన శని దేవుడు, హనుమాన్ పట్ల కృతజ్ఞతగా మారుతిని పూజించే వారికి తన దృష్టి సోకదని వాగ్దానం చేశాడట!❋



గుజరాత్

176) శ్రీ వీసా ఆంజనేయస్వామి దేవాలయం-అహ్మదాబాద్

చమత్కారీ హనుమాన్

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 'చమత్కారీ హనుమాన్' లేక 'వీసా మారుతి' దేవాలయం చాలా ప్రసిద్ధమైంది. అమెరికా కెనడా ఆస్ట్రేలియా మొదలైన దేశాలకు చదువులకోసమో, ఉద్యోగాలకోసమో వెళ్ళాలనుకొనే వారు వీసాలు మంజూరు కావటంలో ఇబ్బందులు పడుతూ ఉంటే ఈ హనుమాన్‌ను దర్శిస్తే సత్వరం వీసా మంజూరు అయేట్లు చేసే శక్తి ఈ స్వామికి ఉంది. అందుకే వీసా ఆంజనేయ స్వామి అని భక్తులు పిలుస్తారు. కొందరు చమత్కారీ హనుమాన్ అంటారు.

మహాదేవ ఆలయంలో చమత్కారీ హనుమాన్

400 ఏళ్ళ క్రితమే ఇక్కడ మహాదేవ దేవాలయం ఉంది. మహా సుఖరాం మాలక్ చంద్ ప్రాణ వల్లభుల కుమారుడు శ్రీ బాపూజీ సుఖ రాం మహారాజ్‌కు దోలేశ్వర మహాదేవాలయం కంటికి కనిపించింది. ఈయన సాతోద్రా నగర బ్రాహ్మణ గృహస్తు. అప్పటి నుంచి ఈ వంశం వారే స్వామి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయం ప్రజల దర్శనానికి ఉండేది కాదు.

గుజరాత్‌లో మొట్ట మొదటి నూలు మిల్లును నిర్మాణం చేసినవారు రావు బహదూర్ రాం చోడియా చోటావాలకు బాపూజీ సుఖరాం గారు మామ గారు. ఆ సమయంలో ఈ మహాదేవ ఆలయంలో సుఖరాం గారు 'చమత్కారీ హనుమాన్' విగ్రహాన్ని ప్రతిష్టించారు. అప్పటి నుంచి వారి కుటుంబానికి కాని ఈ ప్రదేశానికి కాని ఎటు వంటి ఉపద్రవం కలగలేదు.

వీసా మారుతి

బ్రిటిష్ వారి పాలనలో ఇంగ్లాండ్, అమెరికాలకు వెళ్ళాలనుకొనే వారికి వీసాలు మంజూరు చేయటానికి చాలా కఠిన నిబంధనలు ఉండేవి. అప్పుడు వీసార్థులు ఈ చమత్కారీ హనుమాన్‌ను దర్శించి వీసాలు మంజూరు చేయించమని వేడుకోనేవారు. ఆయన తన అనుగ్రహ వీక్షణంతో వీసాలు మంజూరు అయ్యేట్లు చేసేవారు. అందుకనే స్వామిని హనుమాన్ దాదా అని వీసా హనుమాన్ అనీ పిలవటం ప్రారంభమైంది. ఆ కాలంలో బాగా ప్రసిద్ధులైన తుషార్ భాయ్, ఉదయాన్ భాయ్, ముకేష్ భాయ్ మొదలైన వారు వీసాలు పొందలేక ఈ స్వామిని శరణు వేడారు వారి వీసా అడ్డంకులన్నీ తొలగించి చమత్కారీ హనుమాన్ వీసాలు మంజూరయ్యేట్లు అనుగ్రహించారు. అప్పటి నుంచి సామాన్య ప్రజలు కూడా ఈ స్వామిని దర్శించి వీసాలు పొందటం జరిగింది. భారత దేశంలో ప్రతిచోటు నుంచి ప్రజలు ఈ స్వామిని దర్శించి వీసాలు పొందేవారు. వీసా అప్లికేషన్లు తీసుకువచ్చి స్వామి పాదాల చెంత ఉంచి పూజ చేయించి అనుగ్రహం పొంది వీసా పొందేవారు. అదొక అలవాటైపోయి తీర్ధ ప్రజాలాగా జనం వస్తారు. వీసాలు పొందిన ప్రతివారు మళ్ళీ ఆలయానికి వచ్చి స్వామికి కృతజ్ఞతలు తెలియజేసుకొనేవారు.

మనోభీష్ట సిద్ధి హనుమాన్

వీసాల కోసమే కాదు బిజినెస్‌లో లాభాల కోసం, అభివృద్ధి కోసం విద్య ఉద్యోగాల కోసం కూడా చమత్కారీ హనుమాన్‌ను సందర్శిస్తారు. అనారోగ్యంతో బాధ పడేవారు బీదరికంతో అలమటించేవారు. మానసిక సంతృప్తి శాంతి లేనివారు ఈ స్వామి దర్శనంతో అనుకున్నవన్నీ పొందేవారు. ఈ ఆలయం అహ్మదాబాద్‌లోని ఖాడియా అనేచోట దేశాయ్ పోల్‌లో ఉంది. స్వామి ప్రతిష్ట 1832లో జరిగింది.❋

177) శ్రీ కష్ట నివారణ హనుమాన్ దేవాలయం-సోమనాథ్

గుజరాత్‌లో సోమనాథ్ దేవాలయం దగ్గరే కష్టనివారణ హనుమాన్ మందిరం ఉంది. 1783లో నాగపూర్ రాజు రాజా భోంస్లే, రేవా మహారాణి రాణి అహల్యా బాయ్, గ్వాలియర్ రాజా షిండే మొదలైన వారు ఔరంగాజేబు దండ యాత్రలో శిధిలమైన సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించారు. ఆలయ ముఖద్వారాన్ని అహల్యాబాయి గేట్ అని పిలుస్తారు. అప్పుడే ఇక్కడ కష్ట నివారణ హనుమాన్ దేవాలయాన్ని నిర్మించారు. సోమనాథ్ శివాలయాన్ని నిర్మించటానికి పైన పేర్కొన్న హేమా హేమీలందరికి స్ఫూర్తిగా నిలిచి ధైర్యం ఇచ్చి సంపదనిచ్చి తోడ్పడినవాడు హనుమంతుడే అని వారందరూ పూర్తిగా నమ్మి ఆయనకొక ఆలయం నిర్మించి ఋణం తీర్చుకొన్నారు. అందుకే ఈ హనుమాన్‌ను 'కష్ట నివారణ హనుమాన్' అని పిలుచుకొన్నారు.

అయిదు అడుగుల ఈ కష్ట నివారణ హనుమాన్ శరీరం అంతా గంధ సిందూరంతో దర్శనమిస్తాడు. సూక్ష్మ దృష్టితో స్వామి కనులు మహా కాంతివంతంగా ఉంటాయి. శరీరమంతా ఆభరణాలతో మెరిసిపోతూ ఉంటాడు. పైకెత్తిన కుడి చేయి అభయ ముద్రతో ఆశీర్వదిస్తున్నట్లు దేనికీ భయపడ వద్దు నేను ఉన్నాను మీకు అండగా అని చెబుతున్నట్లుగా ఉంటుంది. సోమనాథ జ్యోతిర్లింగాన్ని దర్శించిన భక్తులు తప్పక ఇక్కడికి వచ్చి కష్ట నివారణ హనుమాన్‌ను దర్శించి వెళ్ళటం సంప్రదాయం.*

178) శ్రీ రోకాడియా హనుమాన్ మందిరం–పోర్బందర్

గుజరాత్‌లో పోర్ కొత్త పోర్ బందర్‌లో రోకాడియా హనుమ దేవాలయం ఉంది. చాలా చల్లని ప్రశాంత వాతావరణంలో ఆలయం ఉంది. ఆలయంలో హనుమ ఎడమ చేతిలో సంజీవిని పర్వతం ఉంచుకొని కుడి చేతిలో అభయముద్రతో గద పైకి పెట్టి కనిపిస్తాడు. కాళ్ళ కింద ఒక రాక్షసుడిని మర్దిస్తున్నట్లు దర్శనమిస్తాడు. సంపూర్ణాలంకృతుడై వాలం గద పైకి ఉన్నట్లు కనిపిస్తాడు. ఆలయం చిన్నదిగానే ఉంటుంది.❋

179) శ్రీ బాలాజీ హనుమాన్ దేవాలయం–రాజ కోట్

గుజరాత్ రాష్ట్రంలోని రాజ కోట్‌లో భూపేంద్రనగర్‌లో శ్రీ బాలాజీ హనుమాన్ మందిరం ఉంది. ఇందులో హనుమ బాల హనుమగా అనేక భంగిమలలో ఎక్కడా లేని విధంగా కనిపిస్తాడు. ఎడమ చేయి కిందికి ఉండి కుడి చేయి పైకెత్తి శిరసు దగ్గర గదా ధారిగా కనిపిస్తాడు. విగ్రహం చుట్టూ చిన్న చిన్న ఆంజనేయ మూర్తులు, పాదాలకింద రాక్షసి జుట్టు పట్టుకొన్నట్లు ఉంటాడు. స్వామికి వివిధ రకాల స్వీట్ల నైవేద్యం పెడతారు. ఆహార్యం కూడా వింతగా ఉంటుంది. నుదుట బొట్టుతో మీసాలతో తలపై వెండి కిరీటంతో దర్శనమిస్తాడు బాలాజీ హనుమాన్.❋

180) శ్రీ దాబోదియా హనుమాన్ మందిర్-గాంధీనగర్

గుజరాత్ రాజధాని గాంధీ నగరానికి 18కిలో మీటర్ల దూరంలో దాబోదా వద్ద హనుమాన్ దేవాలయాన్ని దాబోదియా హనుమాన్ దేవాలయం అంటారు. ఈ స్వామికి ఒక ప్రత్యేకత ఉంది. చాలాకాలంగా ఉన్న విడాకుల వివాదం స్వామి దర్శనంతో నిలిచిపోతుంది. కుటుంబంలో అశాంతి ఉంటే, ఆడపిల్లకు పెళ్లి కాకపోతే స్వామికి మొక్కుకొని దర్శిస్తే అన్నీ సవ్యంగా అయిపోతాయి. వివాహం ఆలస్యమౌతున్న అబ్బాయి రెండు శనివారాలు ఈ హనుమాన్‌ను దర్శిస్తే వెంటనే అనుకూలవతి అయిన అమ్మాయితో పెళ్లి అయిపోతుంది అని నమ్మకం. పిల్లలు విపరీత వింత ఆకారాలలో జన్మిస్తే ఈ ఆంజనేయస్వామి వరుస దర్శనాలతో ఆ వక్రతలన్నీ సర్దుకుంటాయి అని విశ్వాసం.❋

181) శ్రీ ఖిద్ భంజన మారుతి దేవాలయం-హర్ని-వడోదర

గుజరాత్‌లోని విశ్వామిత్ర నదీతీరంలో వడోదర పట్టణం ఉంది. ఒకప్పుడు దీన్ని చంద్రవాన్ రాజు పాలించాడు కనుక 'చంద్రావతి' అనేవారు. తర్వాత వీరావతి అని, వటవృక్షాలు ఎక్కువగా ఉండటం వలన 'వటపత్ర' క్రమంగా వడపత్రగా మరి ఇప్పుడు వడోదర అయింది. ఇంగ్లిషు వాళ్ళు పలకలేక 'బ్రోదెర' అనేవారు. తర్వాత అదే 'బరోడా' అయింది. 1974లో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం 'వడోదర' పేరునే ఖాయం చేసింది. రాష్ట్ర రాజధాని అహ్మదాబాద్ గాంధీనగర్‌కు 139 కిలోమీటర్లు. కొద్దికాలం ముస్లిం పాలన తప్ప మొదటి నుంచీ హిందూరాజుల పాలనలోనే ఉంది. కనుక హిందూ సంస్కృతీ నాగరకత సంస్కృత వ్యాప్తి ఎక్కువ. అందుకే దీనికి 'సంస్కృతనగరి' అంటారు. చాళుక్య, మహారాష్ట్రరాజులే ఎక్కువకాలం రాజ్యమేలారు. ఇక్కడ ఎక్కువ భాగం శ్రీ హనుమ భక్తులు ఉండటం విశేషం. వడోదరలో ఆంజనేయ దేవాలయాలు చాలా ఉన్నాయి. అందులో పురాతనమైనవి ఎక్కువగా ఉన్నాయి. వీటిలో హర్ని హనుమాన్దేవాలయం అతి ప్రాచీనమైనదేకాక ప్రసిద్ధమైనది. ఇది వడోదర విమానాశ్రయానికి దగ్గర. హర్ని సరస్సు, మోత్నాత్మహాదేవి దేవాలయాలు ప్రసిద్ధం.

ఈ ఆలయానికి భిద్భుజంగ మారుతి దేవాలయం అనే పేరు

రావటానికి ఒక గాథ ఉంది. వటవృక్షాలు ఎక్కువగా ఉండటం వలన మహర్షులు ప్రశాంతంగా ఇక్కడ తపస్సు చేసుకొనేవారు. దురదృష్టం అప్పుడు ఈ ప్రాంతం హిరణ్యక శిపుడనే రాక్షసుని అధీనంలో ఉండేది. వాడు మునులను బాధించేవాడు. శ్రీరాముడు సీతా, లక్ష్మణులతో అరణ్యవాసం చేస్తూ ఇక్కడికి రాగా, మహర్షులు తమ బాధలను శ్రీరాముడికి విన్నవించుకొన్నారు . రాముడు లక్షణ హనుమలను హిరణ్యక శిపుని అదుపు చేయమని ఆజ్ఞాపించాడు. ఎంతకాలం వాడితో యుద్ధంచేసినా జయించ లేకపోతున్నారు. యుద్ధం కొనసాగిస్తూ తగిన సమయంలో హనుమను తన విరాట్స్వరూపాన్ని ప్రదర్శించమని హితవు చెప్పాడు రాముడు. 14వ రోజు యుద్ధంలో హనుమ విరాట్స్వ రూపాన్ని చూపించి, వాడిని నేలకేసి అదిమి, తన కుడికాలు పాదంతో తొక్కిపట్టగా, వాడి బలం క్రమంగా క్షీణించసాగింది. అప్పుడు రాముడు హనుమాను అదే భంగిమలో కొద్దికాలం ఉండమన్నాడు. హనుమ కుడిపాదాన్ని వాడి తలపై ఉంచి, వాడి బలమంతా హరిచేట్లు చేసి చంపేశాడు. అదే భంగిమలో రామాజ్ఞపై శ్రీ హనుమ అప్పటి నుండి ఉండిపోయాడు. హనుమ పరాక్రమానికి, తాపసులను రక్షించినందుకు, రాముడుమెచ్చి, వానర రూపంపోయి మానవ రూపం పొంది, ఇక్కడే ఉండి భక్తుల కోర్కెలను తీర్చమని వరమిచ్చాడు. 'భిద్' అంటే కష్టాలు అని అర్థం. భంజన అంటే తొలగించినవాడు. మునుల కష్టాలు పోగొట్టి వారు ప్రశాంతంగా తపస్సు చేసుకోవటానికి కృషిచేసిన మారుతి కనుక 'భిద్భంజన్మారుతి' అయ్యాడు. ఈ హనుమకు మనిషిలాగానే మీసాలు, గడ్డం ఉండి, ఆయన శౌర్యపరాక్రమాలకు ప్రతీకగా కనిపిస్తాడు. ఈ క్షేత్రం విశ్వామిత్ర, సూర్య నదులకు దగ్గరలో ఉంటుంది. మంగళ,శనివారాలలో భక్తుల రద్దీ ఎక్కువ. శ్రావణ శనివారాలలో మరీ ఎక్కువ. అప్పుడు గొప్ప ఉత్సవం నిర్వహిస్తారు. దీపావళికి ముందు చతుర్ద శిసాధనకు, సిద్ధికి చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ చతుర్దశి శనివారం అయితే ఇంకా మహా పవిత్రం. ఈ అతిప్రాచీన భిద్భంజన్మారుతిని దర్శించి తరిద్దాం.❋

182) శ్రీ అనోఖేహనుమాన్ మందిర్-అహమ్మదాబాద్

గుజరాత్ రాష్ట్రం అహమ్మదాబాద్ దగ్గర బనాస్కాంత జిల్లాలో అనోఖే హనుమాన్మందిరం చాలా పురాతనమైంది. శనివారం విశేషంగా భక్తులు వస్తారు. అయిదారు శతాబ్దాలుగా ఇక్కడ భక్తులు కొబ్బరికాయలు మాత్రమే దేవుడికి సమర్పిస్తారు. గుట్టలు గుట్టలుగా కొబ్బరికాయలు పేరుకొనిపోయి చిన్నసైజు కొండలాగా కనిపిస్తుంది. ఇప్పటికి కోటికి పైగా కొబ్బరికాయలు అక్కడ ఉన్నాయి. ఎవరైనా ఒకకాయ దొంగిలిస్తే పాపపరిహారంగా అయిదుకొబ్బరికాయలు సమర్పించాలి. భక్తుల కోరికలన్నిటినీ ఈ అనోఖే హనుమాన్ తీరుస్తాడని అందరి విశ్వాసం. ఈ కొబ్బరికాయ పర్వతం లోపల కనిపించీ కనిపించకుండా హనుమాన్ కనిపిస్తాడు. ఈ కొబ్బరికాయ హనుమాన్ ఆలయం 600-700 ఏళ్ళ చరిత్ర కలది. పది కిలోమీటర్ల దూరం నుంచి భక్తులు నడిచివచ్చి దర్శనం చేసుకొంటారు.

ఈ ఆలయానికి ఒక చరిత్ర ఉంది. సుమారు 80 ఏళ్ళ క్రితం తరాజ్‌కు చెందిన అశోక్ దార్ మఠంకు చెందిన మహంత్ ర్దేపురి మహారాజ్ ఇక్కడికి వచ్చి పిల్లలకు కొబ్బరికాయ కొట్టి ప్రసాదంగా ఇచ్చారు. ఒక పిల్లాడికి వెంటనే జబ్బు చేసింది. పిల్లలు హనుమాన్దాదాను అక్కడ కొబ్బరిచెట్లు పెంచటానికి అనుమతి కోరితే, వద్దని చెప్పాడు. అప్పుడు మహంత్ గారు హనుమను కొబ్బరికాయలు కొట్టి ప్రసాదంగా పెడితే, తరిగిపోతాయని భావిస్తే, వాటిని అలాగే ఉంచటానికి అనుమతివ్వు అని కోరారు. సరే అన్నాడు హనుమ. అప్పటినుంచి ఇక్కడ కొబ్బరికాయ కొట్టే ఆనవాయితీ మారిపోయి, ఇలా రాశులు రాశులుగా పెరిగిపోయాయి.*

183) శ్రీ ఏకాదశముఖి హనుమాన్ మందిరం-పోర్బందర్

గుజరాత్‌లో సూరత్ దగ్గర 'సుదామపురి' అనబడే పోర్ బందర్లో ఏకా దశముఖి హనుమాన్ దేవాలయం గొప్ప దర్శనీయ స్థలం. దీనినే కడోదర దేవాలయం లేక ధరంతి హనుమాన్ మందిర్ అంటారు. ఈ హనుమాన్ కవచాన్ని అగస్త్య మహర్షి తన అర్ధాంగిలో పాముద్రకు ఉపదేశించాడు. ఈ ఆలయం పంచముఖి మహాదేవ మందిరంలో ఉన్నది. ఇక్కడి హనుమంతుని విగ్రహానికి రెండుచరణాలు, 22 బాహువులు, 11 ముఖాలు ఉండటం విశేషం. ఈ ముఖాలు-కపిముఖం, భైరవముఖం, అగ్నిముఖం, హయగ్రీవ ముఖం, వరాహ ముఖం, నాగ ముఖం, రుద్రముఖం, నరసింహ ముఖం, గజముఖం, సౌమ్య ముఖం (వానర ముఖం). ఇలా ఏకా దశముఖాలున్న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం ఇండియాలో ఇదొక్కటే అంటారు. ఈ స్వామి స్తోత్రం దేవనాగర లిపిలో లభ్యం.

లోపాముద్ర ఉవాచ-

1- 'కుంభోద్భవద యాసింధో శ్రుతం హనుమ త్పరం యంత్ర మంత్రాదికం సర్వం త్వాన్ముఖోదీరితం మయా'

2- 'దయం కురుమయి ప్రాణనాధ వేది తుము తసహే, కవచం వాయుపుత్రస్య ఏకాదశా ముఖమన'

3- 'ఇతేవం వచనం శ్రుత్వాప్రియా యాప్రశ్రయాన్వితం వక్తుంప్రచక్రమేత త్రలోపాముద్రం ప్రతి ప్రభు. అగస్త్య ఉవాచ -

4- 'నమస్కృత్వా రామదూతం హనుమంతం మహామతిం, బ్రహ్మప్రోక్తం తుకవచం శ్రుణిసుందరి సాదరం'

5- 'ఆనంద నాయును మహాచతురాన నభాషితం-కవచం కామదందివ్యంరక్షకుల విమర్దనం'*

184) శ్రీ హనుమాన్ మందిరం-లంభవేల్

గుజరాత్‌లోని ఆనంద్ దగ్గర లంభవేల్‌లో శ్రీ హనుమాన్ మందిరం హనుమాన్ చాలీసా పారాయణతో మారు మోగుతుంది. ఇక్కడ హారతి చాలా అద్భుత దృశ్యం.❋

185) శ్రీ జంబూ గోడ జంద్ హనుమాన్ మందిరం-గుజరాత్

గుజరాత్ రాష్ట్రంలో అరణ్య ప్రాంతంలో జంబూ గోడ జంద్ హనుమాన్ మందిరం ఉన్నది. 18 అడుగుల ఆంజనేయ విగ్రహం పరమ ఆకర్షణీయం. మంగళవారం హనుమకు, అంగారకునికి ప్రీతికరమైన రోజు. అందుకని భక్తులు ఇక్కడికి అధిక సంఖ్యలో ఉపవాసంతో వచ్చి, స్నానం చేసి పవిత్రులై ఆవునేతితో దీపారాధన చేసి తమ దోషాలను పరిహరించుకొంటారు. భీముడే ఇక్కడ ఆంజనేయ విగ్రహం ప్రతిష్టించాడని ఐతిహ్యం. ఇక్కడ 'భీముడి తిరగలి' తప్పక చూడాలి. ఇక్కడే 'అర్జున బావి' కూడా ఉన్నది. పాండవులు వనవాసంలో ఇక్కడికి వచ్చిన ఆనవాళ్ళున్నాయి. ఇక్కడున్న చిన్న చిన్న రాళ్ళతో ఇల్లులాగ కడితే, తప్పకుండా మంచి స్వగృహం నిర్మించుకొంటారు అనే నమ్మకం ఉంది. ఈ ఆలయం జంబూ గోడ అభయారణ్య ప్రాంతంలో ఉన్నది. మంచి టూరిస్ట్ స్పాట్. వడోదర నుంచి ఇక్కడికి 90 కిలోమీటర్ల దూరం. చక్కని స్నాన కుండాలు, అందమైన ప్రకృతిలో ఉన్న ఆలయం.❋

186) శ్రీ దోడీ వాడా హనుమాన్ మందిరం-బేచరాజి

గుజరాత్‌లో మెహ్ శానా సిటీ దగ్గర బేచరాజి గ్రామంలో దోడీవాడా హనుమాన్ మందిరం సీతారామ మందిరానికి ఎదురుగా ఉన్నది. ఆలయాన్ని అరాష్ పహాన్ రాళ్ళతో నిర్మించారు. 500 అడుగుల పొడవు, 200 అడుగుల వెడల్పు ఉన్న చిన్న గుడి. దగ్గరలో మొధేరా సూర్య దేవాలయం, మహేశ్వరి మాతంగి దేవాలయాలున్నాయి.

మహారాష్ట్ర

187) నది నీటిలో దొరికిన శ్రీ ఆంజనేయ విగ్రహం-పూనే

మహారాష్ట్రలోని పూనేలో మూతా నదిలో సంగం బ్రిడ్జి దగ్గర నానాపేట్‌లో 2010 నవంబర్ నెలలో 250 ఏళ్ళ 6 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం లభించింది. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ ప్రాజెక్ట్ కింద పూనే మునిసిపల్ కార్పోరేషన్ వారు ఈ నదిని శుభ్రం చేస్తుంటే ఈ భారీ హనుమాన్ విగ్రహం దొరికింది. పొడవు ఆరు అడుగులు ఉంటే వెడల్పు మూడున్నర అడుగులు ఉంది. పురావస్తు శాఖకు చెందిన అధికారులు పరీక్షించి ఈ విగ్రహం 250 సంవత్సరాలకు పూర్వపు విగ్రహం అని తేల్చారు. ఈ విగ్రహం నది నీటిలో, పది అడుగుల లోతున పూడికలో ఉండి పోయింది. మూతా నది ఒడ్డున అనేక ప్రాచీన దేవాలయాలున్నాయి. ఇలాంటి భారీ ఆంజనేయ విగ్రహాలు పూనేలో ఆరు ఉన్నాయని చెప్పారు. పాషాణ్‌లోని సోమేశ్వర దేవాలయంలో అచ్చంగా ఇలాంటి విగ్రహమే ఒకటి ఉందట. కాని ఇప్పుడు చెప్పుకొన్న మూతానదిలో దొరికిన హనుమాన్ విగ్రహం ఈ ఆరు విగ్రహాలలో అత్యంత సుందరమైన విగ్రహంగా తెలియజేశారు. ఈ మారుతి కుడి వైపుకు తిరిగి ఉంటాడు. చాతీమీద బాకు ఉంటుంది. తోక

చివర గంట ఉంటుంది శంఖాన్ని కూడా ధరించి ఉంటాడు. ఈ విశేషాలనుబట్టి ఈ హనుమాన్‌ను యుద్ధ సైనికులు ధైర్యోత్సాహాల కోసం అర్చించేవారని అంటున్నారు. ఇలాంటి విగ్రహాలు సాధారణంగా రాజుల కోటలలో ఉంటాయి. గణేష్ ఖిండిలో 'చతుశ్రుంగి' దేవాలయంలో అచ్చంగా ఇలాంటి ఆంజనేయ విగ్రహమే ఉంది.✻



188) శ్రీ దక్షిణముఖ హనుమాన్ మందిర్-షిర్డీ

మహారాష్ట్రలోని ప్రసిద్ధ షిర్డీ సాయిబాబా మందిరం బయట ఉన్న శ్రీ దక్షిణ ముఖి హనుమానాలయానికి ఒక చరిత్ర ఉంది. ఇందులో హనుమాన్ విగ్రహాలు రెండు ఉన్నాయి. పూనా తంబేకు చెందిన దేవీదాస్ మరియు గంగాఫీర్ అనే ఇద్దరు సాదు పుంగవులు షిర్డీ క్షేత్రానికి వచ్చినప్పుడు ఈ దేవాలయంలోనే బస చేసేవారు. భక్తులు తనకు కానుకలుగా సమర్పించిన దక్షిణ డబ్బుతో ఈ దేవాలయాన్ని సాయిబాబా మరమ్మతు చేయించాడు. కనుక దీనికి దక్షిణముఖీ మారుతి దేవాలయం అనే పేరు వచ్చింది స్వామి దక్షిణాభిముఖంగా కూడా ఉంటాడు.

చావడి ఉత్సవాలు జరిగినప్పుడు సాయిబాబా ఈ దక్షిణముఖి ఆంజనేయ ఆలయం వద్ద ఆగి చేతులు ఊపుతూ వింతగా ప్రవర్తిస్తూ కొన్ని నిమిషాలు మౌనంగా నిలబడేవాడు. ఇప్పుడు పల్లకీ ఉత్సవంలో కూడా ఇక్కడ ఆపి చోప్ దార్లు లాల్కరీ నిర్వహిస్తూ బాబా ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. నామజపం చేసుకోవటానికి మహా ప్రశాంతంగా ఈ ఆలయం ఉపయోగపడుతోంది. శ్రీరామ నవమి అనంతరం వచ్చే శ్రీ హనుమజ్జయంతిని ఈ ఆలయంలో పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహిస్తారు.

ఈ హనుమ ఆలయం వెలుపల రావి వేప వృక్షాలున్నాయి. వీటికింద

శ్రీ బి.వి.నరసింహస్వామి నాగ ప్రతిష్టను చేశారు. బొంబాయికి చెందిన మూర్తికార్ బజ్రేరావు దాల్వే 11-2-1983న శివలింగాన్ని, నందిని ప్రతిష్టించాడు. మహా శివరాత్రి నాడు పల్లె ప్రజలు ఈ శివలింగం వద్ద గొప్ప ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. షిర్డీలోని సాయి సంస్థాన్ ఈ రెండు విగ్రహాల బదులు ఒకే విగ్రహం ఉంటే బాగుంటుందని భావించి ఆలయ మరమ్మతులు చేసి నల్ల మార్బుల్ రాయితో దక్షిణముఖి ఆంజనేయస్వామి విగ్రహం చెక్కించి ప్రతిష్టించింది. పాత జంట మార్బుల్ విగ్రహాలను సంస్థాన్ మ్యూజియంలో భద్రపరచింది. శ్రీరామనవమి ముందు ప్రారంభించి హనుమజ్జయంతి వరకు హోమాలు నిర్వహించారు. షిర్డీ వెళ్లి సాయిబాబా దర్శనం చేసుకొన్నా వారందరూ తప్పక ఈ దక్షిణముఖి హనుమాన్ దర్శనం చేసి తరిస్తారు.❋



189) భద్రమారుతి దేవాలయం-ఖుల్దాబాద్

మహారాష్ట్రలో మరాట్వాడా అనిపిలువబడే ఔరంగాబాద్‌జిల్లా ప్రసిద్ధ ఎల్లోరా గుహలకు సమీపంలో ఖుల్దాబాద్‌లో శ్రీ భద్రమారుతీ దేవాలయం సుప్రసిద్ధమైనది. దీని పూర్వకాలపు పేరు భద్రావతి. మొగలాయీ పాలన కాలంలో ఖుల్దాబాద్‌గా పేరు మార్చారు. పార్సీ భాషలో 'ఖుల్దా' అంటే స్వర్గ

ద్వారం అని అర్థం. భద్రావతి అంటే సురక్షిత ప్రాంతం, పవిత్ర ప్రదేశం అని అర్థాలున్నాయి. ఏ పేరైనా దాని ప్రత్యేకతనే తెలియజేస్తోంది. దేశంలోని 12 జ్యోతిర్లింగాలలో 4 మహారాష్ట్రలోనే ఉండటం ప్రత్యేకత. అవే త్రయంబకేశ్వరం, ఘ్రుష్ణేశ్వరం, నాగనాదేశ్వరం, భీమ శంకరేశ్వరం.

ఎల్లోరా గుహలకు అతి దగ్గరలో నాలుగు కిలోమీటర్ల దూరంలో శ్రీ భద్ర మారుతి దేవాలయం ఉంది. ఇక్కడి మారుతి అరుదైన ఆకృతిలో వెనుకకు వాలి ఉన్న భంగిమలో కనిపించటం మరీ విశేషం. దీని వెనుక ఒక కథ ఉంది. ఒకప్పుడు ఈ భద్రావతి ప్రాంతాన్ని శ్రీరామభక్తుడైన భద్రసేన మహారాజు పాలించేవాడు. శ్రీరాముడిని పరమ పవిత్రమూర్తిగా, ఆపన్న రక్షకునిగా, రామభద్ర మూర్తిగా భావించి అర్చించేవాడు. ఇక్కడున్న శ్రీరామాలయానికి అనువుగా ఒక చెరువు త్రవ్వించి దానికి భద్ర కుండం అని పేరు పెట్టాడు. ఈ చెరువులో నిత్యం పవిత్ర స్నానం చేసిన తరువాత మాత్రమే శ్రీరామ భద్రుని దర్శించి పూజించేవాడు. అందమైన తన గారాల కూతురుకు 'భద్ర' అని పేరు పెట్టుకొన్నాడు. అందుకే ఈ నగరానికి భద్రావతి అనే పేరొచ్చింది.

శ్రీరామభక్తుడైన భద్రసేన మహారాజు గొప్ప సంగీత విద్వాంసుడు కూడా. తానే స్వయంగా శ్రీరామునిపై కీర్తనలు రాసి స్వరాలు కట్టి తన్మయత్వంతో అతి మధురంగా గానం చేసి రామునికి నివేదనగా వినిపించేవాడు. ఈ గానానికి ప్రకృతి పులకించి పోయేది. భక్తుల మనసు ఆనంద డోలికలలో ఊగేది. అందరూ అరమూసిన కనులతో ఆ గాన మాధుర్యంలో తన్మయులై మేను మరచేవారు. శ్రీరామ దర్శ నానుభూతి పొందేవారు. మహారాజు గానానికి, సంగీత సాహిత్యాలకు అంతటి ప్రభావం ఉండేది. రామునికి దగ్గరై, ఐహిక సుఖాలకు దూరమై భద్రసేన మహారాజు మహా తపస్సంపన్నుడయ్యాడు. ఈ రకంగా శ్రీ రామ భజన ఉదయం నుండి సాయంకాలం వరకు కొనసాగేది. కొన్నిసార్లు కొన్ని రోజులు ఆపు లేకుండా జరిగేది.

'యత్ర యత్ర రఘునాద కీర్తనం తత్ర తత్ర కృత మస్తకాంజలిం' అన్నట్లు ఇంత గొప్పగా రామభజన, కీర్తనా జరుగుతుంటే రామ భక్త హనుమాన్

అక్కడికి రాకుండా ఉండగలడా? 'పారిజాత తరుమూల వాసియై 'హనుమ రామధ్యానంలో, ఉండకుండా ఉండగలడా? భద్రసేన మహారాజు దివ్య రామనామ సంకీర్తనలకు పులకించి ఆనంద భాష్పధారలు కన్నుల వెంట కారుతుండగా వింటూ మైమరచిపోయి, రాజు రామభక్తికి జోహార్లు అర్పించేవాడు మనసులోనే. భద్రసేనుని గానానికి పక్షులు తన్మయం చెంది వినేవి. చెట్ల కొమ్మలు సవ్వడి సేయకుండా విని పుష్ప వృష్టి కురిపించి అభినందించేవి. యావత్ ప్రకృతి రామ గానామృతంలో తడిసి ముద్ద అయి దివ్యానుభవం పొందేది.

గంటలకొద్దీ రాజర్షి భద్ర సేన మహారాజు రామ గానాన్ని వెనక్కి వాలి పోయి వింటూ, భావ సమాధిలో మునిగిపోయే వాడు హనుమాన్. రాజు తన భావ సమాధి నుంచి బయటపడి, కనులు తెరచి చూస్తే, భావ సమాధిలో తన్మయస్థితిలో తనకు అత్యంత సమీపంలో ఉన్న మారుతిని చూసి ఆశ్చర్యపద్దాడు. వెంటనే మారుతి పాదాలపై వ్రాలి తన భక్తిని ప్రకటించాడు. అప్పుడు భావ సమాధిలో ఉన్న మారుతి ధ్యానానికి భంగం కలిగింది. అప్పుడు హనుమాన్ "రాజర్షి భద్రసేన మహారాజా! నీ రామభక్తికి ఎంతో తన్మయుడనయి ఆనందించాను. నీకు శ్రీరామదర్శనం కలిగిస్తాను. ఇంకా నీ మనసులో కోరికలేవైనా ఉంటే చెప్పు" అని అడిగాడు.

అదే తన్మయస్థితిలో ఉన్న రాజర్షి భద్రసేనుడు "మహాత్మా! నువ్వే నా పాలిటి శ్రీరామభద్రుడివి. నీకు శ్రీరామాశీస్సులున్నాయి. నీ దర్శనం కలిగినదీ అంటే నాకు శ్రీరాముని కృపా విశేషం లభించినట్లే. నువ్వు ఆనందానుభూతి పొంది నన్ను సంతృప్తుడిని చేశావు. అయితే ప్రభూ! నువ్వు ఇదే భావ సమాధిలో ఇక్కడ ఈ క్షేత్రంలో స్థిరంగా నిలిచిపోయి, భక్తులను సదా అనుగ్రహించ వలసినదిగా, కన్యలకు సద్బుద్ధిని అనుకూలుడైన భర్తను అనుగ్రహిస్తూ నీ భక్తులకు సకల శ్రేయస్సులు కలిగించవలసినదిగా నా విన్నపం" అని ప్రార్థించాడు. "తథాస్తు" అన్నాడు మారుతి. రాజర్షి భద్రసేన మహారాజుకు ఇచ్చిన మాట ప్రకారం మారుతి ఇక్కడే 'భద్ర మారుతి'గా భావ సమాధి భంగిమలోనే ఉండి, భక్తులకు సర్వ శుభమంగళాలు చేకూరుస్తూ అనుగ్రహిస్తున్నాడు.❁

190) శ్రీ విశ్వరూప హనుమాన్ మందిర్ -ముంబై

నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత శ్రీ హనుమాన్ ఒక్కడే అనే గొప్ప నమ్మకంతో 'సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ' వారు భారీ భజరంగబలి విగ్రహాన్ని నిర్మించి బొంబాయిలో నేరుల్ వద్ద ప్రతిష్ఠించి స్ఫూర్తి కలిగించారు. విద్యార్థి లోకానికి స్ఫూర్తి, ధైర్యం, ప్రేరణ కలిగించాలని బొంబాయిలోని ఎస్.ఐ.ఈ.ఎస్. ట్రస్ట్ వారు భావించి ట్రస్టు 2004లో రిజిస్టర్ చేయించారు. దీనికే 'విశ్వ రూప హనుమాన్' అనే పేరు వచ్చింది. 33 అడుగుల ఎత్తున్న భారీ మూర్తిగా హనుమాన్ దర్శనమిస్తాడు. నిలబడి ఉన్న భంగిమలో శిల్పించిన గ్రానైట్ ఏకశిలా విగ్రహం ఇది. కంచికి చెందిన శిల్పకళా మణి అని ప్రసిద్ధి చెందిన ఎం.ముత్తయ్య స్థపతి స్వయంగా పర్యవేక్షణ చేసి నిర్మించిన అతి సుందరమూర్తి ఈ విశ్వరూప ఆంజనేయస్వామి. 55టన్నుల బరువున్న ఈ భారీ మారుతి విగ్రహాన్ని చెన్నైలో ఏడాది కాలం శ్రమించి నిర్మింపజేశారు. దాన్ని ముంబాయికి రవాణా చేయించి విగ్రహ స్థాపన చేశారు. పద్మపీఠంపై నిలుచున్న విశ్వరూప భగవాన్ హనుమాన్ చేతులు జోడించి ప్రార్థిస్తున్న భంగిమలో దర్శనమిస్తాడు. కనులు ధ్యానంలో ఉన్నట్లు కనిపిస్తాయి. చెవులకు కుండలాలు, చేతులకు మూడు కంకణాలు, భుజాలకు కేయూరాలు, పాదాలకు అందెలుతో మనోహరంగా కనిపిస్తాడు. వాలం భూమిపై ఆని ఉన్నట్లు ఉండటం విశేషం. విగ్రహం మనోహరంగా ఉండటమేకాక స్ఫూర్తి, ప్రేరణ ఆదర్శాలనిచ్చే పవిత్ర మూర్తిగా కనిపించి యువతకు మార్గదర్శి అనిపిస్తున్నాడు.

ఇటీవలే శ్రీ రామ సన్నిధిని కూడా నిర్మించారు. హనుమకు ఎత్తైన మండపాన్నీ కట్టించారు. 26-1-2000న అతి రుద్రం, చండీయాగం నిర్వహించి, ఫిబ్రవరి 9న కంచి కామకోటి పీఠ జగద్గురువులు శ్రీ శ్రీ జయేంద్ర

సరస్వతి గారిచేతనే రూల్ లోని శ్రీ చంద్రశేఖర సరస్వతి విద్యాపురంలో శ్రీ విశ్వరూప హనుమాన్ విగ్రహావిష్కరణ చేయించారు. ఇంతటి భారీ విగ్రహం దేశంలోనే అరుదు. డిసెంబర్ 25 నుండి 28 వరకు మహారుద్ర మహాయజ్ఞం, శ్రీ హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. జగద్గురువుల సమక్షంలో డిసెంబర్ 28న శ్రీ హనుమాన్‌కు రజత కవచధారణ చేసి తరించారు.❋



191) శ్రీ ఘంటల హనుమ దేవాలయం-ఖార్

మహారాష్ట్రలోని బొంబాయిలో ఖార్ రైల్వేస్టేషన్ నుంచి పది నిమిషాల నడక దూరంలో ఉన్న మధు పార్క్ దగ్గరలోని ఖార్‌లో 'ఘంటేశ్వరహనుమాన్' దేవాలయం ఉన్నది. భక్తులు ఈ హనుమను దర్శించి తమ కోరికలు తీరగానే ఘంటలు ప్రదానం చేస్తారు. అలాంటి వేలాది కంచు ఘంటలతో ఆలయమంతా నిండి ఉండటం చేత 'ఘంటేశ్వర హనుమాన్ దేవాలయం' అని పేరొచ్చింది. ఆ ఘంటా నాదం పర వశం కలిగిస్తుంది. . మంగళ, శనివారాలలో భక్తుల రద్దీ అత్యధికం కనుక దర్శనం చేసుకొని బయటికి రావటానికి కనీసం ముప్పావు గంట పడుతుంది. హనుమజ్జయంతికి ఇసకేస్తే రాలనంత జనం రావటం విశేషం.❋

192) పాముకాటు డాక్టర్- శ్రీ మారుతి దేవాలయం-పంగారి

మహారాష్ట్ర బీడ్‌జిల్లా పంగారిలో ప్రాచీన మారుతి దేవాలయం ఉన్నది. దీన్ని మారుతి దేవాలయమని, 'మరుతిచి' దేవాలయమనీ అంటారు. మహారాష్ట్ర భాషలో మరుతిచి అంటే మారుతికి చెందినది అని అర్థం. బీడ్-అహ్మద్ నగర్ రోడ్డులో బీడ్ నుంచి 45 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయముంది. 17వ శతాబ్ది ఆలయంగా భావిస్తారు. ఆలయాన్ని గురించి రెండు కథనాలున్నాయి-

16వ శతాబ్దంలో ఒక హనుమ భక్తుడు ఈ ప్రాంతంలో బాలాఘాట్ పర్వతం వద్ద ఉండేవాడు. అతను ఏది కోరుకొంటే దాన్ని తీరుస్తానని హనుమ చెప్పాడు. తనకేమీ అక్కర్లేదని, తన గ్రామానికి వచ్చి అక్కడే కొలువై ఉండి భక్తుల కోర్కెలు నెరవేర్చమని కోరాడు. అలాగే వస్తాననీ, కాని తానూ అతని వెంట వస్తున్నానో లేదో అని వెనక్కి తిరిగి చూడకూడదని షరతు పెట్టాడు స్వామి. ఒకవేళ వెనక్కి తిరిగి చూస్తే, ఒక చిన్న రాతి విగ్రహంగా మారిపోయి ఇక అక్కడి నుంచి కదలను అన్నాడు. సరే అన్నాడు భక్తుడు. ఇద్దరూ బయల్దేరారు. దారిలో దట్టమైన కాక్టస్, పంగార వృక్షాలున్న అడవి గుండా వెడుతున్నారు. అప్పటిదాకా హనుమ మీద నమ్మకమున్న భక్తుడికి అనుమానం వచ్చి ఒకసారి వెనక్కి తిరిగాడు. అంతే! ముందే చెప్పినట్టు చిన్న రాతి విగ్రహంగా మారి, ఎంత బతిమిలాడినా కదలలేదు. తన గ్రామానికి వెళ్లి

విషయం వివరించి అందర్నీ స్వామి విగ్రహం ఉన్నచోటే నివాసం ఏర్పాటు చేసుకోమన్నాడు. అందరూ అతని మాట మన్నించి కొత్త గ్రామాన్ని అక్కడే ఏర్పాటు చేసుకొనిదానికి 'పంగార' అని పేరు పెట్టుకొన్నారు. అదే పంగార మారుతి. కాలక్రమంలో పంగారి అయింది.

రెండవ కథనం ప్రకారం పంగారికి 8 కిలోమీటర్ల దూరంలో సావర్గావ్ అనే చోట హనుమ విగ్రహం ఉంది. ఈ ప్రదేశం బహిర్భూమిగా ఉపయోగ పడేది. ఒకసారి పంగారి నుంచి ఎడ్ల బండిపై ఒక రైతు ఇటు వస్తూ విగ్రహం దగ్గరకు వచ్చేసరికి విగ్రహం మాట్లాడుతూ తనను ఈ దుర్గంధం నుంచి పెకలించి వేరే శుభ్రమైనచోట పాతి, ఆలయం కట్టించమని కోరింది. గ్రామస్తులకు చెప్పి అందరి సహకారంతో అక్కడ ఆలయ నిర్మాణం చేశాడు. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. పాము కాటేసినవారు ఈ హనుమను దర్శించి 'బోలామారుతి మహారాజ చఛాంగ్భళా' అంటూ మూడుసార్లు అంటే, విషం క్షణాల్లో విరుగుడైపోయి బ్రతికిపోతారు. పాము కాటుకు గురైనవారు మగవారి సాయంతోనే రావాలి. అక్కడున్న బావిలో స్నానం చేసి అందులోని నీటిని 'ఘగర్', అని పిలువబడే మట్టి లేక లోహపాత్రలో తీసుకొని, దేవాలయంలోని మారుతి విగ్రహం చుట్టూ, పైన చెప్పిన మంత్రాన్ని చదువుతూ బాధితుడికి మెలకువ వచ్చేవరకు ప్రదక్షిణలు చేయాలి. ఒకవేళ బాధితుడిని ఆలయం బయట పొరబాటున స్త్రీలు తాకినట్లయితే అతడిని గోమూత్రంతో శుద్ధి చేయాలి. ఆలయం లోపల అతడిని స్త్రీలు ముట్టుకొంటే హనుమ అతడిని కాపాడే శక్తి కోల్పోతాడు. బాదితుడి బాగు కోసం అంతా ఇంత కఠిన నిబంధనలు పాటించాలిసిందే.❋

193) శ్రీ జాగృత మారుతి దేవాలయం-గౌడగావ్

మహారాష్ట్ర సోలాపూర్ జిల్లా అక్కకోట్ మండలం గౌడగావ్‌లో శ్రీ జాగృత మారుతి దేవాలయాన్ని 15వ శతాబ్దికి చెందిన అక్కల్ కోట్ స్వామి సమర్థ నిర్మించారు. వీరు దత్తాత్రేయస్వామి అవతారంమైన శ్రీ నరసింహ సరస్వతి. వీరుపూరి, కాశి, హరిద్వార్, గిర్నార్కధియవాడ, రామేశ్వరం, చైనా, టిబెట్, నేపాల్‌లకును సందర్శించారు. అక్కల్ కోట్‌లో స్థిరపడక ముందు

పండరిపురం దగ్గర మంగళ వేఢలో కొంతకాలం ఉన్నారు. చింతోపంత్తోల్ ఆహ్వానం మేరకు 1856లో అక్కల్కోట్కు వచ్చి గ్రామం బయటనే 22 ఏళ్ళు ఉండిపోయారు. అప్పటి నుంచి వీరిని అక్కల్ కోట్ మహారాజ్ అనేవారు. కర్ణాటకలోని గాణగా పురంలో చాలా కాలమున్నారు. ఇక్కడే 'నిర్గుణపాదుకలు' భక్తులకు అందజేసి కర్దలి అరణ్యం చేరి అక్కడే సమాధి అయ్యారు. దత్తాత్రేయస్వామి అవతార స్వరూపులైన అవతారమూర్తులందరూ కర్దలి అరణ్యంలోనే మహాసమాధి అయ్యారు. నరసింహభారతి గారు కూడా కర్దలి అరణ్యంలోనే సమాధి చెంది, 300 ఏళ్ళున్నారు. ఒకరోజు కట్టెలు కొట్టేవాడు అక్కడున్న పుట్టను తొలగించాడు. అందులో యోగి యోగ సమాధి స్థితిలో కనిపించాడు. వీరే తర్వాత స్వామి సమర్ధగా ప్రసిద్ధి చెందారు.

అక్కల్కోట్ మారుతి స్వామి దక్షిణ ముఖంగా ఉండటం విశేషం. ఇలాంటి దక్షిణ ముఖ హనుమాన్దేవాలయాలు చాలా అరుదు. భక్తుల కోరికలు నెరవేర్చే, నిత్య జాగృతావస్థలో ఉండే స్వామిగా సుప్రసిద్ధుడు. దేవాలయ మహాద్వారం చిన్నదే.❋

194) శ్రీ ఖల్జాపూర్ మారుతి దేవాలయం-షోలాపూర్

మహారాష్ట్ర షోలాపూర్ జిల్లా ఖల్జాపూర్ మారుతి దేవాలయం పేరెన్నికగన్నది. ఇది టూర్గిస్ట్ స్పాట్గా చాలా ప్రసిద్ధం. అందమైన ప్రకృతి పరవశం కలిగిస్తుంది. ఇక్కడ శివాలయమూ ఉన్నది. పెద్ద ప్రాకారంలో ఉన్న దేవాలయం ఇది. తప్పక దర్శించాల్సిన దేవాలయం.❋

195) పురాతన శ్రీ ఆంజనేయ దేవాలయం-గొండియా

మహారాష్ట్రలో గోండియాలో పురాతన పవిత్రమైన శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. శిదిలమైతే 2004లో పునరుద్ధరించారు.❋

196) 'విలన్ హనుమాన్' దేవాలయం-పార్మర్

మహారాష్ట్ర అహ్మద్ నగర్ జిల్లాలో ముంబాయికి 5 కిలోమీటర్ల దూరంలో హనుమాన్‌ను విలన్‌గా భావించే ఊరు పార్మర్లేకదైత్యనందూర్ ఉన్నది. ఇక్కడ అందరూ హనుమంతుని 'విలన్'గా భావిస్తారు. హనుమాన్కు చెందిన ఏ ఉత్సవాలు ఇక్కడ చేయరు. పిల్లలకు ఆంజనేయ సంబంధమైన పేర్లు కూడా పెట్టనే పెట్టరు. అంతేకాదు, వేరే దైవాన్ని కూడా పూజించరిక్కడ. ఇక్కడ రాక్షసుడే దేవుడు. ఇక్కడి తెగలు ఈయన్ని కాక వేరేవరినైనా పూజిస్తే శిక్షిస్తారు. ఇక్కడికి వచ్చేవారు 'మారుతి' కార్లలో రాకూడదు. ఇక్కడున్న అసురిని పేరు 'దైత్యనింబ' స్థానిక కథనం ప్రకారం దైత్యనింబ శ్రీరాముని పరమభక్తుడు. శ్రీరాముడు సీతాలక్ష్మణులతో ఇక్కడున్న కేదారేశ్వర దేవాలయం సందర్శించాడు. తన ఆరాధ్య దైవం వచ్చాడని దైత్యనింబుడు పరవశంతో దర్శించాలనుకొని, అక్కడ రామభక్త హనుమాన్పై అసూయ చెంది యుద్ధం చేశాడు. శ్రీరాముడు కల్పించుకొని ఆపేసి దైత్యుని రామభక్తిని మెచ్చాడు. ఆ ప్రాంత రక్షకునిగా ఉండమని నింబుని రాముడు ఆదేశించాడు. అప్పటినుంచి ఇక్కడి వారంతా దైత్యనింబుని మాత్రమే పూజిస్తున్నారు. నింబు ద్వేషించిన హనుమాన్పేరు కూడా స్మరించరు. పార్మర్పూనాకు 92 కిలోమీటర్లు.❋

197) శ్రీ సమర్ధరామదాసు నిర్మించిన హనుమాలయం-సలాబత్పూర్

మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లా సలాబత్పూర్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ గురువు శ్రీ సమర్ధ రామదాసస్వామి నిర్మించిన ప్రాచీన శ్రీ హనుమాన్ దేవాలయం ప్రసిద్ధమైనది .

మహారాష్ట్ర గోడోహిరోలి జిల్లా చప్రాలలో హనుమాన్మందిరం విశేషమైనది.❋

గోవా

198) ప్రాచీన శ్రీ హనుమాలయం-గోవా

1840లో నిర్మించబడిన ఈ హనుమాలయాన్ని 'బుడతకీచు'లనే పోర్చుగీస్వాళ్ళు ధ్వంసం చేస్తే, ఆ తర్వాత అక్కడి హనుమా భక్తులంతా కలిసి1843లో పునర్నిర్మించి వెండి విగ్రహం ప్రతిష్ఠించారు. మపూసా వర్తకులు నిధి పోగు చేసి నిర్మాణానికి సాయపడ్డారు. భూత ప్రేత పిశాచాలకు భయంకరుడు ఈ హనుమ.❋

దాద్రానగర్ హవేలీ

199) శ్రీహన్మాన్ దేవాలయం-సిల్వసా

దాద్రానగర్ హవేలీలోని సిల్వసాలో శ్రీ ఆంజనేయస్వామి శ్రీరామ సీతాదేవిల ముందు అభయ ముద్రతో కూర్చుని దర్శనమిస్తాడు. ఇక్కడే స్వామి నారాయణ దేవాలయమూ ఉంది.❋

మధ్య ప్రదేశ్

200) ఖేదపతి హనుమాన్ మందిర్-గ్వాలియర్

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని గాంధీనగరలో సర్వసిద్ధి శ్రీ ఖేదపతి హనుమాన్ మందిరం ప్రసిద్ధమైనది. ఈ ప్రాంతంలో ఎన్నో దేవాలయాలు ఉన్నా ఈ హనుమాన్‌కున్న ప్రశస్తి ఎవరికీ లేదు. బాగా రద్దీగా ఉండే నగరం మధ్యలో ఈ ఆలయం ఉంది. సింధూర శరీరి అయిన ఈ హనుమాన్ దర్శనం ఒక అలౌకికానుభవం అని అనిపిస్తుంది. స్వామి విశాలమైన కనులలో కరుణ జాలువారుతుంటుంది. స్వామి శిరసుపై ఉన్న రత్న ఖచిత రజత కిరీటం మరింత శోభాయమానంగా ఉంటుంది. విలువైన ఆభరణాలు దుస్తులతో స్వామి మెరిసిపోతూ ఉంటాడు.

గ్వాలియర్‌లోని ఈ ఖేదపతి హనుమానాలయ నిర్మాణం జరిగి 1000 ఏళ్ళు అయినట్లు చారిత్రకాధారాలున్నాయి. మొదట్లో ఈ హనుమాలయం ఒక రావిచెట్టు కింద ఉండేది. తరువాత భక్తులు విశాలమైన ప్రాంగణంలో అందమైన పెద్ద ఆలయాన్ని నిర్మించారు. నిత్యం వేలాది భక్తుల సందర్శనంతో ఆలయం కిట కిటలాడుతుంది. హనుమాలయం ప్రక్కనే సీతా రామలక్ష్మణ విగ్రహాలనూ ప్రతిష్టించారు. హనుమ పాదాలచెంత కూర్చుంటే ఎంతో ప్రశాంతత లభిస్తుంది. ఇప్పుడు ఇది ఒక టెంపుల్ కాంప్లెక్స్‌గా పరిణామం చెందింది.❋

201) శృంగార క్షేత్రంలోనూ శ్రీ బాహువీర ఆంజనేయ దేవాలయం-ఖజురాహో

మధ్యప్రదేశ్‌లోని చత్రపూర్ జిల్లాలో నిఖజురాహో శృంగార క్షేత్రంలో ఉన్న 10వ శతాబ్దికి చెందిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇక్కడి భారీ హనుమాన్ విగ్రహం చూపరుల దృష్టిని ఇట్టే ఆకర్షిస్తుంది. అక్కడి శిలాశాసనంలో ఇది క్రీ.శ.10వ శతాబ్ది విగ్రహం అని తెలియజేయబడింది. ఇది ఆర్కిలాజికలల్ డిపార్ట్‌మెంట్ సంరక్షణలో ఉన్నది. ఖజురాహో సాహిత్యంలో కూడా ఈ విగ్రహ విశేషాలు కనిపిస్తాయి. ఈ శాసనాన్ని 1904లో మొదట గుర్తించినవాడు అలేక్జాండర్ కన్నింగ్గాం. శాసనం సంస్కృతంలో మూడు వాక్యాలలో ఉన్నది. ఈ శాసనం ఒక గొప్ప చారిత్రిక సత్యాన్ని తెలియజేసింది. దానిపై 316 అని ఉంది. అంటే హర్ష సామ్రాజ్యం నాటిదని తెలుస్తోంది. హర్షుని కాలం 922 అని చరిత్రకారులు ధృవీకరించారు. అంటే 10వ శతాబ్దంనాటి విగ్రహం అన్నమాట. ఇంకా ప్రాచీన హనుమాన్ విగ్రహాలున్నాయని చెబుతున్నా హజురాహో హనుమాన్ ఇప్పటికి తెలిసిన దాన్నిబట్టి అతి ప్రాచీనమైనది.❋

202) శ్రీ డాక్టర్ హనుమ దేవాలయం-భిండ్

మధ్యప్రదేశ్ భిండిలో డాక్టర్ హనుమ దేవాలయం రోగగ్రస్తులకు గొప్పవరం. డాక్టర్ల చుట్టూ తిరగకుండా ఈ హనుమ చుట్టూ ప్రదక్షిణం చేసి దర్శించి నమస్కరిస్తే ఎటువంటి జబ్బు అయినా యిట్టె మాయం. అందుకే డాక్టరనుమాన్ అంటారు. అతిప్రాచీన దేవాలయం ఇది. ఈ ఆలయాన్ని దంద్రూవాధం హనుమాన దేవాయం అంటారు. సోమవారం రాత్రి 8 గంటలకే భక్తులు ఆలయానికి చేరతారు. రాత్రి 11 గంటలకు దర్శనం ప్రారంభమౌతుంది. మహంత్ రామదాస మహారాజ్ హనుమ విశేషాలు రాత్రి 12 గంటలకు వివరిస్తారు. తర్వాత ఆపులేకుండా దర్శనం కొనసాగుతుంది. కనీసం ఒక లక్ష భక్తులు దర్శిస్తారు. భక్తులకు మంచినీటి సౌకర్యం ఉంటుంది. శ్రీరామ పట్టాభిషేకం తర్వాత లక్ష్మణస్వామికి హనుమ వైద్యం చేశాడట. ఇక్కడి ప్రదేశం పేరే 'బాధతగ్గించేది' అని అర్థం వచ్చే దందౌర. సాదుశివకుమార్గారికి ఒకప్పుడు కేన్సర్వచ్చింది. ఈ ఆలయానికి రాగానే హనుమాన్డాక్టర్కనిపించి నయం చేశాడని చెప్పుకొంటారు.❋



203) శ్రీ ఖేడాహనుమాన్ దేవాలయం-ఖేడా

మధ్యప్రదేశ్ ఖేడాలో రెండు భుజాలపై శ్రీరామ, లక్ష్మణస్వాములను భరిస్తూ ఆనందంగా రామనామం చేస్తున్న హనుమాన్‌గా పెద్ద విగ్రహం ఉన్న దేవాలయం ఉన్నది. ఇదికాక మామూలు రూపంలో ఉన్న చిన్న హనుమాన్విగ్రహమూ ప్రక్కనే ఉంది. ఇలా రెండురూపాలలో ఇక్కడ హనుమ దర్శన భాగ్యం పొందవచ్చు. ఒకాయన భుజపరాక్రమశాలి, రామకార్య దురంధరుడు అయితే రెండో ఆయన రామభాక్త హనుమాన్గా లక్ష్మణ ప్రాణదాత కనుక చేతిలో సంజీవి పర్వతం ఉంటుంది. ఇద్దరికీ తిరునామాలుంటాయి. ఆలయం 160 ఏళ్ళ నాటిది. ఇలా ఒకే ఆలయంలో విభిన్న విగ్రహమూర్తులున్న హనుమాన్లు ఇంకెక్కడా కనిపించరు. అదొక విశేషం ఇక్కడ. ఆలయం ప్రక్కన పంపావతి నది ఉంది. ఈ నదిలో స్నానించి ఆ పవిత్ర జలంతో హనుమాలను అభిషేకిస్తారు భక్తులు. సంతానార్ధులు, రైతులు, విద్యార్ధులు, ఫలాపేక్షకులు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి హనుమ దర్శనంతో సఫల మనోరధు లౌతారు.❋

204) శ్రీ చింద్ దాదాహనుమాన్-చింద్

మధ్యప్రదేశ్ బెరీలి జిల్లా చింద్‌లోని హనుమాన్ దేవాలయం లక్షలాదిభక్తులను ఆకర్షిస్తోంది. రాజకీయనాయకులు సినిమా స్టార్లు కష్టంలో ఉన్నప్పుడు ఈ స్వామిని దర్శించి తమ ఇక్కట్లను తొలగించుకొంటారు. హనుమజ్జయంతికి లెక్కలేనంత మంది భక్తులు వస్తారు. మంగళ, శనివారాలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. హనుమాన్మూర్తి వైభవం బహు ఆకర్షణీయం.❋

205) శ్రీ చమత్కారి హనుమాన్ దేవాలయం-మహాగావ్

మధ్యప్రదేశ్‌లో మహాగావ్‌లో శ్రీ చమత్కారి ఆంజనేయ దేవాలయం. ఉందిస్వామి ఇక్కడి భక్తులమొర ఆలకించటం విశేషం. సమస్త వ్యాధులను నయంచేసే శక్తి ఈ చమత్కారి హనుమాన్‌కు ఉన్నది.❋

206) శ్రీ గోదావరి ధాం హనుమాన్ మందిరం-కోట

మధ్యప్రదేశ్ చబల్ నదీ తీరంలో కోట అనే చోట గోదావరీ ధాంలో శ్రీ హనుమ మందిరం క్రీ.శ.1043 నాటి ప్రాచీనాలయం. 1963లో జీర్ణోద్ధరణ జరిగింది. స్వామి నల్ల శిలారూపం. శ్రీ రామ పరివారమూ ఉంటుంది. సహజ ప్రకృతి మధ్య విరాజిల్లిన ప్రాచీనాలయం.❋

207) శ్రీ హనుమాన్ టేక్రి మందిర్-గుణ

మధ్యప్రదేశ్ గుణలో శ్రీహనుమాన్ టేక్రిమందిరం అతి ఎత్తైన ప్రదేశంలో ఉంది. టేక్రిసర్కార్గుణా అని పిలుస్తారు. రమణీయ ప్రదేశంలో ఉన్న ఆలయం. దగ్గరలో శివ, రామాలయాలున్నాయి.❋

ఛత్తీస్‌గడ్

208) శ్రీ దక్షిణముఖి హనుమాన్ మందిరం-భిలాయ్

చత్తీస్గడ్ రాష్ట్రం భిలాయిల్లో శ్రీ దక్షిణముఖి హనుమాన్మందిరం ప్రాచీనమైనది. శిధిలమైతే పునర్నిర్మించారు. మొదట్లో ఉత్తరముఖి మందిరం. పాలరాతి విగ్రహంగా హనుమాన్ ప్రతిష్ట తర్వాత దక్షిణముఖి హనుమాన్‌గా ప్రసిద్ధుడు. ఎడమచేతిలో గద, కుడిచేతిలో సంజీవ పర్వతంతో దర్శనమిస్తాడు. చైత్రపౌర్ణమికి హనుమజ్జయంతి చేస్తారు.*

రాజస్థాన్

209) శ్రీ గెజెటెడ్ హనుమాన్ మందిర్-జై సల్మీర్

రాజస్థాన్‌లో అందమైన పట్టణం జై సల్మీర్. అక్కడ పాత పవర్ హౌస్ లోపల శ్రీ గెజెటెడ్ ఆంజనేయ దేవాలయం ఉన్నది. ఇది హనుమాన్ సర్కిల్‌కు అతి సమీపంలో ఉంది. ఆలయ పునర్ నిర్మాణం భారీ ఎత్తున జరుగుతోంది.*

210) ఎడారి ప్రాంతంలో శ్రీ హనుమ దేవాలయం-రోఁజ్రీధాం

రాజస్థాన్ గంగానగర్ జిల్లా రావ్లామండలం రోఁజ్రీధాంలో శ్రీ హనుమ దేవాలయం ఉన్నది. మహిమ గల ఈ హనుమదర్శనార్థం ఏడాది పొడుగునా భక్తులు విశేషంగా వస్తారు. హనుమాన్ సేవా సమితి ఈ దేవాలయాన్ని నిర్వహిస్తోంది. ఇక్కడ ప్రత్యేకత హనుమాన్ భజన, కీర్తలతో ఆలయం ఎప్పుడూ మారుమోగుతూనే ఉండటం. అనుపగర్-బికనీర్ రోడ్డుపై రోఁజ్రి గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలో ఆలయం ఉంది. అనుపమగర్‌కు 55, రావ్లామండికి 22, చాతర్గడ్‌కు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయం ఇది. ఎక్కడి నుంచైనా హాయిగా చేరుకొనే బస్ సౌకర్యముంది. ఇక్కడున్న దేవాలయ సమూహంలో శ్రీ హనుమాన్ ముఖ్యదైవం. ఆలయగోడలు అనేక దేవతల, మహర్షుల రంగు రంగుల చిత్రాలతో శోభాయమానంగా ఉంటాయి. హనుమాలయం కుడి ప్రక్కనే చిన్న శివాలయమూ ఉంది. రామదేవాలయం, రామకూటం కూడా దగ్గరున్న ఇసుకదిబ్బపై ఉన్నాయి.*

211) పుట్టు వెంట్రుకలకు ప్రసిద్ధమైన శ్రీ హనుమ దేవాలయం-పునరసార్

రాజస్థాన్‌లో పునరసార్ బాలాజీ దేవాలయం 1775 విక్రమ సంవత్సర జ్యేష్ట శుద్ధ పౌర్ణమినాడు నిర్మించబడింది. ఈ ప్రాంతమంతా ఇసుకదిబ్బలతో నిండి ఉంటుంది. ఇక్కడి ముఖ్యమైనది శ్రీనిజీ దేవాలయమే అయినా ఇందులోని ఆంజనేయుడే ఆకర్షణీయ దేవుడు. ఖేజ్డి వృక్షం వద్ద ఉంటాడు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల భక్తులు తమ పిల్లల పుట్టు వెంట్రుకలు తీయించటానికి ఇక్కడికే వస్తారు. గోధుమపిండి, పంచదార, వెన్నలతో కలిపి తయారుచేసే ప్రసాదం 'చుర్మాప్రసాది' ఇక్కడి ప్రత్యేకత. దీన్ని హనుమాన్‌కు నైవేద్యంగా పెట్టి, పూజారి భక్తులందరికీ ప్రసాదంగా పంచి పెడతాడు. చైత్ర శుద్ధ పౌర్ణమి, ఆషాఢ శుద్ధ పౌర్ణమి, భాద్రపద మాసం అంతా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యం కోసం ఎసి, నాన్ ఎసి రూములతో జైరాం ధర్మశాల కట్టారు. దేవస్థాన పూజార్ల ట్రస్ట్ ఉచిత భోజనశాల నిర్వహిసొంది. రుచికరమైన ఆరోగ్యదాయకమైన భోజనం ఇక్కడ లభిస్తుందని ప్రజలందరూ గొప్పగా చెప్పుకుంటారు.

బికనీర్ జిల్లాలో జాతీయ రహదారిపై పునరాసార్ గ్రామం ఉంది. దేవాలయం బికనీర్‌కు 57, శ్రీ దుర్గాఘర్‌కు 43 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. సేరునాకు 15 కిలోమీటర్లు. ఆలయ నిర్మాణానికి ఒక నేపధ్యం ఉన్నది. 1974లో పునరసార్‌లో భయంకర కరువు వచ్చింది. ప్రజలు ఆవాసాలు వదిలి తిండి కోసం, బ్రతుకు తెరువు కోసం బయటికి వెళ్ళారు. జైరాందాస్ బోత్రా అనే ధాన్యం వ్యాపారి దీన్ని వదలి పంజాబ్‌కు సామానంతా ఒంటెపై ఎక్కించి అనుచరులతో బయల్దేరగా కొంతదూరం పోయాక ఒంటె కాలు విరిగి నడవలేక పోయింది. అనుచరులను మళ్ళీ పునరసార్‌కు వెళ్లిపొమ్మని చెప్పి తాను ఆ రాత్రి అక్కడే బసచేసి నిద్రపోయాడు. కాసేపటికి

ఎవరో తలుపు తట్టారు. మెలకువ వచ్చి బయటికి వచ్చి చూస్తే, ఎవరూ కనిపించలేదు. మళ్ళీ మళ్ళీ నిద్రపోవటం తలుపు చప్పుడు వినిపించటం లేచి చూడటం ఎవరూ లేకపోవటం జరిగింది. గ్రహించి రెండుచేతులు ఎత్తి నమస్కరించి "అయ్యా! తమరెవరో ఎందుకు తలుపు తడుతున్నారో చెప్పండి" అని ప్రార్ధించాడు. అప్పుడు ఆంజనేయుడు పూజారి రూపంలో కనిపించి "భక్తా! ఇప్పటిదాకా నువ్వు ఆపదలో ఉన్నావు. ఇక ఈ క్షణం నుంచి నీకు అంతా మంచి జరుగుతుంది" అని చెప్పి చూపుడు వ్రేలితో దూరంగా ఉన్న హనుమ విగ్రహాన్ని చూపించి దాన్ని తనతో తీసుకువెళ్లి ప్రతిష్టిస్తే గ్రామానికి శుభం కలిగి అందరి కష్టాలు గట్టెక్కుతాయి. నువ్వూ, నీ కుటుంబ సభ్యులు మాత్రమే ఆలయాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి" అని అభయమిచ్చాడు. అప్పుడు బోత్రా అక్కడి నుంచి కదలాలంటే తన ఒంటె కాలు విరిగింది కనుక అసాధ్యం అన్నాడు. వెంటనే పూజారి రూపంలోని హనుమ "నీ ఒంటె కాలు నయమైపోయింది చూసుకో" అన్నాడు. వెళ్లి చూస్తే నిజంగానే దాని కాలు నయమై లేచి నుంచుని ప్రయాణానికి సిద్ధంగా ఉంది. జైరాందాస్ బోత్రా తనతోపాటు హనుమ విగ్రహాన్ని తీసుకొని వెళ్లి ప్రతిష్టించాడు. అప్పటినుంచి బోత్రా కుటుంబమే తరతరాలుగా శ్రీ హనుమ దేవాలయాన్ని కాపాడుకొంటూ హనుమ చెప్పిన మాటను తూచా పాటిస్తున్నారు. బోత్రా కుటుంబం జైన్బోత్రా వ్యాపారులు.❋

212) మర్రిచెట్టు క్రింద విశ్రమించిన శ్రీ వీరహన్ దేవాలయం-వడ్లేశ్వర్

రాజస్థాన్‌లో జలోర్ జిల్లా ఆహోర్తహసీల్లో అగ్వారి గ్రామంలో వెలసిన శ్రీ వడ్లేశ్వర వీరహనుమాన్ పురాణ ప్రసిద్ధుడు. ఇక్కడ మర్రిచెట్టు కింద శ్రీ ఆంజనేయస్వామి అలసట తీర్చుకోవటానికి విశ్రమించాడని స్థానిక కథనం. అందుకని పరమ పవిత్ర స్థలంగా వెలుగొంది గొప్ప దేవాలయం నిర్మించారు. అగ్వారి గ్రామం ఆహోర్‌కు 14 కిలోమీటర్లలో నేషనల్ హైవే నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. ఫాల్నా, జలూర్లు దగ్గర రైలుస్టేషన్లు.❋

213) పాండవులు ఆశ్రయం పొందిన శ్రీ పండుపోల్ హనుమ దేవాలయం-ఆల్వార్

రాజస్థాన్ రాష్ట్రంజైపూర్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆల్వార్‌లో శ్రీ ఆంజనేయ దేవాలయం ఉంది. ఇది ద్వాపర యుగంతో సంబంధమున్న ఆలయంగా చెబుతారు. పాండవులు వనవాసం చేస్తూ, ఇక్కడ విశ్రమించారని స్థానిక కథనం. ఇక్కడ రెండు కొండలు కలిసిపోయి కలిసి ఉన్నచోట దారిలేక భీముడు గదతో వాటిని తీవ్రంగా మోదితే, అక్కడ ఒక సొరంగం ఏర్పడి అద్భుత జలప్రవాహం ఉరికి బయటికి వచ్చి సహజ జలపాతమై ప్రవిత్ర ప్రదేశమై ఈ ప్రదేశం అందాన్ని రెట్టింపు చేసింది. జలపాతం ప్రక్కనే అందమైన శ్రీ ఆంజనేయ దేవాలయం వెలిసింది. దీన్ని మొదట గుర్తించినవారు సంత్ నిర్భయదాస్ మహారాజ్. ఇంత దట్టమైన అరణ్య ప్రాంతంలో ఇంతటి పరవశం కలిగించే ప్రకృతి, జలపాతం వద్ద హనుమ విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయి ఒక చిన్న గుడి కట్టించాడు. క్రమంగా అది పెరిగి పెద్ద గొప్ప తీర్ధయాత్రా స్థలమైంది. మంగళ, శనివారాలలో అశేషంగా భక్తులు వచ్చి జలపాత స్నానం చేసి, స్వామిని దర్శించి ప్రకృతితో పులకించి తరిస్తారు. ఇక్కడి నుంచి ఏ పట్టణం అయినా కనీసం 150 కిలోమీటర్ల దూరానికి తక్కువ ఉండదు. కాని స్వామి దర్శనంతో సకల పీడలు, ఈతి బాధలు, కష్టాలు తొలగి పోతాయని భక్తుల అచంచల విశ్వాసం. అందుకే అంతంత దూరాల నుంచి కూడా వస్తారు. సాధారణంగా హనుమ విగ్రహాలు నుంచుని కాని, కూర్చుని కాని కనిపిస్తాయి. కాని ఇక్కడి హనుమాన్ ఆనుకుని కూర్చుని ఉన్నట్లు కనిపించటం విశేషం. అంటే విశ్రాంతి భంగిమ-'ఆరాంసే'గా ఉండటం విశేషం. హనుమ తోక కూడా చాలా పెద్దగా ఉండటం మరో వింత. ప్రక్కనే సంత్ నిర్భయ

దాస్ స్మృతి చిహ్నం కూడా ఉంటుంది. అన్ని పండగలు ఇక్కడ బాగానే చేస్తారు. ముఖ్యంగా హనుమ జయంతి, శ్రీరామనవమి, నవరాత్రి ఇంకా ఘనంగా నిర్వహిస్తారు. అందరూ అతి పవిత్రంగా భావించే ఆలయం కనుక ఇక్కడ మద్యం మాంసం గుడ్లు, శృంగారం పూర్తిగా నిషేధం. భక్తులు స్వామివారి తాయత్తులు, లాకెట్లు కొని తీసుకు వెడతారు.*

214) ఎడమచేత ఖట్వాంగాయుధం ధరించిన శ్రీ హనుమ దేవాలయం- మేవాడ్

ఇప్పుడు రాజస్థాన్‌లో ఉన్న మేవార్ ఒకప్పుడు గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానాలలో ఒక భాగం. ఇప్పుడు మేవార్ రాజ్యాన్ని ఉదయపూర్ అంటున్నారు. ఈ రాజ్యదైవం 'మేధాపటేశ్వర్'. దీనిలోంచి వచ్చిందే మేవార్. ఈ రాజ్యానికి ఈశాన్యంలో ఆరావళి పర్వతాలు, ఉత్తరాన అజ్మీర్, దక్షిణాన గుజరాత్, ఆగ్నేయంలో మధ్యప్రదేశ్‌లోని మాల్వాప్రాంతం, తూర్పున రాజస్థాన్‌లోని హడోటి ఉన్నాయి. కనుక విదేశీ దండ యాత్రికులు ఈ అతి ముఖ్యభాగాన్ని లోబరచుకోవటానికి తహ తహలాడేవారు.

ఖిల్జీరాజులలో రెండవవాడు అల్లాఉద్దీన్ ఖిల్జీ, అతని సైన్యాధికారి మాలికాఫర్ ఇక్కడి సనాతన ధర్మాన్ని నాశనం చేయటానికి తీవ్ర ప్రయత్నం చేశారు. మేవార్ రాజులు చిత్తోర్ రాజధాని చేసుకొని పాలించేవారు. 14వ శతాబ్దంలో వీరు కూడా ఖిల్జీవల్ల చాలా బాధలనుభవించారు. ఖిల్జీ-మేవార్, గుజరాత్, రణథంబూర్లను జయంచాక, మిగిలిన ఉత్తరభారత రాజ్యాలు గడ గడ వణికిపోయాయి. మేవార్ మహారాజు మోకాల్‌ను, సోదరులు చాచా, మేరాలు 1433లో హత్య చేశాక, ప్రజానుకూలత లేకపోవటంతో పారిపోయారు. మోకాల్రాజు సౌభాగ్యదేవిల కుమారుడు రాణా కుంభ

సింహాసనం అధిష్టించాడు. ఈయనకు రణమల్లరాథోడ్ బాగా సహాయపడ్డాడు. మాల్వాసుల్తాన్ మహమ్మద్ ఖిల్జీ, కుంభరాణాపై యుద్ధానికి వచ్చి, రాణా చేతిలో చిత్తుగా ఓడిపోయాడు. మాల్వా, గుజరాత్ సైన్యాలపై తాను సాధించిన అద్భుత విజయానికి చిహ్నంగా కుంభరాణా 37 మీటర్ల , 9 అంతస్తుల విజయ స్తంభాన్ని 1448లో నిర్మించాడు. మధ్యభారత్‌కు చెందిన మాన్సింగ్‌తోమార్, దక్షిణభారతానికి చెందిన రెండవ దేవరాయలు, పూర్వ భారతానికి చెందిన కపిలేంద్రదేవ్‌లు, మేవార్ రాజు కుంభరాణా 15వ శతాబ్దంలో భారతదేశంలో సనాతన ధర్మసారధులుగా నిలిచారు. మేవార్ రాజ్యసౌభాగ్య సంస్కృతీ వైభవాలకు కుంభరాణా నిలువెత్తు దర్పణంగా నిలిచాడు.

మేవార్ సామ్రాజ్యాన్ని మాల్వా నవాబు మహమ్మద్ ఖిల్జీ, గుజరాత్ నవాబు కుతుబుద్దీన్, నాగపూర్ నవాబు అంషద్ ఖాన్, మార్వారాజు రావుజోధాల దండయాత్రల నుండి రక్షించుకోవటానికి ఆగ్నేయ భాగంలో కొత్త రాజధాని నిర్మించాడు. ఇక్కడ రెండవ శతాబ్దిలో జైన రాజు 'సంప్రతి' నిర్మించిన కోట ఉండేది. ఉదయపూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ రాజధానికి 'కుంభాల్ఘర్' అని తన పేరొచ్చేట్లు పెట్టాడు. 1443లో ప్రారంభించి 15 ఏళ్ళలో 1458లో పూర్తి చేశాడు. దీని శిల్పి మదన్. సముద్ర మట్టానికి 1075 మీటర్ల ఎత్తులో రాజస్థాన్‌లోనే అతి ఎత్తైన కోట 'కుమ్భాల్ఘర్ కోట'. కోటపైకి కింది నించి ఎక్కాలంటే తాతలు దిగొస్తారు. అద్భుత శిల్పవిన్యాసంతో తీర్చిదిద్దబడిన కోట. పూర్తిగా వాస్తు ప్రకారం నిర్మించారు. కోటపైన నుంచుంటే మబ్బులు తలను తాకి వెడుతున్న అనుభూతి కలుగుతుంది. ఇక్కడి నుంచి చుట్టూ పరికిస్తే పరవశమే కలుగుతుంది. ఇంత ఎత్తుకు బిల్డింగ్ సామగ్రి ఎలా మోసుకు తెచ్చారనేది అంతుపట్టని మిస్టరి. ఈ కోటను ఎవరూ జయించనే లేదు. అందుకని దీనికి 'అజేయదుర్గం' (అన్‌కాన్కరబుల్ ఫోర్ట్) అనే పేరు సార్ధకమైంది. కోట గోడ 38 కిలోమీటర్ల పొడవు, 15 అడుగుల మందంతో అతిబలిష్టంగా ఉంటుంది. చైనాలోని 'గ్రేట్ వాల్' తర్వాత ప్రపంచంలో రెండవ గొప్ప గోడ ఇదే. కోటకు ఏడు రాజ ద్వారాలున్నాయి. కోటకు దక్షిణ ద్వారం అరేటోపోల్ ద్వారం నుంచి ప్రవేశిస్తారు. తర్వాత హల్లాపోల్ ద్వారం , పిమ్మట

హనుమాన్పోల్ ద్వారం, రాంపోల్, విజయ్పోల్ ద్వారాలు దాటి, భైరాన్పోల్, నింబూపోల్, పఘ్రూపోల్ ద్వారాలు దాటి లోనికి వెళ్ళాలి. తూర్పున 'దనివత్త' ద్వారం ఉన్నది. ఇది మేవార్‌ను మార్వార్‌ను కలిపేది.

హనుమాన్ ద్వారం-సర్వరక్షక హనుమాన్ విగ్రహం

హనుమాన్ ద్వారాన్ని కోట ముఖ్య గోడలో నిర్మించారు. ఇదే కోటలోని అన్ని ముఖ్య కేంద్రాలకు వెళ్ళటానికి దారి. ఇదే కుంభాల్ఘర్ కోటకు ముఖ్యమైన స్ట్రాటజిక్ పాయింట్. ఈ ద్వారం గురించి ఒక జానపద గాథ బాగా ప్రచారంలో ఉంది. కుంభరాణా ఈ కోట కట్టేటప్పుడు కోట గోడ కట్టింది కట్టినట్లు కూలిపోయేదట. చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పుడు ఒక జ్యోతిష్యుని రాణా సంప్రదించాడట. ఆయన కోటకోసం త్యాగం చేసే వ్యక్తిని బలి ఇవ్వాలి అని చెప్పాడట. రాజు చాటింపు వేయించాడు. ఎవ్వరూ తెగించి ముందుకు రాలేదట. ఒక రోజు అకస్మాత్తుగా ఒక వీరసైనికుడు ముందుకు వచ్చి సనాతన ధర్మప్రచారకుడు కుంభరాణా కట్టించే కోట పటిష్టత కోసం తన ప్రాణాలు అర్పిస్తానని చెప్పి ఆత్మ బలిదానం చేశాడు. ఈ ప్రదేశంలో కట్టిన ద్వారమే 'హనుమాన్పోల్'. ఈ గేటు దగ్గర రెండు ఆంజనేయ విగ్రహాలున్నాయి. ఒకటి 12 అడుగుల ఎత్తు విగ్రహం. రెండవది కోట గోడలోనే ప్రతిష్ఠితమైనది. ఈ రెండు విగ్రహాలను కుంభరాణా, మందావూర్ నుంచి తెప్పించాడు.

కుంభాల్ కోటలో శ్రీ హనుమంతుడు కోటను రక్షకుడు మాత్రమే కాదు, భారతీయ సనాతన ధర్మపరిరక్షకుడు కూడా. ఈ హనుమ ప్రత్యేకత ఒకటి ఉంది. స్వామి ఎడమ చేతిలో శివుని యుద్ధ ఆయుధమైన 'ఖట్వాంగం' ధరించి ఉంటాడు. దీనికి కారణం మేవార్ రాజ్యదైవం 'మేధాపటేశ్వార్' పేరున్న శివుడు కావచ్చు. ఈ ఆయుధాన్ని రాజు కుంభరాణాస్వామికి స్వయంగా సమర్పించాడు. స్వామి కుడిచేయి పైకెత్తి ఉంటుంది. అందులో ఏదో ఉంది. రెండు ముంజేతులకు కంకణాలుంటాయి. భుజాలకు కేయూరాలు, పాదాలకు నూపురాలతో సర్వాభరణ భూషితుడుగా ఈ సర్వరక్షక హనుమాన్ దర్శనమిస్తాడు. ఆయన వాలం కూడా గొప్ప ఆయుధమే కదా. ఈ వాలం చాలా పొడవుగా, తల వెనుక భాగం నుంచి కిందికి దిగి,

ఎడమవైపుకు వాలి ఉంటుంది. మెడలో పొడవైన రుద్రాక్షమాల మోకాళ్ళ వరకు వ్రేలాడుతూ కనిపిస్తుంది. ఎడమ పాదం కింద తొక్కిపట్టిన రాక్షసుని తల ఉంటుంది. స్వామి బలసామర్థ్యాలెట్టివో బలిష్టమైన పిక్కలు నిదర్శనంగా ఉంటాయి. ముఖంలో ప్రశాంతత ఉట్టిపడుతుంది, కనులలో కారుణ్యం తొణికిస లాడుతు భక్త వరదుదనిపిస్తాడు. ఇంతటి వర్చస్సుతో ఉన్న హనుమ విగ్రహం వేరెక్కడా కనిపించదు.

కుంభరాణా గొప్ప సంగీత ప్రియుడు, సంస్కృత కవి. 'సంగీతరాజం' అనే సంస్కృత గ్రంథం రచించాడు. జయదేవుని గీత గోవిందంకు 'రసికప్రియ' వ్యాఖ్యానం, సూదప్రబంధం, కామరాజ రతిసారం కూడా రాశాడు. ఖట్వాంగహస్తుడైన కుంభాల్కోట రక్షక హనుమాన్ను అందరూ కష్టపడి కోట ఎక్కి దర్శనం చేసి తరించాలి.❋

215) మాండవేయ హనుమాన్ దేవాలయం-దుంగార్పూర్

రాజస్థాన్‌లోని దుంగార్పూర్‌లో శ్రీ మాండవేయ హనుమాన్దేవాలయం పురాతన ప్రసిద్ధమైనది. పాతాళ లోకంలోని ఆహిరావణుడిని రామభక్త హనుమాన్ సంహరించి ఇక్కడ విశ్రమించాడు. కార్తీక పౌర్ణమినాడు 'అధ్మతీయ మహామేలా' నిర్వహిస్తారు. ఆ రోజు కనీసం 5 లక్షల మంది భక్త జనం స్వామిని సందర్శిస్తారు. ఆలయం సుందర శిల్ప కళాశోభితం.❋

216) శ్రీ భజరంగ్ దోరా దేవాలయం-బికనూర్

రాజస్థాన్‌లో బికనీర్లో ఉన్న భజరంగధోరా దేవాలయం సంస్కృతీకళ, పవిత్రత, సౌందర్యాలకు ప్రతీకగా ఉంటుంది. ఇకడే మన్సాపురాణ హనుమాన్ దేవాలయమూ ఉంది. ఇక్కడే అంజనాదేవికి వాయుదేవుని ప్రభావం వలన ఆంజనేయుడు జన్మించాడని స్థలపురాణం. దీనినే గ్రాద్యుయేట్మందిర్ అంటారు. డిగ్రీ పరీక్ష రాసే వారంతా ఈ హనుమాన్ను దర్శించి పరీక్ష రాస్తారు. ఇక వారికి ఢోకా ఉండదని నమ్మకం. కొబ్బరికాయలు ముడుపుగా కడతారు. శివుడు హనుమను ఆశీర్వదించాడు. సూర్యుని వద్ద నవ వ్యాకరణాలు నేర్చి గురుదక్షిణ ఏమి ఇవ్వమని అడిగితే ఆయన వద్దన్నాడు. చివరికి బ్రతిమలాడితే సుగ్రీవుని మంత్రిగా సేవ చేయమని చెప్పాడు. ఆలయంలో శ్రీరామదర్బార్, శ్రీదుర్గామాత, శివాలయాలున్నాయి. ఆలయ ప్రవేశద్వారం చాలా పెద్దది చాలా ఎత్తుగా ఉంటుంది. ప్రాచీన వాస్తు పద్ధతిలో కట్టిన ఆలయం. ఆలయ గోపురం ఆకాశాన్ని తాకుతోందాన్నట్లు ఉంటుంది. స్వామిని సంకటమోచన్ అని పిలుస్తారు. రాజస్థాన్ జైపూర్లో సమోద్వీర హనుమాన్దేవాలయం పురాతనమైనది.❋

217) శ్రీ నవఖండీయ హనుమాన్ దేవాలయం-పుష్కర్-అజ్మీర్-రాజస్థాన్

రాజస్థాన్ అజ్మీర్లోని పుష్కర్లో నవఖండీయ హనుమాన్దేవాలయం పురాతన ప్రసిద్ధి పొందింది. ఎడమ చేతిలో గద, కుడి చేయి అభయహస్తంగా స్వామి ఉంటాడు. శిరసుపై కిరీటం ఉంటుంది. ప్రక్కనే వినాయక విగ్రహం, శివపార్వతులు, సీతారామలక్ష్మణులు ఉంటారు. హనుమాన్చాలీసా గోడలపై చెక్కబడి ఉంటుంది. నిత్య పారాయణ జరుగుతుంది.❋



218) శ్రీ ఖోలేకే హనుమాన్ మందిర్-జైపూర్

రాజస్థాన్ జైపూర్లో ఖోలేకే హనుమాన్మందిరం ప్రాచీనమైనది. సగం ఎగురుతున్న భంగిమలో ఉన్న విగ్రహం. మంచి రమణీయ ప్రకృతి మధ్య ఉన్న దేవాలయం. విశ్రాంతి మందిరాలు, భోజనశాలలు మూడుఅంతస్తులతో 22 వంట గదులున్న విశాలమైన దేవాలయం. సమావేశాలు భక్తిగోస్టులు నిర్వహించటానికి చాలా అనువుగా ఉంటుంది. క్రింద కూర్చుని కాని, టేబుళ్ళపైన కాని భోజనాలు చేయచ్చు. దీన్ని 'సావామణి' అంటారు. రోజుకు 50 కిలోలు వండుతారు. భోజనంలో బాతి అనే వెరైటీలో రెండు రకాలు, చూర్మాలో రెండు రకాలు, కాది, దాల్, మిర్చి ఊరగాయ, కిచిడి, రైస్ పలావ్, అప్పడం రకాలతో భోజన ప్రసాదం. స్వచ్ఛమైన దేశీయ ఆవునేతితో వండుతారు. అడ్వాన్సా 'సావామణి' బుక్చేసుకొంటే దేవాలయమే వండటం దగ్గర నుంచి వడ్డించటం దాకా అన్నీ ఏర్పాటుచేస్తుంది. జైపూర్ రైల్వేస్టేషనుకు 11 కిలోమీటర్లలో లక్ష్మణ్ డింగ్రీలో చిన్నకొండపై ఖోలేకే హనుమాన్మందిరం ఉన్నది. చుట్టూ ఆరావళి పర్వతాలు కనువిందు చేస్తాయి. పవిత్రత, పరిశుభ్రత ఉన్న ప్రాంతం. భక్తుల కోర్కెలు వెంటనే తీరుస్తాడు ఖోలేకే హనుమాన్.❋



219) శ్రీ అంజని మాత దేవాలయం-కరౌలి

రాజస్థాన్‌లో అంజనీదేవి ఖాదీయ యదు వంశరాజుల కులదేవత. కైలామాత మరో రూపమమైన ఈ దేవతను తర తరాలుగా పూజిస్తున్నారు. అర్జున దేవమహారాజు ఈ ఆలయాన్ని కొండపై నిర్మించాడు. ఈ వంశరాజులు శ్రీకృష్ణుని వారసులమని చెప్పుకొంటారు. 1343లో అర్జున దేవరాజు కొండపై అంజనిమాత దేవాలయాన్ని, కొండ క్రింద ఆంజనేయ దేవాలయం కట్టించాడు. అంటే తల్లి అంజనాదేవి పాదాల వద్ద కుమారుడు హనుమంతుడు ఉన్నట్లుగా భావన. మంగళ, శనివారాలలో నవరాత్రులలో విశేషపూజలలో అశేష భక్త జనం పాల్గొంటారు కరౌలీ బ్రాహ్మణులు పూజారులు. కొండ ప్రక్కన పంచన నదిలో స్నానంచేసి అంజనీమాతను అంజనీపుత్రుని దర్శించి అనుగ్రహం పొందుతారు.❋



220) శ్రీ భజరంగబలి దేవాలయం-భిల్వారా

రాజస్థాన్ భిల్వారాలో శ్రీ భజరంగబలి దేవాలయం గొప్పగా ఉంటుంది. విశాలమైన ప్రాంగణం. స్వామి పూర్తిగా వెండి ఆభరణాలతో మునిగిపోయి అపురూపంగా విచిత్రంగా అనిపిస్తాడు. పాలరాతి సీతా రామలక్ష్మణ విగ్రహాలు ముచ్చటగా ఉంటాయి. పురాతనాలయం. శిల్పశోభ బాగుంటుంది. నిత్య పూజా భజన చాలీసా పారాయణలతో ఆలయం ప్రతిధ్వనిస్తుంది.❋

మరికొన్ని హనుమాన్ దేవాలయాలు

❋ హనుమాన్ మందిరం: మౌంట్ అబూకు 1.5 కిలోమీటర్ల దూరంలో పది అడుగుల ఎత్తులో హనుమాన్ మందిరం నిర్మించారు. హనుమంతుడు తన భుజాలపై రామ, లక్ష్మణులను ఎత్తుకుని వెళ్తున్నట్లుగా ఉంటుంది.

❋ దేసూరి దేసూరి, రాణాక్పూర్‌కు 25 కి.మీ. దూరంలో ఉంటుంది. ఈ గ్రామంలో హనుమాన్ దేవాలయాలు

❋ వేది దేవాలయం ఇదొక జైన దేవాలయం. దీన్ని రాణా కుంభ రాజు నిర్మించాడు. కుంభాల్ ఘర్ కోటలోని హనుమాన్ పోల్ సమీపంలో ఈ ఆలయం కలదు. ఆలయంలో జైన తీర్థాంకరుల విగ్రహాలు ఉంటాయి.

❋ రాజస్థాన్ జైపూర్ దగ్గర హరోట గ్రామ సమీపంలో చోములో అంజనీమాత ఒడిలో కూర్చున్న బాల హనుమాన్దేవాలయమున్నది.

పంజాబ్

221) సిద్ధ శ్రీ హనుమాన్ దేవాలయం- ఫజిల్కాబాద్

పంజాబ్‌జిల్లా కాబాద్‌లో సిద్ధ శ్రీ హనుమాన్దేవాలయమున్నది. విశాలమైన ప్రాంగణంలో పాలరాతి శ్రీ ఆంజనేయ విగ్రహం ఆకర్షణీయం కోరిన కోర్కెలను సిద్ధింపజేస్తాడు కనుక ఆ పేరు వచ్చింది.

వంజాబ్‌లో విల్లౌరాలో కూడా హనుమాన్దేవాలయమున్నది. విగ్రహం నిలువెత్తు పాలరాతి విగ్రహం. దేవాలయం బయట మరో 67 అడుగుల పెద్ద గండర గండ శ్రీ సంకట మోచన్ ఆంజనేయస్వామి విగ్రహం కూడా ఉంది. ఇది ఆసియాలో ఎత్తైన విగ్రహం అని ఇక్కడి వారంటారు.❋



హర్యానా

222) శ్రీ కపిస్థల హనుమాన్మందిర్-కైథాల్

హర్యానాలో కైథాల్లో కపి స్థలం ఉంది. అంటే వానర ఆవాసం అన్నమాట. మహాభారత కాలంలో పాండవ చక్రవర్తి యుధిష్టిరుడు దీన్ని కనిపెట్టాడు. కపులు ఉండే ప్రదేశం కనుక కపి నాయకుడైన ఆంజనేయస్వామి దేవాలయం ఇక్కడ ఉన్నది. ఆయనతోపాటు ఆయన జనని అంజనాదేవి కూడా ఉంది. ఇక్కడే అంజనాదేవికి ఆంజనేయుడు జన్మించాడని స్థానిక కథనం. అందుకనే కథల్లో 'అంజనితిల'లో ఆ గుర్తుగా శ్రీ ఆంజనేయ దేవాలయం నిర్మించారు.❋

223) భారీ ప్రసాద వితరణ చేసే హనుమాన్ మందిర్-నగోరి గేట్

హర్యానా హిస్సార్‌లోని గోరీగేట్లో ఉన్న శ్రీ ఆంజనేయ దేవాలయంలో నిత్యం 151 మంది భక్తులు ఉదయం 11 గంటల వరకు రామాయణ పారాయణ చేయటం విశేషం. సీతారామ లక్ష్మణ విగ్రహాలు శివమందిరం కూడా ఈ విశాలాలయంలో ఉన్నాయి. దీపావళినాడు అనేక రకాలైన స్వీట్లు భారీగా తయారుచేసి నైవేద్యం పెట్టి ప్రసాదంగా భక్తులకు అందజేస్తారు.❋

224) శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం- యమునానగర్

700 సంవత్సరాల చరిత్ర ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయం శ్రీ జానకీదాస్ మహరాజ్ గారి సంకల్పం వలన నిర్మించబడింది. హర్యానా యమునానగర్‌లో ఆలయం ఉన్నది. ఈ హనుమాన్ ఆయన కలలో కన్పించి అక్కడే ఉన్న చెట్టు కింద తన విగ్రహం ప్రతిష్ట చేయమని కోరాడు. జానకీదాస్ అనే కతీర్థాల నుంచి మట్టి తెప్పించి స్వామిని ఇక్కడ ప్రతిష్టించాడు. క్రమంగా దేవాలయం నిర్మింపబడి నిత్య పూజాదికాలు ప్రారంభమయ్యాయి. ఈ స్వామిని దర్శించిన వారి కోరికలు నెరవేరుతాయి. ఇక్కడే రామదర్బార్, యాగశాల, గోశాల కూడా ఉన్నాయి.*

ఢిల్లీ

225) గిన్నీస్ బుక్ ఎక్కిన శ్రీ బాలహనుమాన్ మందిరం- కన్నాట్ సర్కస్-ఢిల్లీ

బహుప్రాచీనమైన, మహాభారతంతో సంబంధమున్న 5 శ్రీ బాల హనుమాన్దేవాలయలలో ఢిల్లీలో ఉన్న దేవాలయం రికార్డ్ సృష్టించింది. ఇక్కడ 1964 ఆగస్ట్ 1 నుంచి 24 గంటలూ నాన్‌స్టాప్‌గా నిరంతరం పగలూ, రాత్రీ శ్రీ రామమంత్రం శ్రీ రామ మంత్రం 'శ్రీరామ జయరామ జయ జయ రామ అఖండ రామ నామ సంకీర్తన జరుగుతోంది. గిన్నీస్‌బుక్ వాళ్ళు వచ్చి స్వయంగా చూసి ఈ విషయాన్ని నమోదు చేసి గొప్ప ప్రాభవాన్ని కలిగించారు. మండపంలోని పైకప్పు అంతా రామాయణ గాథలు, తులసీ

రామయణ విశేషాలు హనుమంతుని దిగ్విజయ గాథలు కనిపిస్తాయి. కురుక్షేత్ర యుద్ధ విజయానంతరం పాండవులు ఈ దేవాలయాన్ని ప్రతిష్టించారు. దీన్ని మహారాజ జైసింగ్ 1724లో నిర్మించాడు. సంత్ తులసీ దాసు కూడా రామాయణ చాలీసా రాస్తూ శ్రీ బాలహనుమాన్ను దర్శించాడు. మొఘల్ చక్రవర్తి అక్బర్ కూడా ఈ ఆలయాన్ని సందర్శించాడు.

1532-1623 కాలం వాడైన, రామచరిత మానస్రచించిన భక్త తులసీదాస్ హనుమాన్ చాలీసా రాస్తూ అక్బర్ చక్రవర్తి ఆహ్వానం మేరకు ఢిల్లీ వచ్చి, తులసీదాస్ను ఏదైనా అద్భుతం చేయమని కోరగా శ్రీ బాలహనుమాన్ ఆశీర్వాదంతో చేసి, చక్రవర్తిని మెప్పించాడు. సంతోషించిన అక్బర్ ఈ బాలహను మాన్దేవాలయాన్ని తులసీదాసుకు శిఖరంపై ఉన్న ముస్లిం చిహ్నమైన చంద్రరేఖతో సహా కానుకగా ఇచ్చాడు. శిఖరంపై ఈ ముస్లిం చిహ్నం ఉండటంతో అప్పటి నుంచి, విదేశాల నుంచి ఇండియాపై దండయాత్ర కొచ్చిన ఏ ముస్లిం రాజు ఈ దేవాలయాన్ని ధ్వంసం చేయలేదు.❋

ఉత్తర ప్రదేశ్

226) శ్రీ పంకీ హనుమాన్ దేవాలయం-కాన్పూర్

ఉత్తరప్రదేశ్లోని కాన్పూర్లో భాగమైన పంకిలో ఉన్న హనుమాన్ దేవాలయం వేలాది భక్తులను ఆకర్షిస్తుంది. చాలా ఎత్తు మీద ఉన్న ఈ ఆలయంకు వెళ్ళాలంటే కష్టపడి వెళ్ళాల్సిందే. ప్రస్తుతం పెద్ద పెద్ద కుంభాలతో

భారీ నగిషీలతో ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఆలయానికి సుమారు 400 ఏళ్ళకు పైగా చరిత్ర ఉంది. మహాంత్ శ్రీ శ్రీ 1008 పురుషోత్తం దాస్ మహారాజ్ ఈ ఆలయాన్ని మొదట గుర్తించారు. కనాపూర్‌గా పిలువబడే నేటి కాన్పూర్ పట్టణ నిర్మాణాన్ని ప్రారంభించిన రాజా హిందూసింగ్ కాలం కంటే పూర్వపు ఆలయం ఇది. ఒకప్పుడు పురుషోత్తం మహారాజ్ గారు చిత్ర కూటంలో పర్యటిస్తూ ఇటువైపువచ్చి ఇక్కడ ఒక రాయికి కాలు తగిలి తూలీ పడబోయారు. తీరా చూస్తే అది శ్రీ ఆంజనేయస్వామి. స్వామి మహిమగా దీన్ని భావించి తనతోబాటు ఆ విగ్రహాన్ని తీసుకువెళ్ళే ప్రయత్నం చేశారు. బండి మీద ఎక్కించి తీసుకోస్తుండగా ఈ ప్రాంతానికి రాగానే ఎడ్లకు విగ్రహం బాగా బరువనిపించి అడుగులు నెమ్మదిగా వేస్తున్నాయి. గ్రహించిన మహంత్ ఆ రాత్రికి అక్కడ విశ్రమించారు. మహంత్‌కు ఆంజనేయ స్వామి దివ్యలీల అని తెలిసి స్వామికి ఇక్కడే ప్రతిష్ట చేయటం ఇష్టమని అర్ధం చేసుకొని అందరి సహాయంతో విగ్రహాన్ని బండి మీద నుంచి అక్కడే ప్రతిష్ట చేశారు మహంత్. ఈ ప్రదేశమే పంకి. ఇది బితూర్‌లోని వాల్మీకి ఆశ్రమానికి దగ్గరలోనే ఉంది.

భక్తులు ఈ హనుమాన్‌నే పూజించేవారు. కాలక్రమంలో చిన్న దేవాలయం ఏర్పడింది. ఇదే పంకి హనుమాలయం. ఇప్పుడు చాలా ప్రసిద్ధ ఆలయంగా పేరు పొందింది. స్వామికి నివేదించుకొన్న కోర్కెలన్నీ తీరుతాయి అనే భావం బలపడింది. క్రమేపీ దేశంలోని భక్తులంతా పంకి హనుమాన్‌ను దర్శించి తమ పాప పంకిలాన్ని దూరం చేసుకొంటున్నారు. ఉత్తర భారతదేశంలో ఈ ఆలయానికి ఒక విశిష్ట స్థానమేర్పడింది. ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వచ్చింది. గన్ ఫాక్టరీ కూడా రావటంతో పంకి వైభవం అనేక రెట్లు పెరిగింది.❋

227) శ్రీ ఆంజనేయ దేవాలయం-నైమిశారణ్యం

నైమిశారణ్య విశేషాలు

'నిమి' అంటే రథ చక్రపు 'సీల'. విష్ణుమూర్తి రథచక్రం సీల జారి పడిన అరణ్య ప్రదేశాన్ని నైమిశారణ్యం అంటారు. ఒకప్పుడు ఇక్కడ మహర్షులు అనేక యాగాలు యజ్ఞాలు క్రతువులు నిర్వహించేవారు. అప్పుడు సుమారు 88 వేల మంది మహర్షులు ఉండేవారట. ఇక్కడే శౌనకాది మహర్షులకు సూతమహర్షి భారతం మొదలైన పురాణాలను వివరించి చెప్పాడు. అంటే ధార్మిక ప్రసంగాలకు, యజ్ఞ యాగాలకు ఇది నెలవుగా ఉండేది. వ్యాసమహర్షి మహాభారత రచన ఇక్కడే చేశాడు. ఆయన ఆవాస భూమి ఇదే. ఇక్కడే వేద విభజన చేశాడు. నైమిశారణ్యంలో 'కలి దేవత'కు ప్రవేశార్హత లేదు. ఇప్పటికీ దేశం నలుమూలల నుండి నైమిశారణ్యం చేరి అక్కడ శాంతి యాగాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు విష్ణు సహస్రనామ లలితా సహస్రనామ పారాయణాలు భాగవత సప్తాహాలు చేస్తున్నారు మనవాళ్ళు. ఇది ఉత్తరప్రదేశ్‌లో పాంచాల కోసల రాజ్యాల మధ్య గంగానది ఉపనది అయిన గోమతీ నదీ తీరాన ఉంది. రామాయణంలోనూ దీని ప్రసక్తి ఉంది. కుశలవులకు వాల్మీకి మహర్షి రామాయణ గాథను నేర్పింది ఇక్కడే. ఇవాళ ఉత్తరప్రదేశ్‌లో సీతాపూర్ జిల్లాలో లక్నో నగరానికి ఎనభై కిలో మీటర్ల దూరంలో నైమిశారణ్యం ఉన్నది. ఇక్కడి 'చక్ర తీర్థం' చాలా పవిత్రమైనది. అనిమిషుల ఆవాస క్షేత్రం కనుక నిమిషం అనే పేరు వచ్చింది. విష్ణుమూర్తికి 'అని మిషుడు' అనే పేరుంది కనుక విష్ణుమూర్తి ఆవాసభూమి నైమిషం. చక్రము యొక్క నిమి పడిన

ప్రదేశమే చక్ర తీర్థం. నైమిశారణ్యం చుట్టూ పదహారు దివ్య క్షేత్రాలున్నాయి. అన్నీ దర్శనీయాలే. దీనికి 'అష్టమ వైకుంఠం' అని పేరు. 33 కోట్ల దేవతలు, 88 వేలమంది మహర్షులుతో మూడున్నర కోట్ల దేవాలయాలతో దివ్య భవ్య భూమిగా వెలసిల్లిన క్షేత్రం.

ఇక్కడే విష్ణువు దుర్జయుడు అనే రాక్షసుడిని చక్రాయుధంతో సంహరించాడు. ఇక్కడే దధీచి మహర్షి తన దేహాన్ని త్యాగం చేసి తన వెన్నెముకతో ఇంద్రుని వజ్రాయుధం తయారు కావటానికి సహకరించాడు. ఈ వజ్రాయుధంతో ఇంద్రుడు వృత్రాసుర వధ చేశాడు. ఇక్కడే విష్ణుమూర్తి గయా సురుడిని చంపి అతని శరీరాన్ని సుదర్శన చక్రంతో మూడు భాగాలుగా ఖండించాడు. ఒక భాగం పాద గయ అనబడే గయా క్షేత్రంలో, రెండవ భాగం నైమిశారణ్యంలోని నాభి గయలో మూడవ భాగం బదరీ క్షేత్రంలోని కపాలి గయలో పడేట్లు చేసి సార్ధకత చేకూర్చాడు.

బ్రహ్మదేవుని మనోమయ చక్రం భూమిని తాకిన ప్రదేశంలో చక్రతీర్థం ఏర్పడిందని అంటారు. ఇక్కడే స్వయంభువ మనువు, సత్రప మనువు 23,000 సంవత్సరాలు యజ్ఞ యాగాలు చేశారు. నారాయణుడు తమ కుమారుడిగా జన్మించాలనే కోరిక వారికి ఇక్కడే కలిగింది.

హనుమాన్ గఢి

రామలక్ష్మణులను అహిరావణుడు ఎత్తుకు పోయి పాతాళ లోకంలో దాచేశాడు. హనుమంతుడు ఉపాయంగా పాతాళానికి చేరి ఆహిని చంపి సోదరులిద్దరినీ భుజాలపైకి ఎక్కించుకొని పాతాళం నుంచి బయటికి వచ్చిన ప్రదేశమే నైమిశారణ్యం. స్వామి దక్షిణాభి ముఖంగా కనిపిస్తాడు. అందుకే దీన్ని 'దక్షిణేశ్వర హనుమాన్ దేవాలయం' అంటారు. హనుమ కుమారుడు మకరధ్వజుడు కూడా విగ్రహ రూపంలో దర్శనమిస్తాడు. సీతాసాధ్వి తన కుమారులు లవ కుశులను భర్త శ్రీరామునికి అప్పగించి తల్లి భూదేవిలో ఇక్కడే కలిసిపోయింది.

వ్యాస గద్దే, సీతా కుండం హవాన్ కుండ్, పాండవ ఖిలా, లలితాదేవి దేవాలయం ఇక్కడ అదనపు ఆకర్షణలు. జీవితంలో ఒకసారైనా నైమిశారణ్యం వెళ్లి చక్రతీర్థ స్నానం చేసి హనుమాన్‌ను సందర్శించి ధన్యులం కావాలి.❋

228) 90 అడుగుల విరాట్ హనుమాన్-కిరాతపురం

ఉత్తరప్రదేశ్ బిజ్నూర్ జిల్లా కిరాతపురంలో ఉన్న హనుమాన్ధాంలో 90 అడుగుల భారీ శ్రీ ఆంజనేయ విగ్రహం ఉంది. లక్నోకు నాలుగు వందలు, ఢిల్లీకి 160 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నది. 22-4-1997న విగ్రహావిష్కరణ జరిగింది.❋

229) బిజేతువా మహావీర్ హనుమాన్ దేవాలయం-సుల్తాన్పూర్

ఉత్తరప్రదేశ్ సుల్తాన్పూర్ జిల్లా సూరాపూర్లో బిజేతువా మహావీర హనుమాన్ దేవాలయం పురాతనమైనది. మంగళ, శనివారాలలో విపరీతమైన రద్దీగా ఉంటుంది. ఆలయానికి త్రేతా యుగంతో సంబంధం ఉంది. హనుమంతుడు సంజీవి పర్వతం తీసుకురావటానికి వెడుతూ ఉంటే, రావణుడు ఆయన దృష్టి మరల్చటానికి కాలనేమి అనే రాక్షసుడిని పంపిస్తాడు. వాడు ఇక్కడ తపస్సు చేసుకొనే మునివేషంలో ఉంటాడు. ఇక్కడున్న మకరికుండంలో స్నానం చేస్తుండగా అక్కడున్న సాలీడు హనుమకు వాడు ముని కాదని, రావణుడి నమ్మినబంటు కాలనేమి రాక్షసుడని చెప్పింది. విషయం గ్రహించిన హనుమ కాలనేమిని చంపి విశ్రాంతి తీసుకొని, సంజీవనీ పర్వతం తెచ్చి లక్ష్మణుని ప్రాణరక్షణ చేశాడు. ఈ ఆలయంలో లెక్కలేనన్ని గంటలు ఉండటం మరో విశేషం.❋

230) లడ్డూ తింటున్న హనుమాన్ మందిర్-ఈతావా

సజీవ హనుమాన్‌గా భావింపబడే శ్రీ ఆంజనేయ దేవాలయం ఉత్తరప్రదేశ్ ఈతావాలో ఉన్నది. యమునా నది ఒడ్డున సిటీకి 8 కిలోమీటర్లలో ఆలయం ఉన్నది. ఆలయపూజారి కథనం ప్రకారం ఇది ద్వారయుగానికి చెందిన ఆలయం. ఇక్కడి హనుమాన్ విగ్రహ విషయం ప్రతాపగర్ రాజు హుకుందేవ్‌కు భక్తతులసీదాసు చెప్పగా ఆయన విగ్రహాన్ని తన రాజధానికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తే ఆయన కదలనని భీష్మించి, గట్టిగా తీసుకు వెళ్ళాలనులనుకొంటే తన ఆకలి తీర్చమన్నాడట. సరే అని రాజు పట్టణంలోని పాలు అన్నీ నైవేద్యం పెట్టించాడు. ఆకలి తీర లేదు. రాణి వచ్చి క్షమించమని చెంపలేసుకొని కొద్దిగా పాలు తెప్పించి నైవేద్యం పెట్టించగా సంతృప్తి చెందాడు. ఈ హనుమ 'పీలువా మహావీర్' అని పిలువబడుతాడు. ఇంతకంటే మరో అత్యంత ఆశ్చర్యమైన విషయం హనుమాన్ మూతికి సంబంధించినది. ఎవరు లడ్డూప్రసాదం తెచ్చి మూతికి అందించినా ఆయన హాయిగా మన 'మంగళగిరి పానకాల స్వామిలాగా' ఆరగిస్తాడు. ఇలా తర తరాలుగా జరుగుతోంది. ప్రతి మంగళవారం తెల్లవారుఝామున నుంచి భక్తులు లడ్డూలతో క్యూలో ఉంటారు. ఇలాంటి సజీవ సంజీవరాయుడు ప్రపంచంలో ఇంకెక్కడా లేదు.❋

231) శ్రీ హనుమాన్ ధాం-షామ్లి

ఉత్తరప్రదేశ్ హనుమాన్ తిలా రోడ్ షామ్లిలో శ్రీ హనుమాన్ ధాం ఉన్నది. విశాల ప్రాంగణంలో ఉన్న అందమైన దేవాలయం. గోస్వామి తులసీ దాసు తరచూ సందర్శించిన ఆలయం.

ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో ప్రాచీన లంగర్కిచౌకిలో అందమైన మార్బుల్ హనుమాన్ విగ్రహం, దేవాలయం కనువిందు చేస్తాయి.❋



ఉత్తరాఖండ్

232) 52 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి-నౌకుచింతల్

ఉత్తరాఖండ్ నైనిటాల్ జిల్లాలోని నౌకుచింతల్‌లో 'తొమ్మిది మూలల సరోవరం' చూపరులను బాగా ఆకర్షిస్తుంది. నైనిటాల్‌లోని అన్ని సరస్సుల కంటే చాలా లోతైనది. 983 మీటర్ల పొడవు, 693 మీటర్ల వెడల్పు ఉంటుంది. చుట్టూ అందమైన లోయ ఉండటంతో అందం రెట్టింపై 'నైన్ కార్నర్ లేక్' అనే పేరొచ్చింది. గొప్ప టూరిస్ట్ స్పాట్. ఉష్ణోగ్రత ఎప్పుడూ 11 సెంటిగ్రేడ్ నుంచి -2 డిగ్రీల వరకు ఉంటుంది. మార్చి నుంచి నవంబర్ వరకు చూడటానికి బాగా ఉంటుంది.

నౌకుచింతల్ మెయిన్‌రోడ్ మీదనే 52 అడుగుల పొడవైన భారీ శ్రీ ఆంజనేయ విగ్రహం విశేషంగా ఆకర్షిస్తుంది. ఎత్తైన పర్వతాలు, లోతైన లోయలు కనువిందు చేస్తాయి. స్వామికి కృత్రిమ గుహను వైష్ణవదేవి మందిరం మోడల్లో ఏర్పాటు చేయబడింది. హనుమ పాదాల వద్ద ముఖ్య దేవాలయంలో మూడు చిన్న చిన్న దేవాలయాలున్నాయి. ఇక్కడ భక్తులు విశ్రమిస్తారు. రామదర్బార్, శని దేవాలయాలు నిర్మాణంలో ఉన్నాయి.

నౌకూచియాతల్‌కు 19 కిలోమీటర్ల దూరంలో సప్త సరోవరాలున్నాయి. ఇవి సముద్రమట్టానికి 1370 అడుగుల ఎత్తులో ఉంటాయి. వలస పక్షులకు ఇవి స్వర్గధామంగా ఉంటాయి.❋

233) శ్రీ హనుమాన్ ఘరి-నైనిటాల్

ఉత్తరాఖండ్ నైనిటాల్‌లో శ్రీహనుమాన్ ఘరి దేవాలయం చాలా ప్రసిద్ధమైంది. నీంకరోలి బాబా తరచుగా సందర్శించిన దేవాలయమిది. సముద్ర మట్టానికి 6,401 అడుగుల ఎత్తున ఉన్న దేవాలయం. తాలితల్ బస్‌స్టాండ్‌కు మూడున్నర కిలోమీటర్ల దూరం. ఇక్కడి హనుమంతుడు తన హృదయం చీల్చి హృదయంలో శ్రీరాముడు, సీతాదేవి కొలువై ఉన్నట్లుగా చూపించే దృశ్యమానంగా గోచరించటం విశేషం. ఆలయం నుంచి అస్తమయ సూర్యుడిని చూడటం ఒక అపూర్వ దివ్యానుభూతి.❋

234) శ్రీ హనుమాన్ ధాం-రాంనగర్

ఉత్తరాఖండ్ నైనిటాల్జిల్లా రామనగర్లో జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ సమీపంలో శ్రీ హనుమాన్ ధామ్ ఉంది. దీన్ని అంజని గ్రామం అని పిలుస్తారు. చిన్నకొండపై ఆలయం ఉంటుంది. మెట్లు ఎక్కి వెళ్ళాలి. విశాల ప్రాంగణంలో పాలరాతి శ్రీ హనుమ విగ్రహం చూపరులను యిట్టె ఆకర్షిస్తుంది.❋

235) శ్రీ సిద్ధబలి హనుమాన్ మందిర్-కోట్ ద్వార్

ఉత్తరాఖండ్‌లో నది ఒడ్డున కోట్‌ద్వార్‌లో సిద్ధబలి ఆంజనేయ దేవాలయం 'బాబా సిద్ధబలి హనుమాన్మందిర్'గా ప్రసిద్ధమైంది. చిన్నకొండపై అందమైన ప్రకృతిలో ఆలయం ప్రశాంతతకు నిలయంగా ఉంటుంది. స్వామి స్వయంభుగా భావిస్తారు. ఇది మంచి పిక్నిక్ స్పాట్ కూడా. సర్వాలంకారశోభితుడుగా హనుమ దర్శనమిస్తాడు. గద్వాల్ పర్వతాలలో అత్యంత సుందరాలయమిది. కోట్‌ద్వార్‌లోనే దుర్గాదేవి రహస్య దేవాలయం ఉన్నది. ఈ గుడిలో అర్ధరాత్రి శివపార్వతులు సంభాషించు కొంటారట. అందుకని మిస్టీరియన్ దేవాలయం అంటారు.❋

హిమాచలప్రదేశ్

236) సంజీవి పర్వతంతో కాలు మోపిన శ్రీ ఆంజనేయాలయం-కసౌలి

కసౌలి టవున్ బస్టాండ్ నుండి 4 కి.మీ.ల దూరంలో అత్యధిక ఎత్తులో మంకీ పాయింట్ కలదు. ఈ ప్రదేశం నుండి సట్లేజ్ నది, హన్దిగర్ మరియు మంచుతో నిండిన హిమాలయ దిగువ ప్రాంత చూర్చంద్‌ని శిఖరం వంటివి చక్కగా చూడవచ్చు. శిఖరంపైకల దేవాలయంలో హనుమంతుడి విగ్రహం వుంటూ అనేకమంది పర్యాటకులను ఈ ప్రదేశానికి ఆకర్షిస్తుంది. ఈ దైవం పేరుతో దీనిని మంకీ పాయింట్ అన్నారు. హిందూ పురాణాల మేరకు హనుమంతుడు తాను ఔషధాలతో కూడిన సంజీవని పర్వతాన్ని

మోసుకు వస్తూ ఈ పర్వతంపై కాలు మోపాడు. ఈ కొండ ఆకారం ఆ దైవం పాదం ఆకారంలో వుంటుంది. ఈ మంకీ పాయింట్ ప్రదేశం అంతా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధీనంలో వుంటుంది. టూరిస్టులు అక్కడి అధికారుల అనుమతులు తీసుకొని సందర్శించాలి. కెమెరాలు అనుమతించబడవు. మాల్రోడ్ నుండి సుమారు రెండు గంటలు నడక వుంటుంది. లేదా కారులో వెళ్ళాలి.❋

బీహార్

237) శ్రీ సంకట మోచన్ హనుమాన్ దేవాలయం-గయ

బీహార్‌లోని ప్రసిద్ధ యాత్రాస్థలం గయలో శ్రీ ఆంజనేయ దేవాలయాలు చాలా ఉన్నాయి. అందులో కొన్ని ముఖ్యమైన వాటిని గురించి తెలుసుకొందాం. అందులో మొదటగా చెప్పదగినది మహావీర్ మందిరంలోని సంకట మోచన్ హనుమాన్. దీనినే హనుమాన్ మందిర్ అంటారు. ఎప్పుడూ భక్తుల రద్దీతో ఆలయం ఉంటుంది. మహావీర మందిరం అతి పురాతనమైనది. అలాగే హనుమాన్ మందిరం కూడా. మంగళ, శనివారాలలో భక్తుల సంఖ్య అసంఖ్యాకంగా ఉంటుంది. శ్రీరామ నవమినాడు మహావీర్, సంకట మోచన్ హనుమాన్‌లను దర్శించే క్యూ కనీసం కిలోమీటర్ పొడవు ఉంటుంది.❋

238) శ్రీ శ్రీ 1008 శ్రీ రామభక్త మహావీర బాలాజీ దేవాలయం-కరారియా

బీహార్‌లో బంకాజిల్లాలో కరారియా గ్రామంలో శ్రీ శ్రీ 1008 శ్రీ రామభక్త మహావీర బాలాజీ దేవాలయం ఉన్నది. ఇక్కడ బాలాజీ అంటే తిరుమల వెంకన్న కాదు 'బాలహనుమాన్' అని అర్థం. బీహార్ అంతటా బాలహనుమాన్‌ను బాగా పూజిస్తారు. బంకా, భాగల్పూర్ ముంఘేరి జిల్లాల నుంచి విశేష సంఖ్యలో హనుమ భక్తులు వచ్చి సందర్శిస్తారు. దీనికి 'భజరంగ చౌకీ' అనే పేరు ఉంది. దక్షిణ బీహార్లో ఈ అలయానికున్న ప్రసిద్ధి ఏ హనుమాలయానికీ లేదు. ఈ దేవాలయ మొదటి మహంత్ శ్రీమతి సావిత్రీదేవి. ఇప్పుడున్న మహంత్సోర్జ్ చాలా స్ట్రిక్ట్. శాకాహారి. ఎప్పుడూ పవిత్ర గ్రంథాలు పఠిస్తూ ఉంటాడు. ఆయనకు పాన్ షాప్, టీ దుకాణం మాత్రమే ఆదాయం. ఈ ఆలయం బహుసుందరంగా ఉంటుంది. పార్వతీమాత , శివుడు, గణేశుడు కొలువై ఉంటారు. ఇక్కడి వృషభ మందిరం చూడ ముచ్చటగా ఉంటుంది. గాలి ధూళి సోకిన వారు వ్యాధిగ్రస్తులు ఇక్కడ ఆవునెయ్యి దీపారాధన చేసి స్వామిని దర్శిస్తే చాలు అన్నీ నయమైపోతాయని గొప్ప నమ్మకం. మంగళ, శనివారాలలో రద్దీ ఎక్కువ. దీనికి సమీపంలో శీతల్మాత, కాళీమాత, దుర్గామాత దేవాలయాలున్నాయి. ఇక్కడి జఖ్రాజ్ బాబా, నర్సింగ్ బాబా పాలెస్‌లు తప్పక చూడాలి. బీహార్లోకరౌలిజిల్లా కర్తారియాలో అతి ప్రసిద్ధి చెందిన మహాశక్తి స్వరూపిణి శ్రీ దుర్గాదేవి ఆలయం దీనికి దగ్గరే. బంకా రైల్వేస్టేషన్‌కు హనుమాన్మందిరం 35 కిలోమీటర్లు.❋

ఝార్ఖండ్

239) శ్రీ గుహాంజనేయ దేవాలయం-తపోవనం

ఝార్ఖండ్లో శ్రీ వైద్యనాథ జ్యోతిర్లింగ దేవాలయం చాలా ప్రసిద్ధమైనది. దీనికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'శ్రీవాసుకినాథ శివ దేవాలయం' సందర్శిస్తే కాని యాత్ర పరిపూర్ణం కాదని అంటారు. ఒకప్పుడు ఒక వేటగాడికి ఈ లింగం కనిపించిందని చెబుతారు. మరో కథనంలో సముద్ర మధనం పూర్తయ్యాక రజ్జువుగా ఉన్న వాసుకి కాసేపు ఇక్కడ విశ్రాంతి తీసుకున్నాడు కనుక వాసుకినాథ శివలింగం అంటారని కూడా ఉంది. రావణుడు శివునికి ఘోర తపస్సు చేసి శివుని అనుగ్రహంతో 'అమృతలింగం' పొంది లంకకు తీసుకుపోతూ ఉంటే దేవతల అభ్యర్ధనతో శ్రీ మహావిష్ణువు ఒక గొర్రెల కాపరి వేషంతో కనిపిస్తే, సంధ్యావందన సమయం అయినందున రావణుడు వాడికి ఆలింగం ఇచ్చి తాను వచ్చేదాకా జాగ్రత్తగా చూడమన్నాడు. కాసేపు చూసి రావణుడు ఎన్ని కేకలుపెట్టినా రాకపోతే భారం మోయలేక లింగాన్ని 'దియోఘర్' అనేచోట భూమి మీద పెట్టేశాడు. అది భూమిలోకి చాలాదూరం దూరిపోయింది. రావణుడు వచ్చి లబో దిబోమని లింగాన్ని పెకలించటానికి విశ్వప్రయత్నం చేసి హతాశుడయ్యాడు. శివలింగం పైభాగం మాత్రమే కనిపించింది. చేసేదిలేక, లంక నుంచి రోజూ వచ్చి ఈ శివలింగానికి అభిషేకం చేసి వెళ్ళేవాడు రావణుడు. వైద్యనాథానికి 10 కిలోమీటర్ల దూరంలో 'తపోవనం' అనే ప్రాంతం ఉంది. వైద్యనాథాయానికి రామాయణ కాలంతో

సంబంధం ఉన్నట్లే, తపోవనానికీ ఉంది. ఇక్కడే వాల్మీకి మహర్షి తపస్సు చేశాడని అందుకే 'తపోవనం' పేరొచ్చిందని అంటారు. ఇక్కడనేక గుహలున్నాయి. అందులో మహర్షులు తపస్సు చేసుకొనేవారు. శ్రీ బాలానంద బ్రహ్మాచారి అనే యోగి పుంగవుడు ఇక్కడే తపస్సు చేసి సిద్ధి పొందారు. ఇక్కడున్న శివాలయంలో శ్రీ తపోనాథ శివలింగం మహిమాన్వితం.

ఇక్కడున్న కొండలపై అనేక లోతైన చీకటి గుహలున్నాయి. అందులో శ్రీ హనుమాలయం ఉన్న ఒక గుహ ప్రసిద్ధమైనది. చాలా కష్టపడి ఈ చీకటి గుహలో చాలాదూరం వెడితేకాని శ్రీ హనుమ దర్శనం లభించదు. రెండు పెద్ద సమాంతర బండరాళ్ల మధ్య కొద్దిపాటి ఖాళీ, అందులో ఒక రాయికి పగులు కనిపిస్తాయి. చాలా శ్రమించి ప్రయత్నం చేస్తే తప్ప చేతులు దూరనంత పగులు అది. అందులోంచి చూస్తే ఆ పగులుకు లోపల రెండువైపులా చెక్కబడిన శ్రీ హనుమ విగ్రహాలు దర్శనమిచ్చి ఆశ్చర్యచకితులను చేస్తాయి. వీటిని ప్రత్యక్షంగా చూస్తే తప్ప, ఎవరూ నమ్మలేనంత నిజం ఇది. ఇలా విగ్రహాలు మలచటం సామాన్య మానవ మాత్రుడికి సాధ్యమైన విషయం అనిపించదు. అంతటి మహదాశ్చర్యం కలిగిస్తుంది ఈ గుహ, ఇందులోని శ్రీ హనుమ విగ్రహాలు.❋

మధ్యప్రదేశ్

240) శ్రీ ఉల్టా వీర హనుమాన్ దేవాలయం-సాల్వర్

మధ్యప్రదేశ్ రాజధాని ఉజ్జయినికి 15 కిలో మీటర్ల దూరంలో, ఇండోర్‌కు 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న సాల్వార్‌లో తలక్రిందులుగా అంటే ఉల్టాగా ఉన్న శ్రీ వీర హనుమాన్ విగ్రహం ఉంది. అందుకే దీనికి ఉల్టా హనుమాన్ అంటారు. స్వామికి చిన్న కోవెల ఉన్నది. ఆంజనేయస్వామి విగ్రహంలో

ముఖ భాగం మాత్రమే కనిపించటం మరో విశేషం. ఈ ఆలయం అతి ప్రాచీనమైనదని రామాయణ కాలంలో అంటే త్రేతాయుగం నాటి ఆలయం అని స్థానికులు ఘనంగా చెబుతారు. అహిరావణుడు రామ లక్ష్మణులను బంధించి పాతాల లోకానికి తీసుకువెళ్ళిన ప్రదేశం ఇదే నని అందరి నమ్మకం. ఈ ద్వారం గుండానే ఆంజనేయ స్వామి పాతాళానికి వెళ్లి వారిద్దరినీ విడిపించుకొని తీసుకు వచ్చాడని స్థల పురాణంలో ఉంది. ఈ ఆలయం చాలా మహిమాన్వితమైనది. ఆలయం చుట్టూ అనేక మహర్షుల మందిరాలున్నాయి. వారందరూ ఇక్కడికి వచ్చి తపస్సు చేసినట్లు అనిపిస్తుంది. ఈ మందిరాలే దాదాపు పన్నెండు వందల ఏళ్ళ నాటివని చరిత్ర చెబుతోంది. ఆలయ ప్రాంగణంలో మర్రి, వేప, పారిజాత వృక్షాలున్నాయి. అవికాక అతిపురాతన పారిజాత వృక్షాలు రెండు ఇక్కడ ఉండటం మరో విచిత్రం. ఈ పారిజాత వృక్షంలో శ్రీ ఆంజనేయస్వామి కొలువై ఉంటాడు. పారిజాత వృక్షాలమీద వేలాది రామచిలుకలు కూర్చుని ఉండి ఆశ్చర్యం కలిగిస్తాయి. ఒకానొక బ్రాహ్మణుడు రామచిలుక రూపం దాల్చాడని పురాణ కథనం. వీరహనుమాన్ చిలుక రూపంగా మారి గోస్వామి తులసీదాసుకు వాహనమై శ్రీరామదర్శనం చేయించాడని పురాణ చరిత్ర.

శ్రీ ఉల్టా వీర హనుమాన్ ఆలయంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, పార్వతీదేవి విగ్రహాలున్నాయి. ప్రతి మంగళవారం ఉల్టా హనుమాన్ విగ్రహానికి 'నారింజ రంగు పూత' పూస్తారు. ఇది మరో ప్రత్యేకత. మూడు వారాలకొకసారి ఉల్టా హనుమాన్‌ను సందర్శిస్తే సీదాగా కోరికలు నెరవేరతాయని భక్త జన విశ్వాసం. ఉల్టా స్వామిని వేలాది భక్తులు దర్శించి మనోభీష్టిని పొందుతారు. ❋

241) శ్రీ సఖీ రూప హనుమాన్ దేవాలయం-ఝాన్సి

మధ్యప్రదేశ్‌లో చారిత్రిక నగరం ఝాన్సీలో సఖి రూపంలో శ్రీ ఆంజనేయస్వామి దర్శనమిస్తాడు. అందుకనే సఖి రూప హనుమాన్ అనే పేరొచ్చింది. మిధిలా నగరంలో సీతా రాములను దాసీ లేక సఖి వేషం వేసుకొని ఒక ఉద్యానవనంలో హనుమ కలిపాడట. అదీ దీనికి నేపథ్యం. అందుకే సఖి హనుమాన్ అయ్యాడు. ఒళ్లంతా ఆడవేషమే. శ్రీరాముడు మెచ్చి ఒక పత్రం మీద అతన్ని ప్రశంసిస్తూ రసిన వాక్యాలు ఈ హనుమ నడుం దగ్గర కట్టబడి ఉండటం విశేషం.❋

242) రోజుకు మూడుసార్లు ముఖం మార్చుకొనే శ్రీ హనుమ దేవాలయం-సూరజ్కుండ్

మధ్యప్రదేశ్ నర్మదా తీరాన సూరజ్‌కుండ్‌లో అతి ప్రాచీన ఆంజనేయ దేవాలయమున్నది. స్వామి ప్రతిరోజూ మూడుసార్లు తన ముఖాన్ని మూడు జీవన దశలలో మార్చుకోవటం ఇక్కడ విశేషం. ఈ హనుమకు సూర్యదేవునికి అవినాభావ సంబంధం ఉందని చరిత్ర చెబుతోంది. సూర్యకుండమే సూరజ్కుండ్. సుదూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ఈ విశేషం గమనించి ఆశ్చర్యపోతారు.❋

243) శ్రీ హోరీకే హనుమాన్ మందిర్-ఇందోర్

అభయదాత హనుమాన్మందిరం లేక హోరీకే హనుమాన్దేవాలయం మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఉన్నది. భూత ప్రేత పిశాచాదుల విముక్తి చేసి అభయప్రదాత అనిపించుకున్నాడు ఇక్కడి హనుమ. భక్తుల విరాళాలతో ఆలయం సర్వతోముఖంగా వర్ధిల్లుతోంది. జగన్నాథుడు అనే భక్తుడు స్వామివారి విగ్రహాన్ని స్థాపించాడు.❋



ఒరిస్సా

244) శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయం-కటక్

ఒరిస్సాలో కటకం అని పూర్వం పిలువబడిన కటక్ లోణి కన్నగార్‌లో శ్రీ పంచముఖి ఆంజనేయ దేవాలయం ఉన్నది. కతాజోది నదీ తీరంలో ఉన్నది. వందేళ్ళ చరిత్ర ఉన్న ఆలయం. ఆంజనేయునితోబాటు శ్రీరామ సీతా లక్ష్మణ స్వాముల విగ్రహాలూ ఉన్నాయి. మహి రావణ సంహారానికి హనుమ పంచముఖాలతో ఉన్నాడని మనకూ తెలిసిన విషయమే. పంచముఖి హనుమాన్ స్తోత్రం చదువుతూ స్వామిని దర్శిస్తే సకల మనోరదాలు ఈరేడుతాయి.

"పంచాస్య చూత మనేక విచిత్ర వీర్యం-శ్రీ శంఖ చక్ర రమణీయ భుజాగ్రదేశం పీతాంబరం మకర కుండల నూపురాంగం-ధ్యాయేతి తం కపివరం హృది భావనం".❋

245) శ్రీ సంకట మోచన హనుమాన్ దేవాలయం-భద్రక్

ఒరిస్సాలో భద్రక్ వద్ద వాసుదేవపూర్‌లోని శ్రీ సంకట మోచన హనుమాన్ దేవాలయం బాగా ప్రసిద్ధమైనది. అక్కడే పల్లి హనుమాన్ మందిరం కూడా దర్శనీయ దేవాలయమే.❋

246) శ్రీ ద్విబాహు హనుమాన్ దేవాలయం-కేదారగౌరీ

ఒరిస్సా రాష్ట్ర భువనేశ్వర్ దగ్గర కేదారగౌరీ రోడ్డుపై కేదారగౌరీ వద్ద శ్రీ ఆంజనేయ దేవాలయం ప్రాచీన మైనది. ఇక్కడి హనుమాన్‌కు రెండు చేతులు మాత్రమే ఉంటాయి. కేదారగౌరీ ట్రస్టీన్ని నిర్వహిస్తోంది. పురావస్తుశాఖ అంచనాల ప్రకారం ఆలయం 15 లేక 16వ శతాబ్దికి చెందిన ప్రాచీన ఆలయం. ఎర్రరంగు లాటరైట్ శిలలతో నిర్మించబడింది. 3.4 చదరపు మీటర్ల చతురస్రాకార విమానం బడ, గండి, మస్తకాలతో ఉంటుంది. గుడి రెండస్తులుగా ఉంటుంది. మస్తకం ఒక మీటర్ ఉంటుంది.❋

247) శ్రీ సంకట మోచన హనుమాన్ మందిరం- ఖుర్దా రోడ్

ఒరిస్సా రాష్ట్రం ఖుర్దా రోడ్‌కు దగ్గరలో తంతాముండియాలో శ్రీ సంకట మోచన్ హనుమాన్ దేవాలయం ప్రసిద్ధమైనది. హనుమతోపాటు సీతారామ లక్ష్మణులు కూడా కొలువై ఉంటారు. అన్ని సదుపాయాలూ ఉన్న ఆలయం.*

పశ్చిమ బెంగాల్

248) శ్రీ హనుమాన్ మందిర్- డార్జిలింగ్

పశ్చిమ బెంగాల్‌లో డార్జిలింగ్‌లో కాలిపాంగ్‌లో కొండలు పడమటి నుంచి ఈశాన్యం వైపు 'బూమేరాంగ్'లాగా భలే తమాషాగా కనిపిస్తాయి. ఈ చివర ధియోలో కొండ ఉంటుంది. గోప్పలాండ్ స్కేప్‌తో విశాలమైన మైదానం కనిపించి చూడముచ్చటగా ఉంటుంది. పచ్చగడ్డి పరుపు పరచినట్లు ఉండటం దీని ప్రత్యేకత. మిగిలిన అన్ని ప్రదేశాలకంటే చాలా ఎత్తుగా ఈ ప్రాంతం ఉంది. తీస్తా లోయ ముచ్చట గొలుపుతుంది. సిక్కిం కొండలు రెండవ వైపు ఉంటాయి. ఇంత అందమైన ప్రదేశంలో శ్రీ హనుమంతుని భారీ విగ్రహమున్న హనుమాన్ దేవాలయం చిన్న కొండమీద కట్టారు. చూసి తీరాల్సిందే. ఈ ప్రాంతాన్నే షేర్పా వ్యూ పాయింట్ అంటారు. సమీపంలోనే కాంచన గంగ శిఖరం దర్శనమిస్తుంది. దక్షిణాన రెల్లి నదీ లోయ కనిపిస్తుంది. హనుమ దేవాలయం దగ్గరలోనే దుర్గామాత మందిరమూ నిర్మించారు. అందమైన బుద్ధ విగ్రహమూ ఉంది. ఇక్కడే అతి ప్రాచీన మహా కాళేశ్వర దేవాలయం కూడా ఉంది.*

249) శ్రీ కోన హనుమాన్మందిర్-హౌరా

పశ్చిమబెంగాల్హౌరాలో కోన రాజమార్గంలో శ్రీ కోన హనుమాన్మందిరమున్నది. ఒకప్పుడు రైతు దంపతులకు హనుమ విగ్రహం దొరికింది. చిన్నగుడి కట్టి పూజించారు. కాలక్రమంలో బాగా విశాలమైన దేవాలయ నిర్మాణం జరిగింది. అత్యద్భుత శిల్పశోభతో ఆలయం ఆశ్చర్యపరుస్తుంది. సత్సంగానికి, భజనలకు విశాలమైన హాలు ఏర్పాటు చేశారు. అనుబంధంగా ఆయుర్వేద హోమియో వైద్యశాలలూ నిర్వహిస్తున్నారు. మందిర పైభాగంలో ఉన్న శిల్పకళ వర్ణనాతీతం. అనేక దేవతామూర్తులు, రామాయణ గాథలూ సముద్ర మధనం అబ్బురపరుస్తాయి.

పశ్చిమబెంగాల్ జియాగంజ్‌లో కూడా భజరంగబలి దేవాలయమున్నది.❋

250) శ్రీ హనుమాలయం-బారకార్

పశ్చిమబెంగాల్ అసంసోల్ జిల్లా బారకార్‌లో శ్రీ హనుమాలయం ప్రసిద్ధమైనది. ఇక్కడే సిద్దేశ్వర దుర్గా గణేశ దేవాలయాలున్నాయి. వీటిని 'బెగూనియా దేవాలయా'లంటారు. ఒరిస్సా శైలిలో కట్టిన ఆలయాలివి.❋

అస్సాం

251) శ్రీ గోగాముఖ ఆంజనేయస్వామి ఆలయం-గోగాముఖ్

అస్సాంలో మెగా హైడ్రాలిక్ ప్రాజెక్ట్ వద్ద గోగాముఖ్ ఉంది. ఇక్కడ సూర్యోదయం చూడటానికి వేలాదిమంది వస్తారు. ఇక్కడి విశాల అందమైన ప్రాంగణంలో శ్రీ హనుమమందిరంతోపాటు చాలా దేవతా విగ్రహాలున్నాయి.❋

252) శ్రీ ఉమానంద హనుమాన్ దేవాలయం-పీకాక్ఐలాండ్

అస్సాం బ్రహ్మపుత్రా నది మధ్యలో పీకాక్ ఐలాం డ్కామరూప్‌లో శివాలయంలో ఉన్న శివుడిని 'భయానంద' అంటారు. కల్కి పురాణం ప్రకారం ఇక్కడే పరమశివుడు సృష్టి ప్రారంభంలో భస్మాన్ని చల్లి పార్వతీదేవికి జ్ఞానోదయం కలిగించాడు. ఇక్కడే మన్మధుడు తపస్సు చేస్తున్న శివునిపై పుష్పబాణాలు వేస్తే, ముక్కంటి కంటిమంటకు మాడి భస్మమైనాడు. అందుకే ఈ పర్వతాన్ని 'భస్మాచలం', 'భస్మకూటం' అంటారు. ఇక్కడే ఊర్వశి కామాఖ్య దేవతలకు అమృతం అందించిందని కల్కి పురాణం చెప్పింది. ఇదే ఊర్వశి ఐలాండ్.

ఇక్కడి ఉమానంద శివుడిని సోమవారంతో కలిసిన అమావాస్యనాడు పూజిస్తే అంతకంటే అదృష్టం ఇంకోటి లేదు. మాసశివరాత్రికి అశేష భక్తజనం వస్తారు. ఉమానంద దేవాలయాన్ని 1694లో బార్ఫుకాన్ గార్గ్యహండీకి అనే ఆయన ఆనాటి అస్సాం రాజులలో బల వీర పరాక్రమాలలో మేటి అయిన రాజు గదాధరసింగ్ ఆజ్ఞతో నిర్మించాడు. 1897 భూకంపానికి ఆలయం ధ్వంసమైతే, ఒక ధనిక వర్తకుడు పునర్నిర్మాణం చేశాడు. కామరూప్ మొగలాయి పాలనలో కొచ్చినప్పుడు ఉమానంద దేవాలయ పూజారులు జహంగీర్, ఔరంగజేబ్ల నుండి భూమి, నగదు పొందారు.

ఇక్కడే ఉమానంద ఆంజనేయస్వామి దేవాలయమూ చరిత్ర ప్రసిద్ధికెక్కిందే.❋

అండమాన్

253) శ్రీ వీర హనుమాన్దేవాలయం-అండమాన్

అండమాన్, నికోబార్ దీవులలో దక్షిణ అండమాన్లో రాజధాని పోర్ట్ బ్లేయిర్ వద్ద, ఎయిరోడ్రోం బజారులో రాజీవ్ గాంధినగర్లో శ్రీ వీర హనుమాన్దేవాలయం అక్కడివారందరికీ పవిత్ర యాత్రాస్థలం.❋

అమెరికా

254) శ్రీ కార్యసిద్ధి హనుమాన్ మందిర్-డల్లాస్

అమెరికా టెక్సాస్ రాష్ట్రం డల్లాస్లో కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం ఒక దేవాలయ సమూహం. ఇక్కడ పిల్లలకు 10 నెలలో 18 అధ్యాయాల భగవద్గీతను నేర్పించారు. వీరిని కుటుంబాలతోపాటు కురుక్షేత్ర పర్యటనకు తీసుకువెళ్ళామని నిర్వాహకులు శ్రీ చక్రవర్తి తెలిపారు. ఈ పారాయణ ప్రోగ్రాంను 'హర్షగీతాపారాయణ'గా పేర్కొన్నారు. ఆలయం శ్రీ దత్తపీఠం ఆధ్వర్యంలో నడుస్తోంది.

❀ రెండవ భాగం దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-సంపూర్ణం ❀

"శ్రీ ఆంజనేయ వైభవం" పద్యాలు

శ్రీ హనుమ ద్విభీషణ సమాగమము

- రామడుగు వేంకటేశ్వరశర్మ

ఫ్లాట్ నెం.201, 2వ అంతస్థు, ఆర్.వి.టవర్స్, శ్రీ వేంకటేశ్వరబాల
కుటీర్ వద్ద, 2/17, బ్రాడీపేట, గుంటూరు-522002,
సెల్.నెం.9866944287

1) సీ॥ రాఘవోత్తమ ధనుః ప్రవిముక్తమైసాగు! శ్వసన విక్రమశీలి శరమువోలె
సకలలోకాలోక చైతన్య దంబౌచు! ప్రసరించు సూర్యకరంబువోలె
తల్లి దాస్యము తీర్చ దరిలేని జవమొప్పు! పయనించు దీవ్యత్ సుపర్ణు వోలె
బహుళార్ధ సాధక ద్వంద్వభావాతీతమహిత స్థితప్రజ్ఞ మనసువోలె
లంకలో సీత వెదక నిశ్శంకగతిని! పయనమై యేగు హనుమ వైభవము తోచె
వర మహాంభోధిలంఘనావసరమందు! ముఖ్య జాంబవదాదులు ప్రోత్సహింప

2) సీ॥ మైనాకు నాతిథ్యమహిమంబు నానంద! కర కరస్పర్శతో గౌరవించి
సురస వెట్టు పరీక్ష వరుస తీరు గ్రహించి! బుద్ధి వైభవముతో పొగడువడసి
ప్రాణుల నీడల పట్టెడి సింహికా! ఘనమాయ చీల్చి మర్దనము చేసి
ద్వారంబుపై నున్న దానవి లంకిణి! అడ్డును తొలగించి, అతిశయించి
లంకలోనికి చేరి నిశ్శంక గతిని! వనము వనమును భవనమున్ భవనమునకు
రావణుని నివాస మందు నారామ కొఱకు వెదకుచుండ-
వాయుజుడొక వీధిలోన

3) సీ॥ ధర్మనిగ్రహుడైన దశరథసుతు ధను! ర్బాణాలు కుడ్యచిత్రాలు కాగ
పాపముక్త కవాట రూపనామాక్షరాలౌ! ద్వారబంధానాలపై సౌరు మీర
పరమ పావన లసత్ పరిమళ భరితమౌ! తులసి ప్రాంగణమందు
చెలువుమీర
వేదనాదోదారవిధి వీనులకు విందు!గా రామనామంబు గ్రాలుచుంట

హరిమయంబైన ఒక్క మందిరముగాంచి! హరియును మునిగి తేలి
అచ్చెరువు
అంతులేని సంతోషబు స్వాంతమందు! గంతు లిడగ, నిద్రాసతీకట్రమబాహు
బంధనము రామనామ సంస్పర్శతోడ! వీడెడి విభీషణుని గాంచె విశదమతిని

4) తే॥ గీ॥ సాధుసంగతి సకలార్థసాధకంబు! ఇతడు సజ్జనుడంచును నింపు మీర
చేరబోయె సత్కార్యైక సిద్ధి కొరకు! బ్రహ్మ విజ్ఞానరూపుడౌ పవనసుతుడు

5) సీ॥ చతురాగమాభ్యాస సంపదుత్తేజంబు! వదన మండల మందు వరలు చుండ
వైదిక ధర్మైక పరిరక్షణ స్ఫురత్! వరవిష్ణు తత్త్వంబె ఉరమునిండ
లయ మొసంగియు శుభాలయమైన శివశక్తు! లై బాహుదండబులదరుచుండ
శిష్యుడయ్యుకు గురు శ్రీసూర్యచైతన్య గతియెల్ల నడకలో కదలు చుండ
జీవపరమాత్ములను కల్పు చేవగలగి! వాజ్నియమరూఢిలక్షణ ప్రభలు గలిగి
అనఘు డాచార్యవర్యుడై అలరునట్టి! బ్రాహ్మణుండౌ చు చేరె
నా పవన సుతుడు

6) కం॥ చేరిన విప్రోత్తము గని! నారదులా మీరు! లేక నారాయణులా
కారుణ్య స్ఫూర్తిశ్రీ! శ్రీరాముల? ఎడదపొంగె ప్రేమ మిము కనన్

7) కం॥ అని పల్కు విభీషణు గని! హనుమ తనదు పేరు తెల్పి ఆ రాము కథన్
గణనీయంబుగ పలుకుచు! వినుతింపగవశమె? సన్నివేశము లౌరా

8) సీ॥ రామాది జనన కారక ఋశ్యశృంగుని! ప్రభ పల్క రఘునాథ విభుడె వలయు
శైశవ లీలల, శైవధనుర్ధ్వని! నల విశ్వనాథుండె పలుకువలయు
కౌశికుయాగ రక్షణము, తాటకవధ! ఘన భాస్కరుండె వాకొనగముయు
లలన శూర్పణఖను, లక్ష్మణరేఖల! రంగనాథుండె తెల్పంగవలయు
గుహుపల్కులును, అల్ల మహిజా వియోగంబు! పలుకు మొల్లలతోనె
చిలుకవలయు
ప్రభుని రాముని పితృవాక్యపాలనంబు! సతిని కోల్పోయియును
రామచంద్రుమొగము
నందలి గభీరభావంపుచందమొప్పు! పుట్ట పుట్టిన ఆ జగజెట్టి కేని
శక్యమే కాదటన్న ఈ జగతిలోన! రాఘలేశ్వరు నవచరిత్ర వచింప

పరికిని సాధ్యమేకాదు- ఇది నిజమ్ము॥

9) కం॥ ఈపగిదిని స్మరణంబున! ఈ పుణ్య యశో విశేషులనుపమ పులక
వ్యాపారుతౌచు మోద! శ్రీపాకమ్మొందిరంత చిత్ దైత్యుడనెన్॥

10) కం॥ "పవనకుమార! విను వాస్తవమును- దంతాలమధ్య సజ్జిహ్వా వలెన్
మివులంట నిస్సహాయత! చవి చచ్చిన స్థితిని ఉంటి; సత్కృప గనునన్॥

11) కం॥ ఆ రామచంద్రుని గనియెడి! పేరాసయుగలదు కనుకె విచ్చేసితిరా
మీరిటకు; సాధుసంగతి! ఆ రాముని కరుణలేక అది జరుగునటే

12) మ॥ అని భాషించు విభీషణున్ గనుచు దివ్యానంద చిత్తాన ఆ
హనుమానుండు "నిరంతరంబు నిజభృత్యశ్రేణిపై ప్రేమభా
వన చిందిపగ జేయుటే ప్రభువుదౌ స్వాభావిక ప్రజ్ఞ; నన్
గనుడే నున్నతవంశజుండ నటె? అజ్ఞానిన్; కడున్ దీనభా
జనుడన్; చంచలుగన్; ప్రభాతమున అస్మన్నామముల్ బల్కబూ
నిన వారెల్లర కాదినాన అపుడెంతే నన్న మేన్ జేతికెం
దు నలబకధమ్మగుగాదె? అటి నను ఎంతోసత్కృపన్ జూడడే!
ఘను నేతా దృశు స్వామినే మరువ దుఃఖంబందుటే కాక- వా
సనలన్ తిర్గెడి వారికన్ శుభ తతుల్ సత్ప్రాప్తమౌనొక్కొ! అం
చనుచుండంగనె అశ్రు పూర్ణ నయనుండై రాముమహాత్మ్య చిం
తనతో మానసమందనిర్వచనీయ శాంతంబందగా అంతటన్"

13) మ॥ సుగుణాఢ్యుండు విభీషణుండు రఘు సుశ్లోకున్ వియోగంబునా
పగ రానంతటిదంచు ఇట్లు కపితోభాషించె "మీరేమియున్
వగపొందన్ పనిలేదు సీత; నదె ఆ పౌలస్త్యుడీ లంకలో
అగవల్లీ పరివేష్టితాఖిల భయవ్యాహద్ ప్రౌఢరూ
పగరిష్ఠంబు నశోక మన్ వనిని నిల్పన్ జేసె నోమారుతీ!"

14) ఉ॥ ఏమని చెప్పువాడను? మహీజను చూడగ-పొట్టలో చెయిన్
వేమరు పెట్టి వేగ మెలిపెట్టినయట్లు కలంచు; వాయస
స్వామిని ఘూక గృధ్ర తతి భైరవ రావముతోడ చుట్టునున్

భీమగతిన్ చెలంగ కడు వేపథు వై వణుకొందు కోకిల
స్వామిని వోలె దైత్యవరభామల మధ్యను సీతకుందెదున్"

15) ఆ.వె॥ ఆయశోకవనికి అరుగు మార్గం బదే
ఉచిత వర్తనాన ఒప్పుమయ్య!
నిరుపమాన విజయ నిర్విఘ్నమస్తు! మీ
కఖిల కార్యసిద్ధిరస్తు! స్వస్తి!"*

(నా "జ్ఞానతులసి-" అన్న పద్యకావ్యం నుండి)

ప్రభంజన సూతి

- మంకు శ్రీను
కొప్పుణ్ణు
సెల్.నెం. 8985990215

1) తారక రాముడే పరమదైవమటంచు మదిన్ దలంచి వి
స్తార భుజప్రతాపమున దైత్యుల గర్వమునాహరించె నా
తారకరామ కీర్తనమె తజ్జయకారణమన్న మేటి సా
మీరి నెడంద నిల్చుకొన మేలొనగూరు జగజ్జనాళికిన్॥

2) ఠీవిగ మాటలాడె బ్రకటీకృత వాక్యవిలాస వైఖరిన్
సేవిత సద్గుణోత్తముడు శ్రీరఘురాముడు మెచ్చె వచ్చె సు
గ్రీవుని వెన్ను దట్టె నవలీలగ వాలిని మట్టుబెట్టె నా
పావని యుక్తివైభవము బ్రహ్మకునైన వశంబె పేర్కొనన్॥

3) తన లావున్ గమనింపడింతయును జెంతన్ జేరి వేరొక్కరున్
దన లావింతని చెప్ప రేగును గృతోత్సాహంబు సంధిల్లగన్
హనుమన్ మించిన వీర్యవంతుడిలలో నన్వేషణంబున్ బొన
ర్చిన లేడెందున వాని పాదయుగమర్చింతున్ సుభక్తుండనై॥

4) జలధిన్ దాటుటకై కపీశ్వరులు చర్చం జేయుచుండంగ ని
శ్చల వృత్తిన్ హనుమంతుడక్కడ మహాశాంతుండునై యుండ న
వ్వల మేధానిధి జాంబువంతుడు జగత్ప్రాణాంశ సంభూత! యో
బలవంతా! యని ప్రస్తుతించె హనుమాన్ వాత్సల్యమేపారగన్॥

5) వానరవీరులందరును వహ్వా! యటంచు బ్రశంస జేయగా
బూని మహేంద్రశైలమున బోడిమి మీఱగ నిల్చి యంతటన్
ఆనయశాలి తానెగిరె నంబరవీథికి సంబరంబుతో
వాని మనోజవంబునకు వార్నిధియున్ దలమున్కలయ్యెబో॥

6) శరధిని నిరమించు తఱి చాల విపత్తులు సంభవించె సు

స్థిర విమలాశయుండగుచు దేకువ నీడక సాగె ముందుకున్
నిరుపమ శేముషీ నిధి వినిర్మల రామపదార్చకుండు నా
హరివరు నాంజనేయు నెదయందున జేర్చి భజింతు నిత్యమున్॥

7) వారిధి దాటి శ్రీహనూమ వారిజనేత్ర ధరిత్రిపుత్రినిన్
ధీరుగ గాంచి యామెకిడె దృష్టి జనింపగ రామముద్రికన్
ధీరగభీర చిత్తుడయి తేజము జూపెను లంకలోపలన్
బారెను వైరిదర్గము ప్రభంజనసూతి కసాధ్యమున్నదే॥

8) తరమా వాయుజు గెల్వ వైరులకు యుద్ధ ప్రౌఢి జొప్పించుచున్
దరమా పావని దివ్యరూపమును జిత్తప్రీతి గీర్తింపగన్
దరమా మారుతి వాగ్విలాసమును విద్యావేత్తలూహింపగన్
వరలంకా నగర స్వరూపమును విధ్వంసంబోనర్చెన్ భళా!

9) వాలము ద్రిప్పుచున్ రిపులపై బడి చీల్చిన యోధుడాతడే
వాలము నెత్తి యవ్వనధి పైని గమించిన మేటి యాతడే
వాలమునందు జుట్టి పెనుబాధలు గెంటెడి ప్రోడ యాతడే
లీలగ గాలి ధూళి వెడలించెడి భీకరమూర్తి యాతడే!!

10) రావణపుత్రుడలి సమరంబున శక్తిని వేయ నద్ది భీ
తావహమై సుమిత్ర నుతుయ్యెడె దాకగ మూర్ఛనొందె నౌ
రా!విధి యెంత చిత్రమొ! విలంబము సుంతయు జేయకుండ సం
జీవని తెచ్చి యాతనికి జీవికనిచ్చె దయాంతరంగుడై॥

11) శ్రీరఘురామునిన్ నిలిపె జిత్తమునందున నెంతవాడొ చె
న్నారగ తత్పదాబ్జముల నార్జవమొప్ప భజించుచుండు సీ
తారమణీ మనోహరుడు తావక కీర్తికి మూలమై పుర
స్కారమునందె లోకమున సన్నుతి సేయుదు నంజనాసుతున్॥

12) ఆరయ భక్తకోటి కభయమ్మిడు చక్కదనాల దైవమై
తోరపు శక్తినిన్ గఅపిధుమ్సహ దీప్తినొసంగు మిత్రుడై
ధారుణి నంజనానుతుడుదారవరత్వము చాటె గంధ సిం

ధూరము దాల్చు భక్తులకు దూరము సేయును కష్టనష్టముల్॥

13) ఎక్కడ రామకీర్తనము లింపెనలారగ సాగుచుండునో
యక్కడ రాముబంటు కొలువై తమితోడుత నాలకించెడున్
జక్కని జ్ఞానసంపదయు జక్కని శీలము సద్గుణాదులున్
మక్కువ కూర్చునట్టి హనుమంతుని నిచ్చలు గొల్వుడందరున్॥❋

ఆంజనేయ స్తుతి

- తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు

మ॥ అరిషడ్వర్గము ద్రుంచగా వలనుగాదయ్యా కటాక్షంబుతో
నరి నీ వాచును పారద్రోలగను జూడయ్యా సదా మారుతీ!
పరమామ్నాయ వినీతమార్గమున పెంపారన్నగున్ నిల్చుచున్
పరమం బైన పదంబ నిచ్చెడు పరబ్రహ్మంబు నీవేగదా!

చ॥ ఛిణుఛిణునాదమేదొ విన చేతమునొక్కడ నిల్పి చూడగా
గణగణమంచు మ్రోతలవి కర్ణములంబడి మోహనంబుగా
గుణితములౌనటంచు పలుకుల్ విని సాధన నేను జేయుచో
ఘుణమయి తొల్చు చింతనల ఘూర్ణము చేయగరమ్ము మారుతీ!

శా॥ రామా రామ యటంచు నామనమిటన్ రాగంబులన్ దీయుచో
రామ ధ్యాన మదేల గల్గు నికనారామంబునుం జేసి నీ
రామున్ నా మనమందు నిల్పుదనులే రాకుందువే నీ వికన్
రామున్‌జూడగ నాంజనేయ! వరదా! రాగిల్లినన్నేలగా!

మ॥ భయమే లేదిక నాకు నీపదములనే ప్రారబ్ధకర్మంబులన్
లయమై పోవగ చిత్తమందిహపు లౌల్యంతరించన్ సదా
స్మయదూరున్నను జేసి కావుము మనస్సాంకర్యమున్ ద్రుంచి నన్
దయజూడంగను నీవయౌదు విలనో ధన్యాత్ముడన్ మారుతీ!

శా॥ నే నీరూపము మానసంబునను నన్నేలంగనే నిల్పితిన్
రా! నేరంబుల నెంచకీవు దయ తోరంబౌచు నాపైని సం
ధానింపంగ దొలంగు మోహవితతుల్ ధాత్రీ సుతాన్వేషకా
'జాన్యకాః పద మాశ్రయామి' యికనీ జాగున్ సదా సైతునే

మ॥ స్థిరమై యొక్కట నుండబోని మనసున్ తీరెంచుచున్ కోతిగా
వర వేదాంత విచారసూత్రములలో వర్ణించుటల్ సత్యమె
ట్లరయన్ వానర రూపధారివయి యాట్లారాము జింతించుచున్
స్థిరయోగంబుననుండి చూపితివి సుస్థేమాభిరామాకృతన్

మ॥ కలరే నీ వలెగర్భమందె వటువై కౌపీన వస్త్రంబుతో
తలపన్నేరని జన్మమందిన మహాతత్త్వజ్ఞలున్ మారుతీ!
అలనయ్యంజన మాతృదేవి తపమాహా యీశ్వరానందమై
ఫలమై వజ్రశరీరివై వెలసినావా పాహి రామప్రియా!

ఉ॥ ఎవ్వని పాదసేవనము నీ యణిమాదులు సంభ్ర మంబుగన్
నెవ్వగ జెందుచుండు కడునెయ్యము తోడుత పంచభూతముల్
నివ్వటిలున్ సదా నురలు నెల్లరు కూడి రనుగ్ర హింపగా
నెవ్వని జన్మకాలమున యే ప్రణుతించి ద చెదనట్టి మారుతిన్

శా॥ హుంకారంబొనరించి రాక్షసుల మాయోపాయముల్ ద్రుంచగా
నోంకారాత్మకమైన రూపమటరా నుత్కృష్ట భీమాకృతిన్
హాంకారంబుల దైత్యులు న్మడిసిరే హర్షప్రఫుల్లాంగులై
యోంకారంబుల మారుతిన్ విబుధు లోహోయంచు కీర్తించగా

శా॥ స్వామీ! నీ దగు మైత్రి రామునకు సంభావ్యమ్ము కాకున్నచో
నేమో! సీతను రాము డెట్లు కనునో! ఎట్లామెకున్ ముక్తియో!
రాముండా దశకంఠునిందునుముటల్ రామాయణంబౌటయున్
శ్రీమంతంబగు రామసేవ యెటులౌ శ్రీమారుతీ! పెన్నిధీ!

మ॥ అదిగో చూడుడు గంధమాదనమదే దాక్షిణ్య కైలాసమ
య్యదియే పంపయనన్ బరంగు కొలనా హా యోగ శైలంబదే

పదిలంబెయ్యేడు నీశ్వరాంశజుని దివ్యారామ మయ్యదియే
వదనంబెత్తి నమస్కరించ దయతో పాలించు దీవించులే!❋

నమస్తే! వాయుపుత్రా!

- టేకుమళ్ళ వెంకటప్పయ్య,
విజయవాడ
చరవాణి: 09490400858

శ్లో. 1. ఆంజనేయం వచోమూర్తిం, రామకార్యధురంధరమ్!
లంకాదహన కారకం, దుష్టఘ్నం నౌమిపావనిమ్!!

2. కం. శ్రీరామునకున్ సీతకు
శ్రీరామానుజులకున్ హరీంద్రునకున్ న
ద్ధీరుడు పవన సుతునకు
శ్రీరామాయణ కవికిదె చేయుదు పూజల్.

3. ఉ. భారత దేశమంతటను పావన నామము రామనామమే
కారణ మేమిటా యనగ కారణజన్ముని భక్తిచిత్తముల్
గోరిన కోర్కెలన్నియును గూర్చెడి దాతవు కేసరీసుతా!
పేరును దల్చజాలు మరి! భేదము జూపవు భక్తులందునన్

4. సీ. శ్రీఆంజనేయుడా! శ్రీరుద్ర తేజమా!
చిత్తమ్ము నిలిపితిన్ చెదరకుండ!
భీతిగల్గిన వేళ పిలిచేను నాస్వామి!

కాపాడి బూనంగ గరుణతోడ!
చోరభయమునంది శోకించు దీనుల
దిక్కువై నిలువుమా! దేవ! దేవ!
భూత దయ్యమ్ములన్ పోరాడి మసిజేయు

భీమ బలుడనీవు! భీతి నాశ
భక్తి యున్నను జాలు భజనల సేవల
గోరవు నీవెపుడు కొంచెమైన!

ఆ.వె. మనసు నందు దలువ మాచుట్ట మయ్యేవు
వాల గాత్ర నీకు వందనమ్ము!
సర్వ వేళ లందు చక్కని యండ వై
మమ్ము గాచి నిలుచు మాత పితవు!

5. ఉ. వాక్కున బ్రహ్మవై నిలిచి, వాలిని జంపగ స్నేహశీలివై
మిక్కిలి సఖ్యమేర్పరచి మేలును మంత్రిగ గూర్చినావులే!
చక్కని రాఘవాత్మసతి జాడను దెల్పగ లంకకేగగా
తిక్కను దీర్చిలంఖిణిని ధీటుగ గూల్చితి వాంజనేయుడా!

6. ఉ. సీతకు శోకమున్ దుడిచి చింతను దీర్చిన శక్తిమంతుడా!
జాతిని హీనభావమున జారిన మాటల త్రిప్పికొట్టుచున్
కోతల రావణాసురుని కూల్చెద నంటివి యుద్ధమందునన్
భూతల మంతయున్ జడిసి, భూమిజ మెచ్చెను నీదువాక్కులన్!

7. ఉ. తోకకు మంటబెట్టగను తోయము ముంచక రౌద్రమూర్తివై
పీకల గోసిజంపితివి పీనుగులయ్యిరి రాక్షసాధముల్
శోకము నార్పితీవుఘన సుందర రూపుడ! రామమూర్తికిన్
మాకిల గొప్పధైర్యమిదు మారుతి నందన నీకుమ్రొక్కెదన్!

8. ఉ. వాడిగ గోళ్ళతో బొడిచి వాలము జుట్టుచు నేలగొట్టుచున్
క్రీడగ యుద్ధరంగమున గేకలు వేసిన నీదురూపుకున్
వేడుక జూచెనా కపులు! వీడిరి భీతిన వైరులందరున్

గూడిన ధైర్యసాహసమె కూల్చెను రావణకుంభకర్ణులన్!

9. ఉ. వీడదు రామనామమును, వీడదు నమ్మినవారినెన్నడున్
వీడదు భూతప్రేతముల, వీడదు రక్కసి మూకనెప్పుడున్
వీడదు భక్తిభావమును, వీడదు వేడిన దీనజీవులన్
వీడదు ధైర్య స్థైర్యములు వీడదు యేయుగ మందుజూచినన్

10.తే.గీ.భావి కాలపు బ్రహ్మావు భానుతేజ!
మమ్ము గరుణగ గాచేటి మాన్యశూర!
నిన్ను నిరతము వేడుచు నిలిచినాము
రామ రాజ్యమ్ము నడిపించ రమ్ము ధరన!

11.శ్లో. హనూమంతంమహావీరం, జ్ఞానగానవిశారదమ్!
సౌమిత్రి ప్రాణదాతారం, వన్దేహం రామసేవకమ్!! ❋

ఆంజనేయ స్తుతి

- తపస్వీ,

కేరాఫ్ పంతుల వెంకటేశ్వరరావు,

ప్రసాదంపాడు, విజయవాడ

కం. వీరుడలంకా భయదా- కారుడ! సీతామహోకారుడ! గునాద్
స్సారుడ! రావణసుతసం- హారుడ! మారుతి కుమారుడంజని సుతుడా

సీ॥ చాలిసా చదివినా చాలదు సరిపోదు
శ్రీరామనామంబె చేరు నీకు
పూవులన్ గోరవు పూజలన్ గోరవు
పూలతో రాముని పూజగోరు

మంత్రాలు చూడవు తంత్రాలు చూడవు
        రామభజనసేయరక్షణిత్తు
పాటలన్ మెచ్చవు మాటలన్ మెచ్చవు
        పాటలనే రాముని మాటమెచ్చు

ఆ.వె తమకుపూజసేయ తలతువో తలచవో-కాని రామనామకంబు జెప్ప
నంతులేని రీతి సంతసంబును పొంది- యశమునిత్తువయ్య-అంజనీసుత!
ఆ.వె అట్టి నినుకొలువగ నానందమేగల్గు- స్థైర్య ధైర్యములిక చక్కగాను
నీస్మరణము మాకు నిత్యసుఖములిచ్చు- రక్షణిచ్చునయ్య రామభక్త!

సీ. ఆకుపూజలు చేసి హారతులిచ్చినే
        నడుగలేనయ్యయే హారములను
అష్టకాలు చదివి యభిషేకములు చేసి
        ఆస్తిపాస్తుల నేను నడుగబోను
సిందూరము పులిమి జేగంట గొట్టుచు
        సారెభోగమ్ములు గోరలేను
రంగు రంగుల పూలు రాశులన్ పూజించి
        గృహములిమ్మని విసిగించలేను

తే.గీ. ఎన్ని జన్మలకైనను నివ్విధంబు- శక్తికొలదిగ నీపైన భక్తియుంచి
నీదునామస్మరణ జేయనిత్తముగను- ఆవరంబుచాలికనభయాంజనేయ

నీనామంబు స్మరింపలేని పెదవుల్ నీ దివ్యగానామృతం
బానందించని కర్ణముల్ నినుమనంబునందులచలే నట్టియే
ప్రాణంబున్ వృధయై మెలంగువసుధన్ లంకేశపుత్రాంతకా
శ్రీనారాయణ భక్త! యాంజనీ సుతా! శ్రీయాంజనేయా! ప్రభూ!❋

హనుమద్వైభవం

- ముదిగొండ సీతారామమ్మ
20-8-2/9, శ్రీ మారతీ రెసిడెన్సీ, 2వ అంతస్థు,
అయోద్యానగర్, 5వ లైను, విజయవాడ-520003.
సెల్.నెం. 9199303035

మత్త కోకిల-

అంజనీ సుతుదెవ్వరందురు యద్రిజాహృదయమేశుడే
భంజనంబును చేయదుష్టుల భద్రమూర్తియ తండెగా
రంజిలంగను చేసెనీతడు రామచంద్రుని సేవతో
అంజలించిన వారి నందర నాదరించెడి వేలుపే

మరో మత్త కోకిల-

దాస్యభక్తి భక్తిసాటి యెవ్వరు దాసుడీతడు రాముకున్
వాసమౌగద రామపాదము వానిగాంచినవాడుగా

ఉత్పలమాల-

భక్తిహితార్థ డీతఁడగు బంధువు రాముని తల్చువారికిన్
శక్తి సువర్చలా సహితు శాశ్వతశాంతి ప్రదాతయే యగున్
రక్తిని రాక్షసాధములరాలగ చేసిన యోధుడతడే
ముక్తి ప్రదాత శ్రీప్రదుడు మోదకరుండగుమారులాత్ముడే

చంపకమాల-

ముదమగు పారుజాత తరుమూల నివాసము నీకు నెప్పుడున్
సదయనుజూచుచున్జనుల సాగగ చేసెడివాడవీవు రా
మునిదయగోరుచున్జపము మోదము తోడను చేయుచుందువే
సదమలరూప, యీశ్వరుడ సద్గతి జూపెడి మారుతాత్మజా

మత్తకోకిల-

బ్రహ్మచారి వటంచుయందురు రాగభావముపీడుటన్
బ్రహ్మమందున నిల్చియుండిన పావనీశ్వరుడీవెగా
బ్రహ్మ నీవని చెప్పినారుగ భావికాలము నందునా
బ్రహ్మ చేరెడి మార్గమై పరబ్రహ్మమీనెగ మారుతీ

ఉత్పలమాల-

భారతభూమి యంతటను 'పావని' నీవును లేని తావు ఎ
వ్వారలు కానలేరు గద వర్ధిని నీదగు మూర్తులెన్నియో
దారులలోన కొండలను ధర్మము రాముని కోవెలందునన్
నేరుపు తోడ నిల్పినను నిత్యము పూజలతన్పుచుండిరే

చంపకమాల-

బలమును తేజమున్నొసగి బాసటయౌదువు భక్తకోటికిన్
అలయక రామపాదముల కంజని చేయుచు నిల్చినావుగా
విలసిత శక్తిశాలియును వేదవిశారదుల వాక్యకోవిదున్
కొలచినవారి కెల్లరకు కొంగు పసిండిగ నిల్చు మారుతీ

చంపకమాల-

వరముదిగొండ వంశజుడుపన్నుగమల్లికార్జుదున్
గిరిశపదార విందయుగకీర్తిత భక్తి పరాయణుండు, నే
వరసతి సీతానామమున వర్ధిలుచుంటిని మారుతీశునిన్
కరములు మోడ్చి మ్రొక్కెదను గౌరవముప్పగ మెల్లకాలమున్

చంపకమాల-

వినమతగాత్రుడై హనుమ విశ్వమురక్షణ చేయు రామునిన్
మనసున నిల్పి నామసుధపానము చేయుచు నిర్మలాత్ముడై
అనయము సత్యసంధుడయి యార్తుల బ్రోచుచు నుండువాడు, యీ
హనుమ యటన్నకీర్తిగనె, యంజలి చేయుచునిల్చియుండగా

ఉత్పలమాల-

ద్వైతము వీడినట్టిగుంచి తప్పక కాచును దేవదేవుడ
ద్వైత గుణాశ్రయంబు గద ధర్మము, తప్పక నా శ్రయించగన్
యాతన లేని జీవనము నైక్యగుణంబును కల్గ జీవుయిన్
పాత్రతనంది నాకమును పాయరటంచును పల్కె మారుతీ

ఉత్పలమాల-

రామకథా సుధార్ణవపురమ్యసుధాంశుడవీవు గాదె, ఆ
రామ పదారవింద రసరమ్యతగ్రోలెడి భంభరమ్మవే
రాముని దాసదాసులను రక్షణ చేసెడి రక్షకుండవే
ఏమని చెప్పగా గలను నెంతయునీ మహిమమ్ము మారుతీ

ఉత్పలమాల-

రామకథాతరంగిణిని రత్నపు రాసి వినీవుగాదె, ఆ

దర్శనీయ ఆంజనేయ దేవాలయాలు-2

రాముని రామ సీతమది రంజిల చేసినవాడవీవె, శ్రీ
రాముని దాసుడై నిలిచి రక్కసి మూకల గూర్చినావు, మా
రాములు తీర్చువాడవయ లాలిత రూపుడ మారుతీశ్వరా

ముక్తికోకిల-

ఈవుయూరున భక్త వత్సలుదెల్ల వారలగాయగా
ఈ నిగల్గిన దాతగా ప్రజ లెల్ల సంతసమీయగా
కావుమన్నను భక్తలందరి కావగా నిలుచుండిగా
సావధానపుచిత్తులైయిక సాగిరండయ భక్తితో❋

శ్రీ ఆంజనేయం

- శ్రీమతి లక్కరాజు వాణీసరోజిని
సెల్.నెం.9491054829

1. శ్రీ కరుపాద పద్మముల సేవలు చేయగ బూనినట్టినే
నంకిత భక్తి తత్పరత నా హరి నమ్మిన బంటు నైతి ఈ
లోకములెల్ల సంతసిల లోక భయంకర దానవేంద్రులన్
భీకర యుద్ధమందడచి భీతిలజేసెద రావణాసురున్

2. రాజిత సుందరాకృతుడు రాముని నమ్మిన బంటుగాగ నా
యాజిని రామ లక్ష్మణులకండగ యుద్ధమొనర్చు కోర్కెతో
తేజములోన అగ్నికిలదీటుగ ఉజ్వల ప్రజ్వలీనగన్
అంజని పుత్రుడద్భుతమనంగ రణంబున దూకె వీరుడై

3. అంజన గర్భసంజనితుడద్భుత శౌర్య పరాక్రమంబుతో
భంజనసేయ రాక్షసుల పాపవిలాస మదాంధకారులన్
రంజిలు యుద్ధభూమి గని రాజిలు సూర్య సమాన తేజుడై
రంజుగ మట్టుబెట్టెదను రాక్షసమూకనటంచు దూకెగా.

4. లంకను జేరినట్టి హరి లంఖిణిజంపి ముదంబు బొందుచున్
లంకలొ జొచ్చి యా నగరి రాజసముంగని విభ్రమంబునే
వంక గనంగజాలనని వాలము త్రిప్పుచూ చిత్తశుద్ధితో
లంకను సీత జాడగని రాముని జేర్చుటకుద్యమించెగా.

5. పతినెడ బాసి పెల్లుబుకు బాధ భరింపనశక్యమాయెనే
గతిగనరాదు మత్పతిని గూడ నటంచు విచార మొందునా
యతివ నిరంతరంబు విరహాగ్ని దహింప కృశించుచుండె నీ
యతులిత సుందరీమణి మహా గుణ శీలి నిజంబు సీతయే.

6. అని తలపోసి ఆ మైథిలి యార్తి శమింపగజేయుటెట్లనన్

అనిల సుతుండు దైన్యయగు నాయమడాసి ఉదాత్తచిత్తుడై
వినయముతోడ దెల్పుచు సువిజ్ఞత రాము పరాక్రమం బులన్
జనకజకంగుళీయక మహోజయమౌనని యంచు నిచ్చెగా

7. అంగుళినీయ సంతసిలి అంజనిపుత్రుని కందజేసెనా
యంగన దివ్యచూడమణి నద్భుతమైయ్యది నామె గుర్తుగా
చెంగున యా మణిన్ గొనుచు చేతులు మోడ్చి నమస్కరించి యా
అంగద మిత్రుడౌ హనమ అంతనశోకవనంబు వీడగన్.

8. లంకను వీడు ముందు కపి లంకను ఏలెడి రావణుండనే
వంకను జూడనేర్తునని వాలముతో వనమంత కూల్చితా
గొంకకచైత్యమెక్కి పరిఘాయుధమున్ గొని రాక్షసాధమున్
అక్షకుమారు జంపి కన అబ్బురమోయన గూల్చె వారలన్

9. జయము జయమ్ము రాముని కజేయునకంచు జయధ్వానంబులన్
భయపడ జేసె రాక్షసుల భాసుర వీర పరాక్రమంబుతో
రయముననేగె నచ్చటికి రావణపుత్రుడభేద్యుడింద్రజిత్
నయన భయంకరోగ్రుడై నా కపిసింహుని సంహరించగన్.

10. మాయాయుద్ధ ప్రవీణుడౌనతని నేమార్చంగ సన్నద్ధుడై
నా యాజిన్ జెలరేగె నా హనుమ యుద్ధాసక్త సంరంభుడై
డాయంబోయి యతండుకట్టుబడెనా ధంకార యస్త్రం బుచే
గాయంబేమియుగాక పట్టువదలం గైమోడ్చె నా బ్రహ్మకున్.

11. ఆ పురివాసులెల్లగని యా కపిఈతడె లంకలోపలన్
జంపెనుదానవాగ్రణుల జ్వలిత క్రోధ భయంకరాత్ముడై
చంపుడుకొట్టుడీతనిని జాలితలంపక యంచు నా కపిన్
చంపగనెంచి రావణుని సన్నిధికీడ్చుకు పోయిరెల్లరున్

12. మారుతి జూడ రావణుడు మానసమందున సంభ్రమమ్ముతో
వీరుడితండహో భవుని వేయివిధమ్ముల బోలియుండె ఈ
శూరుని పోరునన్ మిగుల శోకము గల్గెను లంకలోన నీ
మారుతి తోకకాల్చమన మంటలతో కపి లంకగాల్చెగా.❋

చేతనే చేతనే మత్తకోకిల

- వారణాసి. సూర్యకుమారి, మచిలీపట్నం

1 వాయుపుత్ర మహేశ్వరాంశ ప్రభావ భాసితమానసా
ధ్యేయ మెప్పుడు మంచిదైన సుదీర్ఘ మైనను తీర్తువే
సాయమందగ జేతువన్నియు సాధ్యమే యను రీతిలో
న్యాయ పాలన చేతువే కాపీనాథ మమ్మిలకావగన్ /

2 సామదానము భేదదండన చాకచక్యము చేతనే
రామసీతను గాంచినావు విరామమెన్నడు లేకనా
రామమందున జొచ్చితీ వట రామనామ జపంబుతో
రామభక్త కపీశ నీవిల రామబంటుగ నైతివే

3 వాల మొప్పుచు నుండు సుందర వర్తులాకృతి నుండఁగన్
కాలు నేలను మోపకే విహగమ్ము వోలెను నేగవే
ఆలవాలము నీదుడెందము రామభక్తికి నిష్ఠకున్
నీలమేఘునకాప్తుడై వాతి భువినేలుచుంటివి దైవమై

4 స్వాతినంజన కంది సార్థక జన్ము డైతివి పావనీ
దూతవైతివి వాయునందన దూరదృష్టి నిదానమున్
ఖ్యాతి గాంచితివా యయాతిని గాచి తల్లికి నందమై
మాతమాటను నిల్పనెంచియు మాన్యుడైతివి మారుతీ

5 మార్గశీర్ష నందు నీవ్రత మాచరించిన చూపుచున్
మార్గము న్నిక చింతలన్నియు బాపివేయుదు వయ్యరో
మార్గమందవ రోధమెల్లను మాపు మంత్ర ముపాసనా
మార్గమున్ రిపులన్న ణంచు నుపాయమే కడు మేలగున్

6 ఆవిభీషణు పుత్రు గావఁసురాధిపు న్నెదిరించి యున్

నీవిధిన్ శరణన్నవారికి నీవినెంతయు చూపగా
సావధానము నెంచకే పలుసాధనమ్ములు సల్పగా
ఈవిశాల జగమ్మునెల్ల రునిన్ను గొల్చుచు నుందురే

7 బ్రహ్మలోకము కేగుచుందువు బ్రహ్మతేజము లొల్కగా
బ్రహ్మ సృష్టికి నీశ్వరాంశకు ప్రాతినిధ్యము నీవె యై
బ్రహ్మ రాక్షసు లంటివారికి బాహుశక్తిని చూపుచున్
బ్రహ్మదేవు ప్రశంశ లందితివంజనాసుత వందనం

8. రావణాసురు లంక కేగిన రామదూతవు వాలమున్
ఆవనిన్ననలమ్ము బెట్టగ లంక నెల్లను కాల్చగన్
తావిలేని విరన్న తీరును దాల్చిరందరు లంకలో
ఆవిధంబుగబుద్ధి నేర్పగలట్టి వాడవు నీవెగా

9 అష్టసిద్దులు గూడి దుష్కర కార్యసాధన సల్పుచు న్
దుష్ట శిక్షణ జేసి మారుతతుల్య వేగ /జనావళిన్
కష్టముల్ కడతేర్చుచున్ మారిగాచు శాస్త్రవిశారదా
ఇష్టదైవమనం గామాప్రతి యింటి వేల్పువు నైత్తివే

10 భానుడే గురువౌట నీదగు భాగ్యమే యనవొప్పుచున్
మేను పెంచియు దైత్యులన్ దునిమేవు శౌ ర్యముచూపుచున్
భాను పుత్రుని చెల్మి కూర్చితి భద్రమెంచుచు రాఘువున్
కానుకాయెను మాకు నీదు ప్రకాశ మాన సుగాత్రమున్

11 ఫాలలోచను దద్భుతమ్మగు ప్రాభ వమ్మి డె ప్రీతితో
కాలమెంతగ మారినన్ ప్రతి గ్రామమందున శోభతో
ఆలయమ్ములు దేశదేశ ములందు కట్టిరి భక్తులే
వాలగాత్ర ముదమ్ముతోడ నివాసముందువె బ్రోవగన్ ❋